

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50



అలర్ట్ కాకుంటే అనర్థమే!

..నాలుగేళ్ల కింద చెన్నై..

చెన్నై మహానగరం చుక్క నీటి కోసం తల్లడిల్లిపోయింది. తాగటానికీ కటకట వచ్చి ప్రత్యేక రైళ్లలో నీటిని తరలించాల్సి వచ్చింది.

..గత ఏడాది బెంగళూరు ..

బెంగళూరు నగరం నీటి కోసం అల్లాడి పోయింది. చాలా ఏరియాల్లో జనం ఇళ్లు, ఆఫీసులు వదిలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.

..ఇప్పుడు ఢిల్లీ..

దేశ రాజధాని ఢిల్లీ నగరం నీటి కోసం ఆశగా ఎదురుచూస్తోంది. ఆ రాష్ట్ర మంత్రి స్వయంగా నిరాహార దీక్ష చేపట్టాల్సి వచ్చింది..

మరి రేపు..

మన హైదరాబాద్ నగరం వంతేనా? మనమూ నీటి కోసం తండ్లాడాల్సిందేనా?

ఇప్పుడే జాగ్రత్తపడకుంటే.. భవిష్యత్‌లో సాధారణ వినియోగానికే కాదు.. తాగునీటికీ కటకటలాడాల్సిన పరిస్థితి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూగర్భ జలాలను కాపాడుకోకుంటే.. నీటి వృథాను అరికట్టకుంటే.. మహానగరానికి ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు. వాన నీటి సంరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలాలను రీస్టోర్ చేసుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతల ఏర్పాటుపై దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు.

వాన నీటి సంరక్షణ చర్యలు చేపట్టకుంటే భవిష్యత్తులో నగరానికి కటకటే..

అడ్డగోలుగా తోడేస్తుండటంతో అడుగంటిపోయిన భూగర్భ జలాలు

బోర్లు ఎండిపోవడంతో నీటి కోసం సిటీజనుల తిప్పలు

అటు డెడ్ స్టోరేజీలో ప్రధాన జలాశయాలు.. అత్యవసర పంపింగ్‌తో తరలింపు

వాన నీటి నిల్వ, ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు

నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచనలు

పైపులైన్లకు మరమ్మతులు, లీకేజీల నివారణపై ఫోకస్ పెట్టాలని స్పష్టీకరణ

అత్యంత వేగంగా విస్తరిస్తున్న మహానగరం.. భారీ భవంతులు, ఆకాశ హర్మ్యాలు, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య భవనాలు, రోడ్లు, ఫ్లైఓవర్లు, ఇతర నిర్మాణాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారింది. వాన చినుకు నేలలో ఇంకే పరిస్థితి లేకుండా పోయింది. పెరుగుతున్న జనంతో నీటి వినియోగం పెరుగుతోంది. అదే సమయంలో భూగర్భజలం తరుగుతోంది. ఇప్పటికే నీటి కొరత కనిపిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే వేసవి నాటికి నగరం నీటికోసం కటకటలాడటం ఖాయంగా కనిపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. వాన నీటి సంరక్షణ, ఇంకుడుగుంతల ఏర్పాటుతో రోజువారీ అవసరాలు తీరడంతోపాటు పరిసరాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని చెప్తున్నారు.

...::: సాక్షి, హైదరాబాద్ :::...



ఇంకుడు గుంతలు నిర్మించాలి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 300 చదరపు మీటర్లకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి. నగరంలో అలాంటి భవనాలు లక్షన్నరకుపైగా ఉంటాయని అంచనా. గత పదేళ్లలో జరిగిన నిర్మాణాలను పరిశీలిస్తే.. 300 చదరపు మీటర్లకుపైన ఉన్నవి 33,046 పైగా ఉన్నాయి. వాటిల్లో 40 శాతం వరకు నివాస సముదాయాల్లో ఇంకుడు గుంతలు లేనట్టు సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కొన్నింటిలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టినా.. శాస్త్రీయంగా తగిన వెడల్పు, లోతుతో నిర్మించలేదు. పైకప్పుల నుంచి వాననీరు పైపుల ద్వారా వచ్చి ఒకచోట ఫిల్టర్ అయి.. ఇంటి అవసరాలకు పోను మిగతా నీరు ఇంకుడు గుంతలోకి వెళ్లేలా ఏర్పాటు చేయాలి. కానీ.. దాదాపు 80 శాతం ఇంకుడు గుంతలు చెత్తాచెదారం నిండి ఉంటున్నాయి. కొందరు మాత్రం స్వచ్ఛందంగానే పకడ్బందీగా ఇంకుడు గుంతలను నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

నీటి వృథా నివారణ చర్యలు చేపట్టాలి

గ్రేటర్ నగరం ఎత్తయిన ప్రదేశం కావడం, రాళ్లు, కొండలతో నిండి ఉండటంతో.. భూగర్భజలాలపై ఆధారపడకుండా కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తరలిస్తున్నారు. అయితే నీటి వృథాను నివారించడంలో యంత్రాంగం విఫలమవుతోందన్న విమర్శలు వస్తున్నాయి. సరఫరా అవుతున్న నీటిలో 20 శాతానికిపైగా వృథాగా పోతున్నట్టు పలు అధ్యయనాల్లో తేలింది. పైపులైన్ల లీకేజీలపై ఎవరైనా ఫిర్యాదు చేసే దాకా యంత్రాంగం స్పందించే పరిస్థితి లేదు. రోజూ కోట్లాది రూపాయల వ్యయంతో సుమారు వంద కిలోమీటర్ల దూరంలోని నాగార్జునసాగర్ నుంచి, దాదాపు రెండు వందల కిలోమీటర్ల దూరంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని నగరానికి తరలిస్తున్నారు. నగరానికి ఎగువన ఉన్న ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లతోపాటు సింగూరు, మంజీరా జలాశయాల నుంచీ సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరా కోసం ఇంత కష్టపడుతున్న జీహెచ్‌ఎంసీ యంత్రాంగం.. లీకేజీలు, వృథాను అరికట్టేందుకు ప్రయత్నాలు చేయడం లేదు. పైపులైన్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టడంతోపాటు కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల వారీగా నీటి వినియోగ గణాంకాలను బహిరంగంగా ప్రదర్శిస్తే.. వృథాను కొంత అరికట్టవచ్చని నిపుణులు చెప్తున్నారు.

ఏడాదిలో ఎంత వానకు రూఫ్ టాప్‌పై ఎంత నీరు పడుతుందంటే..

(రూఫ్ టాప్ వైశాల్యం 9.3 చదరపు మీటర్లు (3.05 X 3.05 మీటర్లతో..))



వర్షపాతం (సెం.మీ.)	వాననీరు (లీటర్లు)
50	4,645
60	5,574
70	6,503
75	6,968
80	7,432

జలాశయాలు ఎండి.. భూగర్భజలాలు తగ్గి.. ▶ మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే నాగార్జునసాగర్, ఎల్లంపల్లి జలాశయాల్లో నీటి నిల్వలు పూర్తిగా పడిపోయాయి. దీంతో ఎనిమిదేళ్ల తర్వాత ఈసారి ఎమర్జెన్సీ పంపింగ్‌తో నీటి తరలింపు చేపట్టాల్సి వచ్చింది. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు గత సంవత్సరం కంటే ఈసారి దారుణంగా పడిపోయాయి. చాలా ప్రాంతాల్లో గతంలోకంటే 2 నుంచి 7 మీటర్లు అదనంగా అడుగంటాయి.

ఇంకుడు గుంతలపై సర్వే చేపట్టినా? II లో

ఇట్స్ ఫ్లో టైం

ఇంజినీరింగ్ విద్యార్థుల నూతన ఆవిష్కరణ

విద్యార్థుల చెంతకు 'సాంకేతిక' చదువు

'ఫ్లో' పేరుతో కొత్త తరహా ప్రయత్నం

గ్రేటర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితం

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనే లక్ష్యం



వివరాలు 11లో

అన్నీ నంబర్లే. కానీ ఆ కొన్ని మాత్రమే ఎంతో స్పెషల్. ఆ నంబర్ల కోసం పడిగాపులు కాస్తారు. రూ.లక్షలు వెచ్చిస్తారు. ఒక సిరీస్ తప్పితే మరో సిరీస్ కోసం ఎదురు చూస్తారు. నచ్చిన నంబర్ లభించే వరకు పోటీలో ఉంటారు. ఆల్‌నైన్స్, ఆల్‌సిక్స్, ఆల్‌వన్స్ ఇలా ఆకట్టుకునే నంబర్ ఏదైనా సరే వాహనదారులు రూ.లక్షలు చెల్లించి పోటీపడుతున్నారు. లక్కు కోసం కొందరు అదృష్ట సంఖ్యలను దక్కించుకుంటే, ఫ్యాషన్ కోసం మరికొందరు వెరైటీగా నంబర్ ప్లేట్లను ముద్రించుకుంటున్నారు.



లక్కీ నంబర్!

వాహనాల రిజిస్ట్రేషన్‌లో స్పెషల్ నంబర్స్‌కు ఆల్‌టైమ్ డిమాండ్

ప్రతి సిరీస్‌లో ఆల్‌నైన్స్ ధర అదరహో

ఇటీవల టీజీ 09 9999కు అత్యధికంగా రూ. 25 లక్షల బిడ్డింగ్

పదేళ్లలో ప్రత్యేక నంబర్లతోనే ఆర్టీఏకు రూ. 623 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఆర్టీఏ జారీచేసే ప్రత్యేక నంబర్లపై గ్రేటర్ హైదరాబాద్‌లో మొదటి నుంచి ఎంతో క్రేజ్ ఉంది. కారు, బైక్ ఏదైనా సరే 'సమ్‌థింగ్ స్పెషల్'గా ఉండాలని చాలా మంది కోరుకుంటున్నారు. దీంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి రవాణాశాఖ విడుదల చేసే ప్రత్యేక నంబర్లు ప్రభుత్వానికి కాసులు కురిపిస్తున్నాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం లభిస్తోంది. 2014 నుంచి ఇప్పటి వరకు కేవలం ప్రత్యేక నంబర్లపైనే రూ.623 కోట్ల ఆదాయం లభించింది. ఏటా రూ.45 నుంచి రూ.60 కోట్ల వరకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆల్‌నైన్స్ ఆల్‌టైమ్..

గత నెలలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో 'టీజీ 09 9999' నంబర్ మొట్టమొదటిసారి అత్యధికంగా రూ.25 లక్షల ధర పలికింది. సోని ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ సంస్థ తమ 'టయోటా ల్యాండ్ క్రూయిజర్ ఎల్ఎక్స్'వాహనం కోసం ఈ నంబర్‌ను దక్కించుకుంది. ఆల్‌నైన్ నంబర్‌పై ఆర్టీఏ విధించిన ఫీజు రూ.50 వేలు అయితే, బిడ్డింగ్ మొత్తంతో రూ.25,50,000 చెల్లించి సొంతం చేసుకుంది. ఇంతటి భారీ మొత్తంలో డిమాండ్ రావడం విశేషం.

గతంలో ప్రైమ్ సోర్స్ గ్లోబల్ సర్వీసెస్ రూ.21,60,000తో పోటీపడింది. అంతకుముందు కీ స్టోన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ అనే సంస్థ ఆన్‌లైన్ బిడ్డింగ్‌లోనే రూ.17,35,000 చెల్లించింది. నగరంలో హైఎండ్ వాహనాలు పెరుగుతున్న కొద్దీ ఆల్‌నైన్స్‌తోపాటు మరికొన్ని ప్రత్యేక నంబర్లకు డిమాండ్ కూడా అదేస్థాయిలో పెరుగుతోంది.



అదృష్టం బాగుండాలని...

జోతిష్యులు ఒక్కొక్క నంబర్‌ను ఒక గ్రహంతో, వాటి కదలికలతో సరి చూసి భవిష్యత్తును, మానసిక స్వభావాలను అంచనా వేస్తారు. అలా తమ స్వభావానికి తగిన నంబర్‌ను వాహనదారులు ఎంపిక చేసుకుంటున్నారు.

ఆ రకంగా 1,2,3,4,5,6,7,8,9 వంటి ప్రతి సింగిల్ నంబర్‌కు ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. ఉదాహరణకు '1'నాయకత్వానికి, '2'శాంతస్వభావానికి నిదర్శనం. గురుగ్రహంతో పోల్చే '3'వల్ల చక్కటి తెలివి తేటలు, జ్ఞానం లభిస్తాయని నమ్మకం. '5'ను బుధుడికి ప్రతిబింబంగా భావిస్తారు. ఈ నంబర్ వల్ల వ్యాపారం బాగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకం.

ఇక ప్రతి ఒక్కరూ ఇష్టపడే నంబర్ '9'. కుజగ్రహానికి ప్రతీకగా భావిస్తారు. జీవితంలో విజేతలుగా, తిరుగులేని నాయకులుగా ఎదగాలని కోరుకునేవాళ్లు, పోటీమనస్తత్వం, పోరాడేతత్వం ఉన్నవాళ్లు ఈ నంబర్‌ను ఇష్టపడతారు.

లక్కీ నంబర్...

సంఖ్యాశాస్త్రం, జోతిష్యంపై ఉండే విశ్వాసంతో కొంతమంది వాహనదారులు కొన్ని ప్రత్యేక నంబర్లపై ఆసక్తి కనబరుస్తారు. రియల్ఎస్టేట్ వ్యాపారులు, సినీనటులు, రాజకీయ నాయకులతో పాటు సాఫ్ట్‌వేర్ సంస్థలు కూడా ఈ ప్రత్యేక నంబర్లపై ఎక్కువ మక్కువ చూపుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసే లగ్జరీ వాహనాల కోసం నంబర్లు కూడా ప్రత్యేకంగా ఉండాలనే ఆకాంక్ష కూడా మరో కారణం. అదృష్ట సంఖ్యలుగా భావించే నంబర్ల కోసం కొందరు పోటీకి దిగితే.. సామాజిక హోదా కోసం, పేరు ప్రతిష్టల కోసం మరికొందరు పోటీ పడుతున్నారు. విభిన్నరంగాలకు చెందిన వాహన యజమానులు లక్కీనంబర్ల కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి ఆర్టీఏలో కొత్త సిరీస్ ప్రారంభమవుతుంది. మొత్తం నంబర్లలో 2500 వరకు ఫ్యాన్సీ నంబర్లుంటాయి.ఒక్కో నంబర్‌కు 5 నుంచి 10 మంది వాహన యజమానులు పోటీపడుతుండటం విశేషం.

ఈ క్రేజ్ ఇప్పటిది కాదు...

మొదట్లో ఈ నంబర్లకు పెద్దగా డిమాండ్ లేదు. ఇప్పుడు రూ.లక్షల్లో డిమాండ్ ఉన్న '9999'రెండు దశాబ్దాల క్రితం రూ.వేలల్లో లభించేది. 1980ల్లో అయితే కేవలం రూ.500కు ఈ నంబర్లను కేటాయించేవారు. ఎలాంటి పోటీ ఉండేది కాదు. రాజకీయరంగ ప్రవేశం చేసిన ఎన్టీ రామారావుతో ఈ నంబర్‌కు క్రేజ్ వచ్చేసింది. అప్పట్లో ఎన్టీ రామారావు 27, 999, 9999 వంటి నంబర్లకు ప్రాధాన్యం ఇచ్చేవారు. దీంతో అందరూ అదే బాటలో నడిచారు. బాగా డిమాండ్ పెరిగింది.

నంబర్లే బహుమతులు

ఇటీవల కాలంలో చాలామంది వినియోగదారులు తమ కుటుంబ సభ్యులకు వాహనాలను బహుమానంగా ఇవ్వడమే కాదు. వారి పుట్టిన రోజు కలిసొచ్చేలా రిజిస్ట్రేషన్ నంబర్లను ఎంపిక చేసుకొని పోటీకి వస్తున్నారు. '1313'(తేరా తేరా) అంటే పంజాబీలకు ఎంతో ఇష్టం. దీనిని వాళ్లు అదృష్ట సంఖ్యగా భావిస్తారు. '5121' అనే నంబర్‌ను ఆంగ్ల అక్షరాల్లో 'సిరి'గా భావిస్తారు.'143', '214', '8045'వంటి నంబర్లకూ ఎంతో క్రేజ్ ఉంది.

అంకెల్లో అదృష్టం ఉంది



నేను జాతకాన్ని బాగా నమ్ముతాను. కొన్ని అంకెల వల్ల అదృష్టం కలిసివస్తుంది. అందుకే నాకు ఇష్టమైన అదృష్టసంఖ్యల కోసం ప్రతిసారీ పోటీపడుతూనే ఉన్నాను. 1119 నాకు బాగా నచ్చింది.

- కోలా రవికుమార్‌గౌడ్

స్పెషల్‌గా ఉండాలి కదా

బండి కొనుగోలు చేసిన ప్రతిసారి ప్రత్యేక నంబర్ కోరుకుంటాను. నాకు బుల్లెట్ అంటే ఎంతో ఇష్టం. నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలనే ఉద్దేశంతోనే నంబర్‌లకు కూడా ప్రాధాన్యం ఇస్తాను. రూ.లక్షలు వెచ్చించి ఖరీదైన వాహనం కొన్నప్పుడు నచ్చిన నంబర్ కోసం కొంత మొత్తం ఖర్చు చేయడం పెద్దగా భారం కాదు.

- సుధాకర్‌రెడ్డి, వాహన యజమాని




లగ్జరీ వాహనాలు పెరిగాయి



ఖరీదైన, విలాసవంతమైన కార్లు ఇప్పుడు సిటీలో పరుగులు తీస్తున్నాయి. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్లు కూడా స్పెషల్‌గా ఉండాలనే ఉద్దేశంతో వాహనదారులు పోటీపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆల్‌నైన్స్ బిడ్డింగ్ అత్యధికంగా రూ.21 లక్షల నుంచి ఇప్పుడు రూ.25 లక్షలకు చేరింది. ఈ నంబర్ కోసం ఈ స్థాయిలో పోటీ రావడం ఇది మొదటిసారి.

- సి.రమేష్, జేటీసీ, హైదరాబాద్



ఇంకుడు గుంతలపై సర్వే చేపట్టినా?

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ, బెంగళూరు నగరాల తరహాలో హైదరాబాద్‌లో నీటి ఎద్దడి రాకుండా.. ముందుజాగ్రత్తగా వాన నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఇటీవల హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలో జలమండలి, జీహెచ్ఎంసీల ఆధ్వర్యంలో వాననీటి సంరక్షణకు, తాగునీటి సరఫరా పర్యవేక్షణకు వాచ్‌డాగ్ కమిటీ ఏర్పాటైంది. దీనితోపాటు ఇంకుడుగుంతల్లేని నిర్మాణాలను గుర్తించేందుకు 182 బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేపట్టారు. మరోవైపు సుమారు 18 స్వచ్ఛంద సంస్థలు కూడా రంగంలోకి దిగి ఇంకుడు గుంతల నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్నాయి. అయినా ఫలితం లేకుండా పోతోంది.

ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నాం



భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడకుండా బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నాం. ఎన్జీవోల ద్వారా ఇంటింటా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఇళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి. నగరానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో.. అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలిస్తున్నాం. ప్రస్తుతానికి తాగునీటికి ఎలాంటి ఢోకా లేదు.

- సుదర్శన్‌రెడ్డి, ఎండీ, జలమండలి

ఎండిపోయిన బోర్ల రీచార్జి తప్పనిసరి



ఎండిపోయిన బోర్లను వాన నీటితో రీచార్జి చేసుకోవచ్చు. కొత్త బోర్ల తవ్వకాల బదులు ఎండిపోయిన బోర్ల చుట్టూ గుంత తీసి వర్షపు నీరు చేరేలా చేస్తే సరి. వర్షపాతం తక్కువగా నమోదైనా భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రతి అపార్ట్‌మెంట్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ చేపడితే భూగర్భజలాలకు ఢోకా ఉండదు.

- సత్యనారాయణ, రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్, భూగర్భజల వనరుల శాఖ

నీటి సంరక్షణపై అవగాహన అవసరం



నీటి ఎద్దడి, ఆదాపై విద్యార్థుల నుంచి పెద్దల వరకు అవగాహన కల్పించాలి. నీటి సంరక్షణపై ప్రచారం చేయాలి. పైప్‌లైన్ల లీకేజీలు, నల్లాలు తెరిచి వదిలేయడంతో రోజూ వేల లీటర్ల నీళ్లు వృథా అవుతున్నాయి. ఆ వృథాపై జరిమానాలు విధించాలి. నీటిని ఆదా చేసేలా ట్యాప్‌లు అమర్చాలి. నీటిని తోటలు, ఇతర అవసరాలకు పునర్వినియోగించే దిశగా చర్యలు చేపట్టాలి. స్మార్ట్ ల్యాండ్‌స్కేపింగ్ అవసరం.

- కరుణాకర్‌రెడ్డి, ఫౌండర్, వాక్ వాటర్ ఫౌండేషన్


'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 95

బుధవారం 26-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అఫ్'గన్' పేలింది...

టి20 ప్రపంచకప్ సెమీస్‌కు అఫ్గానిస్తాన్. 'సూపర్-8'లో బంగ్లాపై గెలుపు -14లో



చరిత్ర సృష్టించిన చాంగ్‌యీ-6

చందమామ అవతలివైపు మట్టిని తెచ్చిన తొలి దేశంగా చైనా రికార్డు -6లో

న్యూస్‌రీల్

బొకే ఇచ్చి.. బైబై



ఆర్టీసీలో పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు పూలమాలలు, బొకేలు ఇచ్చి వీడ్కోలు చెప్పేస్తున్నారు. పదవీ విరమణ ఆర్థిక ప్రయోజనాల మాటేమిటి అంటే ఆ ఒక్కటి అడగొద్దంటోంది సంస్థ. నష్టాల వల్ల నిధులు లేవన్న కారణంతో రిటైర్డ్ ఉద్యోగులను టెన్షన్ పెడుతోంది. ఇప్పుడు వందలమంది తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

- వివరాలు 16లో▶

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం



డ్రగ్స్ రహిత తెలంగాణ తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే ఎవరైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భట్టి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని చెప్పారు.

- వివరాలు 16లో▶

ఒట్టేసి చెబుతున్నా.. తప్పు చేయలేదు



'తడిబట్టలతో దేవుడి మీద ఒట్టేసి చెబుతున్నా.. నేను అవినీతికి పాల్పడలేదు. బూడిద రవాణాలో రూ. 100 కోట్ల అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఒట్టేసి చెప్పే దమ్ముందా' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. చెల్పూర్ ఆంజనేయస్వామి గుడికి బయల్దేరిన ఆయనను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

- వివరాలు 2లో▶



పేపర్ లీకయిందని ఇలా ఎత్తేసుకుంటూ పోతే ఇక ఏ పరీక్షలు మిగలవ్ సార్!

స్పీకర్ పదవికి పోటీ

ఓం బిర్లా X సురేశ్

డిప్యూటీ స్పీకర్ ఇస్తే పోటీ పెట్టబోమన్న ఇండియా కూటమి

హామీ ఇవ్వని బీజేపీ.. కుదరని ఏకాభిప్రాయం

దళిత నేత సురేశ్‌ను పోటీకి దింపిన 'ఇండియా'



ఓం బిర్లా: **రికార్డుల స్పీకర్** 6లో

కె.సురేశ్: **ఓడి గెలిచారు**

న్యూఢిల్లీ

పద్దెనిమిదో లోక్‌సభ స్పీకర్ పదవికి అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఫలితంగా పోటీ అనివార్యమైంది. కీలక నేతలను పాత పదవుల్లో కొనసాగిస్తున్న మోదీ 3.0 సర్కారు దానికి అనుగుణంగానే ఎన్డీఏ అభ్యర్థిగా ఓం బిర్లాను మంగళవారం స్పీకర్ బరిలో నిలిపింది. ఓం బిర్లా 17వ లోక్‌సభలో ఐదేళ్లు స్పీకర్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. విపక్ష ఇండియా కూటమి ఆఖరి నిమిషంలో.. కాంగ్రెస్ ఎంపీ కొడైకున్నిల్ సురేశ్‌ను రంగంలోకి దింపింది. పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరించి విపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తే.. ఓం బిర్లాకు మద్దతు ఇస్తామని ఇండియా కూటమి షరతు పెట్టింది. అయితే బీజేపీ సీనియర్ నేతలు దీనిపై ఎలాంటి హామీ ఇవ్వలేదు. స్పీకర్ ఎన్నిక తర్వాత డిప్యూటీ స్పీకర్ ఎంపిక ఉంటుందని, ఆ సందర్భం వచ్చినపుడు చూద్దామని బీజేపీ పేర్కొంది. దీనికి ఇండియా కూటమి నేతలు సమ్మతించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి కేటాయిస్తామని హామీ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. ఎన్డీఏ అభ్యర్థిగా ఓం బిర్లా పేరు ఖరారయ్యాక కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్.. చొరవ తీసుకొని విపక్షాలను సంప్రదించారు. రాజ్‌నాథ్ ఆఫీసులో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షాలతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, డీఎంకే నేత టి.ఆర్.బాలు మంగళవారం సమావేశమయ్యారు. ఇరుపక్షాలు తమ తమ వాదనలకే కట్టుబడి ఉండటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. కొద్దిసేపట్లోనే ఈ భేటీ ముగిసింది. వేణుగోపాల్, బాలు అర్ధాంతరంగా

మిగతా 2వ పేజీలో ▶

లోక్‌సభలో విపక్షనేతగా రాహుల్



రాజ్యాంగం చేతబూని.. ఎంపీలుగా రాహుల్, అఖిలేశ్ ప్రమాణం 6లో



మళ్లీ మంచి రోజులు

గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మాధవరం, గాంధీ, మాగంటితో కేసీఆర్. పక్కన హరీశ్‌రావు

- రాజకీయ భవిష్యత్‌పై నగర ఎమ్మెల్యేలకు కేసీఆర్ భరోసా 2లో

'విద్యుత్' కమిషన్ విచారణ నిలిపేయండి

హైకోర్టులో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్

- విద్యుత్ కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగలేదు
- ఇతర న్యాయమార్గాలున్నా కమిషన్ వేయడం చట్టవిరుద్ధం
- హాజరుకావాలంటూ నోటీసులివ్వడం సమర్థనీయం కాదు
- రాజకీయ కక్షతోనే ఏక సభ్య కమిషన్ ఏర్పాటు.. ఏకపక్షంగా విచారణ
- కమిషన్ చైర్మన్ మీడియా సమావేశం పెట్టి అసంబద్ధ వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో వెల్లడి.. కమిషన్ ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని విజ్ఞప్తి
- పిటిషన్‌లో జస్టిస్ నరసింహారెడ్డిని వ్యక్తిగత ప్రతివాదిగా చేయడంపై రిజిస్ట్రీ అభ్యంతరం.. ప్రధాన న్యాయమూర్తి పరిశీలనలో పిటిషన్

12లో



ప్రజల గొంతును గుర్తించండి

స్పీకర్ అయ్యన్నకు వైఎస్ జగన్ లేఖ

- ప్రజా సమస్యలను సభలో బలంగా ప్రస్తావించేందుకు వైఎస్సార్ సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలి.. చట్టబద్ధ గుర్తింపుతో హక్కులు, తగిన సమయం లభిస్తాయి
- విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రతిపక్ష హోదా..
- ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు
- మంత్రుల తర్వాత నాతో ప్రమాణం చేయించడం సంప్రదాయాలకు విరుద్ధం

12లో

అసాంజ్‌కు స్వేచ్ఛ...



- నేరాంగీకారానికి అమెరికాతో ఒప్పందం
- బ్రిటన్ జైలు నుంచి విడుదలైన వికీలీక్స్ వ్యవస్థాపకుడు
- నేడు అమెరికా అధీనంలోని మరియానా ద్వీపంలో కోర్టు ముందుకు.. శిక్ష నుంచి మినహాయింపు, విడుదల!
- తర్వాత నేరుగా స్వదేశం ఆస్ట్రేలియాకు..

- వివరాలు 6లో



...ఇక సీబీఐ వంతు

నేడు కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే అవకాశం

- వివరాలు 6లో

రైతు భరోసాకు పదెకరాలు

పరిమితి పెట్టండి

- ఆదాయ పన్ను కట్టేవారికీ పెట్టుబడి సాయం ఇవ్వండి
- మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుల సూచన
- దొడ్డు వరికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని విజ్ఞప్తి
- యంత్రాలు సరఫరా చేయాలన్న అన్నదాతలు
- ప్రజాధనం వృథా కాకుండా అర్హులకే 'రైతు భరోసా' అందిస్తాం: మంత్రి తుమ్మల
- అసెంబ్లీలో చర్చించాక పథకాన్ని తీసుకొస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకానికి పరిమితులు విధించాలని.. గతంలో మాదిరి అందరికీ కాకుండా, పదెకరాల వరకు భూమి ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అందించాలని రైతులు పేర్కొన్నారు. కొందరు రైతులు మాత్రం ఐదెకరాల వరకు పరిమితి పెట్టినా మంచిదేనని అన్నారు. చాలా మంది రైతులు సాగులో ఉన్న భూమికి, సాగుచేసే వారికే పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఆదాయ పన్ను చెల్లించే రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని కోరారు. విదేశాలకు వెళ్లే తమ పిల్లల విద్యా రుణాల కోసం

మిగతా 12వ పేజీలో ▶



గ్రామాలవారీగా రుణ మాఫీ రైతుల జాబితా

త్వరలో వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు

- 5లో



నడ్డాతో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో అనిల్‌కుమార్ యాదవ్, జితేందర్‌రెడ్డి, పొంగులేటి, కోమటిరెడ్డి

రూ.693 కోట్ల ఎన్‌హెచ్‌ఎం

బకాయిలు ఇవ్వండి

కేంద్ర మంత్రి నడ్డాకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.693.13 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య రంగంపై తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ గురించి నడ్డాకు రేవంత్ వివరించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలన్నీ ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 5,159 బస్తీ దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) నిర్వహిస్తున్నామని చెప్పారు.

కేంద్రం వాటా ఆలస్యంతో మేమే చెల్లిస్తున్నాం..: రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నందున కేంద్రం

మిగతా 5వ పేజీలో ▶

ఇంకా అలక వీడని జీవన్‌రెడ్డి

రాజీనామాకు సిద్ధమై మండలి చైర్మన్‌కు ఫోన్ చేసిన సీనియర్ నేత



జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న భట్టి, శ్రీధర్‌బాబు

- విషయం తెలుసుకొని జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లిన భట్టి, శ్రీధర్‌బాబు
- పార్టీలోనే ఉంటానని, ఎమ్మెల్సీగా ఉండలేనని స్పష్టీకరణ
- సీనియర్లను వదులుకోవడానికి సిద్ధంగా లేమన్న భట్టి..
- త్వరలోనే అసెంబ్లీకి వచ్చి అన్నీ మాట్లాడతా: జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తనకు సమాచారం లేకుండా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై కినుక వహించిన కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఇంకా అలకపాన్పు వీడలేదు. సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ పదవిని వదులుకునేందుకు ఆయన సిద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం హైదరాబాద్‌లోని జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లి గంటన్నర పాటు చర్చించారు. చర్చల తర్వాత కూడా ఆయన తన వైఖరి మార్చుకోలేదు. కాంగ్రెస్ పార్టీని తాను వదిలే

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కోమటిరెడ్డి, పొంగులేటి

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జి.కిషన్ రెడ్డిని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. మంగళవారం ఢిల్లీలోని అశోకా రోడ్‌లో ఉన్న కిషన్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రులు ఆయన్ను సన్మానించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ బిడ్డగా కిషన్‌రెడ్డి కేంద్రమంత్రి అవడం ఆనందంగా ఉందని, అందుకే తాము పార్టీలకతీతంగా వచ్చి సత్కరించినట్లు కోమటిరెడ్డి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సహకరించాలని కిషన్‌రెడ్డిని కోరామన్నారు. ఎలాంటి సహాయ, సహకారాలు కావాలన్నా తాను అందుబాటులో ఉంటానని కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

నయవంచనకు ప్రతిరూపం కాంగ్రెస్: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: నయవంచనకు ప్రతిరూపమే కాంగ్రెస్ పార్టీ అని, ఓ వైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూనే మరోవైపు ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమర్జెన్సీ కాలం నుంచి నేటి వరకు కాంగ్రెస్ చెప్పేదొకటి చేసేదొకటి అన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. 'పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజల గొంతులను అణచి వేస్తూ 49 ఏళ్ల కిందట ఇదే రోజు కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించింది. దశాబ్దాలు గడిచినా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యంపై ఎమర్జెన్సీ తరహా దాడిని కొనసాగిస్తూనే ఉంది. ఓ వైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూ పార్లమెంట్‌లో రాజ్యాంగ కాపీలను కాంగ్రెస్ నేతలు చేత పట్టుకొని ప్రదర్శన చేస్తారు. మరోవైపు అదే పార్లమెంటుకు కొద్ది దూరంలోనే ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసే విధంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారు. ఓ వైపు రాజ్యాంగం గురించి మాట్లాడుతూ మరోవైపు రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బ తీసేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ కపటత్వం చూస్తూ ఆవేదన కలుగుతోంది' అని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యే ల సభ్యత్వం రద్దు కోరుతూ పిటిషన్ ఇచ్చేందుకు అసెంబ్లీ స్పీకర్ అపాయింట్‌మెంట్ కోరామన్నారు. ఒకటి రెండు రోజుల్లో సమయమిస్తామని స్పీకర్ చెప్పినట్లు జగదీశ్ రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ తాత మధుతో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్‌రావుతో పాటు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారే నేతలను ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని, స్పీకర్ న్యాయబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే దానంపై అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కాంగ్రెస్ తీర్మానించిన 'పాంచ్ న్యాయ్' ప్రకారం ఫిరాయింపులు ప్రోత్సహించవద్దని ఓ వైపు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చెప్తున్నారని కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం మోదీ విధానాలను అనుసరిస్తూ బీజేపీకి తోకలా వ్యవహరిస్తు న్నారని విమర్శించారు. ఇక విద్యుత్ అంశంలో తాము విచారణ వద్దనడం లేదని, జస్టిస్ నర్సింహారెడ్డిని కమిషన్ బాధ్యతల నుంచి తప్పించాలని మాత్రమే తాము కోరుతున్నట్లు పేర్కొన్నారు.

నేటి భవితలో..

- **జాబ్స్ ఇన్ఫో:** సింగరేణిలో.. కొలువుల మేళ
ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! ప్రారంభంలోనే నెలకు రూ.40 వేలకు పైగా వేతనంతో సర్కారీ కొలువు తలుపుతడుతోంది! దేశంలోని ప్రముఖ బొగ్గు గనుల సంస్థ.. సింగరేణి కాలరీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది!! ఈ నోటిఫికేషన్ ద్వారా ఎగ్జిక్యూటివ్, నాన్–ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో.. మొత్తం 327 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. సింగరేణి కాలరీస్ విడుదల చేసిన ఎగ్జిక్యూటివ్, నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు.
- **జాబ్ పాయింట్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం; యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, రైల్వేలు, త్రివిధ దళాలు, బ్యాంకింగ్, ప్రభుత్వ రంగ సంస్థలు, అటానమస్ ఇన్‌స్టిట్యూట్స్‌లో జాబ్ నోటిఫికేషన్లు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర సమాచారంతో జాబ్ పాయింట్.

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

హస్తినలో కాంగ్రెస్ నేతల చక్కర్లు

- ఢిల్లీలో తిష్టవేసిన పీసీసీ, మంత్రి పదవుల ఆశావహులు
- సీఎం రేవంత్‌ను, హైకమాండ్ పెద్దలను కలిసేందుకు ప్రయత్నాలు
- మంత్రి పదవుల వేటలో మల్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, బల్మూరి
- పీసీసీ కోసం మహేశ్ గౌడ్, సంపత్, బలరాం, షెట్కార్
- నామినేటెడ్ పదవుల కోసం మరికొందరు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో కీలక పదవుల భర్తీపై దేశ రాజధానిలో హైకమాండ్ పెద్దల కసరత్తు తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర నేతలంతా ఢిల్లీలో చక్కర్లు కొడుతున్నారు. అత్యంత ప్రాధాన్యమైన పీసీసీ అధ్యక్ష పదవి సహా మంత్రి పదవుల భర్తీ, ఇతర నామినేటెడ్ పదవుల నియామకానికి సంబంధించి హైకమాండ్ పెద్దలతో చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండ్రోజులుగా ఢిల్లీలో ఉంటున్నారు. దీంతో నేతలంతా ఆయనను, పార్టీ ఇతర పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఐదుగురు రాష్ట్ర మంత్రులతోపాటు సుమారు పది మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ నేతలు ఢిల్లీలో తిష్టవేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.



పీసీసీ పదవికి తీవ్ర పోటీ

పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ స్థానంలో కొత్తవారిని నియమించనున్నారన్న వార్తల నేపథ్యంలో ఆ పదవిని ఆశిస్తున్న ముఖ్యనేతంతా ఢిల్లీలోనే మకాం వేశారు. పీసీసీని ఆశిస్తున్న మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌లు రెండ్రోజులుగా హస్తినలోనే ఉన్నారు. మధుయాష్కీ ఢిల్లీలో తనకున్న పరిచయాలను వాడుకుంటూ పెద్దల దృష్టిలో పడేందుకు యత్నిస్తుండగా, ఇతర నేతలు మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి తమ అభ్యర్థిత్వంపై వినతులు ఇచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోనూ వీరు భేటీ అయ్యారు. మరోపక్క ముఖ్యమంత్రి ప్రతిపాదిస్తున్న జాబితాలో ఉన్న ఎంపీలు బలరాం నాయక్, సురేశ్ షెట్కార్‌లు సైతం రోజంతా సీఎం చుట్టూతే ఉన్నారు. హైకమాండ్ పెద్దలను సీఎం కలిసిన సమయంలోనూ ఈ ఇద్దరు ఆయనతో పాటు నేతలను కలిశారు. ఇక్కడే ఉన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోనూ పీసీసీ ఆశావహులు భేటీ అయ్యి వారి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

మంత్రి పదవుల కోసం మరికొందరు

మరికొద్ది రోజుల్లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ఊహాగానాల నేపథ్యంలో పలువురు ఆశావహులు పార్టీ పెద్దలను కలిసే ప్రయత్నాల్లో మునిగి తేలుతున్నారు. మంత్రి పదవి దక్కుతుందని గంపెడాశతో ఉన్న మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లు రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈసారి విస్తరణలో తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు జి.వివేక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం కేసీ వేణుగోపాల్ సహా ఇతర నేతలను కలిశారు. ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు పార్లమెంట్‌కు వచ్చిన ముఖ్యమంత్రితో కలిసి రాష్ట్ర నాయకులు అగ్రనేతలైన సోనియాగాంధీ, ప్రియాంకగాంధీలతో ముచ్చటిస్తూ కనిపించారు. ఇక సోమవారం ఖర్గే, రాహుల్‌లను కలిసిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డిలు రేవంత్‌తో ఆయన అధికారిక నివాసంలో భేటీ అయ్యి, ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల చేరికపై మాట్లాడినట్లు తెలిసింది. ఇక వీరితోపాటు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు సైతం ఢిల్లీలోనే ఉండి హైకమాండ్ పెద్దలకు తమ వినతులు అందజేశారు.

ఢిల్లీలో గూడెం మహిపాల్

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సైతం ఢిల్లీలో కనిపించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకే ఢిల్లీకి వచ్చారని ప్రచారం జరిగినా, సుప్రీంకోర్టులో ఓ కేసు విషయమై వచ్చినట్లు ఆయన వివరణ ఇచ్చారు. ఇక పటాన్‌చెరుకే చెందిన కాంగ్రెస్ నేత, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు సైతం ఢిల్లీలోనే ఉండి కాంగ్రెస్ పెద్దలను కలవడం గమనార్హం.

నేడు ఢిల్లీకి భట్టి, ఉత్తమ్

అధిష్టానం పిలుపుతోనే ఇద్దరు నేతల హస్తిన పయనం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో స్పష్టమైన కదలికలు కనిపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఉండగా, అధిష్టానం పిలుపు మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడు, సీనియర్ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా అక్కడకు వెళ్లనున్నారు. బుధవారం ఉదయం ఈ ఇద్దరు నేతలు హస్తినకు పయనమవుతున్నారు. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఢిల్లీలోనే ఉండటంతో కీలక పరిణామాలు చోటుచేసుకోవచ్చనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్ష పదవితోపాటు నామినేటెడ్ పదవుల కసరత్తును ఓ కొలిక్కి తెచ్చేందుకే అధిష్టానం మొగ్గు చూపుతోందని, అందుకే రేవంత్‌కు తోడు ఆ ఇద్దరికీ ఢిల్లీ నుంచి పిలుపు వచ్చిందని తెలుస్తోంది. రేవంత్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు బయలుదేరతారని తెలుస్తోంది. ఈలోపే ఢిల్లీ పెద్దలతో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల భేటీ జరిగే అవకాశముంది.

కాంగ్రెస్ ఇకనైనా కుటిలరాజకీయాలు, చీకటి ఒప్పందాలు మానాలి

- నానమ్మను మించి రాహుల్ దురాలోచన
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇకనైనా కుటిల రాజకీయాలు, చీకటి ఒప్పందాలు వీడి ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ సూచించారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై అర్థవంతంగా చర్చకు సహకరించి పరిష్కారమార్గాలు సూచించాలని ఒక ప్రకటనలో కోరారు. దేశాన్ని అస్థిరపరిచి, బలహీనపరిచేందుకు విదేశీ శక్తుల పాత్ర ఉందనే సాకుతో అధికారాన్ని నిలుపుకునేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని గుర్తుచేశారు. 'ఆ చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు. ఎమర్జెన్సీపాలన దేశానికి ఓ మాయని మచ్చ. ప్రజల గొంతునొక్కి కాంగ్రెస్ చేసిన అరాచకాలు, అధికార దాహానికి ఎమర్జెన్సీ నిదర్శనం' అని మండిపడ్డారు. అధికారం కోసం ఇందిరాగాంధీని మించి ఆమె మనవడు రాహుల్‌గాంధీ దురాలోచన చేస్తున్నారని ఆరోపించారు. వివిధ దేశాల్లో పర్యటిస్తూ 'ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది' అనే ముసుగులో రాహుల్ పాశ్చాత్య దేశాల జోక్యాన్ని నిస్సిగ్గుగా కోరుతూ దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నించారని ధ్వజమెత్తారు. గతంలో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చేందుకు 99 సార్లు 356 ఆర్టికల్‌ను దుర్వినియోగం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని దుయ్యబట్టారు. తెలుగురాష్ట్రాల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన డీఎస్పీరెడ్డి, జంగారెడ్డి, వి.రామారావు, జూపూడి యజ్ఞనారాయణ, పీవీ.చలపతిరావు, వెంకయ్య నాయుడు, సీహెచ్.విద్యాసాగర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, ఇంకా సంఘ్ పరివార్ కార్యకర్తలను అరెస్ట్ చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి ఓట్లు పొందాలని చూసినా, కాంగ్రెస్‌కు దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినా ఆ పార్టీ నేతలు తీరు మారలేదని బండిసంజయ్ విమర్శించారు.

సైనిక్ స్కూల్‌పై రేవంత్ అబద్ధాలు: వినోద్



సాక్షి, హైదరాబాద్: వరంగల్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి అసత్యాలు మాట్లా డుతున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ విమర్శించారు. ఇకపై ఆయన చెప్పే అబద్ధాలకు దీటుగా సమాధానం ఇస్తామ న్నారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి వినోద్ కుమార్ మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ తర్వాత రేవంత్ గోబెల్స్ తరహాలో మాట్లాడారన్నారు. వరంగల్‌లో సైనిక్ స్కూలు గతంలోనే మంజూరైందని, కానీ రక్షణశాఖ ఆధ్వర్యంలో నడపలేమని చెప్పినందునే సమస్య తలెత్తిందన్నారు. సైనిక్ స్కూల్ ఏర్పాటుపై గతంలో నాటి రక్షణ మంత్రులు మనోహర్ పారిక్కర్, అరుణ్ జైట్లీని అనేక మార్లు కలిశామని పేర్కొన్నారు. వరంగల్ సైనిక్ స్కూలు ఏర్పాటుపై గత ప్రభుత్వం కేంద్రంతో చేసిన ఉత్తర ప్రత్యుత్తరాలను రేవంత్ చదువుకోవాలని సూచించారు. రక్షణ శాఖ భూముల కేటాయింపునకు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు రికార్డుల్లో ఉన్నాయని గుర్తు చేశారు.



విపక్ష ఎంపీలు ఎం.కె. రాఘవన్, ఆంటో ఆంటొనీ, ఎన్.కె. ప్రేమచంద్రన్, ఎ.రాజా, దీపేందర్‌సింగ్ హుడా, మాణిక్కం ఠాగూర్‌తో కలిసి స్పీకర్‌గా నామినేషన్ వేసేందుకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ కె. సురేశ్



బీజేపీ ఎంపీ ఓం బిర్లా తరఫున నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, కిరణ్ రిజిజు, రామ్మోహన్‌నాయుడు ఇతర ఎన్డీఏ నేతలు

ఓం బిర్లా X సురేశ్

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశం నుంచి బయటికి వచ్చేశారు. మూడుసార్లు ఎంపీ అయిన ఓం బిర్లా రాజస్తాన్‌లోని కోటాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓం బిర్లా తరఫున 10కి పైగా నామినేషన్లు దాఖలైనట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డాలతో పాటు, టీడీపీ, జేడీయూ, జేడీఎస్, ఎల్జేపీ (ఆర్) పార్టీలు ఓం బిర్లా తరఫున నామినేషన్‌లు దాఖలు చేశాయి. కేరళ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దళిత ఎంపీ కే.సురేశ్ ఎనిమిదోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. సురేశ్ తరఫున మూడుసెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.

సంప్రదాయాన్ని పాటించడం లేదు: వేణుగోపాల్

విపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చే సంప్రదాయాన్ని ప్రభుత్వం పాటించడం లేదని వేణుగోపాల్ ఆరోపించారు. ఓం బిర్లాపై తమ అభ్యర్థిని పోటీకి నిలుపుతామని ప్రకటించారు. విపక్షం ఒత్తిడి రాజకీయాలకు దిగుతోందని, షరతులు పెడుతోందని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, లలన్ సింగ్ (జేడీయూ)లు అన్నారు. డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకునే సమయం వచ్చినపుడు విపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తామని సీనియర్ మంత్రులు హామీ ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యం షరతులపై నడవదని పీయూష్ గోయల్ అన్నారు. ఇండియా కూటమిలోని మిగతా పార్టీలు పోటీకి అంత సుముఖంగా లేనప్పటికీ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందని బీజేపీ వర్గాలు తెలిపాయి.

అది మా హక్కు: సురేశ్

'గెలుస్తామా, ఓడుతామా అన్నది ముఖ్యం కాదు. అధికారపక్షం నుంచి స్పీకర్ ఉంటే డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇవ్వాలనేది సంప్రదాయం. గత రెండు లోక్‌సభల్లో మాకు ప్రతిపక్ష హోదా లేదని డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వడానికి నిరాకరించారు. ఇప్పుడు మేము గుర్తింపు పొందిన ప్రతిపక్షం. డిప్యూటీ స్పీకర్ పదవి మా హక్కు. కానీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. మంగళవారం 11:50 గంటల దాకా ప్రభుత్వం నుంచి స్పందన కోసం ఎదురుచూశాం. ఎలాంటి సమాధానం రాలేదు' అని కే.సురేశ్ అన్నారు.

మూడోసారి పోటీ

స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగుతుంది. ఒకవేళ పోటీ అనివార్యమైతే.. లోక్‌సభ చరిత్రలో స్పీకర్ పదవికి పోటీ జరగడం ఇది మూడోసారి అవుతుంది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో 1952, 1967, 1976లలో మాత్రమే స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. 1952లో కాంగ్రెస్ అభ్యర్థి జి.వి.మౌలాంకర్ 394 ఓట్లు సాధించి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి శాంతారాం మోరేకు కేవలం 55 ఓట్లు మాత్రమే వచ్చాయి. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డితో తెన్నేటి విశ్వనాథం పోటీపడ్డారు. సంజీవరెడ్డికి 278 ఓట్లు రాగా, విశ్వనాథంకు 207 ఓట్లు పడ్డాయి. 1976లో జరిగిన ఎన్నిక పూర్తిస్థాయి స్పీకర్ పదవికి కాదు. 1975లో ఇందిగాంధీ దేశంలో అత్యయిక పరిస్థితిని విధించారు. ఐదో లోక్‌సభ ఐదో సెషన్‌ను ఏడాది పాటు పొడిగించారు. అప్పటి స్పీకర్ జి.ఎస్.ధిల్లాన్ రాజీనామా చేయడంతో.. జనవరి 5, 1976న పొడిగించిన ఏడాది కాలానికి స్పీకర్ ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ నాయకుడు బలిరామ్ భగత్‌ను స్పీకర్ పదవికి ఇందిరా గాంధీ ప్రతిపాదించారు. జనసంఘ్ నాయకుడు జగన్నాథరావు జోషి బరిలో నిలువడంతో ఎన్నిక జరిగింది. బలిరామ్ భగత్‌కు 344 ఓట్లు రాగా, జోషికి 58 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం 18వ లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులు ఉండగా, ఇండియా కూటమికి 233 (రాహుల్ గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో విపక్షాల బలం ఒకటి తగ్గింది) ఎంపీలున్నారు. ఇండియా కూటమికి ముగ్గురు స్వతంత్ర ఎంపీల మద్దతుంది. సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే ఓం బిర్లా స్పీకర్‌గా ఎన్నిక కావడం లాంఛనమే. బుధవారం ఓటింగ్ జరిగితే.. పేపర్ స్లిప్పులనే వాడనున్నారు. నూతన సభ్యులు ఎవరెక్కడ కూర్చోవాలో నిర్ణయించే సీట్ల కేటాయింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. కాబట్టి ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థ సిద్ధంగా లేదు. ఓం బిర్లా స్పీకర్‌గా ఎన్నికైతే.. రెండు పర్యాయాలు స్పీకర్‌గా పనిచేసిన ఐదోవ్యక్తి అవుతారు. కాకపోతే గతంలో కాంగ్రెస్ నేత బలరాం జాఖడ్ ఒక్కరు మాత్రమే రెండుసార్లు (ఏడు, ఎనిమిదో లోక్‌సభల్లో) స్పీకర్‌గా పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేశారు.

మళ్లీ మంచిరోజులు

ఎమ్మెల్యేలు పార్టీ మారితే నష్టమేమీ లేదు

- గతంలోనూ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు
- హామీల అమలులో రేవంత్ ప్రభుత్వం విఫలం
- రాజకీయ భవిష్యత్‌పై నగర ఎమ్మెల్యేలకు కేసీఆర్ భరోసా



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల హామీల అమలులో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని, భవిష్యత్‌లో బీఆర్‌ఎస్‌కు మళ్లీ మంచిరోజులు వస్తాయని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారడాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకొని ఉద్యమస్ఫూర్తిని దెబ్బతీసేందుకు ప్రయత్నించినా వెనుకంజ వేయలేదన్నారు. పార్టీ ఫిరాయింపు వ్యవహారం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు శాసనసభ్యు లు, శాసన మండలి సభ్యులు మంగళవారం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఎర్రవల్లి నివాసంలో జరిగిన ఈ భేటీలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అరడజను మంది ఎమ్మెల్యేలు ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భేటీలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై కేసీఆర్ చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం, క్షీణించిన శాంతిభద్రతలు వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్ర ఏర్పాటు ద్వారా అనుభవం కలిగిన నేతలను పునర్నిర్మాణంలో భాగస్వాములు చేయాలనే లక్ష్యంతోనే కొందరిని బీఆర్‌ఎస్‌లో గతంలో చేర్చుకున్నట్టు కేసీఆర్ చెప్పారు. అధికారం కేంద్రంగా పరిభ్రమించే వ్యక్తులు కొందరు అన్నిచోట్లా ఉంటారని, అలాంటి వారిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పినట్టు సమాచారం. పార్టీ వెంట నడిచే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేసీ ఆర్ భరోసా ఇచ్చినట్టు భేటీలో పాల్గొన్న నేతలు వెల్లడించారు.

నగర ఎమ్మెల్యేల భేటీకి ప్రాధాన్యం

ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర నేతలున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో మరికొందరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా అదే తోవ పడుతున్నారనే ప్రచారం జరు గుతోంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేసీఆర్‌ను కలిసిన గ్రేటర్ ఎమ్మెల్యేల్లో అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), మాగంటి గోపీనాథ్ (జూబ్లీహిల్స్), మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి), ముఠా గోపాల్ (ముషీరాబాద్), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), కేపీ.వివేకానంద (కుత్బుల్లాపూర్) ఉన్నారు. వీరితోపాటు ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, పార్టీ నేతలు క్యామ మల్లేశ్, రావుల శ్రీధర్‌రెడ్డి కూడా కేసీఆర్‌ను కలిశారు. కేసీఆర్‌తో భేటీ అధికారిక సమావేశం కాదని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. బుధవారం కూడా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేసీఆర్‌తో భేటీ అయ్యే అవకాశముంది. రెండు రోజులుగా కేసీఆర్‌ను కలిసేందుకు వందల మంది నాయకులు, కార్యకర్తలు తరలివస్తుండటంతో ఎర్రవల్లి నివాసం వద్ద సందడి నెలకొంది.

కౌశిక్ హరికి అభినందనలు

ఇటీవల రామగుండం కేశోరాం సిమెంట్స్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్యానెల్ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘంనేత కౌశిక్ హరి కుటుంబ సమేతంగా ఎర్రవల్లి నివాసంలో కేసీ ఆర్‌ను కలిశారు. కౌశిక్ హరిని కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావులు కూడా అభినందించారు.

కేసీఆర్‌కు ఊరట

రైల్‌రోకో కేసు దర్యాప్తును నిలిపివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనను నిందితుడిగా చేర్చిన మౌలాలి రైల్‌రోకో కేసులో దర్యాప్తును నిలిపివేసింది. తదుపరి విచారణ వరకు దర్యాప్తుపై స్టే విధించింది. పోలీసులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణను జూలై 23 కు వాయిదా వేశారు. 2011లో తనపై నమోదైన రైల్‌రోకో కేసును కొట్టివేయాలని, ఎలాంటి ఆధారాలు లేకున్నా తనను నిందితుల జాబితాలో చేర్చారంటూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో భాగంగా 2011లో మౌలాలి రైల్వేస్టేషన్‌లో జరిగే రైల్‌రోకోలో పాల్గొనాలని ఉద్యమకారులను నేను, ప్రొఫెసర్ కోదండరామ్ పురిగొల్పినట్లు పేర్కొంటూ కేసు నమోదు చేశారు. స్వరాష్ట్ర పోరాటంలో నేను, కోదండరామ్‌లు తమకు పిలుపునిచ్చారన్న సాక్షుల మౌఖిక వాంగ్మూలం తప్ప పోలీసుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. నేను ఆ రైల్‌రోకోలో పాల్గొనలేదు. ఆధారాలు లేకుండా నిందితుల జాబితాలో నా పేరు చేర్చారు. కనుక ఈ కేసు కొట్టివేయాలి' అని కేసీఆర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి వాదనల సందర్భంగా.. కేసీఆర్ రైల్‌రోకోలో పాల్గొన్నట్లు చార్జిషీట్‌లో పేర్కొనలేదు కదా అని అన్నారు. ఆధారాలు లేకుండా కేసు నమోదు చేయడం సరికాదని చెప్పారు.

నాడు కారుకూతలు.. నేడు పథకాల్లో కోతలు

రేవంత్ పాలనపై నిరంజన్‌రెడ్డి విమర్శ



సాక్షి, హైదరాబాద్: 'నాడు కారుకూతలు, నేడు పథకాల్లో కోతలు' అన్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడం ద్వారా రేవంత్ చేసిన తప్పులను సరిదిద్దుకోలేడని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు కూలీలకు రూ.12 వేలు సాయం, మహాలక్ష్మి పథకం, కొత్త రేషన్ కార్డులు మొదలుకుని అన్నీ అమలుకాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రుణమాఫీ వ్యవహారం సినిమా ఫంక్షన్లను తలపిస్తోందని నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రుణ మాఫీ జరగకుండానే సంబురాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ గెలుపునకు బీఆర్‌ఎస్ సహకరించిందని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలోనే బీజేపీకి ఎక్కు వ ఓట్లు వచ్చాయని, బీజేపీని నిలువరించడంలో కాంగ్రెస్ విఫలమైనందునే కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ ఫలితాలపై విచారణ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. మీడియా సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒట్టేసి చెబుతున్నా.. తప్పు చేయలేదు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టీకరణ
- అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నంకు ఒట్టేసి చెప్పే దమ్ముందా? అని సవాల్

వీణవంక (హుజూరాబాద్): 'తడి బట్టలతో దేవుడి మీద ఒట్టేసి చెబుతున్నా.. నేను అవినీతికి పాల్పడలేదు. తప్పు చేయలేదు. బూడిద రవాణాలో రూ. 100 కోట్ల అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఒట్టేసి చెప్పే దమ్ముందా' అని కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ సవాల్ నేపథ్యంలో కౌశిక్‌రెడ్డి కరీంనగర్ జిల్లా వీణవంకలోని తన నివాసం నుంచి చెల్పూర్ ఆంజనేయ స్వామి ఆలయానికి బయల్దేరేందుకు ప్రయత్నించగా.. పోలీసులు మంగళవారం హౌస్ అరెస్టు చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆలయానికి వెళ్లేందుకు పోలీసులు అనుమతివ్వకపోవడంతో తన ఇంటి ఎదుటే తడిబట్టలతో స్నానం చేశారు. అనంతరం తాను అవినీతికి పాల్పడలేదని ఆంజనేయస్వామి చిత్రపటంపై దైవసాక్షిగా ప్రమాణం చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని అపోలో టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మళ్లీ ప్రమాణం చేయడానికి వస్తానని... మంత్రి పొన్నం కూడా తన నిజాయితీని నిరూపించుకోవడానికి రావాలని డిమాండ్ చేశారు. బూడిద రవాణాలో రూ. 100 కోట్ల అవినీతి జరిగిందని ఆధారాలతో బయట పెట్టానని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 6 నెలలు గడవకముందే ఆరు స్కాంలు జరిగాయని ఆరోపించారు. హుజూరాబాద్ మండలం చెల్పూరు ఆలయానికి రావాలని పొన్నం ఆదేశిస్తేనే ప్రణవ్ మాట్లాడారని.. ఆలయానికి బయల్దేరితే పోలీసులతో అడ్డుకోవడం సిగ్గుచేటు మండిపడ్డారు. తాను ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం

సాక్షి, హైదరాబాద్: మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు' పేరిట ఎమర్జెన్సీ వ్యతిరేకదినం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో, హైదరాబాద్ సెంట్రల్ ఆఫీస్‌లో, రంగారెడ్డి జిల్లా పరిధిలో, రాష్ట్ర హైకోర్టు వద్ద ఎమర్జెన్సీ డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్టేట్, సిటీ ఆఫీసుల్లో జరిగిన కార్యక్రమాల్లో నాడు అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడి, జైళ్లకు వెళ్లిన వారిని సన్మానించారు. బర్కత్‌పురాలోని పార్టీ సిటీ సెంట్రల్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రసంగించారు. పార్టీనేత, మాజీ కార్పొరేటర్ వెంకటరమణి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు డా.కాసం వెంకటేశ్వర్లు, సి.కృష్ణాయాదవ్, ఆనంద్‌గౌడ్, శ్యాంసుందర్‌గౌడ్, డా.ఎన్.గౌతమ్‌రావు పాల్గొన్నారు. నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), బంగారు శృతి ఇతర నేతలు పాల్గొన్నారు. గతంలో జనసంఘ్, ఆరెస్సెస్‌లో పనిచేసి, ఎమర్జెన్సీ సందర్భంగా నిర్బంధాన్ని ఎదుర్కొన్న వారిని సన్మానించారు.

క్లుప్తంగా...

ప్రధాని మోదీతో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కేంద్రంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా త్రిపురలో తాజా పరిస్థితుల గురించి ఇంద్రసేనారెడ్డిని మోదీ అడిగి తెలుసుకున్నారు. అలాగే మోదీ 3.0 ప్రభుత్వంలో కేంద్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అమిత్ షాను కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, తదితర అంశాలపై అమిత్ షా ఇంద్రసేనారెడ్డితో చర్చించినట్లు తెలిసింది.

కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం

రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని, మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 5 మంత్రి పదవులు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీలకు జనాభా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని దేశవ్యాప్తంగా బహిరంగ సభలలో చెబుతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. గత మంత్రివర్గంలో బీసీలకు కేవలం 2 మంత్రి పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. త్వరలో జరగబోయే విస్తరణలో కనీసం అయిదుగురికి ప్రాధాన్యమున్న శాఖలను కేటాయించి న్యాయం చేయాలన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థులకు ఇచ్చినట్టు.. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వాలని, బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, ఆరెల్లి కృష్ణ

ఇల్లెందు రూరల్: భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లో జరుగుతున్న రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షునిగా కె.విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఆరెల్లి కృష్ణ, ఉపాధ్యక్షునిగా ఎస్.కే.మదార్, సహాయ కార్యదర్శులుగా బి.రాంసింగ్, నున్నా అప్పారావు, కోశాధికారిగా డి.లచ్చన్న ఎన్నికయ్యారు. సభ్యులుగా సాయిలు, అల్తాఫ్, మందాడి శ్రీను, దుర్గాప్రసాద్, రాజేందర్, పనుసూరి రాజు, మూతి రాంబాబు, అభిలాష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, కృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకించడమే కాక బొగ్గు బావుల వేలాన్ని నిరసిస్తూ జూలై 1 నుంచి 10వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసనలు తెలపనున్నట్లు వెల్లడించారు.

'గుర్తింపు'నకు గ్రహణం!



- అనుబంధ గుర్తింపు కోసం ఈసారి ముందుగానే కాలేజీల్లో తనిఖీలు పూర్తి
- కానీ పాత వీసీలు చేసిన తనిఖీలపై ఇన్‌చార్జి వీసీల అనుమానం
- దీంతో కాలేజీలకు అఫిలియేషన్ ఇవ్వొద్దని వర్సిటీలకు సర్కార్ ఆదేశం?
- ఫలితంగా సీట్ల వివరాలు అందక ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ జూలై 4కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 27 నుంచి జరగాల్సిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా పడింది. కొత్త షెడ్యూల్‌ను సాంకేతిక విద్య విభాగం మంగళవారం విడుదల చేసింది. ఈ మార్పునకు కారణాలేంటనేది అధికారులు వెల్లడించలేదు. కొన్ని కాలేజీలు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అనుమతి పొందాల్సి ఉందని మాత్రమే చెబుతున్నారు. కానీ వాస్తవానికి రాష్ట్ర యూనివర్సిటీల నుంచి ఇప్పటి వరకు ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు రాలేదు. ఇది వస్తేనే ఏ కాలేజీలో ఎన్ని సీట్లు ఉన్నాయనేది తెలుస్తుంది. కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో కాలేజీలు, కోర్సుల వివరాలు ఉంటేనే విద్యార్థులు ఆప్షన్లు ఇవ్వగలుగుతారు. ఏటా ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. కానీ ఈ ఏడాది ముందే పూర్తయింది. మే 21తో 10 విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల పదవీకాలం ముగిసింది. అయితే వారు ఆలోగానే కాలేజీల్లో తనిఖీలు పూర్తి చేశారు. కానీ కాలేజీలకు అఫిలియేషన్ ఇచ్చే సమయంలో తనిఖీలపై ఫిర్యాదులొచ్చాయి. దీంతో కాలేజీలకు ఇప్పుడే గుర్తింపు ఇవ్వొద్దంటూ ప్రభుత్వం ఆదేశించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మే 21 తర్వాత వీసీల పదవీకాలం ముగియడంతో ప్రతి వర్సిటీకి ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా ప్రభుత్వం నియమించింది. పాత వీసీలు చేపట్టిన తనిఖీలపై వారికి అనుమానాలు రావడంతో ప్రక్రియను నిలిపివేసినట్లు తెలుస్తోంది.

గోల్‌మాల్ జరిగిందా?

రాష్ట్రంలో 178 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా వాటిలో 17 కాలేజీలు ప్రభుత్వ అధీనంలోని విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్నాయి. మిగిలిన 161 కాలేజీలు ప్రైవేటువి. ఇంజనీరింగ్ కాలేజీల్లో బ్రాంచీలు, సెక్షన్లు, సీట్లకు సంబంధించి యాజమాన్యాలు ముందుగా ఏఐసీటీఈ నుంచి అనుమతి తీసుకోవాలి. 33 కాలేజీలు మినహా మిగతా కాలేజీలన్నీ ఏఐసీటీఈ అనుమతి తీసుకున్నాయి. అంటే 128 కాలేజీలు తమ పరిధిలోని విశ్వవిద్యాలయం నుంచి గుర్తింపు పొందాల్సి ఉంటుంది. అయితే వర్సిటీల అధికారులు తనిఖీల సందర్భంగా ఇష్టానుసారం వ్యవహరించారని, ప్రైవేటు కాలేజీలకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. ఫ్యాకల్టీ, మౌలికవసతులు లేకున్నా సక్రమంగానే ఉన్నట్లు నివేదికలు ఇచ్చినట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి వీసీలుగా నియమితులైన ఐఏఎస్ అధికారులు తనిఖీల్లో అవకతవకలపై విచారణ మొదలుపెట్టారు. దీంతో అనుబంధ గుర్తింపులో జాప్యం జరుగుతోందని అధికారులు అంటున్నారు. ఈ పరిణామాలపై ఆందోళన చెందుతున్న కాలేజీ యాజమాన్యాలు ఏదో విధంగా గుర్తింపు తెచ్చుకోవడానికి పావులు కదుపుతున్నాయి. ఈ క్రమంలో బేరసారాలకు ఆస్కారం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీట్ల లెక్క ఇలా..

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో 1.22 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉండగా వాటిలో 83 వేల సీట్లు కన్వీనర్ కోటా కింద ఉన్నాయి. అందులోనూ 58 శాతం సీట్లు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇతర కంప్యూటర్ కోర్సుల్లోనే ఉన్నాయి. గత కొన్నేళ్లుగా డిమాండ్ లేని సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో సీట్లను, సెక్షన్లను ప్రైవేటు కాలేజీలు తగ్గించుకుంటున్నాయి. వాటి స్థానంలో కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో సీట్లు పెంచాలని కోరుతున్నాయి. ఈ ఏడాది కూడా ఇదే తరహాలో 80 కాలేజీల నుంచి దరఖాస్తులు వచ్చాయి. గతేడాది బ్రాంచీ మార్చుకున్నవి, కొత్తగా మంజూరైన కంప్యూటర్ సైన్స్ సీట్లు 14 వేల వరకు ఉన్నాయి. పెరిగిన సీట్లను ఆఖరి కౌన్సెలింగ్‌లోకి తెచ్చారు. ఏయే కాలేజీల్లో, ఏ బ్రాంచీల్లో సీట్లు పెరుగుతాయి? ఎందులో తగ్గుతాయి? అనే వివరాలతో ముందే కౌన్సెలింగ్ కేంద్రంలో సాఫ్ట్‌వేర్ రూపొందించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం అనుబంధ గుర్తింపే కాలేజీలకు రాకపోవడంతో సీట్లపైనా అధికారులకు స్పష్టత రావడం లేదు.

సవరించిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇదీ...

ఏ తేదీన	ఏం చేయాలి?
మొదటి దశ	
జూలై 4 నుంచి 12 వరకు	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్
జూలై 6 నుంచి 13 వరకు	ధ్రువపత్రాల పరిశీలన
జూలై 8 నుంచి 15 వరకు	ఆప్షన్ల ఎంపిక
జూలై 19	తొలి దశ సీట్ల కేటాయింపు
జూలై 19 నుంచి 23 వరకు	సెల్ఫ్ రిపోర్టింగ్
రెండో దశ	
జూలై 26	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్
జూలై 27	సర్టిఫికెట్ల పరిశీలన
జూలై 27, 28	ఆప్షన్ల ఎంపిక
జూలై 31	రెండో దశ సీట్ల కేటాయింపు
జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు	సెల్ఫ్ రిపోర్టింగ్
ఆగస్టు 4	కాలేజీలో చేరిన విద్యార్థుల వివరాల వెల్లడి
ఫైనల్ ఫేజ్	
ఆగస్టు 8	స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్
ఆగస్టు 9	ధ్రువపత్రాల పరిశీలన
ఆగస్టు 9, 10	ఆప్షన్ల ఎంపిక
ఆగస్టు 13	సీట్ల కేటాయింపు
ఆగస్టు 13–15	సెల్ఫ్ రిపోర్టింగ్
ఆగస్టు 16–17	బ్రాంచ్ మారితే కాలేజీలో రిపోర్టింగ్ చేయాలి
ఆగస్టు 18	కాలేజీల సీట్ల వివరాల వెల్లడి
అంతర్గత స్లైడింగ్	
ఆగస్టు 21–22	కాలేజీలో బ్రాంచ్ మార్పుకు ఆప్షన్లు
ఆగస్టు 26	సీట్ల కేటాయింపు
ఆగస్టు 27–28	మారిన బ్రాంచ్‌తో కాలేజీలో రిపోర్టింగ్
ఆగస్టు 28	వెబ్‌సైట్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు

ఇంకా అలక వీడని జీవన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రసక్తే లేదని, అయితే ఎమ్మెల్సీ పదవికి మాత్రం త్వరలోనే రాజీనామా చేస్తానని జీవన్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

మండలి చైర్మన్‌కు ఫోన్

సంజయ్ చేరిక సమయంలో కనీసం తనకు సమాచారం కూడా ఇవ్వలేదన్న మనస్తాపంతో ఉన్న జీవన్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకత్వం సోమవారం చర్చలు జరిపింది. పార్టీ అధిష్టానం కూడా మాట్లాడింది. అయినా, తన వైఖరిలో మార్పు లేదంటూ జీవన్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు తాను కలుస్తానంటూ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఫోన్ చేశారు. కానీ, తాను అందుబాటులో లేనని, నల్లగొండ వెళుతున్నానని గుత్తా వెల్లడించడంతో తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు బేగంపేటలోని జీవన్‌రెడ్డి నివాసానికి హుటాహుటిన వెళ్లారు. గంటన్నరకు పైగా అక్కడే ఉండి జీవన్‌రెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేశారు. పార్టీ తగిన గౌరవం ఇస్తుందని, సీనియారిటీకి ఎక్కడా గౌరవం తగ్గకుండా తాము చూస్తామని నచ్చజెప్పారు. అయితే, మంత్రులతో చర్చల సందర్భంగా జీవన్‌రెడ్డి తన మనసులోని మాటలను వారికి వెల్లడించారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. పార్టీ తీసుకున్న ప్రతి నిర్ణయానికి కట్టుబడి ఉన్నానని, తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా తన నియోజకవర్గంలోని తన రాజకీయ ప్రత్యర్థిని పార్టీలో చేర్చుకోవడం ద్వారా తనకు ఏం గౌరవం ఇచ్చినట్టని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీతో తనది నాలుగు దశాబ్దాల అనుబంధమని, తాను పార్టీని వీడే ప్రసక్తే లేదని, అయితే ఎమ్మెల్సీ పదవిలో కొనసాగే ఆలోచన ప్రస్తుతానికి లేదని, తన నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేసినట్టు సమాచారం.

జీవన్‌రెడ్డి మా మార్గదర్శకులు: డిప్యూటీ సీఎం భట్టి

మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర నేతలతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పదేళ్ల పార్టీ జెండాను భుజాన మోస్తూ పార్టీ భావజాలాన్ని చట్టసభల్లో వినిపించిన నాయకుడు జీవన్‌రెడ్డి అని అన్నారు. ఆయన మనస్తాపానికి గురైతే తాము కూడా బాధపడతామని వ్యాఖ్యానించారు. జీవన్‌రెడ్డి తమందరికీ మార్గదర్శకులని, ఆయన అనుభవాన్ని ప్రభుత్వాన్ని నడిపేందుకు తప్పనిసరిగా వినియోగించుకుంటామని చెప్పారు. ఆయన సీనియారిటీకి ఎలాంటి భంగం కలిగించకుండా పార్టీ సముచిత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. సీనియర్ నాయకులను వదులుకునేందుకు పార్టీ సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని జీవన్‌రెడ్డిని తాము కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని భట్టి వెల్లడించారు.

చైర్మన్‌ను సమయం ఎందుకు అడిగానో ఆలోచించుకోండి: జీవన్‌రెడ్డి

భట్టి, శ్రీధర్‌బాబులతో చర్చలు ముగిసిన అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు. తనకు కాంగ్రెస్ పార్టీతో 40 ఏళ్ల అనుబంధం ఉందని చెప్పారు. జరిగిన పరిణామాలు కొన్ని బాధించాయని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి తగిన సంఖ్యాబలం ఉందని, నాలుగున్నరేళ్లు ఎవరూ కదిలించలేరన్నారు. అయినా ప్రభుత్వం నడవాల్సిన సంఖ్యాబలం మీద కాదు సుస్థిరత మీద జీవన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించొద్దని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టామని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే బీజేపీ బలపడుతుందనే అభిప్రాయముందని చెప్పారు. తనతో పార్టీ ఇన్‌చార్జ్ మున్షీ కూడా మాట్లాడారని వెల్లడించారు. శాసనమండలి చైర్మన్ అందుబాటులో లేరని, ఆయన అందుబాటులోకి రాగానే నిర్ణయం చెబుతానని, త్వరలోనే మండలి చైర్మన్ దగ్గరకు వస్తానని అన్నారు. మీరు ఎమ్మెల్సీగా కొనసాగుతారా? రాజీనామా చేస్తారా అని ప్రశ్నించగా, మండలి చైర్మన్ టైం ఎందుకు అడిగానో అర్థం చేసుకోవాలని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

'నాతో మంచిగా ఉండు.. నీ అవసరాలు తీరుస్తా'

మహిళ పట్ల ఓ ఎస్సై అనుచిత ప్రవర్తన... ఎస్పీకి ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'నాతో మంచిగా ఉండు.. నీ అవసరాలు తీరుస్తా...'అని ఎస్సై అసభ్యకరంగా మాట్లాడాడంటూ ఓ మహిళ ఎస్సై నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని ఓ ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు చేసింది. సోమవారం జరిగిన ప్రజావాణిలో ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ను కలిసింది. 'నా భర్త విషయంలో నేను ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టకుండా కాలయాపన చేశారు. మళ్లీ ఫిర్యాదు చేయాలని ఏప్రిల్ 16న స్టేషన్‌కు పిలిపించారు. ఎస్సై క్యాబిన్‌లో నన్ను రెండు గంటలపాటు ఉంచి అసభ్యకరంగా వ్యవహరించారు. నువ్వు ఒక్కదానివే ఎలా ఉంటున్నావు.. భర్తకు దూ రంగా ఉంటున్నావు కదా. నీకు పిల్లలు ఎప్పుడు, ఎలా పుట్టారు.. నీకు ఇప్పుడు భర్తతో ఉండాలనే కోరిక కలగడం లేదా? నాతో మంచిగా ఉండు. నీ ఫోన్‌నంబరు నాకు ఇవ్వు. నా పర్సనల్ నంబరు నువ్వు తీసుకో. నేను నీకు అన్నివిధాలా సహకరిస్తాను. నీ ప్రతి అక్కర తీరుస్తాను.. నీకు వంట వచ్చా.. వస్తే నాకు చేపలు వండుకు రా.. మరొక రోజు మేక మాంసం వండుకురా అని వేధించడమే కాకుండా నాతో బలవంతంగా గ్రీన్ టీ పెట్టించుకొని తాగారు. స్టేషన్‌కు ఇలా అప్పుడప్పుడు వచ్చి నేను నడుచుకొమ్మన్నట్లు నడుచుకో. నీకు అన్నివిధాలా మంచిది. ఈ సంభాషణ మన మధ్యనే ఉండాలి. ఎవరికీ చెప్పవద్దు. ఒక వేళ చెబితే మీ కుటుంబ విషయాల్లో తలదూర్చి అక్రమ కేసులు బనాయిస్తా. అంటూనే నీకంటే మీ అమ్మ ఇంకా బాగుంది అని అన్నాడు. నేను భయపడి ఈ విషయాలు రెండు వారాల పాటు ఎవరితో పంచుకోలేదు. మీరే తగిన చర్యలు చేపట్టండి..'. అని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్పీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ

తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ వినతి



మీడియాతో మాట్లాడుతున్న జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని, రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవద్దని, రీ అపాయింట్‌మెంట్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ సర్వీసులను నిలిపేయాలని టీఎన్జీవో, టీజీవో విజ్ఞప్తి చేశాయి. మంగళవారం టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో నేతలు సత్యనారాయణ, శ్యామ్‌లతో పాటు దాదాపు 40 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఉద్యోగుల చందాతో కూడిన ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, కరువు భత్యం (డీఏ) బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగుల పెండింగ్ పదోన్నతులు ఇప్పించాలని కోరారు. గచ్చిబౌలి టీఎన్జీవో రెండో ఫేజ్‌లో 101.02 ఎకరాల స్థలంపై సొసైటీకి యాజమాన్య హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రూ. 1,544 కోట్ల 'పంచాయతీ' నిధులివ్వండి



- ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌ను కోరిన మంత్రి సీతక్క
- రక్షిత మంచినీటికి నిధులివ్వాలని మరో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకుగాను 6,176 పంచాయతీలకు శాశ్వత భవనాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. అందువల్ల కొత్త పంచాయతీ భవనాల నిర్మాణానికి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద ఒక్కో భవనానికి రూ. 25 లక్షల చొప్పున రూ. 1,544 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ని కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని 10 లక్షల గృహాలకు రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో ఇద్దరు కేంద్ర మంత్రులను వేర్వేరుగా మంత్రి సీతక్క కలిశారు.

సోనియాకు పలకరింపు.. రాహుల్‌కు సత్కారం

పార్లమెంటులో ఎంపీల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి హాజరైన మంత్రి సీతక్క.. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏఐసీసీ కార్యాలయంలో అగ్రనేత రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీగా ప్రమాణం చేసినందుకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

'చేనేతను సంక్షోభంలోకి నెట్టిందే బీఆర్‌ఎస్'



సాక్షి, హైదరాబాద్: సమైక్య రాష్ట్రంలో ఉన్నదానికంటే దారుణంగా గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేనేత రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇచ్చి డబ్బులు చెల్లించకుండా వాళ్ల బతుకులు బుగ్గిపాలు చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటే ఎక్కువగా నేతన్నలకు చేతినిండా ఆర్డర్లు ఇస్తున్నామని, పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నామని తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డికి చేనేతరంగంపై రాసిన బహిరంగ లేఖ చూస్తే.. దొంగే దొంగ దొంగ అన్నట్లు ఉందని తుమ్మల ఎద్దేవాచేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చేనేత కార్మికులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగించే పథకాల కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రూ.33.23 కోట్లు నేత కార్మికులకు 10 శాతం యార్న్ సబ్సిడీ రూపంలో టెస్కో నిధుల నుంచి విడుదల చేశామని తుమ్మల వెల్లడించారు. చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం, స్వయం సమృద్ధి కోసం నూతన పథకాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగుల సమస్యలపై త్రిసభ్య కమిటీ భేటీ

సీఎంకు త్వరలోనే నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని అంశాలపై చర్చించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించిన త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య మంగళవారం సమావేశమయ్యారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కిందిస్థాయి నుంచి ఉన్నతోద్యోగి వరకు, అధికారులు ఉపాధ్యాయుల సమస్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందిన వినతి పత్రాలను త్రిసభ్య కమిటీ సభ్యులు అధ్యయనం చేశారు. ఆయా సంఘాల నుంచి సీఎంకు అందిన వినతి పత్రాలపై చర్చించి ఒక నివేదికను రూపొందించాలని నిర్ణయించారు. ఈ నివేదికను త్వరలోనే ముఖ్యమంత్రికి అందజేయాలని కూడా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల సమస్యలపై తరచూ భేటీ కావాలని పేర్కొన్నారు. ఇది ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని జి.చిన్నారెడ్డి స్పష్టం చేశారు.

రెండోరోజు జూడాల సమ్మెతో స్తంభించిన సేవలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో జూనియర్ డాక్టర్ల సమ్మె మంగళవారం రెండో రోజు కూడా కొనసాగింది. నిరసనల కారణంగా రోగుల వైద్యసేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఓపీ సేవలకు రెండు మూడు గంటల జాప్యం జరిగింది. సమ్మె గురించి తెలియని పలువురు రోగులు ఆస్పత్రులకు తరలివచ్చారు. అనేక ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు కూడా వాయిదా పడ్డాయి. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్)లో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) సభ్యులు ర్యాలీ నిర్వహించి ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అన్ని ప్రధాన ఆస్పత్రుల వద్ద నిరసనలు జరిగాయి. సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జరిపిన చర్చలు విఫలమైన తర్వాత, మంగళవారం తదుపరి చర్చలు జరగలేదు. దీంతో జూనియర్ డాక్టర్లు ప్రభుత్వ తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

6 నెలలు గడిచినా పాలనపై పట్టేది?

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి పదవి చేపట్టి 6 నెలలు గడిచినా రేవంత్‌రెడ్డి పాలనపై పట్టు సాధించలేకపోయారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. పాలనను గాడిలో పెట్టేందుకు కిందామీద పడుతూ ఢిల్లీ పెద్దల మెప్పు పొంది తన పదవిని కాపాడుకోవడంపైనే రేవంత్ దృష్టి పెట్టారని ఎద్దేవాచేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేబినెట్ విస్తరణ, కార్పొరేషన్ల నియామకాలు, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం ఆయన ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. ఇక రేవంత్‌రెడ్డి ఢిల్లీలోనే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచే పాలన సాగిస్తే మంచిదంటూ ఎద్దేవాచేశారు. కేవలం పాలనపై పట్టు కోసమే మూకుమ్మడిగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు చేశారని ఆరోపించారు. మరోవైపు రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ప్రభాకర్ ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ కనుసన్నల్లోనే కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల చేరికలని ఆరోపించారు. అవినీతి, కుంభకోణాల నుంచి కాపాడుకునేందుకే ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వాన్ని నడిపిస్తున్నారన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలను కాపాడే ప్రయత్నం చేస్తోందని ప్రభాకర్ విమర్శించారు.

జై సమ్మక్క.. జై తుల్జాభవాని.. జై భీం

- జై తెలంగాణతోపాటు వివిధ దేవతల పేరుతో ప్రమాణం చేసిన ఎంపీలు
- తెలుగులో ప్రమాణం చేసిన తమిళ ఎంపీ గోపీనాథ్
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు



ఎంపీలుగా ప్రమాణం చేస్తున్న ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, రఘురాంరెడ్డి



మల్లు రవి



బలరాం నాయక్



కడియం కావ్య



చామల కిరణ్



అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎంపీలు తమదైన శైలిలో లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 15 మంది తెలంగాణ ఎంపీలు ఒకరి తర్వాత ఒకరు హిందీ, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రమాణం చేశారు. పలువురు ఎంపీలు జై తెలంగాణతోపాటు జై సమ్మక్క, జై లక్ష్మీనరసింహ, జై భద్రకాళి, జై తుల్జాభవాని, జైభీం.. జై రాజ్యాంగం అంటూ ప్రమాణం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కలు లోక్‌సభకు హాజరై రాష్ట్ర ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. తమిళనాడులోని కృష్ణగిరి ఎంపీ కె.గోపీనాథ్ తెలుగులోనే ప్రమాణం చేశారు.

నగేష్‌తో మొదలు...

ముందుగా ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ హిందీలో ప్రమాణం చేశారు. అనంతరం గడ్డం వంశీకృష్ణ, ధర్మపురి అర్వింద్, మాధవనేని రఘునందన్‌రావు, ఆర్.రఘురాంరెడ్డిలు ఇంగ్లిష్‌లో ప్రమాణం చేయ గా, మిగతా ఎంపీలు సురేశ్ షెట్కార్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, డా.మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, డా.కడియం కావ్య, పోరిక బలరాంనాయక్‌లు తెలుగులో, అసదుద్దీన్ ఒవైసీ ఉర్దూలో లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. కాగా ప్రమాణ సమయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జై సమ్మక్క– సారలమ్మ అని, వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య జై భద్రకాళి అని, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి జైభీం అని, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ జై తుల్జాభవాని అంటూ ప్రమాణం ముగించారు.

ఒవైసీ వ్యాఖ్యపై సభలో గందరగోళం

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సభలో జై పాలస్తీనా అని అనడంపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీ మల్లు రవి ప్రమాణం చేసేందుకు సిద్ధమైన వెంటనే అసదుద్దీన్ ఒవైసీ జై పాలస్తీనా అనడాన్ని వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. దీంతో కొద్దిసేపు మాటల యుద్ధం జరిగింది. గందరగోళ పరిస్థితుల మధ్యే మల్లు రవి ప్రమాణాన్ని కొనసాగించారు. అయితే బీజేపీ సభ్యులు గట్టిగా కేకలు వేస్తుండడంతో మల్లు రవి కాస్త అసహనం వ్యక్తం చేశారు. కాగా ప్రమాణ పత్రంలో ఉన్నది మాత్రమే రికార్డుల్లోకి వెళుతుందని ప్యానెల్ స్పీకర్ రాధామోహన్‌సింగ్ చెప్పడంతో పరిస్థితి చక్కబడింది. ఆ తర్వాత మిగతా సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

సోనియాగాంధీని కలిసిన రేవంత్



తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపీలుగా ప్రమాణం చేసిన వారిని రేవంత్ సోనియాగాంధీకి పరిచయం చేశారు. సీఎం వెంట మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి ఏపీ.జితేందర్‌రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి ఉన్నారు.



ఆకర్షణీయమైన వస్తువుల పట్ల మోహరహితమైన దృష్టి ఏర్పడటమే నిజమైన ప్రజ్ఞ; ఆరాటం స్థానంలో విరక్తి ఉత్పన్నమవటం, స్పష్టమైన అంతఃదృష్టి కలిగిందనటానికి గుర్తు.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 26 జూన్ 2024

చెరవీడిన అసాంజ్ !

అగ్రరాజ్యంపై యుద్ధం చేయాలంటే మారణాయుధాలు అవసరం లేదని, ఒక ల్యాప్‌టాప్‌తో దాన్ని ముప్పుతిప్పలు పెట్టొచ్చని గుక్కతిప్పుకోనీయకుండా చేయొచ్చని నిరూపించిన వికీలీక్స్ అధిపతి జూలియన్ అసాంజ్‌కు పద్నాలుగేళ్ల తర్వాత ఎట్టకేలకు స్వేచ్ఛ లభించింది. తన సాహసవంతమైన కార్యకలాపాల కారణంగా అయినవాళ్లకు దూరమై కొన్నాళ్లు లండన్‌లోని ఈక్వెడార్ దౌత్యకార్యాలయంలో తలదాచుకుని, ఆ తర్వాత బ్రిటన్ చెరలో మగ్గిన అసాంజ్ నేరాంగీకార ప్రకటనకు సిద్ధపడి అమెరికా ఇవ్వజూపిన వెసులుబాటుకు తలొగ్గక తప్పని స్థితి ఏర్పడటం స్వేచ్ఛాప్రియులకూ, పాత్రికేయలోకానికీ చివుక్కుమనిపిస్తుంది. ఒప్పందం ప్రకారం పశ్చిమ పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలోని 14 దీవుల సముదాయమైన ఉత్తర మెరీనా ఐలాండ్స్ (ఎన్ఎంఐ)లో ఒకటైన సైపాన్ దీవిలోని న్యాయస్థానం ఎదుట అసాంజ్ హాజరై తన తప్పు ఒప్పుకున్నాడు. అమెరికాలో అడుగుపెట్టడానికి అసాంజ్ విముఖత చూపిన కారణంగా, సాంకేతికంగా దానిలోనే భాగమైన సైపాన్‌లో ఈ తతంగం పూర్తిచేయటానికి అధ్యక్షుడు జో బైడెన్ అంగీకరించారు. అమెరికా ఆయనపై గూఢచర్యానికి సంబంధించి 18 ఆరోపణలు చేసింది. వాటి ఆధారంగా విచారణ జరిగితే అసాంజ్‌కు 175 ఏళ్ల శిక్షపడేది. కానీ ఒప్పందం ప్రకారం అందులో ఒకే ఒక నేరారోపణ మోపి, దానికింద అయిదేళ్ల శిక్షవిధించి బ్రిటన్ జైల్లో అనుభవించిన కాలాన్ని పరిగణనలోకి తీసుకుని వెంటనే విడుదల చేయటానికి ఒప్పందం కుదిరింది. వికీలీక్స్ ఎప్పటిలా పనిచేస్తుందా లేదా అన్నది తేలాల్సి వుంది.

ఏం నేరం చేశాడు అసాంజ్? యుద్ధాలనూ, దురాక్రమణలనూ సమర్థించుకునేందుకు అగ్రరాజ్యాలు ప్రచారంలో పెట్టే అబద్ధాలను తుత్తినియలు చేశాడు. అమెరికా దురాక్రమణలో ఉన్న ఇరాక్‌లో ఒక మారుమూల పల్లెలో వీధిలో నిలబడి మాట్లాడుకుంటున్న ఇద్దరు సాధారణ పౌరులనూ, రాయిటర్ జర్నలిస్టులు ఇద్దరినీ కేవలం సరదా కోసం బాంబులతో హతమార్చిన అమెరికా సైనికుల దురంతాన్ని ప్రపంచం దృష్టికి తీసుకొచ్చాడు. ఉగ్రవాదాన్ని అంతంచేసే పేరిట ఇరాక్, అఫ్గానిస్తాన్‌లలో అమెరికా కూటమి దేశాలు ఎన్ని అఘాయిత్యాలకు పాల్పడ్డాయో, ఎలా నరమేధాన్ని సాగించాయో తెలిపే లక్ష పత్రాలను బట్టబయలు చేశాడు. వర్ధమాన దేశాలే కాదు... సాటికి సరైన సంపన్న దేశాల విషయంలోనూ అమెరికాకు ఎంత చిన్న చూపున్నదో ఏకరువు పెట్టే కోట్లాది సందేశాలను బజారున పడేశాడు. అవన్నీ వేర్వేరు దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు తమ ప్రభుత్వానికి పంపిన సందేశాలు. ఎక్కడి ప్రభుత్వం ఎటువంటిదో, సైనిక వ్యవస్థల తీరుతెన్నులేమిటో తెలిపే అంచనాలు వాటిల్లో ఉన్నాయి. ఆఖరికి దేశదేశాల పాలకులు తమ అక్రమార్జనను వేరే దేశాల బ్యాంకులకు తరలిస్తున్న వైనాన్ని ఆధారాలతో వెల్లడించాడు. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2006లో జరిగిన కేంద్ర కేబినెట్ విస్తరణలో 'మన అనుకూలుర' వివరాలు పంపిన సందేశం కూడా అసాంజ్ లీక్స్‌లో ఉంది. ఇవన్నీ గూఢచర్యం కిందికొస్తాయని ఇన్నేళ్లుగా అమెరికా చేసిన వాదనలో పసలేదు. ఆ దేశమైనా, పాశ్చాత్య దేశాలైనా సందర్భం ఉన్నా లేకపోయినా ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు చెబుతుంటాయి. తెరవెనక మాత్రం అందుకు విరుద్ధమైన పోకడలకు పోతుంటాయి. దీన్నే సాక్ష్యాధారాలతో అసాంజ్ వెల్లడించాడు. అప్రజాస్వామికమైన ఆ కార్యకలాపాలు తాము నమ్మే విలువలకూ, విధానాలకూ పూర్తి విరుద్ధమని ఆ దేశాల పౌరులు గ్రహించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చివుంటే అంతిమంగా అక్కడి సమాజాలకూ, ప్రపంచానికీ మేలు జరిగేది. కానీ వంచకులను విశ్వసించటం, అబద్ధాలకు పట్టంగట్టడం ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు కనిపిస్తున్న ధోరణి. అసాంజ్ విలువను ఇలాంటి సమాజాలు ఏం గుర్తించగలవు? ఆయన ఇరాక్, అఫ్గాన్‌లలో అమెరికా దురంతాలను వెల్లడించినప్పుడు అమెరికా పౌరులు వెల్లువలా కదిలివుంటే ఇవాళ ఇజ్రాయెల్ గాజాను వల్లకాడు చేయసాహసించేది కాదు. మారణాయుధాలూ, మందుగుండు సరఫరా చేస్తూ ఆ నెత్తుటి క్రీడకు అమెరికా దోహదపడేది కాదు. అమెరికా ఆరోపిస్తున్నట్టు అసాంజ్ గూఢచారి కాదు. నికార్సయిన పాత్రికేయుడు. తన చర్యల ద్వారా మెరుగైన స్వేచ్ఛాయుత సమాజాన్ని ఆశించాడు తప్ప అందులో దురుద్దేశాలు లేవు. చేయని నేరానికి ఇలా గత అయిదేళ్లుగా అసాంజ్ దాదాపు 19 చదరపు అడుగుల సెల్‌లో రోజుకు 23 గంటలు ఏకాంతవాస ఖైదు అనుభవిస్తున్నాడు. బయటి ప్రపంచంతోగానీ, సహ ఖైదీలతోగానీ ఆయనకు సంబంధాల్లేవు. ఈ శిక్ష కారణంగా ఆరోగ్యం బాగా దెబ్బతింది. గుండెజబ్బు సోకింది. బహుశా అందుకే కావొచ్చు... ఆయన ఈ ఒప్పందానికి అంగీకరించి వుండొచ్చు.

అసాంజ్ విడుదలను స్వాగతిస్తూనే పాత్రికేయ ప్రపంచం వ్యక్తం చేస్తున్న భయాందోళనలు సహేతుకమైనవి. తమ దేశ పౌరుడు కాకపోయినా తమ గుట్టుమట్లు వెల్లడించినందుకు అమెరికా ఆగ్రహించటం, ఇన్నేళ్లుగా ఆయన్ను వెంటాడటం... ప్రజాస్వామ్య దేశాలుగా డప్పు కొట్టుకునే స్వీడన్, బ్రిటన్‌లు అందుకు సహకరించటం ఏరకంగా చూసినా సిగ్గుచేటైన విషయం. అసాంజ్ కేసు చూపి భవిష్యత్తులో తమ చీకటి చర్యలను బట్టబయలు చేసే ఏ దేశ పాత్రికేయులనైనా అమెరికా తమ దేశానికి పట్టి అప్పగించమని కోరవచ్చు. ఇప్పుడు ఆస్ట్రేలియా అసాంజ్ వెనక దృఢంగా నిలబడి అటు అమెరికాపైనా, ఇటు బ్రిటన్‌పైనా దౌత్యపరంగా ఒత్తిడి తెచ్చింది. ఎన్ని దేశాలు ఆ పని చేయగలుగుతాయి? అసాంజ్ విడుదల ఆయన కుటుంబానికీ, మద్దతుదార్లకూ ఊరటనిస్తుందనటంలో సందేహం లేదు. కానీ ఇందులో అంతర్లీనంగా కనిపిస్తున్న పోకడలు ప్రమాదకరమైనవి.

వేగంగా, క్షేమంగా పట్టాలెక్కితేనే...

విశ్లేషణ



అలోక్ కుమార్ వర్మ

ఈ నెలలో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదం రైల్వేల పనితీరును మరోసారి వార్తల్లోకి తెచ్చింది. కాగ్ నివేదిక ప్రకారం, రైళ్లలో అత్యంత ప్రమాదాలకు కారణం అవుతున్నవి సిగ్నల్ వైఫల్యాలు, పట్టాల్లో బీటలు. భద్రతా ప్రమాణాలకు తోడు, నత్తనడక వేగం వల్ల రైల్వేలు తమ మార్కెట్ వాటాను కోల్పోయాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగం గంటకు 50 – 51 కిలోమీటర్ల మధ్యనే ఉండిపోయిందనీ, 'మిషన్ రఫ్తార్' ద్వారా సగటు వేగం 75 కిలోమీటర్లకు పెరిగిందన్నది ప్రచారమేననీ తేలింది. వందే భారత్ రైళ్ల వేగం కంటే హంగులకే ప్రసిద్ధి చెందాయి. 140 కోట్ల జనాభా కలిగిన దేశంలో రైల్వే వ్యవస్థ అన్ని విధాలుగా పటిష్ఠంగా ఉన్నప్పుడే ప్రజల అవసరాలు తీరుతాయి.

భారతీయ రైల్వే మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఈ నెల 16న పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి వద్ద ఓ గూడ్సు బండి, ప్యాసెంజర్ రైలును ఢీకొట్టడంతో తొమ్మిది మంది మరణించగా, సుమారు 40 మంది గాయపడ్డారు. 1995 నుంచి తీసుకుంటే దేశంలో కనీసం ఏడు భయంకరమైన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో ఐదింటిలో 200కు పైగా ప్రాణాలు పోయాయి. ఇంకోదాంట్లో 358 మంది మృతి చెందారు. ఈ దుర్ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ వద్ద 1995లో జరిగింది. ఏడాది క్రితం ఒడిశాలోని బాలాసోర్ వద్ద పలు రైళ్లు ఢీకొనడంతో 287 మంది చనిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ ఏడు ప్రమాదాల్లోనే విలువైన 1,600 ప్రాణాలు గాల్లో కలిసిపోవడం గమనార్హం.



పశ్చిమ బెంగాల్‌లో జూన్ 16న జరిగిన ప్రమాద దృశ్యం

140 కోట్ల జనాభా కలిగిన మనలాంటి దేశంలో రైల్వే వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలనీ, రోడ్డు, వాయు మార్గాలతో పోటీపడేలా ఉన్నప్పుడే ప్రజల అవసరాలు తీర్చగలమనీ రైల్వే ప్లానర్స్ చెబుతారు. రైల్వే బోర్డు లేదా కేంద్ర ప్రభుత్వం రెండూ ఈ ప్రాథమ్యాన్ని కాదని అనలేదు. రైల్వే వేగం రెట్టింపు చేస్తామనీ, మరిన్ని రైల్వే లైన్లతో పాటు భద్రతను కూడా పెంచుతామనీ కేంద్రం తరచూ ప్రకటనలు చేస్తూనే ఉంటుంది. ప్రధానమైన రైల్వే రూట్లలో రద్దీ విపరీతమైన నేపథ్యంలో ఇది అవసరం కూడా. కాకపోతే ఈ మాటలు ఇప్పటివరకూ మాటలకే పరిమితం కావడం గమనార్హం.

గూడ్స్, ప్యాసెంజర్ రవాణా రెండింటిలోనూ రైల్వేలు తమ మార్కెట్ వాటాను ఎప్పుడో కోల్పోయాయి. 2010–12 మధ్యకాలంలో ఈ రెండింటిలో వృద్ధి స్తంభించిపోయింది. రోడ్డు, వాయు మార్గాల వాటా ఏటా 6 నుంచి 12 శాతం వరకూ పెరిగాయి. 2014–15 నుంచి 2019 – 20 మధ్యలో ప్రయాణికుల సంఖ్య కిలోమీటర్‌కు 99,500 కోట్ల నుంచి కిలోమీటర్‌కు 91,400 కోట్లకు పడిపోవడం గమనార్హం. అదే గూడ్స్ రవాణా విషయానికి వస్తే, అది కిలోమీటర్‌కు 68,200 – 73,900 టన్నుల మధ్యే నిలిచిపోయింది. 2019–20 నుంచి ఇప్పటి వరకూ ఉన్న కాలంలో ప్యాసెంజర్, గూడ్స్ రవాణా గణాంకాలను రైల్వే శాఖ వెల్లడించలేదు.

దేశంలో రవాణాలో రైల్వేది గుత్తాధిపత్యం అనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే ప్రస్తుతం అది తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మార్కెట్ వాటా తగ్గుదల ఇప్పటిమాదిరే ఇంకో పదేళ్లు కొనసాగితే రైల్వేలు రెండో తరగతి రవాణా వ్యవస్థలుగా మారిపోతాయి. రైల్వే లైన్లు, వేగం, భద్రతా ప్రమాణాలు పెరగకపోవడాన్ని బట్టి చూస్తే భారతీయ రైల్వే ప్రస్థానం ఈ దిశగానే సాగుతోందని అనాలి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి విశాలమైన, జనాభా తక్కువ ఉన్న దేశాల్లో రైల్వేలు ఇప్పుడు ఇదే దశలో ఉన్నాయి. అయితే భారతదేశంలోని జనాభా సాంద్రత, ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న వైనాలను దృష్టిలో పెట్టుకుంటే రైల్వేల తిరోగమనం మంచిది కాదు.

రైళ్లలో భద్రత అంశాన్ని విస్తృత దృష్టికోణంతో చూడాల్సి ఉంటుంది. గత రెండు దశాబ్దాల్లో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే రైల్వే బోర్డు ఒక దిశ, దిక్కూ లేకుండా పని చేస్తోంది. అకస్మాత్తుగా విధానాల మార్పులు జరిగిపోతుండటంతో విస్తరణ, వృద్ధికి సంబంధించిన భవిష్యత్తు ప్రణాళికలు అస్తవ్యస్తంగా మారిపోయాయి. నత్తనడకన నడుస్తున్న రైళ్లను మరింత వేగంగా పరుగెత్తించడంలో బోర్డు ఘోరంగా విఫలమైంది. రైళ్ల రాకపోకలు దైవాధీనమన్న పరిస్థితి ఇప్పటికీ మారలేదు. భద్రతపై ఆందోళనలూ పెరిగిపోతున్నాయి.

రైల్వేల భద్రత, వేగం, సమయపాలన విషయాల్లో భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇటీవలే రెండు ముఖ్యమైన నివేదికలు సమర్పించారు. 2014–19 మధ్యలో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైల్వేల సగటు వేగంలో పెద్దగా మార్పుల్లేవనీ, గంటకు 50 – 51 కిలోమీటర్ల మధ్యనే ఉండిపోయిందనీ స్పష్టం చేసింది. 'మిషన్ రఫ్తార్' ద్వారా సగటు వేగం గంటకు 75 కిలోమీటర్లకు పెరిగిందన్న ప్రచారం వట్టిదేనని తేల్చింది. సరుకు రవాణా రైళ్ల విషయంలో రైల్వే బోర్డు చెప్పుకొంటున్నట్లుగా వేగం రెట్టింపు కాకపోగా, సగటు వేగం కొంత తగ్గినట్లు ఈ నివేదిక తెలిపింది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, రైళ్లను గంటకు 110–130 కి.మీ. వేగం నుంచి, గంటకు 160 – 200 కి.మీ. వేగంతో పరుగెత్తించేందుకు కావాల్సిన టెక్నాలజీ, కోచుల తయారీ సామర్థ్యాలను భారత్ 20 ఏళ్ల క్రితమే సముపార్జించుకోవడం!

కాగ్ విడుదల చేసిన రెండో నివేదిక ప్రమాదాలకు సంబంధించినది. ప్రమాదాల సంఖ్యలో కొంత తగ్గుదల ఉంది. మనుషుల కాపలి లేని గేట్ల దగ్గర మనుషులను పెట్టడం దీనికి ముఖ్య కారణం. కానీ పట్టాలు తప్పిపోవడం, ఢీకొనడం వంటి వాటి విషయంలో పెద్దగా పురోగతి లేదు. సిగ్నల్ వైఫల్యాలు, రైల్ ఫ్రాక్చర్లు(పట్టాల్లో బీటలు) పెరిగిపోతూండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయ రైల్వేల్లో అత్యంత భారీ ప్రమాదాలు ఈ రెండు కారణాలతోనే జరగడం గమనార్హం. బాలాసోర్‌లో గత ఏడాది సంభవించిన ప్రమాదానికి సిగ్నల్ వైఫల్యం కారణమన్నది తెలిసిన విషయమే. మొత్తమ్మీద కాగ్ నివేదికలు రెండింటి సారాంశం చూస్తే రైల్వేల్లోని వ్యవస్థల వైఫల్యానికి వేగం, సామర్థ్యం పెంపు వంటివి తోడయ్యాయి. ఫలితంగా భద్రత అంతంత మాత్రంగా మారిపోయింది. సమయపాలన అసాధ్యంగా మారింది.

భారతీయ రైల్వేల్లో ప్రస్తుత నెట్‌వర్క్ తిరోగమన దిశలో ఉంటే... ఏటికేడాదీ భారీ ప్రాజెక్టుల ప్రకటన కొనసాగుతూనే ఉంది. వీటి ఆర్థిక వెసలుబాటు గురించి ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. ప్రధాన బ్రాడ్‌గేజ్ లైన్‌తో అనుసంధానం కాకుండా ఉండే 'స్టాండ్ అలోన్ బుల్లెట్ ట్రైన్లు' వీటిల్లో ఒకటి. ఈ లైన్లు అన్నీ స్టాండర్డ్ గేజ్‌పై నిర్మించినవి. అలాగే సరుకు రవాణాకు ఉద్దేశించిన కారిడార్ పొడవాటి, బరువైన రైళ్ల కోసం సిద్ధం చేసినది.

దేశంలో తొలి బుల్లెట్ రైలు నిర్మాణం 2017లో మొదలైంది. 2012లోనే సరుకు రవాణాకు ప్రత్యేకమైన కారిడార్ల నిర్మాణం మొదలైంది. ఇదిలా ఉంటే... గత మూడేళ్లలోనే దేశంలో సుమారు 50 జతల 'సెమీ హై స్పీడ్' వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టారు. ఇవి వేగం కంటే వాటి హంగులకే ఎక్కువ ప్రసిద్ధి చెందాయి. ఒక్క విషయమైతే స్పష్టం. రైల్వే బోర్డు తన ప్రాథమ్యాలను సమగ్రంగా సమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మరి కొత్త ప్రభుత్వం ఈ అంశాన్ని తలకెత్తుకుంటుందా అన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకం.

వ్యాసకర్త రైల్వే విశ్రాంత చీఫ్ ఇంజినీర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎమర్జెన్సీ బాధిత



అత్యవసర పరిస్థితి కాలంలో అమరులైన ఎందరిలో కన్నడ సినిమా నటి స్నేహలతా రెడ్డి (తెలుగు కవి పఠాభి భార్య) ఒకరు. ఆమె కుటుంబం జార్జి (ఫెర్నాండెజ్)కి సన్నిహితంగా ఉన్న కారణంగా, ఆమెను బెంగళూరు జైల్లో అమానవీయమైన హింసకు గురిచేశారు. ఎమర్జెన్సీ ఎత్తివేయడానికి కొద్దిరోజుల ముందు ఆమె విడుదలయ్యారు. ఆ హింస కారణంగా 1977 జనవరి 20న మరణించారు.

– అలోక్ భట్, కాలమిస్ట్

శభాష్ అఫ్గానిస్తాన్!



16 ఏళ్ల క్రితం అఫ్గానిస్తాన్ ఐసీసీ ప్రపంచ క్రికెట్ లీగ్‌లో ఐదో విభాగంలో ఉండి, జపాన్, సింగపూర్, బోట్స్‌వానా లాంటి దేశాలతో ఆడుతోంది. ఇవ్వాళ వాళ్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ లాంటి దేశాలకంటే ముందుండి, ఐసీసీ టీ20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్లో ఆడుతున్నారు.

– మజహర్ అర్‌శద్, పాక్ క్రికెట్ స్టాటిస్టీషియన్

తప్పించుకోవడానికి...



దేశంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎవరూ ప్రయత్నించడం లేదు. ఆ సమస్యలు తమకు వర్తించకుండా ఉండేలా, ప్రతి ఒక్కరూ తగినంత డబ్బును సంపాదించడానికి ప్రయత్నిస్తున్నారు.

– సౌమ్య శర్మ, లా విద్యార్థిని

మారిన కాలం



నేను ఇరాన్‌లో శరణార్థిగా జన్మించాను. నాకు విద్యాహక్కును నిరాకరించారు. హేరాత్(అఫ్గానిస్తాన్) దగ్గర సరిహద్దును దాటుతున్నప్పుడు, మా నాన్న చెప్పింది నాకు గుర్తుంది: 'ఇది నీ దేశం; నిన్నెవరూ ఇక్కడ తరగతి గదిలోంచి బయటకు తరిమేయలేరు.' అఫ్గానిస్తాన్‌లో చదువుకుని, నేను ఇంతదాన్నయ్యాను. కానీ ఇరవై ఏళ్ల అనంతరం అఫ్గానిస్తాన్‌లో బాలికలు విద్యా హక్కును కోల్పోయారు. మనం వారికి అండగా నిలవాలి.

– ఫెరెష్తా అబ్బాసీ, ఫెలో

అసాంజ్‌కు స్వేచ్ఛ




ఒక మంచి మనిషి, మొత్తానికి స్వేచ్ఛను పొందారు. కాలం మలుపు తిరుగుతోంది! (సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 'వికీ లీక్స్' సంపాదకుడు జూలియన్ అసాంజ్ యూకే జైలు నుంచి విడుదలైన నేపథ్యంలో.)

– టకర్ కార్ల్‌సన్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

రిజర్వేషన్ల పితామహుడు

భారత దేశంలో దళితులు, బీసీల వంటి సామాజికంగా వెనుకబడిన వర్గాలవారి ఉన్నతికి ప్రభుత్వ పరంగా ఇప్పుడు కొనసాగిస్తున్న అనేక సదుపాయాలు, హక్కులను 19వ శతాబ్దంలోనే తన కొల్హాపూర్ సంస్థాన ప్రజలకు అందించినవాడు సాహు మహరాజ్. 1894 ఏప్రిల్ 2న సింహాసనం అధిష్ఠించిన సాహు, వెనుకబడిన కులాల వారందరికీ పాఠశాలలు, వసతి గృహాలు ప్రారంభించి విద్యాబోధనను ఒక ఉద్యమంగా నడిపాడు. 1902 జులై 26, భారతదేశ చరిత్రలో ఒక చరిత్రాత్మక దినం. ఆ రోజు ఛత్రపతి సాహు మహారాజ్ ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగాలన్నింటిలో వెనుకబడిన వర్గాల వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సంచలనాత్మక ఉత్తర్వులను జారీ చేసింది. గ్రామ పరిపాలన రంగంలో వంశపారంపర్యంగా వచ్చే ముఖ్యులైన పటేల్ (పాటిల్), పట్వారీ (కులకర్ణి) వ్యవస్థని 1918లో రద్దు చేశారు.



సాహు మహరాజ్

1919 సెప్టెంబర్ 6న అంటరానితనం పాటించడం నేరమని ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. 1920 మే 3వ తేదిన వెట్టిచాకిరీ వ్యవస్థను రద్దు చేస్తూ చట్టం చేశారు. అంబేడ్కర్ అస్పృశ్యుల హక్కుల సాధన కోసం స్థాపించిన 'మూక్ నాయక్' పత్రికకు ఆర్థిక సాయం చేశారు. 1920లో అంబేడ్కర్ ఇంగ్లాండ్ వెళ్లి చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేశాడు. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభించాడు. 1919 జూన్‌లో బాల్య వివాహాల రద్దు చట్టం వచ్చింది. 1919 జులై 12న కులాంతర, వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ చట్టం తెచ్చాడు. విడాకులు మంజూరు చేయడంలో స్త్రీల నిర్ణయానికే ప్రాధాన్యతనిస్తూ 1919 ఆగస్టు 2న విడాకుల చట్టం చేశాడు. 1920 జనవరి 17న జోగిని, దేవదాసీ వ్యవస్థను రద్దు చేశాడు. ప్రభుత్వం దేవదాసీల పునరావాసానికి చర్యలు తీసుకున్నాడు. 1918లో తన రాజ్యంలో వడ్డీ వ్యాపారాన్ని పూర్తిగా నిషేధిస్తూ సహకార సంఘాలను ఏర్పాటు చేశాడు. మహారాజుగా అనేక సంస్కరణలు తీసుకొచ్చిన రిజర్వేషన్ల పితామహుడు సాహు మహరాజ్ 1922 మే 6న మరణించాడు.

– సంపత్ గద్దం, కామారెడ్డి జిల్లా

(నేడు సాహు మహరాజ్ జయంతి)

రాజ్యాంగేతర శక్తుల కరాళ నృత్యం

సందర్భం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించటానికీ, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం వంటి ఉదాత్త అంశాలను అందుబాటులోకి తేవడానికీ మన 'రాజ్యాంగ పరిషత్' రాజ్యాంగాన్ని రూపొందించింది. ప్రజాస్వామ్య సాధారణ లక్ష్యాల గురించి రాజ్యాంగ ప్రవేశికలో స్పష్టంగా ఉంది. ప్రధానంగా నిష్పక్షపాత ఎన్నికలు, ప్రజాస్వామ్య పాలన, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం; స్వేచ్ఛ, సమానత్వం, ప్రాథమిక హక్కుల గురించిన ప్రస్తావన అందులో ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ ప్రమాణ స్వీకారం చేసే ముందు రాజ్యాంగం మీద పూర్తి విశ్వాసం ఉంచుతామని ప్రమాణం చేస్తారు.

కానీ ఇటీవలి (2024) సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న రాజ్యాంగ విరుద్ధమైన సంఘటనల గురించి ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా మాట్లాడుతున్నారంటే భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత రాజ్యాంగ విరుద్ధంగా మారిందో చెప్పక తప్పదు. ఆధునిక విజ్ఞాన చక్రవర్తి 'ఎలెన్ మస్క్' లాంటి వాళ్ళు ఈవీఎమ్‌ల పనితీరును ఆక్షేపించారంటేనే ఎంత ఘోరంగా ఎన్నికలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. అమెరికా కూడా ఈసారి మన ఎన్నికలను తప్పు పట్టింది. 20 లక్షల ఈవీఎమ్‌లు ఎటుపోయాయో ఎవరూ సమాధానం చెప్పరు. న్యాయబద్ధంగా గెలవాల్సిన ఆంధ్ర, ఒరిస్సా ముఖ్యమంత్రులకు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా మాయాజాలం జరిగింది. 'మాకు మంచి చేసిన జగన్ ప్రభుత్వానికి వేసిన మా ఓటు ఏమయ్యింద'ని సామాన్య ఓటరు అడుగుతున్నాడు.

ఇదే చంద్రబాబు నాయుడి చేతిలో 1995 లోనూ ప్రజాస్వామ్యం కుప్ప కూలటం చూశాం. కానీ ఏకంగా ఎన్నికల కమిషన్ సాయం అందించి కూటమి గెలుపు కోసం శ్రమించడం ఇప్పుడే చూస్తున్నాం. 'దారులన్నీ పెట్టుబడిదారి యంత్రాల కోరల్లోకే అని అర్థమయ్యాక నా వాదనే నాకు బలహీనంగా అనిపిస్తున్నది' అంటారు కార్ల్ మార్క్స్. ఆధునిక భారత ప్రజాస్వామ్య వ్యవస్థ అధికారం, డబ్బుల మయం అయిన వైనాన్ని కళ్ళారా చూస్తున్నాం. 'గెలవటానికి ఏ అడ్డదారైనా ఫర్వాలేదు, గెలవటమే ప్రధానం. ఎన్ని అవినీతి మార్గాలున్నాయో వాటన్నిటి ద్వారా డబ్బు సంపాదించు, వ్యవస్థల్ని అదుపులో పెట్టుకో' అనే ఎత్తుగడతో



వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి దృశ్యం

చంద్రబాబులాంటి వారు వ్యవహరించారు. వీరి నిఘంటువులో న్యాయం, ధర్మం, మానవత్వం అనేవి లేవు. అబద్ధాలు, అక్రమాలు వీరి ప్రాథమిక సూత్రాలు. గెలుస్తుందన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అడ్డ దారిలో ఓడించారు. గత ఐదేళ్లుగా జగన్ ఏ మంచి చేసినా దానిని ప్రజల్లోకి వెళ్ళనివ్వకుండా గోబెల్స్ ప్రచారాలు సాగిస్తూ, అరాచకాలూ వాళ్ళే చేస్తూ వాటిని జగన్ ప్రభుత్వం మీద రుద్దుతూ వచ్చారు.

కూటమి గెలుపు తర్వాత ఇప్పుడు దానిదైన నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అందులో రెడ్‌బుక్ పాలసీ కూడా ఒకటి. దానిలో భాగంగానే వీళ్ళు చేయబోయే ఆకృత్యాలను ప్రజలకు చేరకుండా ఉండటానికి ముందుగా పచ్చమీడియా తప్ప మిగిలిన అన్ని ఛానెల్స్‌ను బ్యాన్ చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందే వీళ్ళు ప్రేరేపించిన రౌడీమూకలు రాష్ట్రంలో చెలరేగిపోయారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లేసిన... ఓటర్ల దగ్గర నుండి నాయకుల వరకు ఎవ్వరినీ విడిచిపెట్టటం లేదు. ఏకంగా ఈ మూక ఇళ్ళ మీదకు ఎగబడుతూ తమ వ్యతిరేకుల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. కత్తి పోట్లతో ప్రాణాలు తీయటానికి ప్రయత్నిస్తున్నారు. గర్భిణీ స్త్రీలను కొడుతున్నారు. నాయకులను చంపటానికి ప్రయత్నిస్తున్నారు. ఒకప్పటి బిహార్‌లో ఉన్న అరాచకం నేడు ఆంధ్రాలో వర్ధిల్లుతోంది. చివరకు చంద్రబాబు నిరంకుశత్వం ఎంత పరాకాష్ఠకు చేరిందంటే... వైఎస్సార్‌సీపీ ఆఫీసును కోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా ఉత్తర ప్రదేశ్‌లో లాగా పొక్లెయిన్‌లతో తెల్లవారేసరికి కూల్చేశారు. కానీ ఏ వార్తా పచ్చ మీడియా రాయదు. చూపించదు.

ఈ దుర్ఘటనలు దేవుడి మీద నమ్మకం ఉన్న వాళ్ళ నమ్మకాన్నీ పోగొడుతున్నాయి. ఇక్కడ గ్రీకు తత్త్వవేత్త 'ఎపిక్యురస్' అన్న మాటలు... 'పదే పదే దుర్మార్గాలు చేస్తున్న వారిని చూస్తుంటే దేవుడు చెడును ఆపాలనుకుంటున్నా ఆపలేకపోతున్నాడా? అలా అయితే ఈ సృష్టి స్థితిలయలు అతని అదుపులో లేవన్నమాట. సమర్థుడే అనుకుంటే చెడును ఎందుకు నివారించటం లేదు. ఈ పగ, ద్వేషాలను, చెడును ఆపే సామర్థ్యం లేకపోతే ఇక ఎందుకండీ దేవుడు. రక్షకుడనే బిరుదులు?' గుర్తుకొస్తున్నాయి. ఎప్పుడో క్రీస్తుకు పూర్వం అన్న ఈ మాటలు నిజంగా ఆలోచించతగినవే కదా. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని ఒక్కసారి జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పద్యాల్లో చూద్దాం. పోలిక ఎంత బాగా సరిపోతుందో–

కర్కశ కరాళ కారుమేఘాల నీడలెగురుతున్నవి/ప్రజల నెమ్మొగములందు/క్రౌర్య కౌటిల్య గాఢాంధకార పటలి /క్రమ్ముకున్నది దిగ్దిగంతమ్ములెల్ల

నిజంగానే 'ఏ నిరర్థక నిర్భాగ్య నీరస గళాలు ఎలుగెత్తి **వాపోతున్నయ్యో– వెలయవో ప్రాభాతశోభావకుల్** అన్నట్లు నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం సుపరిపాలన అందించిన జగన్ మోహన్ రెడ్డి పునరాగమనం కోసం ఆశతో ఎదురుచూద్దాం.

వ్యాసకర్త మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సతీమణి

ఆధ్యాత్మిక శక్తితో...

ఇవ్వాళ ప్రభుత్వాలూ, సంఘసేవకులూ మహిళా సాధికారత గురించి ఎంతగానో మాట్లాడుతున్నారు. కానీ, దాదాపు 140 సంవత్సరాల క్రితమే శ్రీ రామకృష్ణ పరమహంస స్త్రీ జనోద్ధరణపై దృష్టి పెట్టారు. సాక్షాత్తూ భార్యలోనే కాళీ మాతను దర్శించగలిగిన పరమహంస స్త్రీ జనోద్ధరణకు తన శిష్యులను ప్రోత్సహించారు. ఒకరోజు గౌరీమా అనే భక్తురాలు పువ్వులు సేకరిస్తుండగా గురుదేవులు ఒక నీటికుండతో అక్కడకు వచ్చి ఒక చేత్తో చెట్టుకొమ్మను పట్టుకొని మరో చేత్తో చెట్టుకు నీరు పోస్తూ 'గౌరీ, నేను నీరు పోస్తూ ఉంటే నువ్వు మట్టిని కలుపు' అన్నాడు. అప్పుడామె 'ఇక్కడ బంక మట్టి లేదు. ఎలా మట్టిని కలప గలన'ని పలికింది. ఆ మాట విని గురుదేవులు 'నేను ఏ అర్థంలో చెప్పానూ, నువ్వు ఏ రకంగా అర్థం చేసుకొన్నావూ? ఈ దేశంలో స్త్రీల పరిస్థితి శోచనీయంగానూ, బాధాకరంగానూ ఉంది. వారికోసం నువ్వు పాటుపడాలి' అన్నారు. అంటే... తాను దేశ స్త్రీల అభివృద్ధికి నడుం బిగించి కృషి ఆరంభిస్తే, గురుదేవులు అందుకు తగిన తోడ్పాటు అందిస్తారన్నమాట అనుకున్నారు గౌరీమా. అప్పుడామె 'కొద్ది మంది బాలికలను నాకు ఇవ్వండి. వారిని హిమాలయాలకు తోడ్కొని వెళ్ళి వారిని సౌశీల్యవంతులుగా తీర్చి దిద్దుతాను' అంది. గురుదేవులు తన తలను అడ్డంగా ఊపుతూ, 'కాదు, కాదు, నువ్వు నగరంలోనే ఉంటూ పని చేయాలి. నువ్వు అనుష్ఠించిన ఆధ్యాత్మిక సాధనలు చాలు. ఆధ్యాత్మిక శక్తితో నువ్వు స్త్రీలను సేవించాలి' అన్నారు.



జ్యోతిర్మయం

గురుదేవుల ఆదేశాన్ని శిరసావహించిన గౌరీమా కలకత్తాలో బాలికల నిమిత్తం ఒక పాఠశాలను స్థాపించి భారతీయ స్త్రీలను విద్యావంతులను గావించడంలోనూ, తద్వారా వారిని ఉద్ధరించడంలోనూ ఎంతో కృషి చేసింది. (పుటలు 248, 249 – శ్రీ రామకృష్ణ లీలామృతం). రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు స్వామి వివేకానందుడు కూడా మహిళా ఉద్ధరణకు ఎంతగానో కృషి చేయడం గమనార్హం.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పంచమి రా.10.48 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ధనిష్ట ప.3.27 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.10.14 నుండి 11.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.37 నుండి 12.29 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

క్లుప్తంగా...

ఇంటర్ సప్లిమెంటరీలో ఫెయిల్ అయ్యామని..

ఉరేసుకుని ఇద్దరు విద్యార్థుల బలవన్మరణం...

మహబూబ్‌నగర్ క్రైం/ అచ్చంపేట రూరల్/ నాగర్‌కర్నూల్ క్రైం: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయ్యామన్న బాధతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, మరో విద్యార్థి పురుగు మందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు.

- మహబూబ్‌నగర్ టీచర్స్‌కాలనీలో నివాసముంటున్న సి.అక్షయ(18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు రాసింది. రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుంది.
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్‌కు చెందిన పవన్(16) అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంఎల్‌టీ చదివాడు. సప్లిమెంటరీ పరీక్షలో 2 సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన రాకేష్ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతున్నాడు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మంగళవారం సాయంత్రం కళాశాల హాస్టల్‌లోనే పురుగు మందు తాగాడు. ప్రస్తుతం రాకేష్ ఆరోగ్యం నిలకడగా ఉంది.

'గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి కార్మిక, విప్లవ సంఘాలు విభేదాలన్నీ వీడి బొగ్గు గనుల సాధనతో పాటు వాటి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావో యిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. యాంత్రీకరణ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టీకరణ పేరుతో సింగరేణిని ప్రైవేటీకరించారని, కాంగ్రెస్, బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థ విధ్వంసం తారాస్థాయికి చేరుకుందని మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. బీజేపీ గనులను ప్రైవేటీకరించే కుట్రలో భాగంగా వేలం ప్రారంభించిందని, గతంలో రద్దయిన కోయగూడెం, సత్తుపల్లితోపాటు శ్రావణపల్లి గనిని కలిపి వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

గ్రామాల వారీగా | రుణమాఫీ రైతుల జాబితా

ఆ జాబితాను బ్యాంకులు తనిఖీ చేయాలి.. గ్రామసభలో చర్చించాలి

- బంగారంపై ఉన్న పంట రుణాలూ మాఫీ... కుటుంబంలో ఒక్కరికే వర్తింపు
- రుణమాఫీపై రాష్ట్ర వ్యవసాయశాఖ కసరత్తు.. మార్గదర్శకాల ఖరారులో నిమగ్నం
- రెండు మూడు బ్యాంకు ఖాతాలున్నా రెండు లక్షలే మాఫీ
- త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనున్న వ్యవసాయశాఖ
- పీఎం కిసాన్ నిబంధనల ప్రకారం అర్హతల అమలుపై అస్పష్టత



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీకి సంబంధించి అర్హులైన రైతుల జాబితా సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఆయా రైతుల జాబితాను బ్యాంకులతో కలిసి అధికారులు తయారు చేయాలని యోచిస్తోంది. అనంతరం గ్రామసభలో చర్చించి తుది జాబితా సిద్ధం చేస్తారని అధికారులు అంటున్నారు. పంట రుణమాఫీ మార్గదర్శకాలపై వ్యవసాయశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. త్వరలో మార్గదర్శకాలు ఖరారు చేయనున్న నేపథ్యంలో అందులో ఉండాల్సిన అంశాలపై వ్యవసాయశాఖ అధికారులు తలమునకలయ్యారు. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీనాటికి పంట రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు రూ. 31 వేల కోట్లు ఖర్చు అవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించిన సంగతి విదితమే. రుణమాఫీ మార్గదర్శకాలు త్వరలో విడుదలవుతాయని కూడా సీఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో అందులో ఎలాంటి అంశాలు చేర్చాలన్న దానిపై అధికారులు చర్చిస్తున్నారు. గతంలో రుణమాఫీ అమలు సందర్భంగా విడుదల చేసిన మార్గదర్శకాలను కూడా అధ్యయనం చేస్తున్నారు. దాదాపు అవే మార్గదర్శ కాలు ఉంటాయని వ్యవసాయ శాఖవర్గాలు అంటున్నాయి. పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని అంటున్నారు.

పాస్‌పుస్తకం జత చేసి బంగారు రుణాలు తీసుకున్న వాటికి మాత్రమే....

అసలు, వడ్డీ కలిపి ఒక్కో కుటుంబానికి రూ. 2 లక్షల వరకు మాఫీ చేయనున్నారు. రైతు కుటుంబం అంటే..భార్య, భర్త, వారిపై ఆధారపడి ఉన్న పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు. ఒకటి కంటే ఎక్కువ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుంటే... వాటిని ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. గ్రామీణ బ్యాంకుల్లో పట్టాదారు పాస్ పుస్తకంతో కలిపి బంగారం తాకట్టు పెట్టి పంట రుణాలు తీసుకున్న రైతులకు కూడా రుణమాఫీ పథకం వర్తింపజేయాలని నిర్ణయించినట్టు సమాచారం. పట్టణ ప్రాంతాల్లో తీసుకున్న బంగారు రుణాలకు ఇది వర్తించదని తెలిపారు. గతంలో ఈ తరహా నిబంధనలనే అమలు చేశారు. ఇప్పుడు కూడా వాటినే అమలు చేయనున్నారు. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, కోఆపరేటివ్ క్రెడిట్ సంస్థలు (అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్‌లతో సహా), గ్రామీణ బ్యాంకులు రైతులకు పంపిణీ చేసిన రుణా లు, బంగారంపై తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తారు. అయితే పీఎం కిసాన్ నిబంధనల ప్రకారం అందులో ఉన్న అర్హతలను రుణమాఫీకి అమలు చేస్తారా లేదా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. కొన్ని నిబంధనలను మాత్రం తీసుకుంటారని, పూర్తిగా దాన్నే రుణమాఫీ పథకానికి వర్తింపజేయరని అంటున్నారు.

మార్గదర్శకాల్లో చేర్చాల్సిన అంశాల్లో ముఖ్యాంశాలు...

- రైతులకు రుణమాఫీ అందజేయడానికి అర్హులైన లబ్ధిదారుల డేటా సేకరణ, ప్రాసెసింగ్‌కు పోర్టల్‌ను అభివృద్ధి చేయాలి.
- పంట రుణ బకాయిలున్న రైతుల జాబితాను సిద్ధం చేసి వాటిని బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వాటిని చెక్ చేయాలి. రెండు లక్షల వరకు పరిమితమైన రైతుల తుది జాబితాను బ్యాంక్ బ్రాంచీలో సిద్ధం చేయాలి. అందుకు సంబంధించిన ఒక కాపీని జిల్లా కలెక్టర్‌కు పంపాలి.
- అర్బన్, మెట్రోపాలిటన్ బ్యాంకులు, బ్యాంకు శాఖల పంట రుణాలు పొందిన బంగారు రుణాలు మాఫీ చేయరు. అయితే ఆయా బ్యాంకులు గ్రామీణ బ్రాంచీలు ఉంటే అక్కడ తీసుకున్న బంగారు రుణాలు మాఫీ చేస్తారు.
- కొంతమంది రైతులు ఒకే బ్యాంకుకు చెందిన ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు శాఖల నుంచి పంట రుణాలు తీసుకొని ఉండవచ్చు. అందువల్ల నకిలీ లేదా మల్టీపుల్ ఫైనాన్సింగ్‌ను తొలగిస్తారు. అందుకు జాయింట్ మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ ద్వారా మండల స్థాయిలో బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేస్తారు. రుణమాఫీకి అర్హులైన వారందరికీ వ్యవసాయ భూములున్నాయో లేదో ధ్రువీకరిస్తారు.
- ఒక రైతు కుటుంబానికి వివిధ బ్యాంకు ఖాతాలు ఉన్నా, పంటరుణం మొత్తం రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఉంటే, అర్హత ఉన్న మాఫీ మొత్తం కుటుంబ సభ్యుల మధ్య దామాషా ప్రకారం విభజిస్తారు.
- తహసీల్దార్, ఎంఏఓ, ఎంపీడీఓలతో కూడిన మండల స్థాయి అధికారుల బృందం సంబంధిత గ్రామానికి చెందిన ఏఈఓ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు రైతు వివరాలు సేకరిస్తారు. ఆయా రైతుల సమగ్ర సమాచారాన్ని ధ్రువీకరిస్తారు. సామాజిక తనిఖీ చేస్తారు. గ్రామసభ నిర్వహించడం ద్వారా బ్రాంచి మేనేజర్ అన్ని అభ్యంతరాలను తీసుకుంటారు. అనంతరం బ్యాంకుల రైతుల తుది జాబితా ప్రకటిస్తారు. ఆ జాబితాను కలెక్టర్‌కు పంపిస్తారు.
- జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకుల వారీగా, రైతుల వారీగా రుణమాఫీకి సంబంధించిన జిల్లా వివరాలు నమోదు చేస్తారు. దాన్ని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ)కి పంపిస్తారు. దాన్ని ఐటీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. బ్యాంకుల వారీగా, శాఖల వారీగా, గ్రామాల వారీగా రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలను వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు పంపిస్తారు.
- రుణాలు ఇచ్చిన బ్యాంకులే రుణమాఫీకి అర్హులైన లబ్ధిదారుల అర్హత కచ్చితత్వానికి బాధ్యత వహించాలి.
- పంట రుణాన్ని మోసపూరితంగా తీసుకున్నట్టు లేదా రుణమాఫీకి అర్హులు కాదని తేలితే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని రైతు నుంచి ఒక హామీని వ్యవసాయశాఖ తీసుకోవాలి.

రెచ్చిపోతున్న ఇసుక స్మగ్లర్లు

- రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో కానిస్టేబుల్‌పై హత్యాయత్నం
- తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం



చెరువులో మునిగిన ఇసుక ట్రాక్టర్

ముస్తాబాద్ (సిరిసిల్ల): ఇసుక స్మగ్లర్ల ఆగడాలు జిల్లాలో పరాకాష్టకు చేరుకున్నాయి. పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించే క్రమంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై ఇసుక స్మగ్లర్ దాడి చేశాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో ప్రాణపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా అవుతోందన్న సమాచారంతో ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలకు వెళ్లారు. రాంరెడ్డిపల్లె, నామాపూర్ గ్రామాల మధ్య ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని ఠాణాకు తరలిస్తుండగా, గోపాల్‌పల్లెకు చెందిన భూక్య గురుబాబు తన కారులో నామాపూర్ చేరుకున్నాడు. 'నా బండినే పట్టుకుంటారా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్రాక్టర్‌పై ఉన్న కానిస్టేబుల్ సత్యనారాయణపై దాడికి దిగాడు. దీంతో కానిస్టేబుల్ ఎదురుతిరిగి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాల్సిందేనని పట్టుబట్టాడు. అక్కడికి చేరుకున్న ఎస్సై ట్రాక్టర్‌ను ఠాణాకు తీసుకెళ్లాలని హెచ్చరించాడు. దీంతో గురుబాబు ట్రాక్టర్‌ను నడిపాడు. ఆ సమయంలో కానిస్టేబుల్ సత్యనారాయణ ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చోగా, నామాపూర్ శివారులోని మేళ్ల చెరువు వద్దకు చేరుకోగానే గురుబాబు ట్రాక్టర్‌ను వేగంగా నడుపుతూ చెరువులోకి తీసుకెళ్లి.. తాను కిందకి దూకి పారిపోయాడు. ట్రాక్టర్‌పై ఉన్న కానిస్టేబుల్ చెరువులోని బండరాళ్లపై పడిపోగా నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ చెరువు నీటిలో మునిగిపోయింది. అటుగా వచ్చిన ఎస్సై వెంటనే కానిస్టేబుల్‌ను 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గురుబాబు కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కానిస్టేబుల్ సత్యనారాయణ

జంబో డీఎస్సీ హామీ ఏమైంది?

సాక్షి, హైదరాబాద్:ఎన్నికల సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి 25 వేల టీచర్ పోస్టుల భర్తీకి జంబో డీఎస్సీ వేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమ ప్రశ్నించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 65 వేల మంది ఎస్జీటీ కేటగిరీ ఉపాధ్యాయుల ప్రమోషన్స్‌లో సమన్యాయం చేయాలని రాణీరుద్రమ డిమాండ్ చేశారు.

రూ.693 కోట్ల ఎన్‌హెచ్‌ఎం బకాయిలు ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

సహకరించాలని, ఎన్‌హెచ్‌ఎం బకాయిలు విడుదల చేయాలని నడ్డాను రేవంత్ కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలోని మూడు, నాలుగు త్రైమాసికాల కింద రూ. 323.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని.. 2024–25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ. 138 కోట్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఎన్‌హెచ్‌ఎం కింద చేపట్టిన మౌలికవసతులు, నిర్వహణ కాంపొనెంట్ కింద 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రావాల్సిన రూ. 231.40 కోట్లను తక్షణమే రీయింబర్స్ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్‌ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతోపాటు కేంద్రం వాటా మొత్తాన్ని 2023 అక్టోబర్ నుంచి తామే విడుదల చేస్తున్నామని నడ్డా దృష్టికి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.

పెండింగ్‌లో ఉన్న రోడ్లన్నీ త్వరితగతిన పూర్తి చేయండి

ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోశ్‌కుమార్‌తో మంత్రి కోమటిరెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జాతీయ రహదారుల నిర్మాణాలు అన్నీ నత్తనడకనసాగాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రోడ్ల విస్తరణ, మరమ్మతులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం ఆలస్యంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న రోడ్లన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని 'నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా'(ఎన్‌హెచ్ఏఐ)ను మంత్రి కోరారు. మంగళవారం ఢిల్లీలోని ఎన్‌హెచ్ఏఐ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఐ.గణపతిరెడ్డిలతో కలసి కోమటిరెడ్డి ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోశ్‌కుమార్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన జాతీయ రహదారులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్–విజయవాడ(ఎన్‌హెచ్–65) ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన ప్రారంభించి వేగవంతంగా పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్–మన్నెగూడ(ఎన్‌హెచ్–163) రోడ్డుకు ఉన్న ఎన్‌జీటీ సంబంధిత సమస్యకు పరిష్కారాన్ని కనుగొని, ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉన్న నాలుగు లేన్ల విస్తరణ పనులను ప్రారంభించాలని అడిగినట్లు చెప్పారు. హైదరాబాద్–కల్వకుర్తి(ఎన్‌హెచ్–765) రహదారిపై రద్దీ పెరగడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించేందుకు అవసరమైన డీపీఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. డీపీఆర్ ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రికి చైర్మన్ సంతోశ్‌కుమార్ యాదవ్ హామీనిచ్చినట్లు తెలిపారు.

రామగుండంలో కొత్త విద్యుత్ కేంద్రం

- డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రామగుండంలోని 62.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో.. కొత్తగా 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలో 1971 అక్టోబర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న రామగుండం బి– థర్మల్ విద్యుత్ కేంద్రం జీవిత కాలం ముగిసి పోవడంతో ఇటీవల అక్కడ విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. దానిని తొలగించి 800 మెగా వాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మి స్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగమించేందుకు రా మగుండంలో కొత్త విద్యుత్ కేంద్రం నిర్మించా లని కోరుతూ మంత్రులు శ్రీధర్ బాబు, పొ న్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్, ఎమ్మె ల్యేలు ప్రేమ్ సాగర్ రావు, రాజ్ ఠాగూర్ సింగ్, ఆది శ్రీనివాస్, విజయ రమణారావు తదితరు లు మంగళవారం హైదరాబాద్‌లో భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేయగా, ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. పిట్ హెడ్ ప్లాంట్ (బొగ్గు లభ్యత ఉన్నచోట సింగరేణి ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రాన్ని నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని భట్టి వెల్లడించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఆలస్యమెందుకు?

తెలుసుకొని చెప్పాలని ఏఏజీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయడంలో ఆలస్యమెందుకై ందో తెలుసుకుని చెప్పాలని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్‌ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పినట్లు.. ఒకవేళ ఈ నెల 27 తర్వాత ఆ చెక్కులు చెల్లనివిగా మారే ప్రమాదం ఉంటే.. పిటిషనర్ అభ్యర్థన మేరకు వెంటనే ఆ చెక్కులను అర్హులకు పంపిణీ చేసేలా అధికారులను ఆదేశిస్తూ తీర్పు ఇవ్వాల్సి వస్తుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. హుజూరాబాద్‌లోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయకుండా నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న తనను అడ్డుకుంటున్నారని కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతోనే అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ వాదనలు వినిపిస్తూ.. చెక్కుల పంపిణీలో ఎలాంటి ఆలస్యం జరగలేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఆ చెక్కులు 27 తర్వాత చెల్లే అవకాశం లేకుంటే, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బుధవారం లోగా వివరాలు తెలుసుకుని చెప్పాలని ఆదేశించారు.

అసాంజ్‌కు ఎట్టకేలకు స్వేచ్ఛ!


లండన్ నుంచి విమానంలో మరియానా దీవులకు బయలుదేరిన అసాంజ్

- నేరాంగీకారానికి అమెరికాతో ఒప్పందం
- బ్రిటన్ జైలు నుంచి విడుదలైన వికీలీక్స్ వ్యవస్థాపకుడు
- నేడు అమెరికా అధీనంలోని మరియానా ద్వీపంలో కోర్టు ముందుకు
- శిక్ష నుంచి మినహాయింపు, ఆ వెంటనే విడుదల!
- తర్వాత నేరుగా స్వదేశం ఆస్ట్రేలియాకు

వాషింగ్టన్: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజ్‌కు ఎట్టకేలకు విముక్తి లభించనుంది. ఆయనను అమెరికాకు అప్పగించే విషయంపై బ్రిటన్ కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐదేళ్లుగా బ్రిటన్లో ఆయన జైలు జీవితం అనుభవిస్తున్నారు. అమెరికా న్యాయ విభాగంతో నేరాంగీకార ఒప్పందం కుదుర్చుకోవడంతో అసాంజ్ విడుదలకు మార్గం సుగమమయ్యింది. దాని ప్రకారం అమెరికా కోర్టులో విచారణకు హాజరయ్యేందుకు యూకే జైలు నుంచి ఆయన మంగళవారం ఉదయం విడుదలయ్యారు. చార్టర్డ్ విమానంలో ఉత్తర మరియానా ఐలాండ్స్‌లోని సైపన్ ద్వీపానికి బయల్దేరారు. అక్కడి అమెరికా ఫెడరల్ కోర్టులో బుధవారం ఉదయం (స్థానిక కాలమానం ప్రకారం) విచారణకు హాజరవుతారు. అమెరికా వెళ్లడానికి అసాంజ్ నిరాకరించడంతో ఆస్ట్రేలియా సమీపంలో అమెరికా అధీనంలో ఉండే ఈ ప్రాంతంలో విచారణ చేపడుతున్నారు. కోర్టుకు సమర్పించిన పత్రాల ప్రకారం... గూఢచర్య చట్టాన్ని అతిక్రమిస్తూ జాతీయ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందడం, వ్యాప్తి చేయడం వంటి ఆరోపణలను అసాంజ్ అంగీకరించనున్నట్లు సమాచారం. ఆయనపై మోపిన 18 అభియోగాలను కలిపి ఒకే కేసుగా విచారించనున్నట్లు తెలుస్తోంది. అసాంజ్ నేరాంగీకార వాంగ్మూలాన్ని న్యాయమూర్తి ఆమోదించాల్సి ఉంటుంది. అనంతరం ఆయనకు శిక్ష ఖరారు చేస్తారు. ఇప్పటికే బ్రిటన్‌లో అనుభవించిన ఐదేళ్ల శిక్షతో సరిపెట్టి విడుదల చేస్తారని సమాచారం. అదే జరిగితే ఆ వెంటనే అసాంజ్ నేరుగా స్వదేశం ఆస్ట్రేలియాకు వెళ్లనున్నారు.

ధ్రువీకరించిన వికీలీక్స్



అసాంజ్ విడుదలను వికీలీక్స్ సంస్థ ధ్రువీకరించింది. ఈ మేరకు సామాజిక వేదిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ''1,901 రోజుల జైలు జీవితం అనంతరం ఆయన జూన్ 24న విడుదలయ్యారు. అసాంజ్ విడుదల కోసం ప్రపంచవ్యాప్తంగా మద్దతిచ్చినవారికి కృతజ్ఞతలు'' అని తెలిపింది.

ఇదీ నేపథ్యం

ఇరాక్, అఫ్గానిస్తాన్ తదితర చోట్ల అమెరికా సైన్యం పాల్పడ్డ తప్పిదాలు, చేపట్టిన తప్పుడు చర్యలకు సంబంధించిన లక్షలాది రహస్య పత్రాలను లీక్ చేసి అసాంజ్ సంచలనం సృష్టించడం తెలిసిందే. దాంతో ఆయన పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగింది. అసాంజ్ స్థాపించిన వికీలీక్స్ అమెరికా రక్షణ రంగ రహస్య పత్రాలెన్నింటినో విడుదల చేసింది. బాగ్దాద్‌పై 2010లో అమెరికా వైమానిక దాడిలో ఇద్దరు రాయిటర్ జర్నలిస్టులతో పాటు సామాన్యులు మృతి చెందిన వీడియో వంటివి వీటిలో ఉన్నాయి. అఫ్గాన్ యుద్ధానికి సంబంధించి 91,000కు పైగా పత్రాలనూ వికీలీక్స్ విడుదల చేసింది. తర్వాత ఇరాక్ యుద్ధాన్ని వివరించే 4,00,000 రహస్య సైనిక ఫైళ్లను విడుదల చేసింది. ఈ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపడంతో అసాంజ్‌పై అమెరికా తీవ్ర అభియోగాలు మోపింది. మరోవైపు లైంగిక నేరాల ఆరోపణలపై అసాంజ్ అరెస్టుకు స్వీడన్ కోర్టు 2010 నవంబర్‌లో ఆదేశించింది. ఆ ఆరోపణలను ఆయన ఖండించారు.

అరెస్టు... ఆశ్రయం జైలు

అసాంజ్ 2010 అక్టోబర్‌లో బ్రిటన్‌లో అరెస్టయ్యారు. తర్వాత బెయిలుపై విడుదలయ్యారు. అయితే ఆయన్ను స్వీడన్‌కు అప్పగించాలని 2011 ఫిబ్రవరిలో లండన్ కోర్టు ఆదేశించింది. దీనిపై బ్రిటన్ సుప్రీం కోర్టులో అప్పీలు చేసినా లాభం లేకపోయింది. దాంతో అసాంజ్ కొంతకాలం లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో రాజకీయ ఆశ్రయం పొందారు. 2019 ఏప్రిల్‌లో ఆ ఆశ్రయం రద్దయింది. అనంతరం బ్రిటన్ కోర్టు ఆయనకు 50 వారాల జైలు శిక్ష విధించింది. అమెరికాకు అప్పగింతపై విచారణ పెండింగ్‌లో ఉండటంతో శిక్ష పూర్తయ్యాక కూడా జైలులోనే ఉన్నారు. అసాంజ్ ఆత్మహత్య చేసుకునే ప్రమాదమున్నందున అమెరికాకు అప్పగించడం కుదరదని బ్రిటన్ కోర్టు 2021లో చెప్పింది.

ఉత్కంఠగా ఉంది భార్య

అసాంజ్ భార్య స్టెల్లా ఆస్ట్రేలియాలో మీడియాతో మాట్లాడారు. భర్త రాక కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నట్టు చెప్పారు. న్యాయవాది అయిన ఆమె అసాంజ్‌ను 2022లో ఆయన జైల్లో ఉండగానే పెళ్లాడారు. అసాంజ్ చార్టర్డ్ విమాన ప్రయాణ ఖర్చు 5 లక్షల డాలర్లని ఆయన అభిమానులు తెలిపారు. ఆ మొత్తాన్ని సేకరించడానికి ఫండ్ రైజింగ్ ప్రచారం మొదలు పెట్టామన్నారు.


చరిత్ర సృష్టించిన చాంగ్‌యీ–6


ఇన్నర్ మంగోలియాలో ల్యాండైన చాంగ్‌యీ–6 మాడ్యూల్

జాబిల్లి అవతలివైపు మట్టి సేకరణ

బీజింగ్: చైనా జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(సీఎన్ఎస్ఏ) సరికొత్త చరిత్ర సృష్టించింది. చందమామపై మనకు కనిపించని అవతలివైపు భాగం నుంచి మట్టి నమూనాలను విజయవంతంగా భూమిపైకి తీసుకొచ్చింది. చైనా ప్రయోగించిన లూనార్ ప్రోబ్ మాడ్యూల్ చాంగ్‌యీ–6 జాబిల్లి నుంచి మట్టిని మోసుకొని స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2.07 గంటల సమయంలో ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియా ప్రాంతంలో క్షేమంగా దిగింది. చంద్రుడి అవతలి వైపు భాగంలోని మట్టిని భూమిపైకి సురక్షితంగా చేర్చిన మొట్టమొదటి దేశంగా చైనా రికార్డుకెక్కింది. చైనా అంతరిక్ష ప్రయోగాల్లో ఇదొక మైలురాయి అని నిపుణులు చెబుతున్నారు. చాంగ్‌యీ–6 మిషన్ పూర్తిస్థాయిలో విజయవంతమైందని సీఎన్ఎస్ఏ ప్రకటించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల చైనా అధినేత షీ జిన్‌పింగ్ హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధకులకు అభినందనలు తెలిపారు. చాంగ్‌యీ–6 వ్యోమనౌక ఈ ఏడాది మార్చి 3న జాబిల్లి దిశగా తన ప్రస్థానం ప్రారంభించింది. ఇందులో అర్బిటార్, ల్యాండర్, అసెండర్, రిటర్నర్ అనే భాగాలు ఉన్నాయి. 53 రోజుల పాటు అవిశ్రాంతంగా ప్రయాణం సాగించి, జూన్ 2న చందమామ దక్షిణ ధ్రువంలోని సౌత్‌పోల్–అయిట్‌కెన్(ఎస్‌పీఏ) ప్రాంతంలో సురక్షితంగా దిగింది. రోబోటిక్ హస్తం సాయంతో రెండు రోజులపాటు మట్టి నమూనాలను సేకరించిన అసెండర్ జూన్ 4న తిరుగు ప్రయాణం మొదలుపెట్టింది. జూన్ 6న భూకక్ష్యలోకి ప్రవేశించింది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఆర్బిటార్–రిటర్నర్‌కు మట్టి నమూనాలను బదిలీ చేసింది. భూమిపై అడుగుపెట్టడానికి తగిన సమయం కోసం వేచి చూస్తూ ఆర్బిటార్–రిటర్నర్ 13 రోజుల పాటు కక్ష్యలోనే చక్కర్లు కొట్టింది. ఎట్టకేలకు మంగళవారం భూమిపైకి క్షేమంగా చేరుకుంది. అరుదైన మట్టి నమూనాలను తీసుకొచ్చింది. వీటిలో వేల ఏళ్ల నాటి అగ్నిపర్వత శిలలు కూడా ఉండొచ్చని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికాకు దీటుగా చైనా దూసుకెళ్తోంది. 2030 నాటికి చంద్రుడిపైకి మనుషులను పంపించబోతున్నామని గతంలోనే ప్రకటించింది.


రాహుల్


అఖిలేశ్

రాజ్యాంగం చేతబూని ఎంపీగా ప్రమాణం

'జైహింద్, జై సంవిధాన్' అని నినదించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ ప్రత్యేక సమావేశాల్లో రెండో రోజు మంగళవారం పలు పార్టీల సభ్యులు ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ సభ్యుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు అఖిలేష్ యాదవ్, డింపుల్ యాదవ్, బీజేపీ సభ్యుడు ఓం బిర్లా, బీజేపీ సభ్యురాలు హేమామాలిని, డీఎంకే నేత కనిమొళి, కేంద్ర మంత్రులు నారాయణ్ రాణే, ఎన్సీపీ(ఎస్పీ) నేత సుప్రియా సూలే, శివసేన(ఉద్ధవ్) సభ్యుడు అరవింద్ సావంత్ తదితరులు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ సహా పలువు ప్రతిపక్ష సభ్యులు రాజ్యాంగ ప్రతిని చేతబూని ప్రమాణం చేయడం విశేషం. ప్రమాణ స్వీకారం అనంతరం రాహుల్ గాంధీ 'జైహింద్, జై సంవిధాన్' అంటూ నినదించారు. స్వతంత్ర సభ్యుడు రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ 'నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి' అని రాసి ఉన్న టి–షర్టును ధరించి ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆజాద్ సమాజ్ పార్టీ(కాన్షీరామ్) ఎంపీ చంద్రశేఖర్ ప్రమాణం చేసిన తర్వాత 'జైభీమ్, జైభారత్, జై సంవిధాన్, జైమండల్, జైజోహార్, జైజవాన్, జైకిసాన్' అని నినాదాలు చేశారు.

విపక్షనేతగా రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యవహరించనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో మంగళవారం రాత్రి జరిగిన ఇండియా కూటమి పక్ష నేతల సమావేశం అనంతరం రాహుల్‌ను విపక్ష నాయకుడిగా నియమించాలనే నిర్ణయం జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ లోక్‌సభలో రాహుల్ గాంధీని ప్రతిపక్ష నాయకుడిగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఒక లేఖ ద్వారా ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్‌కు తెలియజేశారని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఇతర నియామకాలపై తర్వాత నిర్ణయం జరుగుతుందన్నారు. రాహుల్ ఐదోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 18వ లోక్‌సభలో 98 మంది ఎంపీలతో కాంగ్రెస్ అతిపెద్ద విపక్ష పార్టీగా నిలిచింది. పదేళ్ల విరామం తర్వాత ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. కాంగ్రెస్‌కు నిర్ణీత 10 శాతం ఎంపీల బలం లేకపోవడంతో 2014, 2019లలో ప్రతిపక్ష హోదా దక్కలేదు. కాగా స్పీకర్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ తమను సంప్రదించలేదన్న తృణమూల్ మంగళవారం రాత్రి ఖర్గే నివాసంలో జరిగిన ఇండియా కూటమి భేటీకి హాజరైంది.

ఇక సీబీఐ వంతు!

నేడు కేజ్రీవాల్ మళ్లీ అరెస్టు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను బుధవారం సీబీఐ అరెస్టు చేసే అవకాశం కన్పిస్తోంది. సీబీఐ వర్గాలు మంగళవారం తిహార్ జైల్లో ఆయనను విచారించి వాంగ్మూలం నమోదు చేసుకున్నాయి. బుధవారం ట్రయల్ కోర్టులో ప్రవేశపెట్టనున్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై సుప్రీం కోర్టులో గురువారం విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో సీబీఐ చర్య ప్రధాని మోదీ కక్ష సాధింపులో భాగమేనని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. అందుకే కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో ఇరికించారన్నారు.

ఢిల్లీ హైకోర్టులో నిరాశే

మనీ లాండరింగ్ కేసులో బెయిల్ విషయంలో కేజ్రీవాల్‌కు మళ్లీ నిరాశే ఎదురయ్యింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన రెగ్యులర్ బెయిల్‌పై మధ్యంతర స్టే ఎత్తివేతకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం నిరాకరించింది. ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరును సవాలు చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. వాదనలకు ఈడీకి ట్రయల్ కోర్టు సమయమివ్వలేదని ఆక్షేపించింది. కేజ్రీవాల్ ప్రమేయంపై సమర్పించిన పత్రాలను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకోవడంలో, క్షుణ్నంగా పరిశీలించడంలో విఫలమైందని స్పష్టంచేసింది. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుపై పూర్తిస్థాయిలో వాదనలు వినిపించడానికి ఈడీకి తగిన సమయమిచ్చి ఉండాల్సిందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బెయిల్ ఉత్తర్వుపై స్టేను రద్దు చేయడం లేదని తేల్చిచెప్పారు. కేజ్రీవాల్‌కు ఈ నెల 20న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ ఈడీ ఆ మర్నాడే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో బెయిల్‌పై మధ్యంతర స్టే విధిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ ఊరట దక్కలేదు. దాంతో ఆయన కనీసం మరిన్ని రోజుల పాటు తిహార్ జైలులో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.


రాజ్యాంగంపై ప్రేమను వ్యక్తీకరించే హక్కు మీకు లేదు

కాంగ్రెస్ నేతలపై ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం

న్యూఢిల్లీ: దేశ ప్రజలపై బలవంతంగా అత్యవసర పరిస్థితిని రుద్దినవారికి రాజ్యాంగం పట్ల ప్రేమను ప్రకటించే హక్కు లేదని ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి 49 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ మంగళవారం 'ఎక్స్'లో పలు పోస్టులు చేశారు. ప్రజల ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛను కాంగ్రెస్ సర్కారు కాలరాసిందని మండిపడ్డారు. దేశ ప్రజలంతా గౌరవించే రాజ్యాంగాన్ని అగౌరవపర్చిందని ధ్వజమెత్తారు. అప్పటి చీకటి రోజులు ఇప్పటికీ ప్రజల మదిలో సజీవంగా ఉన్నాయని పేర్కొన్నారు. ''దేశంలో ఎమర్జెన్సీ విధించిన పార్టీ నాయకులే ఎన్నో సందర్భాల్లో ఆర్టికల్ 356 ప్రయోగించారు. పత్రికా స్వేచ్ఛను హరించేలా బిల్లులు తీసుకొచ్చారు. సమాఖ్య స్ఫూర్తిని ధ్వంసం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన విలువలను ఉల్లంఘించారు. ఎమర్జెన్సీ విధించినవారి ఆలోచనా ధోరణి ఇంకా మారలేదు. రాజ్యాంగం పట్ల ఏహ్యభావాన్ని వారు దాచిపెట్టుకుంటున్నారు. అయినా ప్రజలకు ఎవరేమిటో బాగా తెలుసు. అందుకే ఎన్నికల్లో వారిని(కాంగ్రెస్) పదేపదే తిరస్కరిస్తున్నారు. గట్టిగా బుద్ధి చెప్పారు. అప్పటి కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజాస్వామ్య సంప్రదాయాలను తుంగలో తొక్కింది. దేశాన్ని చెరసాలగా మార్చేసింది. కాంగ్రెస్ విధానాలను వ్యతిరేకిస్తే దారుణంగా హింసించారు. వేధింపులకు గురిచేశారు. బడుగు బలహీన వర్గాలను అణచివేశారు. అప్పటి సామాజిక తిరోగమన విధానాలతో ప్రజలు నష్టపోయారు. ఎమర్జెన్సీని ధైర్యంగా ఎదిరించి, పోరాడిన గొప్ప వ్యక్తులను మనం స్మరించుకోవాలి. వారికి ఘనంగా నివాళులర్పించాలి'' అని ప్రధాని మోదీ పిలుపు నిచ్చారు.


స్పీకర్ అభ్యర్థుల గురించి...

ఓం బిర్లా రికార్డుల స్పీకర్



61 ఏళ్ల ఓం బిర్లా 2019లో లోక్‌సభకు రెండోసారి ఎన్నికవుతూనే అనూహ్యంగా స్పీకర్‌గా అవకాశం దక్కించుకున్నారు. తద్వారా విపక్షాలనే గాక స్వపక్షమైన బీజేపీ నేతలనూ ఆశ్చర్యపరిచారు. ఈసారీ గెలిస్తే గత 20 ఏళ్లలో ఆ ప్రతిష్టాత్మక పదవిని వరుసగా రెండోసారి చేపట్టిన తొలి నాయకునిగా నిలుస్తారు. గత 20 ఏళ్లలో స్పీకర్‌గా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తొలి నేత కూడా బిర్లానే. పూర్తి స్థాయి డిప్యూటీ స్పీకర్ లేకుండానే పదవీ కాలం పూర్తి చేసిన తొలి స్పీకర్ కూడా ఆయనే. రాజస్తాన్‌లోని కోటా లోక్‌సభ సభ్యుడైన బిర్లా 2019కి ముందు పెద్దగా వార్తల్లో లేరు. భారతీయ జనతా యువ మోర్చా నుంచి రాజకీయాల్లో ఎదిగారు. మూడుసార్లు లోక్‌సభ సభ్యునిగా గెలిచారు. 2003 నుంచి 2014 దాకా కోటా సౌత్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. రాజస్తాన్ ప్రభుత్వంలో సహాయ మంత్రి హోదాతో కూడిన పార్లమెంటరీ కార్యదర్శిగా పని చేశారు. లోక్‌సభ స్పీకర్‌గా అధికార పక్షానికి కొమ్ము కాశారంటూ విపక్షాల నుంచి తీవ్ర విమర్శలే ఎదుర్కొన్నారు. మహువా మొయిత్రా లోక్‌సభ సభ్యత్వం రద్దు, 100 మంది విపక్ష ఎంపీలను సెషన్ మొత్తానికి సస్పెండ్ చేయడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. 2014లో తొలిసారి ఎంపీగా గెలిచాక లోక్‌సభలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 671 ప్రశ్నలు అడగడంతో పాటు 163 చర్చల్లో పాల్గొన్నారు. బిర్లా స్పీకర్‌గా ఉండగానే పార్లమెంటు కొత్త భవనం రూపుదిద్దుకుంది.

కె.సురేశ్ ఓడి గెలిచారు



కొడికున్నిల్ సురేశ్ (62). లోక్‌సభ స్పీకర్ పదవికి 50 ఏళ్ల తర్వాత జరుగుతున్న పోటీలో విపక్ష కూటమి అభ్యర్థిగా దేశవ్యాప్తంగా ఒక్కసారి వార్తల్లో వ్యక్తిగా మారిపోయారు. కేరళకు చెందిన ఈ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏకంగా ఎనిమిదిసార్లు లోక్‌సభ సభ్యునిగా గెలిచారు. అయితే 2009లో ఆయన విజయం వివాదాస్పదంగా మారింది. క్రైస్తవుడైన సురేశ్ ఎస్సీనంటూ తప్పుడు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో మావలికర ఎస్సీ లోక్‌సభ స్థానం నుంచి నెగ్గారంటూ సమీప ప్రత్యర్థి కేరళ హైకోర్టులో కేసు వేశారు. దాంతో సురేశ్ ఎన్నికను కోర్టు రద్దు చేసింది. అనేకానేక మలుపుల తర్వాత చివరికి సుప్రీంకోర్టు ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది. ఎల్ఎల్‌బీ చేసిన సురేశ్ 1989లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పటినుంచి 1998, 2004 మినహా ప్రతిసారీ గెలుస్తూ వస్తున్నారు. పీసీసీ చీఫ్‌గా, పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యునిగానే గాక కేంద్ర మంత్రిగా కూడా చేశారు. ప్రస్తుతం కేరళ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. 2009లో మావలికర లోక్‌సభ స్థానం ఏర్పాటైనప్పటి నుంచీ ఎంపీగా ఆయనే గెలుస్తూ వస్తున్నారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం ప్రత్యర్థిపై కేవలం 10 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గారు.

ముగిసిన ఆతిశి నిరాహార దీక్ష

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఢిల్లీ మంత్రి



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నీటి సమస్యను పరిష్కరించాలంటూ ఈనెల 21వ తేదీ నుంచి మంత్రి ఆతిశి కొనసాగిస్తున్న నిరాహార దీక్ష అర్ధంతరంగా ముగిసింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమెను లోక్‌నాయక్ ఆస్పత్రిలో చేర్పించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న మంత్రి ఆతిశి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కుమార్ తెలిపారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన మంత్రి ఆతిశి దాదాపు ఐదు రోజులుగా సాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ చెప్పారు. ఢిల్లీకి న్యాయబద్ధంగా అందాల్సిన నీటిని హరియాణా నుంచి విడుదల చేయించాలంటూ ప్రధానికి ఆప్ ఎంపీలు లేఖ రాస్తారన్నారు.

వచ్చే నెలలో రష్యాకు మోదీ?

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలైలో రష్యాకు వెళ్లనున్నట్లు సమాచారం. మోదీ పర్యటన ఖాయమని, ఆయన రాకకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడి సహాయకుడు యూరి ఉషకోవ్ చెప్పారు. కాగా, జూలై 8వ తేదీన మోదీ రష్యాలో ఒక రోజు పర్యటన చేపట్టేందుకు అవకాశాలున్నాయని, దీనిపై తుది నిర్ణయం ఇంకా జరగలేదని దౌత్య వర్గాలు అంటున్నాయి. పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ మధ్య విస్తృత స్థాయి చర్చలు జరిగే అవకాశముందని భావిస్తున్నారు. మోదీ 2019లో చివరిసారిగా రష్యాకు వెళ్లారు. అప్పట్లో వ్లాదివోస్టోక్‌లో జరిగిన ఎకనామిక్ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు.

ఉదయనిధికి బెయిలిచ్చిన బెంగళూరు కోర్టు



బెంగళూరు: సనాతన ధర్మాన్ని నాశనం చేయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధికి బెంగళూరులోని ఓ కోర్టు బెయిలిచ్చింది. సామాజిక కార్యకర్త పరమేశ్ వేసిన పిటిషన్‌పై కోర్టు నోటీసులందడంతో ఉదయనిధి మంగళవారం ఉదయం బెంగళూరులోని 42వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరయ్యారు. విచారణ చేపట్టిన మేజిస్ట్రేట్ ఆయనకు రూ.లక్ష పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేశారు. 2023 సెప్టెంబర్‌లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉదయనిధి.. సామాజిక న్యాయం, సమానత్వానికి వ్యతిరేకమైన సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలానికి కారణమయ్యాయి.

అయోధ్యలో ఆలయాల మ్యూజియం

రూ.650 కోట్లతో నిర్మించనున్న టాటా సంస్థ

లక్నో: బాలరాముడు కొలువైన అయోధ్యలో రూ.650 కోట్లతో 'ఆలయాల మ్యూజియం'ఏర్పాటు కానుంది. అంతర్జాతీయ స్థాయి ప్రత్యేకతలతో మ్యూజియంను నిర్మించేందుకు టాటా గ్రూపు సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకు అవసరమయ్యే స్థలాన్ని కేవలం రూపాయికే 90 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు యూపీ ప్రభుత్వం అంగీకరించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల చరిత్ర, వాటి నిర్మాణ రీతులను ఇందులో వివరిస్తారు. మ్యూజియంలో లైట్ అండ్ సౌండ్ షో కూడా ఉంటుందని యూపీ మంత్రి జైవీర్ సింగ్ తెలిపారు.

కెన్యాలో ఆందోళనలు తీవ్రతరం

పార్లమెంట్ భవనానికి నిప్పు

నైరోబీ: వివాదాస్పద పన్నుల పెంపు బిల్లును వ్యతిరేకిస్తూ కెన్యాలో జరుగుతున్న ఆందోళనలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పన్ను పెంపు ప్రతిపాదనలపై మంగళవారం రాజధాని నైరోబీలోని పార్లమెంట్‌లో చర్చ జరుగుతోంది. నిరసనకారులు మంగళవారం పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో భవనంలోని కొంత భాగానికి నిప్పుపెట్టారు. దీంతో, భద్రతా బలగాలు లోపలున్న పార్లమెంట్ సభ్యుల్ని సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. బలగాలు జరిపిన కాల్పుల్లో కనీసం ఐదుగురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయాలపాలైనట్లు రాయిటర్స్ తెలిపింది. కాగా, పన్ను ప్రతిపాదనల్ని వెనక్కి తీసుకోవాలంటూ దేశవ్యాప్తంగా వారం రోజులుగా సాగుతున్న ఆందోళనల్లో ఇద్దరు పౌరులు చనిపోయారు. బ్రెడ్, శానిటరీ టవల్స్, డైపర్స్ వంటి వాటిపై పన్నులు పెంచాలని ప్రభుత్వం ప్రయత్నించింది. తీవ్ర ప్రజాగ్రహం నేపథ్యంలో బ్రెడ్‌పై పన్ను ప్రతిపాదనల్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయినప్పటికీ ఆందోళనలు చల్లారలేదు.

దుబాయ్‌లో ఏపీ వాసికి లాటరీ

దుబాయ్: దుబాయ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ వాసి బోరుగడ్డ నాగేంద్రం(46)ను అదృష్టం వరించింది. నేషనల్ బాండ్స్ ఇటీవల నిర్వహించిన లాటరీలో ఈయన 10 లక్షల దిర్హంలు(సుమారు రూ.2.25 కోట్లు) గెలుచుకున్నారు. బతుకుదెరువు కోసం 2017లో యూఈఏ వెళ్లిన నాగేంద్రం నేషనల్ బాండ్స్‌లో పొదుపు చేయడం ప్రారంభించారు. ఈయనకు 18 ఏళ్ల కుమార్తె, 14 ఏళ్ల కుమారుడు ఉన్నారు. లాటరీ సొమ్ముతో తన పిల్లలకు మంచి చదువులు చెప్పిస్తానని నాగేంద్రం తెలిపారు.

పోర్షే కారు ప్రమాదం కేసు... బాలుడి విడుదలకు బాంబే హైకోర్టు ఆదేశం

ముంబై: పుణేలో ఖరీదైన పోర్షె కారు నడిపి ఇద్దరి మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 17 ఏళ్ల బాలుడిని అబ్జర్వేషన్ హోం నుంచి వెంటనే విడుదల చేయాలని బాంబే హైకోర్టు ఆదేశించింది. మే 19వ తేదీన రాత్రి వేళ మద్యం మత్తులో ఉన్న బాలుడు కారు నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మైనర్ కావడంతో అతడిని పోలీసులు జువెనైల్ జస్టిస్ బోర్డు(జేజేబీ) ఎదుట హాజరు పరిచారు. బాలుడిని తల్లిదండ్రులు, తాత పర్యవేక్షణలో ఉంచాలని బోర్డు ఆదేశాలిచ్చింది. అయితే, రెండు నిండు ప్రాణాలను బలి తీసుకున్న నిందితుడిని విడుదల చేయడమేంటంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో, పోలీసులు బెయిల్ ఆదేశాలను సవరించాలంటూ జేజేబీని ఆశ్రయించారు. ఈ మేరకు బోర్డు నిందితుడిని అబ్జర్వేషన్ హోంకు తరలించాలని ఆదేశించింది. ఈ పరిణామంపై బాలుడి మేనత్త బాంబే హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం వాదనలు విన్న డివిజన్ బెంచ్..అబ్జర్వేషన్ హోంకు రిమాండ్‌కు పంపుతూ జేజేబీ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. బాలుడిని మేనత్త పర్యవేక్షణలో ఉంచాలని, మానసిక నిపుణుడి కౌన్సెలింగ్ కొనసాగించాలని స్పష్టం చేసింది.

బ్రిటన్లో బెట్టింగ్ లొల్లి... ఇద్దరు అభ్యర్థులపై వేటు

లండన్: బ్రిటన్‌లో ఎన్నికల వేళ ప్రధాని రిషి సునాక్‌కు తలనొప్పులు నానాటికీ పెరుగుతున్నాయి. ఇద్దరు అధికార కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల తేదీపై బెట్టింగ్‌కు పాల్పడటంపై మొదలైన రగడ నానాటికీ ముదురుతోంది. వారిపై విమర్శలతో విపక్షాలు ఇప్పటికే హోరెత్తిస్తున్నాయి. ఇద్దరినీ పోటీ నుంచి తప్పించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. దాంతో సదరు అభ్యర్థులు క్రెయిగ్ విలియమ్స్, లారా శాండర్స్‌కు పార్టీ మద్దతు ఉపసంహరిస్తూ సునాక్ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. వారు ఇక కన్జర్వేటివ్ అభ్యర్థులు కారంటూ పార్టీ అధికార ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీపరంగా అంతర్గత విచారణ జరిపిన మీదట ఈ నిర్ణయానికి వచ్చినట్టు వివరించారు. వీరిద్దరూ సునాక్‌కు సన్నిహితులే కావడం విశేషం! బ్రిటన్‌లో జూలై 4న ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఏడాది చివరిలోగా జరగాల్సి ఉండగా సునాక్ ఆకస్మికంగా ముందస్తు నిర్ణయం తీసుకున్నారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 26 । జూన్ । 2024



కెమెరా కన్ను.. ఫెన్సింగ్ దన్ను

హెచ్ఎండీఏ భూముల పరిరక్షణకు నడుంబిగించింది. మియాపూర్ భూముల కబ్జా ఉదంతం నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న హెచ్ఎండీఏ భూములపై నిఘా పెంచింది. -8లో



ఔటర్‌కు ఆకుపచ్చ కోక!

ఔటర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం విస్తరణకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. 158 కిలో మీటర్ల మేర మొక్కలు నాటనున్నారు. ఇందుకు రూ.30 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 33, కనిష్ట ఉష్ణోగ్రత 24 డిగ్రీల సెల్సియస్ ఉండే అవకాశం ఉంది.

సైబర్ క్రైమ్‌పై ఫోకస్

ప్రతి జోన్‌కు ఒక సైబర్ పీఎస్!

- మహిళా పోలీసు స్టేషన్ కూడా..
- అదనంగా 10–15 ట్రాఫిక్ పీఎస్‌లు
- వచ్చే పదేళ్ల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు
- 'సాక్షి'తో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి



'సాక్షి' ఇంటర్వ్యూ

సైబరాబాద్‌లో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. విద్యావంతులు, గృహిణులు, ఉద్యోగులు, సామాన్యులు, విద్యార్థులు.. ఇలా ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి విలవిల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాల నియంత్రణకు పోలీసు కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించింది. వచ్చే పదేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త ఠాణాల ఏర్పాటు, నవీకరణ, సిబ్బంది నియామకం తదితర ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతితో 'సాక్షి' ఇంటర్వ్యూ.

- వివరాలు 10లో▸

ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించాల్సిందే

జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులు



ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మించేంత వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు జూనియర్ డాక్టర్ల సమ్మెలో భాగంగా 2వ రోజు మంగళవారం జూడాలు ఉస్మానియా ఆస్పత్రిలో ప్లకార్డులతో ఓపీ నుంచి కులీ కుతుబ్‌షాహి భవనం, సూపరింటెండెంట్ కార్యాలయం, పాత భవనం చుట్టూ ర్యాలీ నిర్వహించారు. 'ముఖ్యమంత్రి రావాలి, ఉస్మానియాకు నూతన భవనం నిర్మించాలి, మాకు న్యాయం చేయాలి, మమ్మల్ని మీరు బతికించండి, మిమ్మల్ని మేము బతికించుకుంటాం' అంటూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. నూతన హైకోర్టు నిర్మాణం కోసం రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల స్థలం కేటాయించిన ముఖ్యమంత్రి వేలాది మంది పేద రోగులు చికిత్సలు పొందే ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉండే తమకు సీఆర్‌పీఎఫ్ పోలీసుల భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన 8 డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు.

చేయూత పింఛన్లను వెంటనే అందించాలి

మందకృష్ణ మాదిగ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: చేయూత పింఛనుదారులను చిన్నచూపు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు త్వరలో ఉన్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) వ్యవస్థాపక, గౌరవాధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పింఛనుదారుల హక్కుల సాధన కోసం జులై నెల అంతా ఉద్యమించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ప్రతి నెలా మొదటి తేదీనే జీతాలు తీసుకుంటున్నారని, చేయూత పింఛనుదారులకు మాత్రం జూన్ నెల డబ్బులు ఇంకా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా చేయూత పింఛన్ డబ్బులను పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 7 నెలలవుతున్నా హామీని నెరవేర్చలేదన్నారు. ఈ 7 నెలల్లో పింఛనుదారులు రూ.6,300 కోట్లు కోల్పోయారన్నారు. జులై 2వ లోగా బకాయిలు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం ఘనంగా నిర్వహిస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణాన్ని స్థానికుల సహకారంతో ఘనంగా నిర్వహిస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వచ్చే నెల 9వ తేదీన జరగనున్న అమ్మవారి కల్యాణం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల ఏర్పాట్లలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. నాణ్యతతో కూడిన ప్రసాదాలు, తాగునీరు, ఆహార పదార్థాలను భక్తులకు అందించాలన్నారు. తోపులాటలు జరక్కుండా పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేసి ఎక్కువ చోట్ల ఎగ్జిట్‌లు పెట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతులు, సీసీ కెమెరాలు, లైటింగ్, ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం అమ్మవారి కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హన్మంత్‌రావు, అడిషనల్ కమిషనర్ జ్యోతి, వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, అమీర్‌పేట కార్పొరేటర్ కె.సరళ, ఆలయ ఈఓ అంజనీ దేవి, చైర్మన్ సాయిబాబా గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మత్తుపై ధ్వజమెత్తారు





యువతను బలి తీసుకుంటున్న మాదకద్రవ్యాల నిరోధానికి అందరూ కలిసి కట్టుగా ఉద్యమించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని నెక్లెస్ రోడ్డులో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ నిర్మూలన అవగాహన ర్యాలీని భట్టి విక్రమార్క జెండా ఊపి ప్రారంభించారు. మత్తు మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ష్.. సే నో టు డ్రగ్స్.. డ్రగ్స్ ఆర్ నో బాల్స్.. ఇన్ ద గేమ్ ఆఫ్ లైఫ్' అంటూ విద్యార్థులు పోస్టర్లను ప్రదర్శించారు.





వర్షానికి నగరానికి విడదీయరాని అవినాభావ సంబంధముంది. చినుకు పడితే చాలు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్. అంతేనా.. తెరుచుకునే మ్యాన్ హోళ్లు, వెంటాడే వైరల్ ఫీవర్లు, విరిగిపడే చెట్లు, కూలిపోయే శిథిల భవనాలు.. ఇవి సరిపోదన్నట్టు ఈ మధ్య పడిపోతున్న హోర్డింగులు.. ఇలా చెబుతూపోతే బంజారాహిల్స్ ట్రాఫిక్ సవాళ్ల నుంచి మూసీ నది వరదల వరకు కోకొల్లలు. ఈ తరుణంలో సగటు నగరవాసి కొన్ని జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. వర్షాకాలంలో బయటకు వస్తే వెంట గొడుగు, రెయిన్ కోట్ వంటివి ముందు జాగ్రత్తగా తెచ్చుకోవడం మంచిది. వీలైనంత వరకు తడవకుండా ఉండటానికి ప్రయత్నించాలి. అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలో.. అసలు సాధారణంగా ఏం చేయకూడదో తదితర అంశాల్లో పునరాలోచన అవసరమేమో.. ఆ విషయాలపై ఓ లుక్కేద్దాం.. – సాక్షి, సిటీబ్యూరో

జల పైలం



నగర వాసి.. అప్రమత్తతే ఆయుధం

- వానా కాలంలో ప్రమాదాలు
- రహదారిపై వరద నీరు..
- ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు
- చిన్నపాటి జాగ్రత్తలతో మేలు

హెల్ప్ లైన్ నెంబర్లు

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో సత్వరం స్పందించేదుకు డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలం సందర్భంగా నగరంలో మొత్తం 30 గ్రూప్స్ ఏర్పాటు చేశారు. ప్రజల సాయం కోసం: 040-21111111, 040- 2344 2955, 9000113667 నంబర్లను సంప్రదించవచ్చు.

ప్రయాణాలు.. ప్రయాసలు

వర్షం కురిసే సమయంలో తప్పనిసరి ప్రయాణాలైతే తప్ప బయటికి వెళ్లకపోవడం శ్రేయస్కరం. తడిచిన రోడ్డుపై వాహనం నడిపేతే మోటారు సైకిళ్లు జారి పడుతుంటాయి. పెద్ద వాహనాలు అనుకున్న విధంగా బ్రేక్ వేసిన దగ్గర నిలబడదు. రహదారిపై వరద తీవ్రతను బట్టి రహదారి గుంతలుగా మారడం, కొన్ని సందర్భాల్లో కొట్టుకుపోతుంది. డ్రైవర్ రహదారిని గమనించకపోతే పెను ప్రమాదానికి కారణమవుతుంది. నిత్య జీవితంలో ప్రమాణికమైన మొబైల్స్, ల్యాప్‌టాప్‌ల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండటం మేలు.

హెల్ప్ లైన్: 404-23370081/83/84.

వైరల్ జ్వరాలు

అసలే వ్యాధుల కాలం.. ఆపై వర్షంలో తడిస్తే ఇంకేమైనా ఉందా? ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ వద్దు. చిన్న నిర్లక్ష్యం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులకు దారి తీస్తుంది. ప్రతీ సీజన్‌లో వేల సంఖ్యలో బాధితులు ఫీవర్ ఆస్పత్రి, గాంధీ, నిమ్స్, ఉస్మానిసాయ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తుమ్మితే రూ.వందలు.. దగ్గితే రూ. వేలు. ముఖ్యంగా ఈ సమయంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు పెరుగుతాయి. ఎమర్జెన్సీ: 102, 108.

శిథిలాలతో జర భద్రం

ఈ కాలంలో సామూహిక ప్రమాదాలకు శిథిల భవనాలు కేంద్రాలుగా నిలుస్తాయి. మన ఇల్లు సరిగా ఉన్నా కూడా చుట్టుపక్కల శిథిలాల గురించి పరిశీలన అవసరం.. అవసరమైతే జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయాలి. కూలడానికి ఆస్కారమున్న ఇల్లలో నివసిస్తున్నట్లైతే ముందస్తు మరమ్మతులపై దృష్టి సారించాలి. అదే సమయంలో భవనం పురాతనమైనదైతే, శిథిలావస్థకు చేరుకుంటే తప్పనిసరిగా ఖాళీ చేయడం మంచిది. గతంలో ఎంతోమంది శిథిల భవనాల గోడ కూలి, ఇల్లు కూలి మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ సైతం శిథిల భవనాలను గర్తించి, కూల్చివేయాలని చెబుతోంది. గత ఏడాది 320 భవనాలకు నోటీసులు జారీచేశారు.

జీహెచ్ఎంసీ: 040-23225397

విద్యార్థులూ జాగ్రత్త

పిల్లలు పాఠశాలకు వెళ్లినపుడు, వచ్చే సమయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. పాఠశాలకు ఆటో, బస్సులో పంపించే వారు నేరుగా పిల్లలు వాహనం ఎక్కే వరకు అక్కడే ఉండాలి. తిరిగి డ్రాపింగ్ సమయంలో ముందుగానే స్టాప్ వద్దకు చేరుకోవాలి. పిల్లలకు గొడుగు, రైన్ కోట్ బ్యాగ్‌లో ఉంచడం మంచిది.



వేడివేడి ఆహారం

వర్షా కాలంలో వేడి వేడి ఆహారం తీసుకోవడం మంచిది. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలి. తాగు నీటి పైపులైన్ను తనిఖీ చేసుకో విద్యార్థులు, ఉద్యోగులు, టిఫిన్ బాక్స్ తీసుకెళ్లే సమయంలో హాట్ బాక్సుల్లో తీసుకెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి. పులిసిన, నిల్వ చేసిన ఆహారం తీసుకోవడం వల్ల ప్రాణాంతకమైన డయేరియా వంటి వ్యాధులు ప్రమలే ప్రమాదం ఉంది. బయటి ఫుడ్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచిది.

వరద కాల్వలు

నోళ్లు తెరిచే నాళాల పట్ల ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అమాంతం మింగేస్తాయి. వరద ప్రవాహం సమయంలో మ్యాన్ హోల్, ఓపెన్ డ్రైనేజీ కాల్వలు, వరద నీటి కాల్వల పరిసర ప్రాంతాల ప్రజలు పిల్లలు, వృద్ధుల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రమాదకరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలి. గతంలో వరద ప్రవాహంలో పడి మృత్యువాతపడిన ఘటనలున్నాయి.

సాయం కోసం: 155313, 040-23433933

వాహనాల నిర్వహణ

వానా కాలంలో మోటారు సైకిల్, కారు, ఇతర వాహనాలు స్టార్ట్ కావడానికి మొరాయిస్తాయి. సరైన సమయంలో సర్వీసింగ్ చేయించడం, వరద నీటిలో వాహనం మునిగిపోకుండా జాగ్రత్తపడాలి. ప్రయాణాలు చేసే సమయంలో వరద నీటిలో ఉన్నపుడు సైలెన్సర్ ద్వారా ఇంజిన్‌లోకి నీరు వెళ్లకుండా చూసుకోవాలి. ఈ విషయంలో ఎలక్ట్రానిక్ వాహనాలకు సమస్యలు మరింత ఎక్కువగా ఉంటాయి.

పిడుగులు పడేప్రమాదం:

వర్షాకాలంలో చినుకులు ప్రాంభమైనపుడు తడిచిపోకుండా ఉండటానికి సమీపంలో ఉన్న చెట్ల కిందకు వెళ్లడం చూస్తుంటాం. అయితే ఇది ప్రమాదకరం. సాధారణంగా పిడుగులు చెట్ల పైన, సాటిలైట్ టెక్నాలజీకి అనుసంధానమైన ఎలక్ట్రానిక్ డివైజ్‌లపైన పడే ఆస్కారముంది.

లోతట్టు ప్రాంతాలు

హైదరాబాద్‌తో పాటు వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గాల్లో వర్షాలు కురిస్తే మూసీ పరీవాహక ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఫలితంగా లోతట్టు ప్రాంతాల్లోని నివాస గృహాలు, ఇతర నిర్మాణాలు మునిగిపోతున్నాయి. నగరం అతలాకుతలమైపోతుంది.

మహా దృష్టితో..

విపత్తు నిర్వహణ.. ఆస్తుల పరిరక్షణ!

- 'గ్రేటర్'లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల్లోని విభాగాలతో దీనికి రూపం
- కమిషనర్‌గా ఐజీ స్థాయి అధికారి ఏవీ రంగనాథ్ నియామకం
- ఇద్దరు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలతో పాటు భారీ సిబ్బంది
- విధి విధానాలతో కూడిన ఉత్తర్వులు త్వరలో విడుదల

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సర్కారు పాలనా పరంగా కీలక సంస్కరణలు తీసుకువస్తోంది. వీటిలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, నాలాలు, చెరువుల కబ్జాల నిరోధం, విపత్తు స్పందన కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తోంది. పోలీసు విభాగానికి చెందిన అధికారుల నేతృత్వంలో అసెర్ట్స్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పేరుతో దీనికి రూపం ఇస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల్లో ఉన్న నిఘా, పర్యవేక్షణ బృందాలు దీని పరిధిలోకి తీసుకురానున్నారు. ఐజీ హోదాలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను దీనికి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. జీహెచ్ఎంసీలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్‌గా సోమవారం ఆయన నియమితులయ్యారు. కొత్త విభాగం ఏర్పాటు పూర్తయిన తర్వాత దానికి కమిషనర్‌గా మారుతారు.

ఏకరూప స్పందన కోసం..

ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధీనంలో పని చేసే ఈ కొత్త విభాగం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీఎస్ ఐసీసీసీ) కేంద్రంగా పని చేస్తుంది. ఇది అమలులోకి వస్తే ప్రస్తుతం జీహెచ్ఎంసీలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హెచ్ఎండీఏలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు ఇందులో విలీనం కానున్నాయి. ఔటర్ రింగ్ రోడ్‌కు (ఓఆర్ఆర్) లోపల ఉన్న ప్రాంతంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఏకరూప స్పందన ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భిన్న వ్యవస్థలతో వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, భారీ అగ్ని ప్రమాదాలు వంటివి చోటు చేసుకున్నప్పుడు ఇది సాధ్యం కావట్లేదు. జీహెచ్ఎంసీ పరిధిలో దీనికోసం డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) ఉండగా.. ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇలాంటి విభాగాలు లేకపోవడంతో సహాయ కార్యక్రమాలకు ఆలస్యం అవుతోంది. ఓఆర్ఆర్ ఎగ్జిట్ గేట్ల వద్ద వరద నీరు వచ్చినప్పుడు ఈ ఇబ్బంది కనిపిస్తోంది. మరో పక్క నగరంలోని అనేక ఖరీదైన ప్రభుత్వ స్థలాలు కైంకర్యం అవుతున్నాయి. చెరువులు, నాలాలు కబ్జాలతో నిండిపోతున్నాయి. ఈ ప్రభావం నగరవాసులపై తీవ్రంగా ఉంటోంది. దీంతో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం వేర్వేరుగా విభాగాలు పని చేస్తుండటంతో సమన్వయ లోపం ఏర్పడుతోంది.



కబ్జాదారులపై ఉక్కుపాదం మోపాలనే..

- ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అసెర్ట్స్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని తీసుకువస్తోంది. ఇందులో కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎస్పీ స్థాయి అధికారులు, నలుగురు డీఎస్పీలను పోలీసు విభాగం నుంచి డిప్యుటేషన్‌పై తీసుకుంటారు. కబ్జాదారులపై కఠినంగా వ్యవహరించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకుంది. మిగిలిన పోస్టుల్లో పోలీసు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ విభాగాలకు చెందిన వారిని అవసరమైన స్థాయిలో నియమిస్తారు.
- ఈ వింగ్‌కు నిఘా, పర్యవేక్షణలతో పాటు కొన్ని ప్రత్యేక అధికారాలను సైతం ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఎస్పీగా, వరంగల్ పోలీసు కమిషనర్‌గా పని చేసిన ఏవీ రంగనాథ్ ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే ఈ విభాగం తొలి కమిషనర్‌గా ప్రభుత్వం ఈయనకు అవకాశం ఇచ్చింది. అసెర్ట్స్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వింగ్ విధి విధానాలు, బాధ్యతలు, అధికారాలు తదితర అంశాలను ఖరారు చేస్తున్న ప్రభుత్వం త్వరలో సమగ్ర ఉత్తర్వులు జారీ చేయనుంది.

అం'డర్'పేట!



ఆరేళ్లుగా కొనసాగుతున్న ఫ్లైఓవర్ పనులు

- రాకపోకలు నిలిచిపోవడంతో జనం ఇబ్బందులు
- రాజకీయ విమర్శలకే పరిమితమైన నేతలు
- నిర్మాణం పూర్తయ్యేందుకు చొరవచూపని పార్టీలు
- ట్రాఫిక్‌తో వాహనదారులకు ఇక్కట్లు

అంబర్‌పేట: ఒక్క వంతెన.. నిత్యం వేలాది మందికి అవస్థలు తెచ్చిపెడుతోంది. ఒకటి కాదు రెండు కాదు ఆరేళ్లుగా దీని నిర్మాణం కొనసాగుతుండడంతో స్థానిక ప్రజలతో పాటు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం అంబర్‌పేట ప్రధాన రోడ్డులో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణం నత్తకే నడకలు నేర్పుతున్న చందంగా మారింది. ఏళ్లకేళ్లుగా పనులు సాగుతుండడంతో వేలాది మంది అవస్థలు పడుతున్నారు. జాప్యంపై కనీస జవాబుదారీతనం కనిపించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయో తెలియని దయనీయ పరిస్థితి నెలకొంది.

1.5 కిలోమీటర్ కోసం..

అంబర్‌పేట మీదుగా వెళ్లే వరంగల్ ప్రధాన రహదారిపై రూ.390 కోట్లతో 1.5 కి.మీ మేర నిర్మించ తలపెట్టిన ఫ్లైఓవర్ కోసం 20 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు చేసినా 2018లో శంకుస్థాపన చేశారు. గోల్నాక చర్చి నుంచి ఛే నంబర్, శ్రీరమణ చౌరస్తాల మీదుగా ఇరానీ హోటల్ వరకు ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. ఇందుకోసం 281 ఆస్తులను సేకరించారు. 47 పిల్లర్లతో 1.5 కి.మీ మేర ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆరేళ్లకుపైగా పడుతోంది. ఏళ్ల తరబడిగా ఒక చిన్నపాటి ఫ్లైఓవర్‌ను పూర్తి చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. .

2018లో ప్రారంభించి..

అంబర్‌పేట, ఉప్పల్ ప్రాంతాల్లో నిర్మించనున్న ఫ్లైఓవర్‌లను ఇప్పటి, అప్పటి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా 2018లో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం పనులు సాగుతూనే ఉన్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పూర్తి చేయాల్సిన ఫ్లైఓవర్‌ను నిర్లక్ష్యం చేశాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఫ్లైఓవర్ నిర్మాణాన్ని సైతం రాజకీయ విమర్శలకు వాడుకున్నారు. ఫ్లైఓవర్ పూర్తయ్యేందుకు మాత్రం చొరవ తీసుకోలేదు. ఇప్పటికైనా అంబర్‌పేట ఫ్లైఓవర్ పూర్తి చేయాలని డిమాండ్ వెల్లువెత్తుతోంది.

రాకపోకలు నరకయాతన...

అంబర్‌పేట ఫ్లైఓవర్ కోసం మూడేళ్లుగా దశలవారీగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు సైతం సరిగా లేకపోవడంతో నిత్యం వేలాది వాహనదారులకు అంబర్‌పేట ప్రాంతానికి వచ్చేసరికి చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లి.. అందులో చిక్కుకొని ఆందోళనకు గురవుతున్నారు. ఛే నంబర్ చౌరస్తా, శ్రీరమణ చౌరస్తా, అలీ కేఫ్ చౌరస్తా ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏళ్లు గడిచినా అంబర్‌పేట ప్రాంతానికి ట్రాఫిక్ విముక్తి ఉండదా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అంబర్‌పేటలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

కలుషిత నీటితో విద్యార్థులకు అస్వస్థత

చందానగర్ బన్సీలాల్ మలానీ నర్సింగ్ కాలేజ్ హాస్టల్‌లో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని మహిళా దక్షిత సమితి బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ కాలేజీకి సంబంధించిన హాస్టల్‌లోని 25 మంది విద్యార్థులు సోమవారం సాయంత్రం కలుషిత తాగు నీటి కారణంగా అస్వస్థతకు గురయ్యారు. కానీ, కాలేజీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా పక్కనే ఉన్న అర్చన ఆస్పత్రికి ఆ విద్యార్థులను తరలించింది. మంగళవారం ఈ విషయంపై సుమన్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవిని వివరణ కోరగా, తాగునీరు కలుషితం కావడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, 16 మంది ఇప్పటికే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు. మరో 9 మందిని 24 గంటల పాటు పరిశీలనలో ఉంచినట్లు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, పరీక్ష నిమిత్తం తాగునీటి శాంపిల్స్‌ను సేకరించారని చెప్పారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా ఆహారాన్ని పరిశీలించి, ఇందులో ఎలాంటి ఇబ్బందులు లేవని పేర్కొన్నారని తెలిపారు.

ఔటర్‌కు ఆకుపచ్చ కోక!

- రూ.30 కోట్లతో పచ్చదనం విస్తరణకు హెచ్‌ఎండీఏ చర్యలు
- ప్రైవేట్ సంస్థల నుంచి త్వరలో బిడ్‌ల ఆహ్వానం
- 1వ తేదీ నుంచి మొక్కలు నాటే కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం విస్తరణకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. 158 కిలో మీటర్ల మేర సెంట్రల్ మీడియన్, ఇంటర్ చేంజ్‌లు, రోటరీలు, కారిడార్‌లు, తదితర చోట్ల పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నారు. ఇందుకోసం సుమారు రూ.30 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు అంచనా. ఈ మేరకు పచ్చదనం విస్తరణ, అభివృద్ధి కోసం ప్రైవేట్ సంస్థల నుంచి టెండర్‌లను ఆహ్వానించేందుకు హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ విభాగం కార్యాచరణ చేపట్టింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. బిడ్డింగ్‌లో అర్హత సాధించిన సంస్థలు మొత్తం 158 కి.మీ ఔటర్ మార్గంలో సెంట్రల్ మీడియన్, ఇంటర్ చేంజ్‌లు, కారిడార్‌లు తదితర అన్ని ప్రాంతాల్లో 1500 కి.మీ వరకు మొక్కలను నాటి పెంచాల్సి ఉంటుంది. ఔటర్‌పై రాకపోకలు సాగించే వాహనదారులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందజేసేందుకు హెచ్‌ఎండీఏ పెద్ద ఎత్తున పచ్చదనాన్ని అభివృద్ధి చేసింది. గత ప్రభుత్వ హయాంలోనే ఔటర్‌రింగ్ రోడ్డును 30 ఏళ్లకు ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టినప్పటికీ పచ్చదనం పరిరక్షణ బాధ్యత మాత్రం హెచ్‌ఎండీఏ నిర్వహణలోనే ఉంది. ఈ మేరకు పనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు అధికారులు త్వరలో టెండర్లను ఆహ్వానించనున్నారు.



అందం.. ఆహ్లాదం..

- ఔటర్ రింగ్‌రోడ్డు మార్గంతో పాటు నగరానికి అన్ని వైపులా ఉన్న ప్రధాన రహదారి మార్గాల్లోనూ హెచ్‌ఎండీఏ గతంలో పెద్ద ఎత్తున పచ్చదనం విస్తరణ, అభివృద్ధికి చర్యలు చేపట్టింది. నగర శివారు ప్రాంతాలను ఆనుకొని ఉన్న పట్టణ అడవుల్లో కొంత భాగాన్ని ఉద్యానాలుగా అభివృద్ధి చేశారు. మొదట 59 అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. గత ఏడాది 39 పార్కులు వినియోగంలోకి వచ్చాయి. మరో 20 వివిధ దశల్లో ఉన్నాయి. అప్పట్లో హెచ్‌ఎండీఏ చేపట్టిన చర్యలతో నగరంలో ఫారెస్ట్ కవర్ 33.15 చదరపు కిలో మీటర్ల నుంచి 81.81 చదరపు కిలో మీటర్లకు పెరిగినట్లు అంచనా. అర్బన్ ఫారెస్ట్ పార్కులకు వరల్డ్ ఫారెస్ట్ సైన్స్ నుంచి కూడా సముచితమైన గుర్తింపు లభించింది.
- మరోవైపు నగరానికి గ్రీన్‌సిటీ అవార్డు కూడా లభించింది. పచ్చదనంలో నగరం సాధించిన అభివృద్ధిని కాపాడేందుకు హెచ్‌ఎండీఏ తాజాగా దృష్టి సారించింది. ప్రతి రోజు సుమారు 1.50 లక్షల వాహనాలు ఔటర్‌పై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో వాహన కాలుష్యం బారిన పడకుండా ఔటర్ మార్గాన్ని పచ్చదనంతో పరిరక్షించాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు పచ్చదనం వల్ల వాహనదారులకు ఆహ్లాదకరమైన అనుభూతి లభించనుంది. ఈ పచ్చదనం విస్తరణలో భాగంగా ఔటర్‌కు ఇరువైపులా, మధ్యలో రంగురంగుల పూల మొక్కలను నాటనున్నారు. టికోనా, అర్జెంటీయా, బోగన్‌విలియా, పాగోడి, నందివర్ధనాలు, తదితర 11 రకాల మొక్కలను నాటనున్నట్లు అధికారులు తెలిపారు.

సౌమ్యీకరిది.. సోకొకరిది..

ఔటర్ రింగ్‌రోడ్డును ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు లీజుకు ఇవ్వడానికి ముందే హెచ్‌ఎండీఏ పచ్చదనం అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంది. మొత్తం 62 బ్లాకులుగా విభజించి 63.13 లక్షలకు పైగా మొక్కలను నాటారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా ప్రతి మొక్కకు నీటిని అందజేశారు. ఇందుకోసం సుమారు రూ.17 కోట్లతో బోర్ వెల్‌లు వేశారు. పంపుసెట్లు కొనుగోలు చేశారు. కానీ ఔటర్‌ను లీజుకు ఇచ్చే క్రమంలో పచ్చదనం పరిరక్షణను లీజులో భాగంగా కాకుండా హెచ్‌ఎండీఏ నిర్వహణలోనే ఉంచారు. ప్రస్తుతం ఔటర్‌పైన లీజు ద్వారా ఐఆర్‌బీకి ప్రతి నెలా సుమారు రూ.60 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుంది. కానీ రూ.కోట్లు ఖర్చు చేసి ఔటర్‌కు సొగసులు అద్దాల్సిన బాధ్యత మాత్రం హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉండడం గమనార్హం.

హెచ్‌ఎండీఏ అభివృద్ధి పనులపై ఆరా

ఇంజినీరింగ్ విభాగంపై కొత్త కమిషనర్ సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: అభివృద్ధి పనులపై హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సర్ఫరాజ్ అహ్మద్ దృష్టి సారించారు. ఈ మేరకు మంగళవారం ఇంజినీరింగ్ విభాగంపైన సమీక్ష నిర్వహించారు. అధికారులతో సమావేశమై పలు అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌తోపాటు, మీరాలం చెరువుపై నిర్మించనున్న వంతెన పనుల పురోగతిని గురించి అధికారులతో మాట్లాడారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు జంక్షన్ వరకు సుమారు రూ.2,232 కోట్ల అంచనాలతో 18.10 కిలోమీటర్‌ల మేర చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందే శంకుస్థాపన చేసింది. ఈ ప్రాజెక్టు కోసం వివిధ చోట్ల 197 ఎకరాలకుపైగా భూములను సేకరించవలసి ఉంటుంది. ఇందులో రక్షణశాఖ చెందిన భూములే 113 ఎకరాల వరకు ఉంటాయి. తొలగించవలసిన కట్టడాలు, సేకరించవలసిన భూములపై కూడా క్షేత్రస్థాయి సర్వేలు పూర్తయ్యాయి.

ఫార్మాలో పెట్టుబడుల పెంపు

ఇండో-ఉజ్బెక్ ఫార్మా బిజినెస్ ఫోరం భేటీలో నిర్ణయం

లక్డీకాపూల్ : భారత్, ఉజ్బెకిస్థాన్ దేశాల మధ్య ఫార్మా రంగంలో వాణిజ్యం, పెట్టుబడి అవకాశాలను పెంచేందుకు ఇండో-ఉజ్బెకిస్థాన్ ఫార్మా బిజినెస్ ఫోరం సమావేశం విజయవంతంగా ముగిసింది. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ రిపబ్లిక్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ భారత ప్రతినిధి డాక్టర్ దివ్య సునీతరాజ్ మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ రంగంలో సహకారం, ఆవిష్కరణలను పెంపొందించడంలో ఫోరం ప్రాముఖ్యతను వివరించారు. ఇరు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించే దిశగా పలు ఎంఓయూలు కుదుర్చుకున్నామన్నారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కూడా జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఉజ్బెకిస్థాన్ ఎంబసీ నుంచి రాయబారులు ఎస్.సుయరోవ్, కె.సమియెవ్, ఉజ్బెకిస్థాన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ అబ్దుల్లా అజిజోవ్, హెటిరో ల్యాబ్స్, భారత్ బయోటెక్ వంటి భారత ఫార్మా కంపెనీల ప్రతినిధుల పాల్గొన్నారు.

20 రోజుల్లో 60 ఫోన్ల రికవరీ



సాక్షి, సిటీబ్యూరో: ఇరవై రోజుల్లో 60 సెల్‌ఫోన్లను సైబరాబాద్ ఐటీ అండ్ సోషల్ మీడియా విభాగం రికవరీ చేసింది. ఆయా ఫోన్లను సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం డీసీపీ (క్రైమ్స్) కె.నరసింహ చేతులు మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లు చోరీకి గురైనా, పోగొట్టుకున్నా ఎన్‌సీఆర్పీ, సీఐఈఆర్ పోర్టల్స్ లేదా 1930 నేషనల్ హెల్ప్ లైన్ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్లు జగదీశ్వర్, ఆంజనేయులు, ఎస్‌ఐ రూప, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు.

భూఆక్రమణ కేసులో 21 మందికి రిమాండ్

మియాపూర్: మియాపూర్‌లోని 100, 101 హెచ్‌ఎండీఏ భూ వివాదంలో ఆందోళన చేసిన 21 మందిని పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ దుర్గా రామలింగా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూమిలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నారనే ప్రచారం జరగడంతో వివిధ జిల్లాల నుంచి జనాలు వచ్చి గుడిసెలు వేసి ఆక్రమించేందుకు యత్నించారు. అడ్డుకున్న పోలీసులపై రాళ్లదాడికి దిగారు. దాడికి పాల్పడిన నిందితుల్లో ఉడావత్ శంకర్, రత్లావత్ సురేష్ నాయక్, కడావత్ రాములు, కడావత్ వెంకటేష్, వాద్యావత్ రాయుడు, వాద్యావత్ శ్రీకాంత్, పాత్లావత్ భోజ్యా, కేతావత్ లోకారామ్, మేఘావత్ సంతోష్, వి. హరిలాల్, పి.భీముడు, ముడావత్ శ్రీను, కడావత్ రాజు, రత్లావత్ శివ, ఎల్.రాము, ఎల్. శ్రీను, ముడావత్ హతిరామ్, పత్లావత్ గణేష్, ఎల్. రూప్ల, వాలునాయక్, ముడావత్ భాస్కర్ ఉన్నారు.

చెస్ చాంపియన్స్ జైదీప్‌రెడ్డి, గీత అక్షర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ర్యాంకింగ్‌చెస్‌టోర్నమెంట్‌లో అండర్-11 బాలబాలికల విభాగాల్లో సనికొమ్ము జైదీప్‌రెడ్డి, తియ్యగూర గీత అక్షర విజేతలుగా నిలిచారు. జైదీప్ ఐదు పాయింట్లు, గీత అక్షర నాలుగు పాయింట్లు సాధించారు. లాల్‌బహదూర్ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీ జరిగింది. విజేతలకు తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం(టీఎస్‌సీఏ) అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, హైకోర్టు అడ్వకేట్ దారబోయిన సుబ్రమణ్యం ట్రోఫీలు అందజేశారు. వివిధ విభాగాల విజేతల వివరాలు ఇలా ఉన్నాయి.

- అండర్-15 బాలుర విభాగం: 1. ఏకాంశ్ యాదవ్, 2. గుమ్మి నిలయ్ ప్రసాద్, 3. గొర్లి మోహిత్ వెంకట్ సాయి.
- బాలికల విభాగం: 1. హృషిత, 2. హన్సిక జైన్.
- అండర్-13 బాలుర విభాగం: 1. టీఆర్ రామచంద్రన్, 2. అనయ్ సరాఫ్, 3. విరాజ్ జేనా.
- బాలికల విభాగం: 1. పయ్యావుల లహరి, 2. కొండా ఆద్యా రెడ్డి, 3. శ్రీ అన్విత.
- అండర్-11 బాలుర విభాగం: 1. సనికొమ్ము జైదీప్‌రెడ్డి, 2. శ్రీవాత్సవ్, 3. హితేశ్ సాయి సాకేత్.
- బాలికల విభాగం: 1. తియ్యగూర గీత అక్షర, 2. శ్రీవర్షిణి తన్మయి, 3. బూసా విష్ణు శ్రీకృతి.
- అండర్-9 బాలుర విభాగం: 1. మూలె యువాన్, 2. ఇమాదబత్తిని జోయెల్, 3. చేతన్ మాలె.
- బాలికల విభాగం: 1. స్వర దీపక్ ఫాస్గే, 2. సమీక్ష, 3. జస్వీన్ కౌర్.
- అండర్-7 బాలుర విభాగం: 1. కుర్మల ప్రతీక్ వీక్షిత్, 2. వెల్‌వెంధాన్, 3. కరణం లావిత్ కార్తికేయన్.
- బాలికల విభాగం: 1. సాయి అన్విత, 2. గడిపల్లి అద్వైత, 3. జంగా రిషిక.



వివిధ విభాగాల చెస్ విజేతలు

డీజిల్ ట్యాంకర్ బోల్తా తప్పిన ప్రాణాపాయం

తిమ్మాయిపల్లి ఫారెస్ట్ రిడ్జ్ సమీపంలో ఘటన



తిమ్మాయిపల్లి సమీపంలో బోల్తా పడిన డీజిల్ ట్యాంకర్

కీసర: డీజిల్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కీసర పోలీసుల వివరాల ప్రకారం... ఘట్‌కేసర్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ కంపెనీ నుంచి మూడు కంపార్ట్‌మెంట్లు గల డీజిల్ ట్యాంకర్ 12 వేల లీటర్ల పెట్రోల్ లోడ్‌తో కీసర మీదుగా మంగళవారం ఉదయం శామీర్‌పేటకు వెళ్తోంది. తిమ్మాయిపల్లి దాటిన తరువాత ఫారెస్ట్ రిడ్జ్ సమీపంలోని మూలమలుపు వద్ద ట్యాంకర్ ఒక్కసారిగా రోడ్డు కిందికి దిగి బోల్తా పడింది. కొంతమేర డీజిల్, పెట్రోల్ లీకవుతుండటంతో అటుగా వెళ్తున్న వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కీసర పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రమాద నివారణకుగాను ముందుజాగ్రత్తగా ట్రాఫిక్ మళ్లించారు. జేసీబీతో చెట్లపొదలను తొలగించి, క్రేన్ ద్వారా ట్యాంకర్‌ను అతికష్టం మీద బయటకు తీశారు. మరమ్మతులు చేసిన తర్వాత ట్యాంకర్‌ను అక్కడి నుంచి తరలించారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

హాస్టల్‌లో ఏడో తరగతి విద్యార్థి అనుమానాస్పద మృతి



మృతుడు మల్లికార్జున్

కుత్బుల్లాపూర్: కొంపల్లి శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన హాస్టల్‌లో ఏడో తరగతి విద్యార్థి అనుమానాస్పద మృతి కలకలం రేపింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు స్కూల్ ముందు ఆందోళన చేపట్టాయి. వివరాలు ఇలా ఉన్నాయి... మెదక్ జిల్లాకు చెందిన బీరయ్య, మాధవిల పెద్ద కుమారుడు మల్లికార్జున్‌ను కొంపల్లి శ్రీ చైతన్య స్కూల్‌లో ఏడో తరగతిలో సోమవారం చేర్పించారు. రాత్రి సమయంలో తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేసి పడుకున్న మల్లికార్జున్ ఉదయం ఎంతకూ నిద్రలేవలేదు. అపస్మారకస్థితిలో ఉన్న విద్యార్థిని స్కూల్ యాజమాన్యం సుచిత్ర ప్రాంతంలో ఉన్న రష్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు మంగళవారం ఉదయం ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా స్కూలుకు చేరుకుని ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పారు. మల్లికార్జున్ పడుకున్న బెడ్‌షీట్‌పై మూత్రం ఉండటం.. నిద్రలోనే మృతి చెందడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. గుండెపోటుతో మృతి చెందాడా.. లేక మరి ఏమైనా కారణాలు ఉన్నాయా.. అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. గతేడాది ఆరవ తరగతి కూడా ఇదే క్యాంపస్‌లో చదువుకోవడం విశేషం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో 'గ్యాంగ్ రేప్' నిందితులు?

అల్వాల్: బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను నేరేడ్‌మెట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న బాలిక (15)ను ప్రేమ పేరుతో నేరేడ్‌మెట్‌కు చెందిన విజయ్ కుమార్ తీసుకువచ్చి, మరో నలుగురు స్నేహితులతో కలిసి తరుచూ అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే కూతురు అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న తల్లి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసును నేరేడ్‌మెట్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో నేరేడ్‌మెట్ పోలీసులు ప్రధాన నిందితుడితోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. గంజాయికి బానిసైన నిందితులు బాధితురాలికి కూడా మత్తు అలవాటు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజిగిరి డీసీపీ, ఏసీపీలు మంగళవారం నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసు వివరాలు పరిశీలించారు.

వివాహేతర సంబంధం.. ఆపై వక్రబుద్ధి..

- యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. మూడిళ్లల్లో విషాదం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ యాదగిరి స్వామి

చాంద్రాయణగుట్ట: ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడమే కాకుండా ఆమె ఇద్దరు కూతుళ్లపై కన్నేయడంతోనే యువకుడి హత్యాఘటన చోటుచేసుకుందని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నుమా ఏసీపీ బి.యాదగిరి స్వామి, ఇన్‌స్పెక్టర్ కె.ఆదిరెడ్డితో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. రాజేంద్రనగర్ హసన్‌నగర్‌కు చెందిన డ్రైవర్ జాకీర్ అలీ(29) కుటుంబానికి సంబంధించిన స్థలాన్ని ఐదేళ్ల క్రితం ఫలక్‌నుమా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన షాహిన్‌బేగం(38) కొనుగోలు చేసింది. వీరి పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. షాహిన్‌బేగంకు భర్త హాజీ పాషా, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అయితే కొన్ని నెలల నుంచి జాకీర్ అలీ కన్ను షాహిన్ బేగం పెద్ద కూతురు, రెండో కూతురుపై పడింది. తన కూతుళ్లపట్ల అసభ్యంగా ప్రవర్తించవద్దని చెప్పినా వినకపోవడంతో విషయాన్ని ఆమె తన భర్తకు, తమ్ముడు మహ్మద్ షఫీ(31)కి తెలిపింది. ఈ క్రమంలో ఈ నెల 21న రాత్రి షాహిన్ బేగం ఇంటికి వచ్చిన జాకీర్‌పై షఫీ ఐరన్ రాడ్‌తో బాదాడు. అనంతరం గడ్డపారతో దాడి చేశాడు. తాడుతో ఉరేసి చంపాడు. ఈ ఘటపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు హాజీ, షఫీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, షాహిన్‌బేగం పరారీలో ఉంది. ఒక్కగానొక్క కొడుకు జాకీర్ హత్యతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరోవైపు షాహీన్ బేగం, హాజీ దంపతులపై కేసులతో ఐదుగురు పిల్లలు ఒంటరయ్యారు. షఫీ జైలుకెళ్లడంతో అతని భార్య, పిల్లలు కూడా ఆగం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కెమెరా కన్ను.. ఫెన్సింగ్ దన్ను

- హెచ్‌ఎండీఏ భూముల పరిరక్షణకు చర్యలు
- రూ.4.10 కోట్లతో మియాపూర్ భూముల రక్షణ
- అన్ని చోట్ల డిజిటల్ సర్వే, సెక్యూరిటీ పెంపు
- వివిధ ప్రాంతాల్లో 1,900 ఎకరాలకుపైగా భూముల గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ భూముల పరిరక్షణకు నడుంబిగించింది. మియాపూర్ భూముల కబ్జా ఉదంతం నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న హెచ్‌ఎండీఏ భూములపై నిఘా పెంచింది. డిజిటల్ సర్వే చేసి జియో ఫెన్సింగ్ ద్వారా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయనుంది. అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంతోపాటు, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో అధికారులు అనుసంధానం చేయనున్నారు. జియోఫెన్సింగ్‌కు అవకాశం లేని చోట సెక్యూరిటీ సిబ్బందిని పెంచి 24 గంటలపాటు పహారా ఏర్పాటు చేయనున్నారు. ఈ దిశగా ఇప్పటికే ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా డిజిటల్ సర్వే చేపట్టినట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. త్వరలోక్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి సీసీ కెమెరాలు, జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో మొత్తం 368 చిన్నవి, మరో 25 పెద్ద పార్సిళ్లు ఉన్నాయి. ఇప్పటికే పలుచోట్ల విలువైన భూములు కబ్జాకు గురైపోగా అన్నిచోట్ల కలిపి 1,900 ఎకరాలకుపైగా భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మియాపూర్‌తోపాటు, గాజుల రామారం వంటి శివారు ప్రాంతాల్లో భూములు కబ్జాకు గురవుతున్నాయి. గతంలో శంషాబాద్‌లోనూ ప్రైవేట్ వ్యక్తులు ఇదే తరహాలో ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. అధికారులు ఆలస్యంగా మేల్కొని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి రక్షణ చర్యలు చేపట్టారు. మరోసారి మియాపూర్‌లోనూ అదే తరహాలో భూముల కబ్జా పర్వం చోటుచేసుకోవడంతో యంత్రాంగం రంగంలోకి దిగింది. మియాపూర్‌తోపాటు అన్నిచోట్ల భూములను కాపాడేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో ఫెన్సింగ్

మియాపూర్‌లో హెచ్‌ఎండీఏకు 455 ఎకరాల భూమి ఉంది. ఇటీవల ఈ భూముల ఆక్రమణకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవడంతోపాటు పెద్ద ఎత్తున పోలీసు భద్రత ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ భూముల రక్షణపైనే అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. ఇందుకోసం సుమారు రూ.4.10 కోట్లతో చుట్టూ 8 కిలోమీటర్‌ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేసి 50 చోట్ల సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఈ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌తోపాటు కలెక్టరేట్, హెచ్‌ఎండీఏ కార్యాలయాలకు అనుసంధానం చేస్తారు. సెక్యూరిటీ సిబ్బందిని కూడా పెంచనున్నారు. ఆ తరువాత మరో 25 పెద్ద పార్సిళ్లలో భూముల రక్షణ చర్యలు చేపట్టనున్నారు. 'భూముల డిజిటల్ సర్వే కూడా వేగంగా కొనసాగుతోంది. త్వరలో క్షేత్రస్థాయి తనిఖీలు చేసి ఎడ్జ్‌లు, రిడ్జ్‌లు వంటివి గుర్తించి జియో ఫెన్సింగ్ చేస్తాం' అని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

నూర్‌నగర్‌లో సీవరేజీ పైపులైన్ పనులకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్..


సీవరేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

వెంకటేశ్వరకాలనీ: పెద్ద సైజు పైపుల వివాదంలో 'నిలిచిపోయిన సీవరేజీ పైప్‌లైన్ పనులు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన సమస్యల పట్ల వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, జలమండలి తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు స్పందించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని నూర్‌నగర్ బస్తీలో మసీదు ఎదురుగా రెండు వీధుల్లో సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణ నిమిత్తం రూ.20 లక్షలు మంజూరు కాగా 8 ఇంచుల పైప్‌లైన్ వేసేందుకు గత ఎన్నికలకు ముందు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అయితే ఇక్కడ 8 ఇంచుల పైప్‌లైన్ నిర్మాణంతో సమస్య పరిష్కారం కాదని, 12 ఇంచుల పైప్‌లైన్ వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తూ పనులను అడ్డుకున్నారు. అయితే ఇక్కడ సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టకపోవడంతో డ్రైనేజీ వీధుల్లో పారుతున్నదని, రోడ్డు మధ్యలో పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయని, డ్రైనేజీ నీరు గుంతల్లో నిలిచిపోయి దుర్గంధం, దుర్వాసనలతో స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారని 'సాక్షి' సమస్యను వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన కార్పొరేటర్, జలమండలి మేనేజర్ ఇద్దరూ గత రెండు రోజులుగా నూర్‌నగర్ బస్తీవాసులతో సంప్రదింపులు జరిపారు. ఇరుకైన ఈ గల్లీలో 12 ఇంచుల పైప్‌లైన్ వేయడానికి ఇంజినీరింగ్ ప్రణాళికలు అంగీకరించవని, రోడ్డు తవ్వడం కూడా సాధ్యం కాదని, ఇక్కడ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా 8 ఇంచుల పైప్‌లైన్ మాత్రమే వేయడానికి సాధ్యమవుతుందని టెక్నికల్ అంశాలను స్థానికులకు వివరించారు. దీంతో స్థానికులు ఒప్పుకుని పైప్‌లైన్ నిర్మాణానికి అంగీకరించారు. రెండు రోజుల పాటు కార్పొరేటర్ స్థానికులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో మంగళవారం కాంట్రాక్టర్ బస్తీలో సీవరేజీ పైపుల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను కార్పొరేటర్ కవితారెడ్డి, సెక్షన్ మేనేజర్ రాంబాబు దగ్గరుండి ప్రారంభించి పర్యవేక్షించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో అధికారుల పర్యటన


దీన్‌దయాళ్‌నగర్‌లో పర్యటిస్తున్న జలమండలి ఫిలింనగర్ సెక్షన్ మేనేజర్ పవన్‌కుమార్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఏబీఎస్ చౌరస్తా నుంచి దీన్‌దయాళ్‌నగర్ లోక్‌నాథ్ హోటల్ వరకు డ్రైనేజీ పైప్‌లైన్లలో పెద్ద ఎత్తున వ్యర్థాలు, మట్టి, చెత్తా చెదారం నిండిపోయాయని, ఇటీవల వర్షాకాలకు ఇక్కడి డ్రైనేజీ పొంగుతుందని స్థానికులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే జలమండలి ఫిలింనగర్ సెక్షన్ మేనేజర్ పవన్‌కుమార్‌తో మాట్లాడి పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను పరిశీలించి కారణాలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం సెక్షన్ మేనేజర్ పవన్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఇక్కడ పర్యటించారు. ఆరు ఫీట్ల ఈ పైప్‌లైన్‌లో పెద్ద ఎత్తున మట్టి కూరుకుపోవడంతో డ్రైనేజీ పొంగుతున్నట్లు గుర్తించారు. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణం ఆగిపోయిన చోట అంతే ఎత్తులో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మించి రెండు రోజుల్లో క్లియరెన్స్ ఇస్తామని మేనేజర్ హామీనిచ్చారు. దీంతో ఇక్కడ సమస్య పరిష్కారం అవుతుందని, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు రోడ్డు కూడా వేసుకునేందుకు అనుమతిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారుల వెంట దీన్‌దయాళ్‌నగర్ బస్తీ నాయకులు బస్వరాజ్, చందు, కృష్ణ, శ్రీకాంత్, డివిజన్ నాయకులు నాగేష్‌సాగర్, శంకర్, ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బొప్పారపు వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బంజారాహిల్స్: నాటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వ, నిరంకుశ ప్రభుత్వ నిర్బంధాలకు ఎదురొడ్డి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడిన వీరులను బీజేపీ నేతలు సన్మానించారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్ హాజరై ఆనాటి ఎమర్జెన్సీలో పాల్గొన్న నేతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భోజిరెడ్డి, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, నాయకులు కొత్త నీరజ, దండగుల శ్రీనివాస్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, అరుణ్‌కుమార్, బోయ రామాంజనేయులు, అనిల్‌కుమార్, శ్రీనివాస్‌చారి, ఆనంద్ సాగర్, కుబేరుడు, అరవింద్ పాల్గొన్నారు.


సన్మాన కార్యక్రమంలో బీజేపీ నాయకులు

నాలా నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి


సింగాడబస్తీలో నాలా పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి..

బంజారాహిల్స్: వీలైనంత త్వరగా నాలా నిర్మాణ పనులను పూర్తి చేయాలని వెంకటేశ్వర డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కోరారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని సింగాడబస్తీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న నాలా పనులను మన్నె కవితారెడ్డి పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నిర్మాణ పనుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. వర్షాలు పెద్ద ఎత్తున పడుతున్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ జీహెచ్‌ఎంసీ ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కున్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలి

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు


పోస్టర్ విడుదల చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు

హిమాయత్‌నగర్: నీట్ 2024 పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా దేశ వ్యాప్తంగా నష్టపోయిన విద్యార్థుల పక్షాన స్పందించని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్లక్ష్య వైఖరి నశించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యువజన, విద్యార్థి సంఘాలు నిరసన తెలిపాయి. ఈ మేరకు మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిరసన కార్యక్రమ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా హాజరైన నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మోదీ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మోదీ దిష్టిబొమ్మను రాష్ట్ర వ్యాప్తంగా దహనం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కేవలం ఎన్‌టిఏ డైరెక్టర్‌ను తొలగించడం కాదని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను సమూలంగా రద్దు చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పుతూ తిరిగి పరీక్షను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి అభిజిత్ యాదవ్, ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్ రెడ్డి, పి.డి.ఎస్.యు కార్యదర్శి శ్రీను, ఎ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లూరు ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలతో కార్పొరేట్ సంస్థలకే మేలు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, విస్సా కిరణ్

హిమాయత్‌నగర్: ప్రధాని మోదీ అవలంబిస్తున్న విధానాలు కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు జరిగేలా ఉంటాయని మాజీ ఎంపీ, వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆరోపించారు. రైతులకు మేలు జరగాలంటే మోదీ ప్రభుత్వం వెంటనే రైతు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కే.ఎం) కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర కల్పించాలని, ఎంఎస్పిని చట్టబద్ధత, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మోదీ దుర్మార్గపు చర్యలపై జులై 10న ఢిల్లీలో జరిగే సమావేశంలో అన్ని రైతు సంఘాలతో చర్చిస్తామన్నారు. రైతు ఉపశమనం కోసం చట్టం తీసుకుని రావాలని, దీంతో రైతుల ఆత్మహత్యలు తగ్గుతాయన్నారు. ఎస్.కే.ఎం రాష్ట్ర నాయకులు విస్సా కిరణ్ మాట్లాడుతూ రైతుల పట్ల ప్రధాని మోదీ పూర్తి నిర్లక్ష్యంగా ఉన్నారని, నామమాత్రంగా మద్దతు ధరలు పెంచుతున్నారని అన్నారు. రైతులకు మేలు చేసే ఉద్దేశం మోదీకి లేదని, రైతులకు న్యాయం చేయకపోతే దేశ వ్యాప్తంగా దీక్షలూ చేపడతామని వారు హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ రైతు రుణమాఫీని స్వాగతిస్తూ, రుణమాఫీకి సంబంధించి మార్గదర్శకాలు, జీవో విడుదల కోసం ఎదురు చూస్తున్నామని రైతు సంఘాలు తెలిపాయి. ఈ సమావేశంలో మురళీధర్ రెడ్డి, బి.కొండల్‌లు పాల్గొన్నారు.

రూ. 2 కోట్లు... 100 పైపులు



బంజారాహిల్స్‌లో భారీ మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం

- ప్రణాళికలు సిద్ధం చేసిన జలమండలి అధికారులు
- అర కిలోమీటర్ మేర పైప్‌లైన్ నిర్మాణం
- సుమారు 25 బస్తీలు, కాలనీలకు మేలు


మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం తీసుకొచ్చి పైపులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ల పరిధిలో వినియోగదారులకు మరింత మెరుగైన నీటి సరఫరా కోసం కొత్త పైపులైన్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. మెరుగైన నీటి సరఫరా కోసం భారీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం కాగా ఇప్పటికే పైపులు కూడా తీసుకొచ్చారు. ప్రస్తుతం బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మంచినీటి రిజర్వాయర్ నుంచి బంజారాహిల్స్‌రోడ్ నెం.10లోని బసవతారకం క్యాన్సర్ ఎదురుగా ఉన్న తట్టికాన వాటర్ సెక్షన్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తూ ఇక్కడి నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుంది. దీని వల్ల కరెంటు ఖర్చు కావడమే కాకుండా నీటి సరఫరా వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్య నుంచి బయటపడేందుకు ఇప్పుడు నేరుగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 72లోని ప్రశాసన్‌నగర్ రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా బంజారాహిల్స్‌రోడ్‌నెం. 12 అగ్రసేన్ చౌరస్తా, తెలంగాణ భవన్ మీదుగా తట్టికాన వాటర్‌సెక్షన్ వరకు 900 ఎంఎం డయా వాటర్ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

- ఇందుకుగానూ 550 మీటర్ల మేర వంద పైపులు వేసేందుకు రూ. 2 కోట్లు వ్యయం చేయనున్నారు. ప్రశాసన్‌నగర్ రిజర్వాయర్ నుంచి అగ్రసేన్ చౌరస్తా నాలుగేళ్ళ క్రితమే పైప్‌లైన్ నిర్మాణం జరిగింది. అయితే కొన్ని కారణాల వల్ల అగ్రసేన్ చౌరస్తా నుంచి తట్టికాన వాటర్ రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఇప్పుడు ఆ పనులను పాత కాంట్రాక్టర్‌తోనే జరిపించనున్నారు. ప్రస్తుతం తట్టికాన వాటర్ రిజర్వాయర్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం. 14 వరకు 600 ఎంఎం డయా, ఇక్కడి నుంచి ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్, ఇందిరానగర్ వరకు 450 ఎంఎం డయా పైప్‌లైన్‌తో నీటి సరఫరా జరుగుతున్నది.
- 900 ఎంఎం డయా పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే ఇటు బంజారాహిల్స్‌రోడ్ నెం. 14 వైపు, అటు బంజారాహిల్స్ రోడ్‌నెం. 2 ఎన్టీఆర్ భవన్, ఇందిరానగర్, సాగర్ సొసైటీ వరకు గ్రావిటీ ద్వారా నీటి సరఫరా మెరుగ్గా జరుగుతుంది. స్థానికులకు ఎక్కువ సమయం, ఎక్కువ నీళ్లు అందిస్తారు. నీటి సమస్య పూర్తిగా తగ్గుముఖం పడుతుంది.
- 900 ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తయితే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఏరియా, నందినగర్, వెంకటేశ్వరనగర్, నూర్‌నగర్, ఇబ్రహీంనగర్, గురుబ్రహ్మనగర్, జహీరానగర్, ఉదయ్‌నగర్, గౌరీశంకర్ కాలనీ, సింగాడబస్తీ, సింగాడికుంట, అంబేడ్కర్‌నగర్, ఇందిరానగర్, షౌకత్‌నగర్, ఓల్డ్ వెంకటేశ్వరనగర్, సాగర్ సొసైటీ తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరా మెరుగవుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం. 7 సెక్షన్ పరిధిలోను, తట్టికాన వాటర్ సెక్షన్ పరిధిలోనూ నీటి సరఫరాలో ఇబ్బందులు పూర్తిగా తగ్గిపోయి నిర్ణీత వేళల్లో నీటి సరఫరా జరిగేందుకు ఆస్కారం ఉంటుంది.
- త్వరితగతిన పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు జలమండలి అధికారులు తెలిపారు.
- అగ్రసేన్ చౌరస్తా నుంచి తెలంగాన భవన్ మీదుగా తట్టికాన సెక్షన్ వరకు సుమారు అరకిలోమీటర్ మేర ఈ భారీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నారు.


విలువైన వస్తువులు తీసుకొస్తానని..

- ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడి అదృశ్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కూతురు


బజరంగ్ ప్రసాద్ అగర్వాల్ (ఫైల్)

హిమాయత్‌నగర్: తన విలువైన వస్తువులు కుమారుడి ఇంటి వద్ద ఉన్నాయని కూతురు ఇంటి నుంచి బయలుదేరిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నారాయణగూడ అడ్మిన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పురాలోని డిఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో హంసాజైన్ తన భర్త కమలేష్‌తో నివాసం ఉంటుంది. హంసాజైన్ తండ్రి ప్రసాద్ అగర్వాల్ (75) ఇరవై రోజుల క్రితం ఆమె ఇంటికి వచ్చాడు. అంతకు ముందు రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని ఆమె సోదరుడు సురేష్ కుమార్ అగర్వాల్ ఇంట్లో ఉండేవారు. అయితే ఈ నెల 24న ప్రసాద్ అగర్వాల్ అతనికి సంబంధించిన విలువైన వస్తువులు అతని కుమారుడు సురేష్ కుమార్ ఇంట్లో ఉన్నాయని, వాటిని తీసుకుని వస్తానని ఇంటి నుంచి బయలుదేరారు. ఇంటి నుంచి వెళ్లిన ప్రసాద్ అగర్వాల్ తిరిగి రాకపోవడం, మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తండ్రి కోసం హంసాజైన్ బంధువులు, స్నేహితుల వద్ద ఆరాతీయగా ఫలితం లేకపోవటంతో నారాయణగూడ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అరెస్టు


పోలీసులు సీజ్ చేసిన ఇంజెక్షన్లు

హిమాయత్‌నగర్: అక్రమంగా మెఫెంటర్‌మైన్ ఇంజెక్షన్లు కలిగి ఉన్న వ్యక్తిని నగర సీసీఎస్ స్పెషల్ జోన్ క్రైమ్ టీమ్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. బండ్లగూడ అల్–జుబైల్ కాలనీకి చెందిన మహమ్మద్ షా ఫహద్ వద్ద అక్రమంగా మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు కలిగి ఉన్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు అతడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 190 ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం చార్మినార్ జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు అప్పగించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజారులో కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి. టమాట రూ.55, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 52, పందిరి బీర 45, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 21, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 28, దోసకాయ 23, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 35, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 35, అరటికాయ 9, మునగకాయ 4–5లుగా ధరలు ఉన్నాయి.

అకారణంగా భార్యాభర్తలపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా భార్యాభర్తలపై యువకులు దాడిచేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఆయేషా మహ్మద్, ఆబీద్ మహ్మద్ రహమత్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 22వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో అర్షద్ విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. ఆబీద్ మహ్మద్ ఎలక్ట్రిషియన్‌ను పిలిపించగా అర్షద్ అతనిని బెదిరించి పంపాడు. మరో ఎలక్ట్రిషియన్‌ను పిలిపించి ముందు జాగ్రత్త చర్యగా ఆయేషా తన ఫోన్‌లో వీడియో తీస్తుండగా అర్షద్‌తో పాటుగా జావెద్ అనే యువకుడు కూడా వచ్చి భార్యాభర్తలపై దాడి చేశారు. ఈ దాడిలో ఇరువురు గాయపడ్డారు. అనేక రోజులుగా కావాలనే ఈ విధంగా హింసిస్తున్నారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆయేషా మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాబర్ ఉత్పత్తుల అమ్మకాల పేరుతో మోసం

వెంగళరావునగర్: డాబర్ ఉత్పత్తుల అమ్మకాల పేరుతో ఆన్‌లైన్‌లో యువతి వద్ద నుంచి నగదు తస్కరించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కె.మమత అనే మహిళ వెంగళరావునగర్‌లో నివాసం ఉంటూ మియాపూర్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. ఇటీవల ఆమెకు వాట్సప్ ద్వారా మెసేజ్ వచ్చింది. తనపేరు నేహా అని డాబర్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా విధులు నిర్వహిస్తున్నట్టుగా పరిచయం చేసుకుంది. ఆన్‌లైన్‌లైన్‌లో డాబర్ ఉత్పత్తులు అమ్మకాల ద్వారా అధికంగా కమిషన్ తీసుకోవచ్చని నమ్మబలికింది. దీంతో ఆమె రూ.100లో రిజిస్ట్రేషన్ చేయించుకుంది. డాబర్ ఉత్పత్తులను పంపడానికి ఈనెల 20న రూ.1100 ఒకసారి వెంటనే రూ.600 నగదు పంపాలని తెలియజేసింది. మమత ఆ నగదును ఆన్‌లైన్ ద్వారా పంపడం జరిగింది. ఉత్పత్తులను విక్రయించుకోవచ్చని, మెంబర్‌ను అయినట్టుగా తెలియజేస్తూ వెంటనే ఆమెకు రూ.1700 తిరిగి పంపారు. మరుసటి రోజు కూడా నగదు పంపాలని ఆమె నుంచి దాదాపు రూ.75,450 రూపాయలను తీసుకున్నారు. అయితే ఆమెకు డాబర్ ఉత్పత్తులుగాని, నగదుగాని రాలేదు. వాటిని తనకు పంపాలని కోరింది. నాలుగురోజులైనా తిరిగి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాల్మీకుల సంక్షేమానికి పాటుపడాలి

లిబర్టీ: ఆర్థికంగా చితికిపోయి దుర్భర జీవితాలు సాగిస్తున్న వాల్మీకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వాల్మీకి సేవా సమాజ సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాజంలోని వివిధ సామాజిక వర్గాల కోసం ప్రభుత్వాలు పలు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని వాల్మీకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఇప్పటి వరకు లేదని ఆయన అన్నారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వృత్తిని నమ్ముకొని బతుకుబండి లాగుతున్న వాల్మీకులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా సంస్కృతి పరంగా అన్ని సామాజిక వర్గాల కంటే వెనుకబడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సంప్రదాయ వృత్తిని చిన్నచిన్న సులభ కాంప్లెక్స్ ఏర్పాటు చేసుకొని బతుకు సాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో లక్షలాది మంది వాల్మీకుల జీవన ప్రమాణాల్లో జీవన స్థితిగతుల్లో మార్పు నోచుకోక తమ జీవితాలను సాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తీసుకొని వాల్మీకుల ఆర్థిక ప్రగతి సంక్షేమం సామాజిక అభివృద్ధి కోసం రూ. 500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వారు ఆర్థికంగా ముందడుగు వేస్తారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వాల్మీకులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని దళిత బంధు పథకాన్ని వాల్మీకుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భర్త, కొడుకుపై డ్రగ్స్ కేసు అంటూ ఫోన్...

- సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టిన మహిళా ప్రొఫెసర్
- అప్రమత్తమై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

హిమాయత్‌నగర్: నీ భర్త, కుమారుడిపై డ్రగ్స్ కేసు నమోదయిందంటూ సైబర్ నేరగాళ్లు ఓ మహిళా ప్రొఫెసర్‌ని మోసం చేసే ప్రయత్నం చేశారు. ఇది సైబర్ కేటుగాళ్ల పనే అని అప్రమత్తమైన ఆమె వెంటనే భర్తకు ఫోన్ చేసి వారికి చెక్ పెట్టింది. నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన మహిళా ప్రొఫెసర్‌కు మంగళవారం ఉదయం సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. సీబీఐ అధికారులమని నీ భర్త, కుమారుడిపై డ్రగ్స్ కేసు నమోదు అయిందని భయపెట్టారు. రూ. 50 వేలు చెల్లిస్తే కేసు లేకుండా చేస్తామని చెప్పారు. లేదంటే భర్త కుమారుడు జైలుకు పంపుతామని బెదిరించారు. ఫోన్ మాట్లాడుతుండగా మధ్యలో కట్ చేయవద్దని, కుటుంబ సభ్యులకు, బంధువులకు కాల్ చేయవద్దని హెచ్చరించారు. అయినా అప్రమత్తతో భర్త సత్య జనార్ధన్ (సెంట్రల్ జోన్ విలేఖరి)కు కాల్ చేసింది. విషయం చెప్పగా ఇది సైబర్ నేరగాళ్ల కుట్ర అని తెలుసుకుని వారి మోసం నుంచి బయటపడ్డారు. వెంటనే నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు

భయంతో పరుగులు తీసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీ బస్టాపు ఎదురుగా ఉన్న భవనం పార్కింగ్ స్థలంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పార్కింగ్ స్థలంలో దట్టమైన పొగ, వెనువెంటనే మంటలు చెలరేగడంతో ఆ భవనంలోని సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన ఉద్యోగులు భయంతో బయటకు పరుగులు తీశారు. కొంతకాలంగా ఆ స్థలంలో చెత్త, ఉపయోగించని వస్తువులను డంప్ చేసి వదిలేశారు. అయితే ఆ చెత్త నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగ, మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మంటలు ఎలా అంటుకున్నాయనే విషయంపై స్పష్టత రాలేదు. ఎవరైనా ఆకతాయి సిగరెట్ తాగి పడవేశాడా? లేక షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇక్కడి వేస్ట్ మెటీరియల్‌కు వ్యాప్తి చెందిందా? అనేది తెలియాల్సి ఉంది.

ఫ్యాబ్ ఇండియా షాపింగ్ కాంప్లెక్స్‌లో...

జూబ్లీహిల్స్ రోడ్ నెం.36 పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్ పక్కన ఉన్న ఫ్యాబ్ ఇండియా షాపింగ్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. మంగళవారం సాయంత్రం భవనం మొదటి అంతస్తు నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు బయటకు రావడాన్ని గమనించిన స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ అధికారులు ఫ్యాబ్ ఇండియా మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం సంభవించినట్లు గుర్తించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనతో ఫ్యాబ్ ఇండియాతో పాటు ఇదే భవనంలో కొనసాగుతున్న మరో రెండు సంస్థల ఉద్యోగులు, సిబ్బందిని అధికారులు బయటికి పంపించి వేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు నాగిళ్ల నవీన్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాదాపు పదేళ్ల కాలంలో అనేక ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. లిబర్టీ సమీపాన ఉన్న లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 నాటికి తెలంగాణలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్షపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటి నిర్ధారించిందని ఆయన గుర్తు చేశారు. గడిచిన పదేళ్ల కాలంలో పదవి విరమణలతో మొత్తం వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి చొరవ చూపి దశలవారీగా వీలైతే ఏకకాలంలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఉపాధి లేక ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. గ్రూప్–1,2,3,4 పోస్టుల భర్తీకి పూర్తిస్థాయిలో ఏకకాలంలో నోటిఫికేషన్ జారీ చేసేలా ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

బంగారు ఆభరణాలు మాయం

వెంగళరావునగర్: అల్మరాలో దాచిన బంగారు ఆభరణాలు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎం.కల్పన కుటుంబ సభ్యులు గత కొన్నేళ్ళుగా రహమత్‌నగర్‌లోని సంతోషిమాత నిలయంలో నివాసం ఉంటున్నారు. మే నెల 31వ తేదీన కల్పన ఓ ఫంక్షన్‌కు తన నగలు వేసుకుని వెళ్ళి రాత్రికి తిరిగి వచ్చి ఆభరణాలు తీసి అల్మరాలో పెట్టింది. ఇంటి తాళాలు షూ రాక్‌లో పెట్టి కల్పన, భర్త విధులకు వెళ్లారు. మళ్లీ ఈనెల 24వ తేదీ తన స్నేహితురాలు వివాహానికి వెళ్ళేందుకు అల్మరాను తెరిచింది. అయితే అందులో ఉండాల్సిన ఆభరణాలు కనిపించలేదు. వాటి విలువ దాదాపు రూ.90 వేలు ఉంటుంది, చుట్టుపక్కల విచారించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బాధితురాలు కల్పన మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ కోసం దరఖాస్తు చేస్తే...

న్యూడ్ ఫొటోలు సోషల్‌మీడియాలో పెడతానని వేధింపులు

వెంగళరావునగర్: లోన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అధిక నగదు పంపాలని లేదంటే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియలో పెడతానని యువకుడిని వేధిస్తున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... ఎల్లారెడ్డిగూడకు చెందిన ఎస్.గుర్మీత్ సింగ్ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. లోన్ కోసం ఈనెల 17న స్కోర్ ఎనలైజర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అతని ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు అందులో పొందుపరిచాడు. అయితే రూ.6 వేలు మాత్రమే ఇస్తానని చెప్పడంతో దానిని అదేరోజు డిలీట్ చేశాడు. అయితే అతని అకౌంట్‌కు రూ.3600 చొప్పున రెండు సార్లు ఆన్‌లైన్ నుంచి పంపారు. ఈనెల 22న వాట్సాప్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి రూ.6వేలు పంపాలని లేనిపక్షంలో ఫొటోలు మార్ఫింగ్ చేసి న్యూడ్‌గా సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. దీంతో అతను 22,800 పంపాడు. అయినప్పటికీ ఇంకా డబ్బులు కావాలని వేధిస్తున్నారు. విసుగుచెందిన బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోగాలతో సుస్తీ.. అవస్థలతో కుస్తీ..





నగరంలోని పేట్లబురుజు ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. ఏడాదిపాటూ రోగులతో కిటకిటలాడే ఈ ఆస్పత్రిలో సౌకర్యాలు మాత్రం కరువయ్యాయి. దీంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు చుక్కలు కనిపిస్తున్నాయి. నగరంతో పాటు ఇతర జిల్లాల నుంచి ఇక్కడి వచ్చే వారికి మురుగు, చెత్తా చెదారం స్వాగతం పలుకుతున్నాయి. గర్భిణులు, చిన్నపిల్లలకు ఇన్‌ఫెక్షన్లు త్వరగా సోకే ప్రమాదం ఉన్నా అక్కడ శుభ్రతపాటించడంలో ఆస్పత్రి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆస్పత్రి అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. వైద్య సేవల్లో ఆలస్యం కారణంగా పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు ఆస్పత్రి ఆవరణలో మెట్లపైనా.. పార్కింగ్ ప్రాంతంలో గంటల తరబడి ఎదురుచూస్తే దుస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్



పీఎం పదవి కోసమే.. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న సీహెచ్ విద్యాసాగర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రధానమంత్రి పదవి కోసమే నాడు ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని విధించిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో నియంతృత్వం, నిరంకుశత్వం ఎమర్జెన్సీ చీకటి రోజులు అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఏబీవీపీ మాజీ అధ్యక్షుడు ప్రొ.శంకర్ అధ్యక్షత వహించగా మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమర్జెనీ సమయంలో తాను అనుభవించిన జైలు జీవితంతో పాటు అనేక అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు డా.రామకృష్ణ, పృథ్వి, ఝాన్సీ, కల్యాణి, శ్రీహరి, జీవన్, కమల్, సురేష్, సుమన్ శంకర్, రాజు, తోట శ్రీనివాస్, సాయి, గణేష్, దృహన్, హరిప్రసాద్, శివశంకర్, విక్రమ్, రాహుల్, రేవంత్ పాల్గొన్నారు.

అనుమతులు లేని గోదాములపై దాడులు



ఆహార ప్యాకెట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

అల్వాల్: అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న గోదాములపై అల్వాల్ జీహెచ్ఎంసీ అధికారులు, ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నారు. అల్వాల్, దమ్మాయిగూడలోని దేవత ఎంటర్‌ప్రైజెస్ గోదాములో మంగళవారం సోదాలు నిర్వహించగా.. గడువు ముగిసిన లైసెన్స్‌తో కూడిన ప్యాకింగ్ చేస్తున్న ఆహార పదార్థాలను గుర్తించారు. కిరాణా దుకాణాలకు అవసరమైన అవాలు, జీలకర్ర, సబ్జా విత్తనాలు వంటి ఆహార పదార్థాలను ప్యాకింగ్ చేస్తూ చుట్టుపక్కల ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. గోదాముకు బోర్డు పెట్టకుండా నాగారం మున్సిపాలిటీలోని దమ్మాయిగూడ పేరుతో ఓ లైసెన్స్ తీసుకుని జీహెచ్ఎంసీ పరిధిలోని అల్వాల్, దమ్మాయిగూడలో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఎలాంటి పరిశుభ్రత పాటించకపోవడం, ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు లేకపోవడం వంటివి అధికారులు పరిశీలించారు. ఈ మేరకు సుమారు రూ.లక్ష విలువైన ఆహార పదార్థాలను సీజ్ చేశామని అల్వాల్ సర్కిల్ ఆహార భద్రత అధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. సీజ్ చేసిన పదార్థాలను నాచారంలోని ల్యాబ్‌కు పంపామన్నారు.

సమర్థుడైన అధికారి హేమంత్ కేశవ్

- వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ అనుదీప్



హేమంత్ కేశవ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: అందరినీ సమన్వయం చేసుకుంటూ మంచి పనితీరుతో సమర్థుడైన అధికారిగా పాటిల్ హేమంత కేశవ్ పేరు తెచ్చుకున్నారని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కొనియాడారు. హైదరాబాద్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) పాటిల్ హేమంత కేశవ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయిన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన ఏకైక వ్యక్తి హేమంత్ కేశవ్ పాటిల్ అని, నల్గొండ జిల్లా నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కూడా చేశారన్నారు. సూర్యాపేట అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్ గానూ సమర్థవంతమైన సేవలు అందించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సికింద్రాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అద్భుతంగా పనిచేసి అందరి మన్ననలను పొందారన్నారు. అనంతరం పాటిల్ హేమంత కేశవ్‌ను శాలువా, పూలబొకేతో సత్కరించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు, యాదయ్య, ఆశన్న, కోటిజీ, కలెక్టరేట్ ఏవో సదానందం, రాములు, జహీరుద్దీన్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై ఫోకస్

ప్రతి జోన్‌కు ఒక సైబర్ పీఎస్!

- మహిళా పోలీసు స్టేషన్ కూడా..
- అదనంగా 10-15 ట్రాఫిక్ పీఎస్‌లు
- వచ్చే పదేళ్ల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు
- 'సాక్షి'తో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి





అవినాష్ మహంతి, సైబరాబాద్ సీపీ

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్‌లో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. విద్యావంతులు, గృహిణులు, ఉద్యోగస్తులు, సామాన్యులు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ సైబర్ నేరస్తుల వలలో చిక్కి విలవిల్లాడిపోతున్నారు. దీంతో సైబర్ నేరాల నియంత్రణకు పోలీసు కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించింది. వచ్చే పదేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త ఠాణాల ఏర్పాటు, నవీకరణ, సిబ్బంది నియామకం తదితర ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు కమిషనర్ అవినాష్ మహంతితో 'సాక్షి' ఇంటర్వ్యూలోని పలు అంశాలివే..

జోన్‌కు ఒక సైబర్ ఠాణా, ఉమెన్ పీఎస్..

ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో ఒకటే సైబర్ పోలీస్‌స్టేషన్, ఉమెన్ పీఎస్ ఉంది. ప్రతి జోన్‌లో ఒక సైబర్, మహిళా ఠాణాను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. మాదాపూర్, బాలానగర్, శంషాబాద్, మేడ్చల్, రాజేంద్రనగర్‌లలో జోన్‌కు ఒకటి చొప్పున ఐదు సైబర్ పీఎస్‌లతో పాటు అదనంగా 200-250 మంది సిబ్బంది అవసరం ఉంది. అలాగే ప్రతి జోన్‌లోనూ ఒక మహిళా పోలీసు స్టేషన్ అవసరం. ఆయా ఠాణాల్లో కౌన్సిలింగ్‌తో పాటు వరకట్నం, గృహహింస, వేధింపులు వంటి కేసుల నమోదు, దర్యాప్తులుంటాయి. అలాగే శరవేగంగా విస్తరిస్తున్న సైబరాబాద్‌లో ట్రాఫిక్ నిర్వహణకు మరో 10-15 ఠాణాలు అవసరం. కొత్త ట్రాఫిక్ సిబ్బంది, ఠాణాల ఏర్పాటుపై ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం.

రూటు మార్చిన డ్రగ్ పెడ్లర్లు..

ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, నిర్మాణ కార్మికులు, ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉంటాయి. దీంతో స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా సైబరాబాద్‌లో ఎక్కువగా ఉంటారు. దీంతో ఇక్కడ మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం ఎక్కువగానే ఉంటుంది. దీంతో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో గంజాయి, ఎండీఎంఏ, కొకైన్ వంటి మత్తు పదార్థాల రవాణా జరిగేది. పోలీసుల తనిఖీలలో పట్టుబడితే పెద్ద మొత్తంలోనే సరుకు, నగదు నష్టం జరుగుతుండటంతో నేరస్తులు రూటుమార్చారు. ఒకేసారి కిలోల చొప్పున కాకుండా గ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లలో డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. దీంతో కొంతకాలంగా డ్రగ్స్ కేసుల్లో పట్టుబడుతున్న సరుకు కొంత మొత్తంలోనే ఉంటోంది. డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు క్లబ్‌లు, పబ్‌లు, హోటళ్లు, ఫామ్‌హౌజ్‌లతో పాటు విద్యా సంస్థలు, కార్యాలయాలపై కూడా నిఘా పెట్టాం. ఇన్‌ఫార్మర్ల వ్యవస్థను బలోపేతం చేశాం.

కెమెరాలతో రాంగ్‌సైడ్ డ్రైవింగ్ గుర్తింపు..

5 శాతం వాహనదారులు చేసే పొరపాట్లతో 95 శాతం వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అందుకే ప్రత్యేక దృష్టిసారించారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్, నో పార్కింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. 130కు పైగా ప్రాంతాల్లో ఎక్కువ రాంగ్ సైడ్ డ్రైవింగ్ జరుగుతున్నట్లు గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఏర్పాటు చేశాం. వీటితో ఈ-చలాన్లను జారీ చేస్తున్నాం.

గూడ్స్ వాహనాలు ఫ్లైఓవర్లు ఎక్కొద్దు

సైబరాబాద్ కమిషనరేట్‌లోని ఫ్లైఓవర్ల పైకి ఎలాంటి వాణిజ్య, సరుకు రవాణా వాహనాలు ఎక్కకూడదు. ఎందుకంటే చాలా వరకు గూడ్స్ వాహనాల కాలం చెల్లినవి, నిర్వహణ సరిగా ఉండవు. పైగా అధిక లోడ్‌తో ప్రయాణిస్తుంటాయి. దీంతో ఫ్లైఓవర్‌పై అకస్మాత్తుగా వాహనం ఆగిపోతే ఇక ఆ రోడ్డు మొత్తం బ్లాక్ అయిపోతుంది. రెండు మూడు గంటల పాటు నరకం ఉంటుంది. అందుకే గూడ్స్ వాహనాలను ఫ్లైఓవర్‌పైకి అనుమతించడం లేదు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఉల్లంఘనలు పునరావృతమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు వాహన యజమానిపై కూడా చర్యలు తీసుకుంటాం.

వారంలో ఒక రోజు మెగా డీడీలు చేపడుతున్నాం. వందల సంఖ్యలో ట్రాఫిక్ పోలీసులతో ప్రధాన రహదారులంతటా డీడీలు నిర్వహిస్తాం. మద్యం సేవించి వాహనం నడిపే ఏ ఒక్కరూ తప్పించుకోలేరు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



మియాపూర్ భూములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె.శశాంక తదితరులు

మియాపూర్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక హెచ్చరించారు. మియాపూర్‌లోని సర్వే నంబర్ 100, 101లోని హెచ్ఎండీఏ భూములను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మియాపూర్‌లోని 100, 101లోని హెచ్ఎండీఏ భూమిలో గుడిసెలు వేసేందుకు వచ్చి ఆందోళన చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. 100, 101 సర్వే నంబర్‌లోని హెచ్ఎండీఏ భూమిలో ఆక్రమణలను తొలగించి కంచె ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూమి చుట్టూ కంచె ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ భూమి చుట్టూ సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారి వీరారెడ్డి, హెచ్ఎండీఏ ఆర్డీవో సుదర్శన్, శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి, ఏసీపీ నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్ దుర్గారామలింగప్రసాద్, హెచ్ఎండీఏ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్స్

జీడిమెట్ల/జగద్గిరిగుట్ట: ఒకే రోజు రెండుచోట్ల చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పీఎస్‌ల పరిధిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనలో 3 తులాల బంగారం దొంగిలించి చైన్ స్నాచర్లు పోలీసులకు సవాలు విసిరారు. వివరాలు.. జీడిమెట్ల పీఎస్ పరిధిలోని హెచ్ఏఎల్ కాలనీలోని ఓ యువతి(18) రోడ్డుపై వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి ఆ యువతి మెడలో నుంచి చైన్‌ను దొంగిలించడానికి ప్రయత్నించాడు. అదే సమయంలో ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో మెడలోని గొలుసు తెగి కిందపడిపోయింది. ఇంతలోనే ఆమె గట్టిగా అరవడంతో చైన్ స్నాచర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో..

జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలోని ఉషోదయ కాలనీలో మరో స్నాచింగ్ జరిగింది. స్థానికంగా ఉండే శివజ్యోతి(54) అనే మహిళ మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో దగ్గరలోని గుడికి వెళ్తున్న సమయంలో పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు ఆమె మెడలోని 3 తులాల బంగారం చైన్‌ను దొంగిలించి పరారయ్యాడు. ఆ మహిళ తేరుకుని అరిచే లోపే చైన్‌స్నాచర్ కనిపించకుండా పారిపోయాడు. ఇలా ఒకేరోజు రెండు పీఎస్‌లలో చైన్ స్నాచర్‌లు హల్‌చల్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రకటన చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశంలో దేశంలో సామాజిక రిజర్వేషన్లపై ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీలో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దోమలగూడలోని బీసీ భవన్‌లో మాజీ ప్రధాని వీపీ సింగ్ 93వ జయంతి సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో మండల కమిషన్ సిఫారసులను మొదటిసారిగా అమలు చేసి ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత మాజీ ప్రధాని విశ్వనాథ ప్రతాప్‌సింగ్‌కే దక్కుతుందని ఆయన కొనియాడారు. పదేళ్ల బీజేపీ పాలన దేశంలో బీసీలకు చీకటి పాలన అన్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ఎవరు ప్రధానమంత్రి అయినా బీసీలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచకుండా, బడ్జెట్ కేటాయింపు లేకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడినందున బీజేపీ ప్రభుత్వానికి మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజార్టీ రాకుండా 240 సీట్లకే పరిమితం అయ్యిందని తెలిపారు. బీసీలకు తక్షణమే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించకపోతే దేశవ్యాప్తంగా మరో మహా మండల్ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపడుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్, బీసీ నేతలు బూడిద మల్లికార్జున యాదవ్, పానుగంటి విజయ్, మాదే శిరాజేందర్, వీరమల్లకార్తిక్, ప్రవీణ్ యాదవ్, జాజుల భాస్కర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



వీపీ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఏ వాహనం ఎటు పోతుందో?

- కేవలం మదీనా వద్ద మాత్రమే ఏర్పాటు
- ప్రధాన రోడ్లలో సైతం కనిపించని సిగ్నల్స్
- వాహనదారులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు





సిటీ కాలేజీ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేక అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

చార్మినార్: నగరంలోని ఉత్తర మూసి ప్రాంతం నుంచి దక్షిణ మూసి ప్రాంతంలోకి నయాపూల్ బ్రిడ్జి ద్వారా ప్రవేశించి ముందుకెళ్లే వారికి కేవలం మదీనా చౌరస్తా వద్ద మాత్రమే సిగ్నల్స్ అందుబాటులో ఉన్నాయి తప్ప.. పాతబస్తీలో అవసరం మేరకు పూర్తిస్థాయిలో ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేవు. ఇక సాలార్‌జంగ్ బ్రిడ్జి నుంచి దారుషిఫా చౌరస్తా ద్వారా చార్మినార్, చాంద్రాయణగుట్ట తదితర పాతబస్తీలోని ప్రధాన ప్రాంతాలకు వెళ్లే రోడ్డులో దారుషిఫా నుంచి ఎక్కడా సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులో లేదు. ఈ రూట్‌లో చార్మినార్ అవుటర్ రింగ్ ఉన్నప్పటికీ.. సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులో లేదు. ఎవరు ఎటువైపు నుంచైనా దూసుకెళ్లొచ్చు. దీంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిబంధనలను పాటించని వాహనదారులను కట్టడి చేయడానికి పాతబస్తీలో ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరం ఎంతో ఉంది. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించడం లేదని సర్వత్రా ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల సరిహద్దుల్లో ఈ సమస్య మరింత జఠిలంగా తయారైంది. ఏళ్లు గడుస్తున్నా.. పాతబస్తీలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులో తేకపోవడంతో తామంతా ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నామని పాతబస్తీ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికీ.. దాన్ని వినియోగంలోకి తీసుకురాలేదు.

సిటీ కాలేజీ నుంచి చౌమహల్లా రోడ్డులో..

నిత్యం రద్దీగా ఉండే సిటీ కాలేజీ చౌరస్తా నుంచి మూసాబౌలీ చౌరస్తా ద్వారా మోతీగల్లీ రోడ్డులో ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయలేదు. ఈ రూట్‌లో ఓ ప్రైవేటు స్కూల్, హోటల్, వస్త్ర దుకాణాలుండటం.. వాటి ముందు వాహనాల పార్కింగ్ అడ్డదిడ్డంగా ఏర్పాటు చేస్తుండటం.. వాటిని సంబంధిత పోలీసులు పట్టించుకోకపోవడంతో పాటు ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేవు. దీంతో సమస్యలు వస్తున్నాయి. పర్యాటకులు చౌమహల్లా ప్యాలెస్ వెళ్లడానికి ఇది ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ రోడ్డుతో పాటు పురానాపూల్ చౌరస్తా, మూసాబౌలి చౌరస్తా, మోతీగల్లి, ఖిల్వత్ చౌరస్తా, లాడ్‌బజార్ చౌరస్తా తదితర ప్రధాన రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటున్నందున ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్నాయి.

దారుషిఫా నుంచి బీబీబజార్ చౌరస్తా వరకు..

దారుషిఫా చౌరస్తాతో పాటు దారుషిఫా నుంచి బీబీబజార్ చౌరస్తా వరకు గల ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అప్పుడప్పుడు గంటల తరబడి వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోతున్నాయి. పురానీహవేలి, మీరాలంమండి, మీర్‌చౌక్, ఎతేబార్‌చౌక్, బీబీబజార్ తదితర కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా ప్రయాణిస్తున్నారు. విధి నిర్వహణలో అప్పుడప్పుడు సంబంధిత ట్రాఫిక్ పోలీసులు కూడా అందుబాటులో లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

స్వేచ్ఛను హరించిన ఎమర్జెన్సీ

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన నేతలను సత్కరిస్తున్న లక్ష్మణ్

కాచిగూడ: దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీతో దేశంలోని ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ లక్ష్మణ్ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన అప్పటి నేతలను అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల స్వేచ్ఛను నాటి ప్రభుత్వం కాలరాసిందని ఆరోపించారు. కాంగ్రెస్ చరిత్రలో ఎంతోమంది ప్రాణాలను బలి తీసుకుందన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ వంటి వారు ఎమర్జెన్సీ గురించి ఎందుకు మాట్లాడటం లేదని, దేనికోసం నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. కమ్యూనిస్టులు ఎమర్జెన్సీని సమర్థించారని, వారిని చరిత్ర క్షమించదన్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్, సి.నందకిషోర్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఎ.అజయ్‌కుమార్, అరవింద్, శ్యామ్‌రాజ్, సుభాష్ పటేల్, సురేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఆస్తులు డిజిటలైజేషన్ చేయాలి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆస్తులను డిజిటలైజేషన్ చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ జీహెచ్ఎంసీ ఆస్తుల గురించి ఎస్టేట్స్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఆస్తుల ద్వారా ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన ఓపెన్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తులను ఆయా కేటగిరీలుగా విభజించి, వివరాలు అందజేయాలని కోరారు. అద్దెలు సక్రమంగా వసూలవుతున్నదీ లేనిదీ తెలిసేలా, లీజ్ గడువుకు ముందస్తుగా సంకేతాలు అందేలా ఆన్‌లైన్‌లో ఏర్పాట్లు చేయాలన్నారు. కమ్యూనిటీ భవనాలు ఎన్ని ఉన్నాయో, వాటిని ఏ అవసరాలకు వాడుతున్నారో పూర్తి నివేదిక అందజేయాలన్నారు. మోడల్ మార్కెట్లు, మున్సిపల్ మార్కెట్ల మడిగెల వివరాలు, వినియోగిస్తున్న వ్యాపారుల వివరాలు అందజేయాల్సిందిగా ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఎస్టేట్స్‌కు సంబంధించి పూర్తి వివరాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్టేట్స్ అడిషనల్ కమిషనర్ కె.శ్రీవాత్సవ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ అనుదీప్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా చూడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యులకు సూచించారు. నగరంలోని అమీర్‌పేట్ ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను, ఓపీ, ల్యాబ్, ఐసీయూ యూనిట్, మెటర్నిటీ, భోజనశాల వార్డులు, ఆక్సిజన్ యూనిట్, క్యాంటీన్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, రోగులతో, బాలింతలతో ముచ్చటిస్తూ వారికి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో డెలివరీస్ మరిన్ని పెరిగేలా వైద్యులు చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను నమోదు చేయాలని, ఆరోగ్యశ్రీ కిట్లను అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి ఆవరణ, భోజనశాల, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి పనివేళల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకట్, అమీర్‌పేట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాఫ్, సివిల్ సర్జన్ డాక్టర్ దశరథ్, డాక్టర్ మహేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరి టెంపుల్‌కు సిటీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి టెంపుల్‌కు వెళ్లే భక్తుల సౌకర్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేందుకు చర్యలు చేపట్టింది. బుధవారం నుంచి ఈ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. 2 ఎలక్ట్రానిక్ మెట్రో నాన్ ఏసీ బస్సులు జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి ఉప్పల్ రింగ్‌రోడ్డు మీదుగా స్వర్ణగిరికి రాకపోకలు సాగిస్తాయి. ప్రతిరోజూ జేబీఎస్ నుంచి ఉదయం 7, 8, మధ్యాహ్నం 2.50, 3.50 గంటలకు బయలుదేరతాయి. స్వర్ణగిరి నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం 12.10 గంటలు, 1.10 గంటలు, రాత్రి 8 గంటలకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. టిక్కెట్ చార్జీ జేబీఎస్ నుంచి రూ.100, ఉప్పల్ నుంచి రూ.80 చొప్పున ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.


జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌కు మణిశంకర్



కట్ట మణిశంకర్

గోల్కొండ: జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కార్వాన్ సబ్జిమండికి చెందిన కట్ట మణిశంకర్ ఎంపికయ్యారు. వరుసగా ఐదోసారి మణిశంకర్ ఎంపిక కావడం గమనార్హం. ఈ నెల 28వ తేదీ నుంచి తమిళనాడులోని సేలమ్‌లో ప్రారంభం కానున్న జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో మణిశంకర్ తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రగతి మహా విద్యాలయకు చెందిన ఆయన గతంలో అంతర్ యూనివర్సిటీల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికై బంగారు పతకాలను సాధించారు. గత సంవత్సరం జరిగిన చాంపియన్‌షిప్ 80 కేజీల విభాగంలో సైతం గంగపుత్ర సంఘం సబ్జిమండి వీరాభిమన్యు వ్యాయామశాలకు చెందిన మణిశంకర్ చాంపియన్‌గా అవతరించాడు. ఈసారి కూడా స్వర్ణ పతకం సాధించడం తన లక్ష్యమని మంగళవారం ఆయన తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్,
బుధవారం, 26, జూన్, 2024



'అల్లూరి' ప్రీమియర్ షో

రవీంద్రభారతిలో 28న ప్రదర్శన

'మన్యం వీరుడు- అల్లూరి సీతారామరాజు' ప్రీమియర్ షో ఈనెల 28న రవీంద్రభారతిలో జరగనుంది. రాత్రి 7 గంటలకు ఈ ప్రదర్శన ఉంటుంది. కేంద్ర సాంస్కృతిక శాఖ, శంకరానంద కళాక్షేత్రం ఆధ్వర్యంలో డ్యాన్స్ థియేటర్ ప్రొడక్షన్‌లో దీన్ని రూపొందించారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణి, రచయిత్రి ఆనంద శంకర్ జయంత్ దర్శకత్వం వహించారు. దేశంలోని గొప్ప స్వాతంత్ర్య సమర యోధుల్లో ఒకరైన అల్లూరి జీవితాన్ని ఆవిష్కరించేందుకు ఈ ప్రయత్నం చేశామని రూపకర్తలు తెలిపారు. డ్యాన్స్ థియేటర్ నిర్మించిన ఈ జీవిత కథ 45 నిమిషాలు ఉంటుంది.

'రానా' లోకాలోకా టెకీలా...



టాలీవుడ్ స్టార్ రానా దగ్గుబాటి, సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్, హర్షా వడ్లమూడి ఆధ్వర్యంలోని ఇరాన్ హిల్ ఇండియా సంస్థ.. రూపొందించిన టెకీలాబ్రాండ్ 'లోకాలోకా' పానీయం అంతర్జాతీయ మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పూర్తిగా మెక్సికోలోనే తయారయ్యే ఈ లోకా లోకా, తొలుత అమెరికా మార్కెట్‌లో విడుదల చేస్తున్నామని, ఆ తర్వాత దశల వారీగా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తుందని ఈ సందర్భంగా రానా దగ్గుబాటి తెలిపారు.

ప్రపంచంలో ఏదో ఒక మూల నిత్యం సరికొత్త ఆవిష్కరణలు పరిచయమవుతూనే ఉంటాయి. అయితే ఆ ఆవిష్కరణలు అందరికీ చేరడానికి చాలా సమయమే పడుతోంది. ఈ క్రమంలో వాటిని విద్యార్థుల చెంతకు చేర్చాలన్నా.. దానిపై అవగాహన కల్పించాలన్నా.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండాలి. రోబోల తయారీ నుంచి 3డీ ప్రింటింగ్ వరకూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నుంచి డ్రోన్ వినియోగం వరకూ వాటి తయారీ విధానం, వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పనితీరును తదితర టెక్నాలజీని అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కొంత మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ముందడుగేశారు.. ఇంతకీ ఆ విద్యార్థులు ఏం చేశారు? వారి ఉద్దేశం ఏంటి? ఆ విశేషాలేంటో తెలుసుకుందాం..!

– సాక్షి, సిటీ బ్యూరో



ఇట్స్ ఫ్లో టైం

సాంకేతిక కేంద్రంగా

- ఇంజినీరింగ్ విద్యార్థుల నూతన ఆవిష్కరణ
- విద్యార్థుల చెంతకు 'సాంకేతిక' చదువు
- 'ఫ్లో' పేరుతో కొత్త తరహా ప్రయత్నం
- గ్రేటర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితం
- సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనే లక్ష్యం



అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి.. దాని వినియోగం విద్యార్థుల చెంతకు చేర్చాలి.. ఇదీ పలువురి ఇంజినీరింగ్ విద్యార్థుల సంకల్పం.. అనుకున్నదే తడవుగా సాయం కోసం పలువురిని సంప్రదించారు.. వారి సంకల్పానికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వంతపాడారు.. ఆయన సాయంతో ఓ బస్సులో అన్ని సదుపాయాలతో అత్యాధునిక సాంకేతికతను వివరించే నమూనాలతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. దీనికి 'ఫ్లో' (ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్)ను సిద్ధం చేశారు. దీనిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫ్లో ఒక వరంగా మారనుంది...

ఇదే ఫ్లో లక్ష్యం...

భవిష్యత్తులో రోబోలు ఎలాంటి పాత్ర పోషిస్తాయి. వాటిని తయారు చేయడం ఎలా? అందుకు అవసరమైన టెక్నాలజీ ఏంటి? రోబోలకు ఎందుకు అంత ప్రాధాన్యత? తయారు చేసిన రోబోలు ఎలా పనిచేస్తాయి? వాటిని వినియోగించడం ఎలా?.. తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరిస్తారు. ప్రాక్టికల్‌గా బస్‌లోని రోబోలను చూపిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

వాతావరణ వ్యవస్థపై...

ఏ ప్రాంతంలో ఏ సమయంలో ఎంత వేడి (ఎన్ని డిగ్రీలు) ఉంది. రేపు వాతావరణం ఎలా ఉండబోతోంది. వర్షం ఎపుడు కురుస్తుందనే ముందస్తు సమాచారం. వర్షం కొలమానం, తుఫాను హెచ్చరిక వ్యవస్థ ఎలా పనిచేస్తుంది. గాలులు ఎటు నుంచి ఎటువైపు ప్రయాణిస్తున్నాయి. వంటి వాతావరణ సమాచారం మనకు ముందుగానే తెలుస్తుంది. అయితే అది ఎలా సాధ్యమవుతుంది? దానికి వినియోగించే సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలపై ఫ్లో బస్‌లో విద్యార్థులకు వివరిస్తారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)...

ప్రస్తుత ఇంటర్నెట్ వ్యవస్థ ప్రపంచాన్ని మన చేతుల్లో పెడుతోంది. చిటికెలో సమాచారాన్ని చేరవేస్తోంది. కార్యాలయంలో ఉన్న వ్యక్తి ఇంట్లో ఉన్న ఫ్యాన్, ఏసీ ఆన్ చేయడం, ఆఫ్ చేయడం వంటివి చేయగలడు. కార్యాలయం, ఇల్లు, పొలం దగ్గర సీసీ కెమెరాల ద్వారా ఎక్కడో కూర్చుని అక్కడ ఏం జరుగుతుందో పర్యవేక్షించగలడు. ఇంట్లో సెన్సార్ వ్యవస్థతో మనం స్విచ్ ఆన్ చేయకుండానే లైటు వెలుగుతుంది. డోర్ తెరుచుకుంటుంది. రానున్న రోజుల్లో అందుబాటులోకి రానున్నటువంటి అడ్వాన్స్ టెక్నాలజీ తదితర విషయాలు తెలియజేస్తారు.

డ్రోన్ వినియోగం..

ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీకి మార్కెట్‌లో అత్యంత ఆదరణ ఉంది. వీడియోల, ఫొటోల చిత్రీకరణ, వ్యవసాయ పనుల నుంచి మొదలు వివాహాది శుభకార్యాలు, దేశ సరిహద్దుల్లో భద్రత వరకూ డ్రోన్స్ విరివిగా వినియోగిస్తున్నారు. డ్రోన్ తయారీ విధానం, వినియోగం, ఉపయోగాలపై అవగాహన కల్పిస్తారు.



టెక్ టూల్స్

ఫ్రిజ్, ఏసీ, వాషింగ్ మెషీన్, డ్రిల్లింగ్ మెషీన్, మైక్రో ఓవెన్, రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే ఫ్యాన్, ఇంట్లో ఉపయోగించే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఎలా పనిచేస్తాయి. మన జీవితంలో వాటి పాత్ర ఎంతవరకూ ఉంటుంది. వాటి తయారీ విధానం, వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేస్తారు.

ఏఆర్, వీఆర్..

ఆగ్మెంట్ రియాలిటీ(ఏఆర్), వర్చువల్ రియాలిటీ(వీఆర్) ప్రస్తుత ట్రెండ్ ఇది.. ఎక్కడో ఉన్న వ్యక్తి, ప్రాంతం మన కళ్లముందున్న అనుభూతిని కల్పిస్తాయి. ఈ వ్యవస్థను ఉపయోగించి ప్రస్తుతం ప్రచారం.. గేమింగ్.. టూరిజం.. వంటి రంగాలు మంచి జోష్‌లో నడుస్తున్నాయి.. అదే ఆగ్మెంట్ రియాలిటీ టెక్నాలజీతో.. మరో వైపు వర్చువల్‌గానూ (వీఆర్) వేరే ప్రాంతంలో ఉన్న వ్యక్తితో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తోంది.. ఈ రెండు వ్యవస్థల పనితీరును వివరిస్తారు.



3డీ ప్రింటింగ్..

3డీ ప్రింటింగ్ అనేది అత్యాధునిక టెక్నాలజీ. గ్లాస్‌పైన, చెక్క, పింగాణీ వస్తువులు, ఇలా ఎక్కడైనా చక్కని ఆకృతితో మనకు నచ్చిన చిత్రాన్ని ప్రతిబింబించేలా ఎన్నో అద్భుతాలు సృష్టిస్తుంది..ఈ అత్యాధునిక 3డీ ప్రింటింగ్ టెక్నాలజీని ఉపయోగించి భవన నిర్మాణాలను సైతం చేసేలా వృద్ధి చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ టెక్నాలజీకి మంచి ప్రాముఖ్యత ఉంటుంది.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'ఫ్లో' బస్‌లో ఉచిత ప్రవేశం కల్పిస్తారు. పాఠశాల ఉపాధ్యాయులు ఫ్లో టీంను సంప్రదిస్తే వారి షెడ్యూల్ ఆధారంగా ఏ రోజు వీలుంటుందనేదీ ఉపాధ్యాయులకు తెలియజేస్తారు. ఆ షెడ్యూల్ ప్రకారం పాఠశాలకు బస్ వచ్చి అందుబాటులో ఉన్న సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రయివేటు పాఠశాలలు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. అయితే పాఠశాల యాజమాన్యం నామమాత్రపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

పదివేల మందికి అవగాహన...

చిన్నప్పటి నుంచి సైన్స్ పట్ల ఆసక్తి ఎక్కువ. నేషనల్ కాంగ్రెస్ సైన్స్ ప్రోగ్రాంలో పాల్గొనేవాడిని. ఎన్నో బహుమతులు వచ్చాయి. ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ గ్రూప్ తీసుకున్నా. కళాశాలలో బోధన సంతృప్తిగా అనిపించలేదు. 2020లో రోబోటిక్స్‌పై స్టార్టప్ ప్రారంభించాం. ఎఫ్ఎల్ఓడబ్ల్యూ (ఫ్లో) ప్రారంభించడానికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సాయమందించారు. యూఎస్, ఎస్ఎస్ఐఈ నుంచి సుమారు కోటి రూపాయలు నిధులు సమకూరాయి. కొత్త ఇన్నోవేటివ్స్ చేపడుతున్నాం. మేము మొత్తం 18 మంది బృందంగా ఏర్పడి నడిపిస్తున్నాం. త్వరలోనే ఏపీలోనూ ఫ్లో బస్ అందుబాటులోకి వస్తుంది.

– మధులాష్ బాబు, సీఈవో ఎడోద్వజ సంస్థ

ఆ లోటును భర్తీ చేసేందుకే..

కేంద్ర ప్రభుత్వం 2020లో జాతీయ విద్యాపాలసీ (ఎన్ఈపీ)ని అమల్లో తెచ్చింది. ప్రతి పాఠశాలలో అత్యాధునిక టెక్నాలజీని విద్యార్థులకు బోధించాలని చెబుతోంది. ఆ సమయంలో కోవిడ్ రావడంతో కాస్త నెమ్మదించినా, తరువాత కాలంలోనూ ఆశించిన ఫలితాలు లేవు. పాఠశాలల్లో నిష్ణాతులైన శిక్షకులు లేకపోవడం, పరికరాలు అందుబాటులో లేకపోవడం, ఇతర సమస్యలు అడ్డంకిగా మారాయి. ఈ పరిస్థితుల నుంచి అధిగమించడానికి 'ఫ్లో' ఉపయోగపడుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

సంప్రదించాల్సిన
నెం: 9010388921, 9000947208
http:// www.edodwaja.com

కళింగలో 'హ్యాండ్ టూ హ్యాండ్' ప్రదర్శన



బంజారాహిల్స్: స్థానిక రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్లో చేనేతలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను వర్ధమాన సినీ నటి తాక్షి చిత్తోపాకర్ మంగళవారం ప్రారంభించారు. మార్కెట్లోకి ఎన్ని రకాల వస్త్ర ఉత్పత్తులు వస్తున్నా తాను చేనేత వస్త్రాలనే ఎక్కువగా ఇష్టపడతానని ఆమె తెలిపారు. ఈ నెల 30 వరకూ కొనసాగే ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని నిర్వాహకులు జయేష్ గుప్తా తెలిపారు.

ఏసీటీసీ ఈవెంట్స్ సంగీత ప్రదర్శన...



వినోద రంగ కార్యక్రమాలకు పేరొందిన ప్రముఖ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఏసీటీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సంగీత ప్రదర్శనలు జరుగనున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. టాలీవుడ్ అగ్రగామి సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఇందులో పాల్గొంటారని, త్వరలో ప్రారంభం కానున్న ఈ ఇండియా టూర్ అదనపు సమాచారం దేవిశ్రీ ప్రసాద్ అధికారిక మాధ్యమాల ద్వారా లేదా తమ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని సూచించారు.

ఈ గాలి.. ఈ నేలా..

విదేశాల కన్నా.. హైదరాబాద్ మిన్న

'ఎగిరిపోతే ఎంత బాగుంటుందీ..' అంటూ బంగారు భవిష్యత్తును ఊహించుకుంటూ విదేశాలకు వెళ్లిన వృత్తి నిపుణులు రూట్ మార్చారు. 'ఈ గాలి.. ఈ నేలా అని పాడుకుంటూ తిరిగి నగరానికి వచ్చేస్తున్నారు. అలా వచ్చేస్తున్న మన దేశీయుల్లో సిటీకి చెందిన వారితో పాటు ఇతర నగరాలకు చెందిన వారు కూడా ఉండడం విశేషం. ఈ అనూహ్యమైన పోకడని వెల్లడించింది ఇంటర్నేషనల్ మొబిలిటీ ట్రెండ్స్.. నివేదిక.

– సాక్షి, సిటీబ్యూరో



- సిటీకి తిరిగి వచ్చేస్తున్న వృత్తి నిపుణులు
- ఇతర నగరాలకు చెందిన వారు సైతం ...ఇక్కడకే..
- విదేశాల నుంచి రివర్స్ మైగ్రేషన్...



విదేశీ ఉద్యోగాల్లో ఇమడలేకపోతున్న యువ నిపుణులు పని వెతుక్కుంటూ నగరానికి తిరిగి వచ్చేస్తున్నారు. ఈ రివర్స్ మైగ్రేషన్ అమెరికా, యు.కె, కెనడా వంటి దేశాల నుంచి బాగా కనిపిస్తోంది. ఇంటర్నేషనల్ మొబిలిటీ ట్రెండ్స్‌పై బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ వెలువరించిన తాజా నివేదిక ఈ విశేషాలను వెల్లడించింది. విదేశాల్లో ఉంటూ అక్కడ పని చేయడానికి ఇష్టపడే భారతీయుల సంఖ్య 2020లో 78 శాతం కాగా అది మూడేళ్ల తిరిగేసరికి 2023 కల్లా.. 54 శాతానికి పడిపోయిందని పేర్కొంది. విదేశాల్లో చేస్తున్న పనిపట్ల అయిష్టతతో భారత్‌కు వలసలు పెరిగాయని, ఇలా తిరిగొస్తున్న వారిలో అత్యధికులు ఎంచుకుంటున్న టాప్ 3 నగరాలుగా వరుసగా హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ ఉన్నాయని తేల్చింది.

కారణాలెన్నో...

ఇలా విదేశీ ఉద్యోగాలపై మోజు తగ్గిపోతుండడానికి 'ఆర్థిక, వృత్తి పరమైన కారణాలతో పాటు అనేక అంశాలు' కీలకంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. 'ప్రధానంగా ఆర్థిక అంశాలతో పాటు వృత్తి పరమైన వృద్ధి అవకాశాల కోసం మాత్రమే ఇలా వలస వెళ్లాలని భావిస్తారు. ఆ విధంగా చూస్తే ఇలా తిరిగి వస్తున్నవారిలో ఉద్యోగ అవకాశాల నాణ్యత కోసం 52 శాతం మంది, ఆదాయం, జీవన వ్యయం కోసం, 37 శాతం ఆవిష్కరణ డిజిటలైజేషన్ కోసం 29 శాతం మంది విదేశాలను వదలాలని నిర్ణయించుకుంటున్నారు. కుటుంబ అనుకూల వాతావరణం, భద్రత, జీవన నాణ్యత కూడా ప్రధాన కారకాలు' అని నివేదిక వెల్లడించింది.

మన నగరానికే ఎందుకంటే...

ఇలా విదేశాల నుంచి మన దేశానికి తిరిగి వస్తున్న వారిలో అత్యధికులు నగరాన్ని ఎంచుకోవడానికి నగరంలో ఐటీ రంగం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందడం, జీవన వ్యయం తక్కువగా ఉండడం, నగరం సురక్షితం అనే ఇమేజ్... వంటివి కారణాలుగా ఇటీవల నగరానికి మకాం మార్చిన వారు చెబుతున్నారు. 'కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేశాను కాబట్టి అమెరికాలో మంచి ఉద్యోగం వస్తుందని ఆశించాను. కానీ నేను ఆశించింది జరగలేదు. పైగా నా మీద ఆధారపడి నా భార్య నాతో వచ్చేసింది, జీవితం గడపడానికి నేను ఒక కన్వీనియన్స్ స్టోర్‌లో ఉద్యోగం చేయాల్సి వచ్చింది. ఇలా లాభం లేదని నిర్ణయించుకుని ఇంటికి తిరిగి వచ్చాను' అని ఎస్.సుదర్శన్ రావు చెప్పారు. అతను వెళ్లే ముందు నగరంలో తనకి ఆరంకెల జీతంతో ఉద్యోగం ఇచ్చిన అదే కంపెనీ..తిరిగి వచ్చిన తర్వాత కూడా అతనికి మంచి జీతం వచ్చే ఉద్యోగాన్ని అందించింది ' కేవలం ఐటీ రంగంలోనే కాదు, ఫైనాన్స్, ఫార్మా తదితర రంగాలలో కూడా నగరంలో మంచి అవకాశాలు ఉన్నాయి' అని మరో ఉద్యోగి చరణ్ అంటున్నారు. మహారాష్ట్రలోని అకోలాకు చెందిన ఖైతాన్ ఖురేషీ కూడా తన కెనడియన్ కలలను వదులుకుని నగరానికి వచ్చేశారు. 'కెనడాలో నా నెలవారీ ఖర్చులు అక్కడ నేను సంపాదించగలిగిన దానికంటే చాలా ఎక్కువ. పైగా నేను ఎడ్యుకేషన్ లోన్ కూడా చెల్లించాల్సి ఉంది. వచ్చే నెల బడ్జెట్‌కు కేటాయింపుల కంటే ఇండియాకు టిక్కెట్ కొనడమే చౌక అని అనుకున్నా' అంటూ ఆయన నవ్వుతూ చెప్పారు.

మాట సాయం కీలకమే...

విదేశాల్లో మనవారికి కొరవడుతున్న ఎమోషనల్ సపోర్ట్ కూడా కీలకమని వీరు అంటున్నారు. తమ రివర్స్ మైగ్రేషన్‌కు భావోద్వేగ మద్దతు లభించకపోవడం కూడా కొందరు కారణాలుగా పేర్కొన్నారు. 'బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ తర్వాత అమెరికాలో గౌరవప్రదమైన ఉద్యోగం సంపాదించడం నా అదృష్టంగా భావించాను. అయితే మాట్లాడటానికి ఎవరూ లేకపోవడం, ఇంటి పనులతో పాటు తీవ్రమైన పని షెడ్యూల్..అది నిర్వర్తించడానికి కనీస అవసరమైన భావోద్వేగ మద్దతు లేకపోవడం నన్ను నిరాశకు గురిచేసింది' అని నగరానికి తిరిగి వచ్చి ఇక్కడ తనవారితో కలిసి ఆనందంగా గడుపుతున్న అద్నాన్ అన్నారు.


ఫ్యాషన్ సూత్రం..

ఎగ్జిబిషన్‌లో మెరిసిన మోడల్స్...



బంజారాహిల్స్: ఆధునిక, సంప్రదాయ మేళవింపుతో కలగలిపిన సూత్ర లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో మంగళవారం ప్రారంభమైంది. ప్రముఖ సోషలైట్ బినా మెహతాతో పాటు పలువురు మోడల్స్ ప్రారంభించారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా పలు రాష్ట్రాల డిజైనర్లు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ నెల 27 వరకూ ప్రదర్శన ఉంటుంది.

సిటీలో పింక్ లిప్ బూస్టింగ్...



సెలబ్రిటీ సీక్రెట్స్ వేదికగా బ్యూటీ ట్రీట్‌మంట్స్ పై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ ఇన్ఫ్లుయెన్సర్లు పాల్గొని సందడి చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సౌందర్య రంగంలో తాజాగా ఆదరణ పొందుతున్న పింక్ లిప్ బూస్టర్, స్కిన్ వైటినింగ్ ట్రీట్మెంట్ పై ప్రముఖ డాక్టర్ మాధవి చౌదరి అవగాహన కల్పించారు. బ్యూటీ మెడిసిన్, కాస్మొటాలజీ రంగంలో వినూత్న పరిశోధనలు, అధునాతన సాంకేతికతలపై వివరణాత్మక విశ్లేషణ అందించారు. యుఎస్ఏ తరహా పింక్ లిప్ బూస్టర్, స్కిన్ వైటినింగ్ ట్రీట్మెంట్ ఆవిష్కరణ శుభపరిణామమన్నారు. యూఎస్-ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన భద్రత, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని వివరించారు.

ఓం బిర్లా అభ్యర్థిత్వానికి వైఎస్సార్‌సీపీ మద్దతు

- లాలూచీ రాజకీయాలకు వ్యతిరేకమని స్పష్టీకరణ
- అందువల్లే ఓం బిర్లాకు మద్దతిస్తున్నట్లు వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థి ఓం బిర్లాకు వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. బుధవారం జరిగే స్పీకర్ ఎన్నికలో ఓం బిర్లాకు మద్దతివ్వాలని ఎన్డీఏ అగ్ర నేతలు వైఎస్సార్‌సీపీ అధినాయకత్వాన్ని కోరారని పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లాంఛనంగా జరిగే సభాపతి ఎన్నికలో ఓం బిర్లాకు మద్దతివ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంతేగాక లాలూచీ రాజకీయాలకు వైఎస్సార్‌సీపీ పూర్తి వ్యతిరేకమని, అందువల్లే ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వట్లేదని తెలిపారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా బీజేపీతో కలిసి పోటీ చేసిన టీడీపీ.. స్పీకర్ పదవి కోసం పట్టుబడితే.. టీడీపీ అభ్యర్థికి మద్దతిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇటీవల లాలూచీ రాజకీయాలకు తెరలేపిందని, అందువల్లే ఓం బిర్లాకు మద్దతివ్వాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

ప్రజల గొంతును గుర్తించండి

స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ

ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలి

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ప్రతిపక్ష హోదా ఉండాల్సిందేనని, ఈ విషయంలో పరిశీలన చేయాలని కోరుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు సాధించాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. విపక్ష పార్టీల్లో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని పేర్కొన్నారు. శాసనసభలో కూటమి పార్టీల ఉద్దేశపూర్వక చర్యలను సైతం లేఖలో ప్రస్తావించారు. వైఎస్ జగన్ లేఖలో ముఖ్యాంశాలు ఇవీ..



శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు..

మంత్రుల తర్వాత నాతో ప్రమాణం చేయించడం సంప్రదాయాలకు పూర్తి విరుద్ధం. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గుర్తింపు ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్లు దీనిద్వారా కనిపిస్తోంది. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే పది శాతం సీట్లు సాధించి ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు. పార్లమెంట్‌లోగానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఈ నిబంధన పాటించలేదు. అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు వీడియోల ద్వారా బయటపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీలో గొంతు విప్పే అవకాశాలు కనిపించడం లేదు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే ఆస్కారం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నా లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

అంతరంగం అప్పుడే అర్థమైంది..

ఈనెల 21న అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణం కార్యక్రమాన్ని పరిశీలిస్తే నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వరనే అభిప్రాయం కలిగింది. అసెంబ్లీ సంప్రదాయాల ప్రకారం ముందుగా సభా నాయకుడు, తర్వాత ప్రతిపక్ష నాయకుడు, అనంతరం మంత్రులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా అలా జరగలేదు. సంప్రదాయాలకు విరుద్ధంగా మంత్రుల తర్వాతే నాతో ప్రమాణం చేయించారు. నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదనే నిర్ణయాన్ని మీరు ముందుగానే తీసుకున్నట్లు కనిపిస్తోంది.

చట్టంలో స్పష్టంగా ఉంది..

ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అంటే ఎవరనే విషయాన్ని చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్ యాక్ట్ 1953 చట్టం 12 ఆ' ప్రధాన ప్రతిపక్ష పార్టీ అంటే ఎవరనే విషయాన్ని స్పష్టంగా నిర్వచించింది. విపక్షంలో ఉన్న పార్టీల్లో ఎవరికి ఎక్కువ సంఖ్యా బలం ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందున విపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. కానీ జూన్ 21న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చూస్తే వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం, పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా నన్ను ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించడంలో మీ ఉద్దేశాలేమిటో బయటపడ్డాయి. కానీ చట్టాన్ని పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడంలోగానీ, పార్టీ శాసనసభా పక్షనేత అయిన నన్ను ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించేందుకుగానీ ఎలాంటి సందిగ్ధతకు తావులేదు. ఇటీవల స్పీకర్ చేసిన వ్యాఖ్యలు యూట్యూబ్ ఛానళ్లలో ఉన్నాయి. ఓడిపోయాడుగానీ చావలేదు.. చచ్చేవరకూ కొట్టాలి..! అంటూ నన్ను ఉద్దేశించి గౌరవ స్పీకర్ అన్న మాటలు ఆ వీడియోల్లో ఉన్నాయి. తద్వారా నాపై ఉన్న శత్రుత్వాన్ని స్పీకర్ రూపంలో అధికార కూటమి వ్యక్తం చేసింది.

వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది..

ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది. ప్రజా సంబంధిత అంశాలపై అసెంబ్లీలో ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత మాపై ఉంది. అయితే ప్రభుత్వం, స్పీకర్ శత్రుత్వ వైఖరిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో మా పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీ కార్యకలాపాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కట్టడి చేస్తున్నట్లే అవుతుంది. వైఎస్సార్ సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడికి తగిన సమయం లభిస్తుంది. దీనివల్ల ప్రజా సంబంధిత అంశాలను సభ దృష్టికి బలంగా తేగలుగుతారు. సభా కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనేలా, ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్ష పార్టీగా అభిప్రాయాలను చెప్పేలా చట్టబద్ధమైన భాగస్వామ్యం ప్రధాన ప్రతిపక్ష పార్టీకి లభిస్తుంది. ఇలాంటి పరిస్థితి లేకపోతే అసెంబ్లీలో అధికార కూటమి గొంతు మాత్రమే వినిపిస్తుంది. వివిధ అంశాల్లో బలమైన చర్చలు జరిగే అవకాశం కనిపించదు.

ఉపేంద్ర, పీజేఆర్‌ను ప్రధాన ప్రతిపక్ష నేతలుగా గుర్తించారు..

అసెంబ్లీలో 10 శాతం సీట్లు రానందున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించదనే చర్చ జరుగుతోంది. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 208 కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో నిర్దిష్ట సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదనే విషయాన్ని మీ ముందుకు తెస్తున్నా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా ఈ నిబంధన పాటించలేదనే అంశాన్ని గుర్తు చేస్తున్నా. లోక్‌సభకు 1984లో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకుంది. సభలో 10 శాతం సీట్లు సాధించనప్పటికీ నాడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకుగానూ కాంగ్రెస్ 26 సీట్లు మాత్రమే సాధించింది. 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు దక్కనప్పటికీ పి.జనార్దనరెడ్డిని నాడు ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు.

3 సీట్లు వచ్చిన బీజేపీకి సైతం..

2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగానూ బీజేపీ కేవలం 3 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ఈ అంశాలన్నీ కూడా కేవలం ప్రజా ప్రయోజనాల రీత్యా మీ దృష్టికి తెస్తున్నా. ప్రజల తరఫున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో మీకు ఈ లేఖ రాస్తున్నా. అయితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం లేకుండా అధికార కూటమి ఇప్పటికే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో నేను సభలో మాట్లాడాలనుకుంటే అది భారీ మెజార్టీ సాధించిన అధికార కూటమి దయమీద, నన్ను చచ్చేవరకూ కొట్టాలన్న స్పీకర్ గారి విచక్షణ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సభలో ఉన్న పార్టీల సంఖ్యా బలాలను దృష్టిలో ఉంచుకుని ఈ లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

ఏపీలో ఆ చానళ్ల ప్రసారాలు వెంటనే పునరుద్ధరించండి

'సాక్షి' సహా పలు చానళ్ల ప్రసారాలు నిలిపివేతపై కేబుల్ ఆపరేటర్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో నిలిపివేసిన చానళ్ల ప్రసారాలను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 6 నుంచి ఏపీలో సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాలను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ మిని పుష్కర్ణ మంగళవారం విచారించారు. ఆయా చానళ్లను పునరుద్ధరించాలని కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. లిఖితపూర్వక ఆదేశాలు ఇంకా వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయంపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ ఫెడరేషన్ (ఎన్‌బీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఏపీలో ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా తీసుకొన్న నిర్ణయంపై కొరడా లాంటి ఆదేశాలుగా అభివర్ణించింది. 'ప్రజాస్వామ్య పనితీరుకు అవసరమైన బహిరంగ, పారదర్శక మీడియా వాతావరణాన్ని నిర్వహించే ప్రాముఖ్యతను హైకోర్టు జోక్యం నొక్కి చెబుతోంది. ఈ తీర్పు పత్రికా స్వేచ్ఛను సమర్థించడం, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడంపై ఓ ఉదాహరణగా నిలుస్తుంది' అని మంగళవారం ఎన్‌బీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది.

రైతుభరోసాపై రైతులతో మాట్లాడండి

- రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ జరపండి
- డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకాన్ని ఎలా అమలు చేయాలో రైతుల్నే అడిగి తెలుసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయ అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి అభిప్రాయ సేకరణ జరపాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ 'రైతు భరోసాపై రైతుల అభిప్రాయం ఎలా ఉంది? ఈ పథకం అమల్లో ఎలా ముందుకెళ్లాలో వారిని అడిగి తెలుసుకుంటేనే మంచిదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించి మంత్రులు కూడా హాజరయ్యేలా చూడాలని సూచించారు. అసలు తెలంగాణ ఏర్పాటు కాక ముందు రైతుల కోసం అమల్లో ఉన్న పథకాలేంటి? గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పథకాలేంటి? అందుకు గల కారణాలేంటి? తదితర వివరాలను కూడా అందజేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి తగిన బడ్జెట్ ప్రతిపాద నలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో భాగంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా గురించి చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్‌తో అమలయ్యే పథకాలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, అదనపు కార్యదర్శి హరిత, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

వేంపల్లి షరీఫ్ పుస్తకానికి విశాలాక్షి సాహిత్య పురస్కారం


వేంపల్లి షరీఫ్

విజయవాడ కల్చరల్: వైఎస్సార్ జిల్లా వేంపల్లికి చెందిన కవి, రచయిత, పరిశోధకుడు షరీఫ్ రచించిన 'టీవీ ప్రకటనల్లో భాష' పుస్తకం 2024 సంవత్సరానికిగానూ విశాలాక్షి సాహిత్య పురస్కారానికి ఎంపికైంది. ఈ విషయాన్ని మంగళవారం ఓ ప్రకటనలో షరీఫ్ తెలిపారు. ఈ నెల 30వ తేదీన నెల్లూరులో జరిగే విశాలాక్షి 15వ వార్షికోత్సవంలో విశాలాక్షి సాహిత్య పురస్కారంతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులను నుంచి సమాచారం అందినట్లు పేర్కొన్నారు. మనకు తెలియకుండానే మనపై ప్రభావం చూపి, మన అలవాట్లు అభిరుచుల్లో మార్పులు తెచ్చే శక్తి ప్రకటనలకు ఉంటుందని తెలిపారు. ఈ పుస్తకం ఇప్పటికే అనేక విశ్వవిద్యాలయాల్లో తెలుగు జర్నలిజం, ఎంబీఏ విద్యార్థులకు రిఫరెన్స్ పుస్తకంగా ఉందని పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కాగా, షరీఫ్ రచించిన కథలు కొన్ని భారతీయ భాషల్లోకి అనువాదం అయ్యాయి. జుమ్మా కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. గిడుగు రామ్మూర్తి పంతులు భాష పురస్కారంతోపాటు 20పైగా పురస్కారాలను అందుకున్నారు. షరీఫ్ పుస్తకం విశాలాక్షి సాహిత్య పురస్కారానికి ఎంపికైన సందర్భంగా నగరానికి చెందిన పలు సాహిత్య సంస్థలు ఆయనను అభినందించాయి.

రైతు భరోసాకు పదెకరాలు పరిమితి పెట్టండి

▶ మొదటి పేజీ తరువాయి

బ్యాంకులకు ఆదాయ పన్ను స్టేట్‌మెంట్లు చూపించాల్సి వస్తుందని.. కాబట్టి ఆదాయ పన్ను చెల్లించేవారికి కూడా రైతుభరోసా ఇవ్వాలని సూచించారు. ప్రతీ వారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు 'రైతు భరోసా'పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములు వంటి వాటికి రైతు భరోసాను నిలిపివేయాలని కోరారు.

దొడ్డు రకాల వరికీ బోనస్ ఇవ్వాలి

సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో.. చాలా మంది రైతులు దొడ్డు రకం వరికి కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో దొడ్డు వరి సాగు చేసేవారే ఎక్కువని, వారికీ బోనస్ ఇస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని పేర్కొన్నారు. సన్న రకాలకు ఎటూ డిమాండ్ ఉంటుందని.. మార్కెట్లోనూ మద్దతు ధర కంటే ఎక్కువగా రేటు పలుకుతుందని వివరించారు. ఇక సీజన్ సమయంలో పంటల సాగుకు అవసరమైన కూలీల కొరత ఉంటుందని.. దొరికినా ఖర్చు ఎక్కువ అవుతుందని అనేక మంది రైతులు వాపోయారు. అందువల్ల వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు ఐదేళ్లుగా వ్యవసాయ యంత్రాల సరఫరా నిలిచిపోయిందని, దాంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

రైతుబంధుతో రూ.25,670 కోట్లు వృథా: మంత్రి తుమ్మల

గతంలో సాగులో లేని భూములకు కూడా రైతుబంధు వర్తింపజేసి.. 12 విడతల్లో దాదాపు రూ.25,670 కోట్ల ప్రజాధనం వృథా చేశారని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. 93 శాతం వాటా ఉన్న సన్న, చిన్నకారు రైతుల వాటా రైతుబంధు మొత్తంలో 68 శాతం కూడా లేదని.. దానికితోడు 17.5 శాతం ఉన్న కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకాన్ని తీసుకొస్తోందని, పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.15 వేలకు పెంచుతున్నామని చెప్పారు. అయితే రైతుబంధు తరహాలో ప్రజా ధనం వృథా కాకుండా ఉండేలా పటిష్ట విధానాల రూపకల్పనకు తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు వెల్లడించిన, రాత పూర్వకంగా సేకరించిన సూచనలను క్రోడీకరించి నివేదిక తయారు చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని మంత్రి ఆదేశించారు. తమ ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు ఇంకా తీసుకోలేదని.. పూర్తిగా అందరి అభిప్రాయాలు తీసుకున్నాక, శాసనసభలో చర్చించాక పథకాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఆలస్యమైనప్పటికీ అర్హులకు మాత్రమే అందేలా రైతుభరోసాకు రూప కల్పన చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతుసంఘం నాయకుడు అన్వేశ్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్' కమిషన్ విచారణ నిలిపేయండి

హైకోర్టులో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో తీసుకున్న విద్యుత్ రంగ నిర్ణయాలపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిసింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారని, వెంటనే విచారణ నిలిపివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరినట్టు సమాచారం. విద్యుత్ కొనుగోళ్లలో ఎక్కడా అవకతవకలు జరగలేదని.. రాజకీయ కక్షతోనే ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నట్టు తెలిసింది. ఇందులో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి, జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిలను ప్రతివాదులుగా చేర్చినట్టు సమాచారం. అయితే ఈ పిటిషన్ ఇంకా పరిశీలన దశలోనే ఉందని.. నంబరింగ్ కావాల్సి ఉందని తెలిసింది. జస్టిస్ నరసింహారెడ్డిని వ్యక్తిగత ప్రతివాదిగా చేయడంపై రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేసిందని.. దీనిపై ప్రధాన న్యాయమూర్తి పరిశీలన తర్వాత ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన వివరాల కేసీఆర్ పిటిషన్‌లోని అంశాలివీ..

కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం..

''తెలంగాణలోని గత ప్రభుత్వం రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభాన్ని తక్షణమే తరిమికొట్టేందుకు చర్యలు చేపట్టింది. చట్టప్రకారం ఛత్తీస్‌గఢ్ నుంచి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రయత్నించింది. ఒక్కో యూనిట్‌కు తమిళనాడు రూ.4.94, కర్నాటక రూ.4.33 వెచ్చించగా.. తెలంగాణ మాత్రం రూ.3.90 మాత్రమే వెచ్చించింది. ఈ విషయాలను పరిశీలించకుండా.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణాలు, ఛత్తీస్‌గఢ్‌తో ఎంఓయూ, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ)పై కమిషన్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం చట్ట వ్యతిరేకం. విద్యుత్ చట్టం–2003 ప్రకారం.. విద్యుత్ వ్యవహారాలపై సమీక్షించి నిర్ణయాలు వెలువరించేందుకు న్యాయపరమైన రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఎస్‌ఈఆర్‌సీ) ఏర్పాటైంది. ఇది బహిరంగ విచారణలను నిర్వహించి ప్రజాభిప్రాయం తీసుకుంటుంది. ఎస్‌ఈఆర్‌సీ నిర్ణయాలతో విభేదించేవారు ఎలక్ట్రిసిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకునే న్యాయపరమైన వెసులుబాటు ఉంది. ఆ అప్పిలేట్ అథారిటీ ఆదేశాలపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఇలా చట్ట నిబంధనలు ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయడాన్ని చట్టవ్యతిరేకంగా ప్రకటించాలి.

విచారణ పూర్తి చేయకుండా మీడియాకు వివరాలు!

కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి విచారణ పూర్తి చేయకుండానే.. నిజానిజాలను పరిశీలించకుండా, అనేక విషయాలను సమగ్రంగా తెలుసుకోకుండానే విలేకరుల సమావేశం నిర్వహించి పలు అంశాలపై అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు ఆక్షేపణీయం, అభ్యంతరకరం. నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు. 1952 కమిషన్ల విచారణ చట్టంలోని వివిధ సెక్షన్లను ఉపయోగించకుండా, కారణాలను నమోదు చేయకుండా నోటీసు జారీ చేశారు. అందుకే జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ అధిపతిగా కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాను. ఆయన ఇప్పటికే ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నారు. ఏకపక్షంగా విచారణ సాగిస్తున్న కమిషన్‌ను కొనసాగించవద్దు. విద్యుత్ వ్యవహారాలపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సరైనవో, కాదో తేల్చేందుకు కమిషన్ ఏర్పాటు చెల్లదు. విద్యుత్ కొనుగోళ్లు, సరఫరా, ఒప్పందాలపై వివాదాలను విచారించే పరిధి ఎస్‌ఈఆర్‌సీకి మాత్రమే ఉంటుంది. న్యాయపరమైన ఇతర మార్గాలు ఉన్నప్పుడు కమిషన్ ఏర్పాటు చేసే పరిధి, అధికారం ప్రభుత్వానికి లేదు. విద్యుత్ చట్టంలో కూడా ఆ విధమైన వెసులుబాటు లేదు. రాష్ట్ర ప్రభుత్వం కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్–1952లోని నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈ కమిషన్ ఏర్పాటు చేసింది. కాబట్టి ఈ కమిషన్ నియామకమే చెల్లదు.


అది ప్రభుత్వాల మధ్య ఒప్పందం

మార్వా ప్లాంట్ పనులు పూర్తవుతున్న దశను పరిగణనలోకి తీసుకుని 2015 సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. దీన్ని ప్రస్తావించకుండా మార్వా ప్లాంట్ 2016 మార్చిలో వచ్చిందని, పవర్ ప్లాంట్ లేకుండానే విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవడం సరికాదని జస్టిస్ నరసింహారెడ్డి విలేకరుల సమావేశంలో వ్యాఖ్యలు చేశారు. అది రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందమన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

అప్రతిష్ట పాలు చేసేందుకే కమిషన్!

రాష్ట్రం ఏర్పాటైనపుడు జాతీయ గ్రిడ్‌తో అనుసంధానమై లేదు. దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు మాత్రమే అనుసంధానమై ఉన్నాయి. దీంతో ప్రభుత్వం విద్యుత్ సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఎల్) అనుమతి తీసుకుంది. రాష్ట్రాల మధ్య విద్యుత్ సరఫరా వ్యవస్థ నియంత్రణ కోసమే ఆ సంస్థ ఏర్పాటైంది. టీఎస్‌ఎస్పీడీసీఎల్ ఆ సంస్థతో చర్చించి ప్రత్యేక కారిడార్‌ను బుక్ చేసుకుంది. ఇక భద్రాద్రి ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకున్నాకే పనులు చేపట్టాం. ప్రజాప్రయోజనాలకు చెందిన అంశాలుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. కానీ గత ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికే జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషన్‌ను ఏర్పాటు చేసే పరిధి ప్రభుత్వానికి లేదు. అందువల్ల కమిషన్‌ను ఏర్పాటు చేసిన జీవోను కొట్టివేయాలి. కమిషన్ జారీ చేసిన నోటీసును రద్దు చేయాలి..'' అని పిటిషన్‌లో కేసీఆర్ పేర్కొన్నట్టు తెలిసింది.

జగన్ వ్యక్తిత్వ హననమే లక్ష్యం



- చంద్రబాబు, లోకేశ్ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు నడుపుతున్నారు.. జగన్ భద్రతపై అసత్య కథనాలు ప్రచురిస్తున్నారు
- ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇదంతా
- బాబుతోపాటు లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్, భువనేశ్వరికి భద్రత ఇవ్వలేదా?
- హైదరాబాద్‌లోని బాబు ఇంటిలో ఏమున్నాయో ఫొటోలు విడుదల చేయగలరా?
- మీడియాకు ఆ ఇంటిని చూపించగలరా?
- ఉండవల్లిలో కరకట్ట ఇంటికి రూ.వందల కోట్లు ఖర్చు చేయలేదా?
- వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని ధ్వజం

వ్యక్తిగతంగా విచారణకు హాజరుకండి

మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ నోటీసులు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ సీఎండీ ప్రభాకర్‌రావుకు కూడా..
- వాంగ్మూలం ఇచ్చిన సాక్షులకు వ్యతిరేకంగా ఆధారాల సమర్పణకు ఆదేశం
- వారం గడువుతో ఈ నెల 19న జారీ.. నేటితో ముగియనున్న గడువు
- గడువులోగా స్పందించకపోతే సమన్ల జారీకి అవకాశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ వ్యవహారాల్లో అవకతవకల ఆరోపణలపై మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలోని విచారణ కమిషన్ ఈ నెల 19న నోటీసులు జారీ చేసింది. అవకతవకలు జరిగినట్లు వాంగ్మూలం ఇచ్చిన సాక్షులకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలను వ్యక్తిగతంగా హాజరై సమర్పించాలని 253 పేజీలతో కూడిన నోటీసుల్లో ఆదేశించింది. అలాగే విద్యుత్ శాఖ మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావుకు సైతం అదేరోజు నోటీసులు పంపింది. వారం రోజుల్లోగా వ్యక్తిగతంగా హాజరు కావాలని కమిషన్ ఆదేశించగా నేటితో ఆ గడువు ముగియనుంది. గడువులోగా హాజరుకాకుంటే కమిషన్ తప్పనిసరిగా వ్యక్తిగత హాజరు కోరుతూ సమన్లు జారీ చేసే అవకాశాలున్నాయి. జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు కూడా.

ఇప్పటికే ఓసారి నోటీసులు

గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో జరిగిన ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంతోపాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో అందుకు బాధ్యుల గుర్తింపునకు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం తెలిసిందే. ఈ నిర్ణయాల్లో కేసీఆర్ పాత్రపై వివరణ కోరుతూ ఏప్రిల్ 14న ఆయనకు విచారణ కమిషన్ తొలిసారి నోటీసులు జారీ చేయగా ఈ నెల 15న కేసీఆర్ రాతపూర్వకంగా బదులిచ్చారు. జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి విచారణ ప్రక్రియలో పురోగతిని మీడియాకు వెల్లడించడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన కేసీఆర్.. ఆయన్ను విచారణ ప్రక్రియ నుంచి తప్పుకోవాలంటూ కమిషన్‌కు పంపిన లేఖలో డిమాండ్ చేశారు.

కమిషన్ ఇప్పటివరకు 25 మంది అధికార, అనధికార సాక్షులకు నోటీసులు జారీ చేసి సంబంధిత నిర్ణయాల్లో వారి పాత్రపై రాతపూర్వకంగా వివరణ కోరింది. విద్యుత్‌రంగ నిపుణుడు కె.రఘు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, విద్యుత్‌రంగ నిపుణులు వేణుగోపాల్‌రావు, తిమ్మారెడ్డి తదితరులు ఇటీవల కమిషన్ ముందు హాజరై తమ పిటిషన్లకు మద్దతుగా వాదనలు వినిపించారు. వారిని ప్రధాన సాక్షులుగా కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఇలా సాక్షులందరి నుంచి సేకరించిన ఆధారాలను కమిషన్ ఇటీవల కేసీఆర్, ఇతరులకు జారీ చేసిన నోటిసుల్లో పొందుపరిచింది.

'పెట్టుబడి' గండం!

అప్పు పుట్టక.. సర్కారు సాయం కోసం రైతన్న ఎదురు చూపులు

- ఏటా రూ.20 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో కూటమి హామీ.. రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా మార్చడం మినహా సాయం ఏదీ?
- అన్నదాతకు తొలి విడత సాయం ఎప్పుడిస్తారో చెప్పలేని దుస్థితి.. సాగు ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ రైతన్నల ప్రదక్షిణలు
- నాడు హామీ కంటే మిన్నగా పెట్టుబడి సాయం అందించిన జగన్.. ఏటా సగటున 51.50 లక్షల మందికి రూ.13,500 చొప్పున సాయం జమ
- భూ యజమానులతో పాటు అటవీ, దేవదాయ, కౌలు రైతులకూ సాయం



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వీధి చివర బంకుల్లో మత్తు చాక్లెట్లు
కాలేజీ క్యాంపస్‌లో గంజాయి పొగ
పబ్‌లో మాదకద్రవ్యాలు
బుద్ధిగా చదువుకోవాల్సిన
టీనేజ్ పిల్లల్ని మత్తులోకి
లాగడానికి పొంచి ఉన్న డేగలు.
జాగ్రత్త... తల్లిదండ్రులూ.. జాగ్రత్త.
పిల్లలు తెలిసీ తెలియక చిక్కుకుంటారు.
గమనించాలి. చర్చించాలి.
కాపాడుకోవాలి.



మత్తు డేగ ఎగురుతోంది... జాగ్రత్త

స్కూల్ వయసు పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా హర్యాణ రాష్ట్రంలో పోలీసులు ఆయా స్కూళ్లకెళ్లి వారిని చైతన్యపరిచే కార్యక్రమాలు చేస్తున్నారు. 'క్యాచ్ దెమ్ యంగ్' అనేది ఈ కార్యక్రమం పేరు. అంటే చిన్న వయసులోనే పిల్లల దృష్టిని ఆకర్షించి వారిని డ్రగ్స్ దుష్ప్రభావాల గురించి చెప్పాలి. ఇందుకు వారు అంబాలలోని ఒక ప్రయివేటు స్కూల్‌లో ప్రయోగాత్మకంగా ఒక ప్రయత్నం చేశారు. దాని పేరు 'చక్రవ్యూహ్'. వరుసగా ఉన్న ఐదు గదుల్లో రకరకాల పజిల్స్ ఇచ్చి ఒక గదిలో నుంచి మరో గదిలోకి కేవలం తెలివితేటల ఆధారంగా తలుపు తెరుచుకుని ప్రవేశిస్తూ అంతిమంగా బయట పడాలి. 'ఇది ఒక అద్భుత ప్రయోగం' అని విద్యార్థులు అంటున్నారు.

చక్రవ్యూహ్ ప్రయోగం

చక్రవ్యూహ్ అనేది ఒక పజిల్ గేమ్. ఆటోమేటిక్ తాళాలు ఉన్న గదుల్లోకి నలుగురు విద్యార్థుల బృందాన్ని పంపిస్తారు. ఆ బృందం అక్కడ తమ జీవితంలో ఎదురయ్యే రకరకాల సమస్యలను పజిల్స్ రూపంలో ఎదుర్కొంటుంది. అంటే పరీక్షలో ఫెయిల్ కావడం, మంచి ర్యాంక్ రాకపోవడం, నిరుద్యోగం, ఒంటరితనం, తల్లిదండ్రుల కొట్లాట... ఇలాంటి సమయంలో ఆ సమస్యలను ఎలా దాటాలో అక్కడే క్లూస్ ఉంటాయి. ఆ క్లూస్ ద్వారా ముందుకు సాగితే తర్వాతి గదిలోకి తలుపు తెరుచుకుంటుంది. ఇదంతా సీసీ టీవీల ద్వారా అధ్యాపకులు గమనిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రతి సవాలు ఎదుర్కొనే సమయంలో ఆ సమస్య నుంచి పారిపోయి డ్రగ్స్‌ను ఎంచుకునే ఆప్షన్ కూడా ఉంటుంది. కాని ఈ మొత్తం చక్రవ్యూహ్‌లో కలిగే అవగాహన ఏమిటంటే నిజ జీవిత సమస్యల్ని తల్లిదండ్రుల, స్నేహితుల సాయంతో దాటితే వచ్చే కిక్కు డ్రగ్స్ తీసుకొని జీవితాన్ని నాశనం చేసుకోవడంలో లేదని తెలియడం. ఇలాంటి చక్రవ్యూహ్ ప్రయోగాన్ని హర్యాణలోని స్కూళ్లల్లో విస్తృతంగా నిర్వహించాలని పోలీసులు భావిస్తున్నారు. జీవితపు చక్రవ్యూహంలో చిక్కుకుంటే బయటపడే దారి ఉంటుంది గాని డ్రగ్స్‌లో చిక్కుకుంటే దారి ఉండదు అని తెలియడం వల్ల విద్యార్థులు చిన్న వయసులోనే గట్టి సందేశం అందుకుంటారు.

కుతూహలం, సాంగత్యం

టీనేజీ పిల్లలు అయితే కుతూహలం కొద్దీ లేదా దుష్ట సాంగత్యంలోని ఒత్తిడి వల్ల డ్రగ్స్‌ను ట్రై చేస్తున్నారని డీ అడిక్షన్ థెరపిస్టులు అంటున్నారు. పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని తల్లిదండ్రులు గమనించే లోపు వారి ప్రవర్తన పూర్తిగా మారిపోయి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. సరదా షికార్లు, స్లీప్ ఓవర్‌ల సమయంలో సరదా కొద్దీ సీనియర్లో స్నేహితులో డ్రగ్స్ ఇస్తున్నారు. మొదటి ఒక రకం డ్రగ్స్ తీసుకున్నాక మెదడు ఇంకా 'హై' కావాలని కోరుకుంటుంది. దాంతో పిల్లలు ఇంకా ఎన్ని రకాల డ్రగ్స్ ఉన్నాయో చూద్దామని వెతుకులాట సాగిస్తారు. ఇక అంతటితో వారి చదువు, ఆరోగ్యం, ఏకాగ్రత, వ్యక్తిత్వం మొత్తం ధ్వంసమైపోతాయని డ్రగ్స్‌కు బానిసలైన టీనేజ్ విద్యార్థులను పరిశీలిస్తున్న డీ అడిక్షన్ థెరపిస్టులు తెలియచేస్తున్నారు.

ఎలా గుర్తించాలి?

మీ టీనేజ్ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని ఎలా గుర్తించాలి?

1. చాలా మూడీగా తయారవుతారు
2. సరిగా భోజనం చేయరు
3. సడన్‌గా కొత్త కొత్త స్నేహితులు ప్రత్యక్షమవుతుంటారు. తరచూ ఏవో పార్టీలున్నాయని వెళుతుంటారు.
4. గతంలో కంటే ఎక్కువ డబ్బు అడుగుతారు
5. పొడి పెదిమలు
6. ఎర్రబడ్డ కళ్లు
7. వాదనలకు దిగి ఆధిపత్యం ప్రదర్శించడం
8. కుటుంబంతో కలివిడిగా లేకపోవడం
9. అర్థం పర్థం లేని నిద్రా సమయాలు.

బయట పడేయాలి

డ్రగ్స్‌కు అలవాటు అయ్యారని తెలియగానే తల్లిదండ్రులు పిల్లల్ని మందలించడానికి చూస్తారు. వెంటనే ఆ పిల్లలు 'మీరిలా తిడితే ఇల్లు విడిచి వెళ్లిపోతాం' అని బ్లాక్‌మెయిల్ చేస్తారు. వీరిని చాలా ఓర్పుతో థెరపీల ద్వారా తిరిగి మామూలు మనుషుల్ని చేయాల్సి వస్తుంది. పోలీసుల గమనింపు ప్రకారం 18 నుంచి 25 ఏళ్ల లోపు వారిని డ్రగ్ పెడలర్స్ లక్ష్యం చేసుకున్నా నేడు 14 ఏళ్ల పిల్లలతో మొదలు ప్రతి టీనేజ్ అమ్మాయి అబ్బాయి డ్రగ్స్ డేగ రెక్కల కింద ఉన్నట్టే లెక్క.

నెగెటివ్ కుటుంబ వాతావరణం

టీనేజ్ పిల్లలు డ్రగ్స్ వైపు మొగ్గు చూపడంలో ప్రధానంగా నెగెటివ్ కుటుంబ వాతావరణం ఒక ముఖ్యకారణమని నిపుణులు అంటున్నారు. తల్లిదండ్రులు ఘర్షణతో ఉన్నా పిల్లలతో మంచి అనుబంధం ఏర్పరచుకోకపోయినా ఆత్మీయంగా వారితో సమయం గడపకపోయినా 'మనం పట్టని తల్లిదండ్రుల' కంటే 'మనకు కిక్ ఇచ్చే డ్రగ్స్ మేలు' అనే భావనలో భ్రష్ట సాంగత్యాలలోకి పిల్లలు వెళతారు. ఆ సంగతి తెలియనివ్వరు. చదువుతో పాటు క్రీడలు, ప్రకృతి ప్రేమ, బంధుమిత్రులు, క్రమశిక్షణ గల ఆర్థిక పరిస్థితి, భావోద్వేగాలకు అయినవారు ఉన్నారన్న భరోసా, విలువలు లేదా ఏదో ఒక ఆధ్యాత్మిక ఆలంబన... ఇవి టీనేజ్ పిల్లల రోజువారీ జీవనంలో ఉంటే వారు డ్రగ్స్ బారిన ఏ మాత్రం పడరు. తల్లిదండ్రులూ బహుపరాక్.

అల్ట్రా రన్నర్ మీనల్

● 6 రోజులు .. 680 కిలోమీటర్ల పరుగు

ఆమె ఖాతాలో అనేక రేసులు పూర్తి చేసిన రికార్డులు ఉన్నాయి. భారతదేశపు అగ్రశ్రేణి అల్ట్రా రన్నర్‌గా పేరొందింది. పేరు మీనల్ కొటక్, గుర్గావ్‌వాసి. ఇటీవల 680కి పైగా కిలోమీటర్ల పరుగును 6 రోజుల్లో అంటే 144 గంటల్లో కవర్ చేసి సరికొత్త రికార్డ్‌ను నెలకొల్పిన మొదటి భారతీయ మహిళగా నిలిచింది. తనను తాను మెరుగుపరుచుకోవాలనే సంకల్పంతో అల్ట్రారన్‌లలో పాల్గొంటున్నాను అని చెబుతోంది మీనల్ కొటక్.


మీనల్ కొటక్

"పురుషుల రికార్డ్ ఇప్పటి వరకు 574.5 కిలోమీటర్లు ఉంటే, నా రికార్డ్ 680 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసింది. మిగతావారికంటే ఉన్నతంగా ఉండేలా నన్ను నేను మెరుగుపరుచుకోవాలన్నదే నా సంకల్పం. కిందటేడాది అమెరికాలోని మిల్వాకీలో జరిగిన అల్ట్రామారథాన్‌లో భారతదేశం తరపున పాల్గొన్న మల్టీ డే రికార్డ్ అసాధారణమైంది. ఇటీవల జరిగిన ఆరు రోజుల ఈవెంట్‌లోనూ నేనే ముందున్నాను. ఈ రేసుతో ఆసియాలో టాప్ 5 యాక్టివ్ రన్నర్‌గా, ప్రపంచంలో టాప్ 12 యాక్టివ్ 6–డే ఉమెన్ అల్ట్రారన్నర్‌లలో ఒకరిగా ఉన్నాను. నా మనుగడ కోసం మొండిగా పోరాడతాను. సుదీర్ఘమైన చలి, ఒంటరితనం దేనినీ లెక్కచేయను. చాలా కఠినమైన సాధన. నా ఎమోషన్స్ అన్నీ సమం చేసుకుంటూ ప్రయత్నం చేశాను. చివరకు నా సంకల్పం మనసు, శరీరంపై గెలిచింది.

మార్చిన పరుగు

2014లో ఒక ట్రెడ్‌మిల్ పరుగు నా రన్నింగ్ సామర్థ్యాన్ని, శక్తిని గ్రహించేలా చేసింది. నా బలాన్ని గుర్తించిన సరైన వ్యక్తుల సహాయంతో ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో పరుగెత్తాను. 34 సంవత్సరాల వయసులో వృత్తిపరమైన రన్నింగ్ అనుభవం లేకుండా పాల్గొన్న ఆ మారథాన్ నా జీవిత గమనాన్ని మార్చింది. ఆ సమయంలోనే మహిళా అల్ట్రారన్నర్‌లు చాలా తక్కువ మంది ఉన్నారని తెలిసి, ఆసక్తి కలిగింది. మారథాన్‌లకు భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించి, చరిత్ర సృష్టించాలనుకున్నాను. 2017లో 24 గంటల పరుగు విభాగంలో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించాను. అక్కడ నుంచి అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నా సామర్థ్యాన్ని గుర్తించింది. వారు నాకున్న రికార్డులన్నీ పరిశీలించారు. అలా 2017లో బెల్‌ఫాస్ట్‌లో తొలిసారిగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాను. ఆ తర్వాత 2018లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను.

డిప్రెషన్ నుంచి కోలుకొని...

2019లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి కొంత కాలానికి ముందు కాలికి తీవ్ర గాయమైంది. అనేక కారణాల వల్ల డిప్రెషన్ బారిన పడ్డాను. నా కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో బెడ్‌రెస్ట్‌లో ఉండటం వల్ల చాలా బాధపడ్డాను. మొత్తానికి ఆ ఒత్తిడిని జయించి ఇప్పుడు నా 44 ఏళ్ల వయసులో 680 కిలోమీటర్ల పరుగును సాధించేంతగా ఎదిగాను. ఏడాది కిందట అమెరికాలో 72 గంటల్లో 379 కిలోమీటర్లు పరుగును పూర్తి చేశాను. మూడేళ్లుగా ఈ రేసులను ట్రాక్ చేస్తున్నాను. ఇక్కడ ఆటలో మనసు శక్తి ఎంతటిదో తెలుసుకున్నాను.

ప్రణాళికతో దినచర్య

మల్టీడే రేసులు 24 గంటల రేసుల కంటే భిన్నంగా ఉంటాయి. ఒక క్రీడాకారుడు ఇక్కడ రోజుల తరబడి పరిగెత్తడంలో ఎన్నో ప్రణాళికలను అమలు పరచాల్సి ఉంటుంది. దీంతో గతంలోకంటే ఎక్కువ ప్రేరణ, మద్దతు అవసరం అవుతుంది. ఈ రేసులోకి వెళ్లడానికి మొదటి మూడు రోజులు ఆలోచించాను. ఒకసారి శిక్షణ మొదలుపెట్టాక ఇక ప్రణాళికలను అనుసరించేలా నా దినచర్య మారిపోయింది. రన్నింగ్ కోసం మాత్రమే కాదు ఒక రేసర్‌గా మిమ్మల్ని మీరు ఆవిష్కరించు కోవాలంటే పోషకాహారం వంటి అనేక ఇతర అంశాలు ప్రణాళికాబద్ధంగా ఉండాలి. ఒక గంట లేదా రెండు గంటలు నిద్ర, బట్టలు మార్చుకోవడం, ఆహారం తీసుకోవడం, కాళ్లకు బొబ్బలు రాకుండా చూసుకోవడం... వీటన్నింటిపైనా శిక్షణ ప్రారంభించినప్పటి నుండే శ్రద్ధ వహించాలి. మల్టీ డే రేసింగ్ ఆరోగ్య పోటీగా కూడా మార్చుకోవచ్చు.

ఇప్పటివరకు భారత దేశం నుండి ఏ మహిళ కూడా మల్టీ డే మారథాన్‌లో పాల్గొనలేదు. ఈ విషయం నన్ను ఆలోచించేలా, రికార్డ్‌ను సాధించేలా చేసింది. అల్ట్రారన్ రేస్‌లో మొదటి భారతీయ మహిళను నేనే అవుతానని అనుకోలేదు. మానవ పరిమితులన్నీ అధిగమించడానికి ఒక అడుగు ముందుకు వేసినందుకు సంతోషంగా ఉన్నాను. నా భర్త సచిన్ ఉద్యోగి అయినప్పటికీ నా ముఖ్యమైన రన్నింగ్‌రేసులన్నింటికీ తప్పక హాజరై, నన్ను జాగ్రత్తగా చూసుకుంటాడు" తన విజయపరంపరను వెనకాల ఉన్న రహస్యాలను వివరించింది మీనల్ కొటక్.

● అక్కా చెల్లెళ్లు

కల నిజం చేసుకున్నారు

ప్రతి కృషికి తగిన ఫలితం ఉంటుంది. ఇది నూటికి నూరుపాళ్లు నిజమని నిరూపిస్తున్నారు అనుజా గుప్తా, ప్రతాంక్షా గుప్తా అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు. ఢిల్లీవాసులైన వీరిద్దరూ ఐదేళ్ల క్రితం లక్షరూపాయలతో చికన్‌కారీ కుర్తీల వ్యాపారం మొదలుపెట్టారు. ఇప్పుడు 45 మంది ఉద్యోగులతో, ఐదుకోట్ల టర్నోవర్‌తో వ్యాపారాన్ని నడుపుతున్నారు. ఒడిదొడుకులను అధిగమిస్తూ వ్యాపారంలో మైలురాళ్లను అధిగమిస్తున్నారు.

అనుజా గుప్తా మాట్లాడుతూ "మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, పెరిగిన అక్కాచెల్లెళ్లం. మా వ్యాపారం ఇన్‌స్టాగ్రామ్ పేజీ నుంచి మొదలైంది. 2020లో కోవిడ్ కారణంగా మా వ్యాపార కలలు కూడా కనుమరుగవుతాయనుకున్నాం. చాలా వ్యాపార సంస్థలు లాక్‌డౌన్ సమయంలో మూలనపడ్డాయి. మేం మా వ్యాపారాన్ని నలభై చికన్‌కారీ కుర్తీలు, పలాజోలు, చీరలతో మొదలు పెట్టాం. మా వెంచర్ పేరు 'చౌకట్'. కోవిడ్ కాలంలో చాలామంది వద్ద డబ్బు లేదు. కాబట్టి మా దుస్తులు అమ్ముడవుతాయన్న గ్యారెంటీ మాకు లేదు. అలాగని మా వ్యాపారాన్ని మూసేయడానికి మేం సిద్ధంగా లేం. మా నిర్ణయం సరైనదేనని ఆ తర్వాత అర్థమైంది.


అనుజా గుప్తా


ప్రతాంక్షా గుప్తా

పెరిగిన ఆర్డర్లు

అమ్మకానికి ఉంచిన డ్రెస్సులు హాట్‌కేక్‌లుగా అమ్ముడయ్యాయి. మొదటి నెలలోనే 34 ఆర్డర్లు వచ్చాయి. దాంతో మా ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యింది. మరిన్ని ఆర్డర్లు వచ్చిన తర్వాత ఒక లాజిస్టిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. చికన్‌కారీ కుర్తీలు ఖరీదైనవి అనే అభిప్రాయాన్ని వారితో మాట్లాడి, మార్చగలిగాం. నాణ్యత విషయంలో రాజీపడకుండా తక్కువ ధరకే చికన్‌కారీ కుర్తీలు అందించ వచ్చని నిరూపించాం. ఈ నమ్మకం వల్లనే లాక్‌డౌన్ ప్రకటించిన ఇరవై రోజుల తర్వాత నుంచి కూడా మా 'చౌకట్' నుంచి దుస్తులు అమ్ముడు పోవడం పెరిగింది. కోవిడ్ కారణంగా డిజైనర్ల దగ్గరకు వెళ్లి, సరైనవి ఎంచుకునే పరిస్థితి లేదు. అలాంటప్పుడు మేమిద్దరం సొంతంగా డిజైన్ చేయాలని నిర్ణయించుకున్నాం. ఇది కూడా మరో మైలురాయిలా నిలిచింది.

అభిరుచులు వేరైనా సృజన ఒక్కటే

ఇప్పుడు మా సంస్థలో 45 మంది ఉద్యోగులు ఉన్నారు. దేశంలో 5 వేల మంది నేత కార్మికులతో భాగస్వామ్యం కలిగి ఉన్నాం. మా సంస్థకు విదేశాలలో కూడా క్లయింట్లు ఉన్నారు. డెబ్బైశాతానికి పైగా ఆర్డర్లు ఆన్‌లైన్‌లో డెలివరీ చేయబడతాయి. అక్కచెల్లెళ్లమే అయినా ఇలా కలిసి వ్యాపారం చేస్తామని కలలో కూడా అనుకోలేదు. మా ఇద్దరు చదువులు వేరు, అభిరుచులు వేరు. కానీ, మా ఇద్దరి ఆలోచన ఒక్కటిగా ఉన్నది 'చౌకట్' సృష్టించడంలో. నేను జర్నలిజంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేశాను. ప్రతాంక్షా గుప్తా ఫ్యాషన్/అప్పెరల్ డిజైన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మా అమ్మానాన్నలు మాకు పూర్తి సహకారం అదించడంతో నేడు మా కంపెనీ ఐదుకోట్ల టర్నోవర్‌కు చేరుకుంది" అని వివరిస్తారు ఈ సోదరీమణులు.


'చౌకట్' టీమ్

బ్యూటిప్



స్నానం చేయడానికి అర గంట ముందుగా కొబ్బరి పాలను ముఖానికి, దేహానికి పట్టించి మర్దన చేయాలి. దీనివల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది.

యూత్ పల్స్



శతకోటి సూర్యప్రభా భాసిత... వీరాధివీరా

– వెల్‌కమ్ టు గేమ్ జోన్

పురాణాలు ఇప్పుడు కాలక్షేపం కోసం కాదు. వయసు మళ్లిన వారి కోసం మాత్రమే కాదు. మిలీనియల్స్ నుంచి జెన్ జెడ్ వరకు యువతరం పురాణాలను ఇష్టపడుతోంది. అయితే అది చదువు రూపంలో కాదు. గేమింగ్ రూపంలో. ఇండియన్ మైథలాజికల్ గేమ్స్‌ను ఆడడానికి గేమర్స్‌లో 82 శాతం మంది ఇష్టపడుతున్నట్లు చెబుతోంది గేమింగ్ అండ్ ఇంటరాక్టివ్ మీడియా ఫండ్ సంస్థ లుమికై. అర్జునుడి నుంచి కర్ణుడి వరకు రకరకాల పురాణపాత్రలలో 'ప్లేయర్' రూపంలో పరకాయ ప్రవేశం చేస్తోంది యువతరం...

అహ్మదాబాద్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని శాన్వీకి గేమింగ్ అంటే బోలెడంత ఇష్టం. ఎక్కువ సమయాన్ని టెక్ట్స్‌బుక్స్‌తోనే గడిపే శాన్వీ కాసేపు వీడియో గేమ్స్ ఆడడం ద్వారా రిలాక్స్ అవుతుంది.

కొన్ని సంవత్సరాల క్రితం 'డెత్స్ డోర్' నుంచి 'మాన్‌స్టర్ హంటర్' వరకు ఎన్నో గేమ్స్ ఆడింది.

అయితే ఒక ఫ్రెండ్ సలహా ప్రకారం కొన్ని నెలల క్రితం తొలిసారిగా ఇండియన్ మైథలాజికల్ గేమ్ ఆడింది. ఇక అప్పటి నుంచి అలాంటి గేమ్స్ మాత్రమే ఆడుతోంది.

'మైథలాజికల్ గేమ్స్‌కు ఇతర గేమ్స్‌కు తేడా ఏమిటో తొలిసారిగా తెలుసుకున్నాను. ఇవి కేవలం కాలక్షేప ఆటలు కావు. పురాణ జ్ఞానాన్ని, తార్కిక శక్తిని పెంచుతాయి' అంటుంది శాన్వీ.

'చిన్న పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడంతో గేమ్స్ ఆడేవారి సంఖ్య పెరిగింది. మన దేశంలో పెద్ద గేమింగ్ కన్స్యూమర్ బేస్ ఉంది. గతంతో పోల్చితే వచ్చిన మార్పు ఏమిటంటే మన సాహిత్యం, సంస్కృతితో ముడిపడి ఉన్న పాత్రలను యువ గేమర్స్ ఇష్టపడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వరల్డ్–క్లాస్ టెక్నాలజీతో మన వైన పాత్రలను ఇండియన్ స్టూడియోలు డెవలప్ చేస్తున్నాయి' అంటుంది 'విన్‌జో గేమ్స్' కో–ఫౌండర్ సౌమ్య సింగ్ రాథోడ్.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మన పురాణాలు, చరిత్ర, సంస్కృతి, జానపద సాహిత్యంలోని పాత్రల ఆధారంగా మరిన్ని గేమ్స్ ఆన్‌లైన్ గేమింగ్ సెక్టార్ నుంచి రానున్నాయి అంటుంది సౌమ్య.

'పురాణాలను గేమింగ్‌తో మిళితం చేయడంతో ప్లేయర్స్ కొత్త రకం అనుభూతికి గురవుతున్నారు. అన్ని వయసుల వారిని ఈ గేమ్స్ ఆకట్టుకుంటున్నాయి' అంటున్నాడు 'ఇన్‌ఫోఎడ్జ్ వెంచర్స్' ఫౌండర్ చిన్మయ్ శర్మ.

'మన పురాణాల్లో దాగున్న ఎన్నో ఇతివృత్తాలు డెవలపర్‌లను ఆకర్షిస్తున్నాయి. ఆ పాత్రలు యూత్‌ను ఆకట్టుకునేలా గేమ్‌ను డిజైన్ చేస్తున్నారు' అంటున్నాడు యుగ్ మెటావర్స్ సీయీవో ఉత్కర్ష్ శుక్లా.

మైథలాజికల్ గేమ్స్ అనేవి ఎక్కువగా ఫస్ట్–పర్సన్ షూటర్(ఎఫ్‌పీఎస్) గేమ్స్. మెయిన్ క్యారెక్టర్‌లోకి పరకాయ ప్రవేశం చేసి ఆడే గేమ్స్.

'టెస్ట్ యువర్ స్కిల్స్ ఇన్ దిస్ ఎపిక్ స్ట్రాటజీ గేమ్' అంటూ ఆహ్వానించిన 'కురుక్షేత్ర: అసెన్షన్' ఢిల్లీకి చెందిన సజనికి బాగా నచ్చింది. ఈ వీడియో గేమ్‌లో అర్జునుడు, భీముడు, కర్ణుడు లాంటి ఎన్నో పాత్రలు ఉంటాయి.

'మైథలాజికల్ గేమ్స్ మనల్ని మన మూలాల్లోకి తీసుకువెళతాయి. మన పురాణాలు, జానపదాల ఆధారంగా గేమ్స్‌ను రూపొందించే అద్భుత అవకాశం ఇప్పుడు గేమ్ డెవలపర్‌లకు వచ్చింది. దేవ, దానవుల మధ్య యుద్ధానికి సంబంధించి సెకండ్ గేమ్‌ను రూపొందిస్తున్నాం' అంటున్నాడు 'కురుక్షేత్ర' గేమ్‌ను రూపొందించిన 'స్టూడియో సిరా' కో–ఫౌండర్ అభాస్ షా.

'కురుక్షేత్ర'ను తక్కువ సమయంలో ఆరు లక్షలమంది డౌన్‌లోడ్ చేసుకున్నారు.

మన దేశంలోనే కాదు ఆగ్నేయాసియా దేశాలలో కూడా భారతీయ పురాణాల ఆధారంగా రూపొందించిన గేమ్స్‌ను ఆడడానికి ఇష్టపడుతున్నారు. ఇష్టాన్ని క్యాష్ చేసుకోవడం అని కాకుండా ఈ గేమ్స్ ద్వారా యువతలో నైతిక విలువలు పాదుకొల్పే, ఆత్మస్థైర్యం పెంచగలిగే ప్రయత్నం చేస్తే భవిష్యత్ కాలంలో వాటికి మరింత ఆదరణ పెరుగుతుంది.

రాజీ పడకుండా...

నోడింగ్ హెడ్స్ గేమ్స్ కంపెనీ రూపొందించిన 'రాజీ యాన్ ఏన్షియెంట్ ఎపిక్' మనల్ని మన పురాణ ప్రపంచంలోకి తీసుకువెళుతుంది. మన దేవాలయాల సౌందర్యం నుంచి ఇతిహాస కళ వరకు ఈ గేమ్‌లో ప్రతిఫలిస్తుంది.

కంపెనీ ప్రారంభం నుంచి మన పురాణాల ఆధారంగా గేమ్‌ను రూపొందించాలని కల కన్నది పుణేకు చెందిన 'నోడింగ్ హెడ్స్ గేమ్స్' కంపెనీ ఫౌండర్ శృతి ఘోష్ 'రాజీ' రూపంలో తన కలను నిజం చేసుకుంది.

'గ్రీకు ఇతర పురాణాలు సినిమాలు, గేమ్స్ రూపంలో మనల్ని ఆకట్టుకున్నాయి. అయితే ఆ స్థాయిలో మన పురాణాలు గుర్తింపు పొందలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మన పురాణాల ఆధారంగా రాజీ గేమ్‌కు రూపకల్పన చేశాం. ఇది ఎంతో మంది డెవలపర్‌లకు స్ఫూర్తిని ఇచ్చింది. ఎంత చెప్పినా మన పురాణాల్లో నుంచి చెప్పడానికి ఇంకా ఎంతో ఉంటుంది' అంటుంది శృతి ఘోష్.


శృతి ఘోష్

"సెమీస్‌కు చేరడం కలగా ఉంది. ఇంకా నమ్మలేకపోతున్నాను. న్యూజిలాండ్‌పై గెలుపుతో మాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. మేం చేసింది తక్కువ స్కోరని తెలుసు. కానీ గట్టిగా పోరాడాలని నిర్ణయించుకున్నాం. మా ప్రణాళికలను సమర్థంగా అమలు చేశాం. జట్టులో ప్రతీ ఒక్కరు తమ పాత్ర సమర్థంగా పోషించారు. ఇది పెద్ద ఘనత మా దేశంలో ప్రజలకు సంతోషం పంచాలని కోరుకున్నాం. అక్కడ ఇప్పుడు సంబరాలు జరుగుతున్నాయి. మా ఆనందాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు. -రషీద్ ఖాన్, అఫ్గానిస్తాన్ కెప్టెన్

10 అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రపంచకప్ (వన్డే/టి20) టోర్నీల చరిత్రలో సెమీఫైనల్ దశకు చేరిన పదో జట్టుగా అఫ్గానిస్తాన్ గుర్తింపు పొందింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (1975), ఇంగ్లండ్ (1975), న్యూజిలాండ్ (1975), వెస్టిండీస్ (1975), పాకిస్తాన్ (1979), భారత్ (1983), దక్షిణాఫ్రికా (1992), శ్రీలంక (1996), కెన్యా (2003) జట్లు ఉన్నాయి.

1 ప్రపంచకప్ టోర్నీల్లో బంగ్లాదేశ్‌పై అఫ్గానిస్తాన్ తొలిసారి విజయం అందుకుంది. గతంలో బంగ్లాదేశ్‌తో జరిగిన నాలుగు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో (టి20 : 2014లో...వన్డే వరల్డ్‌కప్: 2015, 2019, 2023) అఫ్గానిస్తాన్ ఓడిపోయింది.

9 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌ల్లో ఇన్నింగ్స్‌లో నాలుగు అంతకన్నా ఎక్కువ వికెట్లు తీయడం రషీద్ ఖాన్‌కిది తొమ్మిదిసారి. షకీబ్ అల్ హసన్ (8 సార్లు) పేరిట ఉన్న రికార్డును రషీద్ బద్దలు కొట్టాడు.

న్యూజిలాండ్, ఆస్ట్రేలియావంటి జట్లను ఓడించి సెమీస్ వరకు సాగిన మీ ప్రయాణం అద్భుతం. మీ శ్రమకు, పట్టుదలకు ఫలితమే ఈ విజయం. మిమ్మల్ని చూసి గర్విస్తున్నా. దీనిని ఇలాగే కొనసాగించండి. - సచిన్ టెండూల్కర్

మైదానంలో దృశ్యాలు చాలా గొప్పగా కనిపిస్తున్నాయి. అఫ్గాన్‌కు గొప్ప విజయమిది. తొలిసారి సెమీస్ చేరిన పఠాన్లలో భావోద్వేగాలు బలంగా కనిపిస్తున్నాయి. అత్యుత్తమ క్రికెట్ ప్రదర్శన ఇది. -యువరాజ్ సింగ్"

అఫ్‘గన్’ పేలింది



టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో అఫ్గానిస్తాన్

తొలిసారి ఐసీసీ టోర్నీలో సెమీఫైనల్‌కు

- చివరి మ్యాచ్‌లో 8 పరుగులతో బంగ్లాదేశ్‌పై విజయం
- గెలిపించిన రషీద్, నవీన్, గుర్బాజ్
- గురువారం దక్షిణాఫ్రికాతో సెమీస్ పోరు

కన్నీళ్లు ఆగడం లేదు... భావోద్వేగాలను నియంత్రించుకోవడం సాధ్యం కావడం లేదు... పట్టరాని ఆనందాన్ని ప్రదర్శించేందుకు పదాలు దొరకడం లేదు... ఒకరు కాదు, ఇద్దరు కాదు అందరి ఆటగాళ్లది ఇదే పరిస్థితి... తాము సాధించిన ఘనత ఎంత అసాధారణమైనదో వారికి తెలుస్తున్నా ఇంకా నమ్మశక్యంగా అనిపించని స్థితి... సొంత దేశంలో క్రికెట్ మైదానంలో అడుగు పెట్టడమే కష్టంగా మారిపోగా... జట్టు సభ్యులంతా కలిసి సాధన చేసే అవకాశం లేకపోగా... ఎప్పుడో టోర్నీకి ముందు కలిసి ప్రాక్టీస్ చేయడమే... కానీ తమ పోరాటం, పట్టుదల ముందు వాటన్నంటినీ చిన్న విషయాలుగా మార్చేసింది. అగ్రశ్రేణి జట్లు క్రికెట్‌ను శాసిస్తున్న చోట అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ అసాధారణ ఆటను చూపించింది... అద్భుత ఆటతో సత్తా చాటుతూ ప్రపంచకప్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

టోర్నీకి ముందు అంచనాలు లేవు... అండర్‌డాగ్ కిందే లెక్క.. కానీ లీగ్ దశలో న్యూజిలాండ్‌పై భారీ విజయం గాలివాటం కాదని, సూపర్-8లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన వైనం అదృష్టం వల్ల కాదని అఫ్గానిస్తాన్ నిరూపించింది... గత టి20 వరల్డ్‌కప్‌లో ఒక్క విజయానికి కూడా నోచుకోని జట్టు ఇప్పుడు ఏకంగా సెమీస్ చేరింది. బంగ్లాదేశ్‌తో చివరి సూపర్-8 పోరులో విజయం దోబూచులాడింది. 115 పరుగులు మాత్రమే చేసి దానిని కాపాడుకోవడం అంత సులువు కాదు. కానీ అఫ్గాన్ ఆటగాళ్లంతా ప్రాణాలు పణంగా పెట్టినట్లు మైదానంలో పోరాడారు... మళ్లీ మళ్లీ పలకరిస్తూ వచ్చిన వర్షంతో కూడా పోటీ పడాల్సి వచ్చింది... చివరకు తాము అనుకున్నది సాధించారు. బంగ్లాపై పైచేయి సాధించి తొలిసారి ఓ ఐసీసీ టోర్నీలో సగర్వంగా సెమీస్ స్థానాన్ని ఖాయం చేసుకోగా, తాము ఎప్పటికీ మారమన్నట్లుగా బంగ్లాదేశ్ ఆటగాళ్లు నిష్క్రమించారు.

కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్): 'కమాన్ బంగ్లాదేశ్'... భారత్‌తో ఓటమి తర్వాత ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ మాట ఇది. ఆల్‌టైమ్ గ్రేట్ జట్టు కూడా మరో టీమ్ ప్రదర్శనను నమ్ముకుంటూ అదృష్టం పలకరిస్తుందేమోనని ఆశపడింది. బంగ్లాదేశ్ గెలిస్తే తాము సెమీఫైనల్ చేరవచ్చని కంగారూలు కలగన్నారు. కానీ అఫ్గానిస్తాన్ ఆ అవకాశం ఇవ్వలేదు. మంగళవారం జరిగిన గ్రూప్-1 చివరి సూపర్-8 మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 8 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. **భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం జరిగే తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో అఫ్గాన్ టీమ్... రాత్రి జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడతాయి.**

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 115 పరుగులు మాత్రమే చేయగలిగింది. రహ్మానుల్లా గుర్బాజ్ (55 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. బంగ్లాదేశ్ స్పిన్నర్ రిషాద్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ మధ్యలో వర్షం రావడంతో ఒక ఓవర్ తగ్గించి లక్ష్యాన్ని 19 ఓవర్లలో 114 పరుగులుగా నిర్దేశించారు. అయితే బంగ్లాదేశ్ 17.5 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. లిటన్ దాస్ (49 బంతుల్లో 54 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) పోరాటం వృథా కాగా... జట్టులో నలుగురు డకౌటయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నవీన్ ఉల్ హక్ (4/26), కెప్టెన్ రషీద్ ఖాన్ (4/23) ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. తాజా ఫలితంతో గ్రూప్-1 నుంచి 2 విజయాలతో 4 పాయింట్లు సాధించిన అఫ్గానిస్తాన్ రెండో స్థానంతో సెమీస్ చేరింది. బంగ్లాదేశ్ ఓటమితో ఆస్ట్రేలియా జట్టు కూడా 'సూపర్-8' దశలోనే ఇంటిదారి పట్టింది.



కాబూల్ వీధుల్లో అభిమానుల సంబరాలు

ఆద్యంతం 'డ్రామా' సాగి...

స్వల్ప స్కోర్ల ఈ మ్యాచ్ పలు మలుపులతో ఆసక్తికరంగా సాగింది. పదే పదే వాన అంతరాయం కలిగించడంతో విజయం దోబూచులాడింది. అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో గుర్బాజ్ మినహా అంతా విఫలమయ్యారు. అతను కూడా తన శైలికి భిన్నంగా చాలా నెమ్మదిగా ఆడాడు. చివర్లో రషీద్ ఖాన్ (10 బంతుల్లో 19 నాటౌట్; 3 సిక్స్‌లు) మెరుపులతో స్కోరు 100 పరుగులు దాటింది. రన్‌రేట్‌లో అఫ్గాన్, ఆసీస్‌లను దాటి సెమీస్ చేరాలంటే 12.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించాల్సిన స్థితిలో బంగ్లాదేశ్ మైదానంలోకి దిగింది. అయితే సెమీస్ సంగతేమో కానీ ఆ జట్టు మ్యాచ్ గెలిచే అన్ని అవకాశాలను కూడా వృథా చేసుకుంది. ఫజల్ తన తొలి ఓవర్లోనే తన్జీద్ (0)ను అవుట్ చేయగా, నవీన్ వరుస బంతుల్లో నజ్ముల్ (5), షకీబ్ (0)లను అవుట్ చేయడంతో స్కోరు 23/3 వద్ద నిలిచింది. ఈ దశలో వాన వచ్చి ఆగిన తర్వాత రషీద్ వరుస ఓవర్లలో సౌమ్య సర్కార్ (10), తౌహీద్ (14)లను వెనక్కి పంపించాడు. అయినా సరే చేతిలో 5 వికెట్లతో 56 బంతుల్లో 36 పరుగులు చేయాల్సిన బంగ్లాదేశ్ గెలిచే స్థితిలో నిలిచింది. కానీ రషీద్ మళ్లీ వరుస బంతుల్లో రెండు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తెచ్చుకున్నాడు. 81/7 నుంచి బంగ్లా డక్‌వర్త్ లూయిస్ స్కోరుతో పోటీ పడుతూ వచ్చింది. ఒక ఎండ్‌లో నిలిచిన దాస్ ఎంతో ప్రయత్నించినా... మరోవైపు మిగిలిన మూడు వికెట్లు తీసేందుకు అఫ్గాన్ బౌలర్లకు ఎక్కువ సమయం పట్టలేదు. ముస్తఫిజుర్‌ను నవీన్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేయడంతో అఫ్గాన్ ఆటగాళ్లు, అభిమానుల సంబరాలతో మైదానం హోరెత్తిపోగా... అక్కడి నుంచి దాదాపు 12 వేల కిలోమీటర్ల దూరంలో కాబూల్‌లో కూడా ఆ విజయధ్వానం బ్రహ్మాండంగా వినిపించింది!

ఉత్తమ నటుడు గుల్బదిన్!



11.4 ఓవర్ల తర్వాత బంగ్లా స్కోరు 81/7 వద్ద వానతో మ్యాచ్ ఆగినప్పుడు ఒక ఆసక్తికర ఘటన జరిగింది. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆ సమయానికి బంగ్లా 2 పరుగులు వెనుకబడి ఉంది. అక్కడే మ్యాచ్ ముగిసిపోతే అఫ్గాన్ గెలుస్తుంది. ఈ దశలో పరిస్థితి మెరుగ్గా ఉంది, తొందరపడ వద్దన్నట్లుగా డ్రెస్సింగ్ రూమ్ నుంచి అఫ్గాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ సైగ చేశాడు. అప్పటి వరకు స్లిప్‌లో చక్కగా ఫీల్డింగ్ చేస్తున్న గుల్బదిన్ 'అలా అయితే ఓకే' అన్నట్లుగా ఒక్కసారిగా కండరాలు పట్టేశాయంటూ కుప్పకూలిపోయాడు. ఆ వెంటనే పిచ్‌పై కవర్లు వచ్చేశాయి. అయితే ఆ తర్వాత మళ్లీ చక్కగా మైదానంలోకి దిగిన గుల్బదిన్ తర్వాతి వికెట్ కూడా తీశాడు. దాంతో ఇదంతా నటన అంటూ అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి. మ్యాచ్ తర్వాత రషీద్ మాత్రం తన ఆటగాడికి మద్దతుగా నిలిచాడు. నిజానికి అక్కడే మ్యాచ్ ముగిసి ఉంటే వివాదం జరిగేదేమో కానీ ఆట కొనసాగి ఆలౌట్ వరకు వెళ్లడంతో ఇది సమస్యగా మారలేదు.

'వెల్‌డన్'

- అంతర్జాతీయ క్రికెట్‌లో అఫ్గానిస్తాన్ ప్రస్థానం అసాధారణం
- అగ్రశ్రేణి జట్లకు దీటుగా ఎదిగిన వైనం

'మిమ్మల్ని నిరాశపర్చము, మీ నమ్మకాన్ని నిలబెడతాం'... టి20 వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందు జరిగిన వెల్‌కమ్ పార్టీలో క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారాతో రషీద్ ఖాన్ అన్న మాట ఇది. ఎందుకంటే ఈ టోర్నీలో సెమీస్ చేరే నాలుగు జట్ల పేర్లు చెప్పమని మాజీలు, విశ్లేషకులతో అడిగితే ఒక్క లారా మాత్రమే అఫ్గానిస్తాన్ పేరు చెప్పాడు. వారి ఆటపై అతనికి ఉన్న నమ్మకాన్ని ఇది చూపించింది. రేపు ట్రినిడాడ్‌లోని బ్రియాన్ లారా స్టేడియంలోనే రషీద్ బృందం సెమీఫైనల్ మ్యాచ్ ఆడబోతోంది! గత కొన్నేళ్లుగా అటు వన్డే, ఇటు టి20 ఫార్మాట్‌లలో నిలకడైన ప్రదర్శన కనబరుస్తూ వచ్చిన అఫ్గానిస్తాన్ ఇప్పుడు 'సంచలనాల' జట్టు నుంచి సమర్థమైన జట్టుగా ఎదిగింది. ప్రస్తుతం ఆ దేశంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా జట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కేంద్రంగానే తమ హోం మ్యాచ్‌లు ఆడుతోంది. ఆటగాళ్లంతా కూడా అక్కడే దాదాపుగా స్థిరపడ్డారు. 2023లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లోనే అఫ్గానిస్తాన్ పదును ఏమిటో ప్రపంచానికి తెలిసింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, పాకిస్తాన్‌లను ఓడించిన టీమ్, ఆస్ట్రేలియాను కూడా ఒకదశలో 91/7తో ఓటమి దిశగా నెట్టింది. ఆసీస్ అదృష్టవశాత్తూ మ్యాక్స్‌వెల్ అద్భుత ఇన్నింగ్స్ జట్టును గెలిపించినా... ఇప్పుడు టి20 వరల్డ్‌కప్ లో నాటి పనిని అఫ్గాన్ పూర్తి చేసింది. -సాక్షి క్రీడా విభాగం



నబీ

15 ఏళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆ జట్టు ప్రస్థానం ప్రారంభమైంది. ఆరంభంలో ఐసీసీ వరల్డ్ క్రికెట్ లీగ్-డివిజన్-5లో జపాన్, బోట్స్‌వానా వంటి జట్లతో తలపడిన టీమ్ ఇప్పుడు ఆసీస్, కివీస్, విండీస్, పాక్‌లను దాటి వరల్డ్ కప్ సెమీస్‌లోకి అడుగు పెట్టడం అసాధారణం. అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీ 15 ఏళ్లుగా జాతీయ జట్టుకు ఆడుతున్నాడు. అఫ్గాన్ పురోగతికి అతను ప్రత్యక్ష సాక్షి. అఫ్గాన్ తరఫున ఏకంగా 45 ప్రత్యర్థి దేశాలపై విజయం సాధించిన టీమ్‌లలో అతను భాగస్వామి. 'ఆరంభంలో మేం ఎదుర్కొన్న సమస్యలను దాటి ఇక్కడికి రావడం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. మా ఘనతల వెనక ఎన్నో కష్టాలు, త్యాగాలు ఉన్నాయి. అవి ఇప్పుడు ఫలితాన్ని అందించాయి' అని నబీ చెప్పాడు. ఈ టోర్నీలో అఫ్గాన్ టీమ్ ప్రదర్శనలతో పలువురు కీలక పాత్ర పోషించారు.



రషీద్ ఖాన్: కెప్టెన్‌గా జట్టుకు అన్నీ తానే, అంతటా తానే అయి నడిపిస్తున్నాడు. తన పదునైన లెగ్‌స్పిన్‌తో టోర్నీలో 16 వికెట్లు పడగొట్టిన రషీద్... బ్యాటింగ్‌లోనూ మెరుపులతో తన పాత్ర పోషించాడు. బంగ్లాతో మ్యాచ్‌లో అతని మూడు సిక్సర్లే చివరకు కీలకంగా మారాయి. ఆసీస్‌తో మ్యాచ్‌లో బౌలర్లను మార్చిన తీరులో అతని నాయకత్వ సామర్థ్యం కూడా కనిపించింది. 25 ఏళ్ల రషీద్ ఇప్పటి వరకు 92 టి20లు ఆడి 152 వికెట్లు తీయడంతోపాటు 452 పరుగులు సాధించాడు.



గుర్బాజ్: ఓపెనర్‌గా అతని దూకుడైన ఆట జట్టుకు మంచి ఆరంభాలను అందించి విజయానికి బాటలు వేసింది. 281 పరుగులతో ప్రస్తుతం టోర్నీ టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. ముఖ్యంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున ఐపీఎల్ అనుభవంతో ఇటీవల అతని బ్యాటింగ్ మరింత పదునెక్కింది. 22 ఏళ్ల గుర్బాజ్ ఇప్పటి వరకు 62 టి20లు ఆడి 1657 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 10 అర్ధ సెంచరీలు ఉన్నాయి.



నవీన్ ఉల్ హక్: ప్రధాన పేసర్‌గా జట్టుకు కీలక సమయాల్లో వికెట్లు అందించి పైచేయి సాధించేలా చేశాడు. టోర్నీలో 13 వికెట్లు తీసిన అతను బంగ్లాదేశ్‌పై ఆరంభంలో తీసిన 2 వికెట్లే విజయానికి బాటలు వేశాయి. ట్రవిస్ హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన అతని అవుట్‌స్వింగర్ టోర్నీకే హైలైట్‌గా నిలిచింది. 24 ఏళ్ల నవీన్ 44 టి20లు ఆడి 59 వికెట్లు పడగొట్టాడు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పలు ఫ్రాంచైజీ లీగ్‌లలో రెగ్యులర్‌గా ఆడుతున్నాడు.

'మీరు బాగా ఆడితే గెలిస్తే చాలు...అదే నాకు ఫీజు, పారితోషికం' – అజయ్ జడేజా (వన్డే వరల్డ్ కప్‌లో టీమ్‌కు మెంటార్‌గా పని చేసిన జడేజా అఫ్గాన్ బోర్డు నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకునేందుకు నిరాకరించాడు)



డ్వేన్ బ్రేవో (బౌలింగ్ కన్సల్టెంట్): 573 టి20 మ్యాచ్‌లు, 625 వికెట్లతో అపార అనుభవం ఉన్న విండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రేవోను ఈ టోర్నీ కోసం అఫ్గాన్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా నియమించుకుంది. అతడి నియామకాన్ని జట్టు సమర్థంగా వాడుకుంది. ముఖ్యంగా అఫ్గాన్ పేసర్ల బౌలింగ్‌లో ఆ తేడా కనిపించింది. టి20ల్లో స్లో బంతులను వాడే విషయంలో బ్రేవో సూచనలు, వ్యూహాలు అద్భుతంగా పని చేశాయి.

జొనాథన్ ట్రాట్: ఇంగ్లండ్ మాజీ ఆటగాడైన ట్రాట్ హెడ్ కోచ్‌గా జట్టు పురోగతిలో కీలక పాత్ర పోషించాడు. జూలై 2022 నుంచి అతను కోచ్‌గా కొనసాగుతున్నాడు. గత ఏడాదే పదవీ కాలం పూర్తయినా మళ్లీ అతడినే అఫ్గాన్ కొనసాగించింది. ట్రాట్ శిక్షణ, ప్రణాళికలు కొత్త తరహా టీమ్‌ను ప్రపంచానికి పరిచయం చేశాయి. ఇప్పుడు సరైన ఫలితాలు అందిస్తున్నాయి.




స్పెయిన్ ‘హ్యాట్రిక్’



ఫెరాన్ టోరెస్

డసెల్‌డార్ఫ్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ స్పెయిన్ జట్టు 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసింది. గ్రూప్ 'బి'లో భాగంగా అల్బేనియాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో స్పెయిన్ 1-0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 13వ నిమిషంలో స్పెయిన్ జట్టుకు ఫెరాన్ టోరెస్ ఏకైక గోల్ అందించాడు. మూడు విజయాలతో స్పెయిన్ తొమ్మిది పాయింట్లతో గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. గ్రూప్ 'బి'లో భాగంగా క్రొయేషియా జట్టుతో జరిగిన మ్యాచ్‌ను డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ 1-1తో 'డ్రా' చేసుకుంది. క్రొయేషియా తరఫున లూకా మోడ్రిచ్ (55వ ని.లో), ఇటలీ తరఫున జకాగ్ని (90+8వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. యూరో టోర్నీ చరిత్రలో గోల్ చేసిన అతి పెద్ద వయస్కుడిగా మోడ్రిచ్ (38 ఏళ్ల 289 రోజులు) గుర్తింపు పొందాడు. నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఇటలీ జట్టు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. గ్రూప్ 'డి'లో జరిగిన మ్యాచ్‌ల్లో ఆస్ట్రియా 3-2తో నెదర్లాండ్స్‌ను ఓడించగా... ఫ్రాన్స్, పోలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో 'డ్రా'గా ముగిసింది. 'డి' గ్రూప్ నుంచి ఆస్ట్రియా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్ ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాయి.

క్వార్టర్స్‌లో యూకీ జోడీ



న్యూఢిల్లీ: మలోర్కా చాంపియన్‌షిప్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ శుభారంభం చేసింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో యూకీ-ఒలివెట్టి ద్వయం 6-3, 6-3తో శ్రీరామ్ బాలాజీ (భారత్)-ల్యూక్ జాన్సన్ (బ్రిటన్) జంటపై నెగ్గింది. యూకీ జోడీ ఐదు ఏస్‌లు సంధించింది.

వార్నర్ వీడ్కోలు

అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ఆసీస్ స్టార్

దేవిడ్ వార్నర్ ఓ ఆస్ట్రేలియన్ క్రికెటర్ అంతే! అంతేనా అంటే కచ్చితంగా కాదు... మనకు బాగా తెలిసిన వ్యక్తి... మనల్ని మైదానంలో (ఐపీఎల్) ఆటతో, వెలుపల సతీసమేతంగా రీల్స్‌తో తెలుగు వాళ్లకు సుపరిచితుడు. అతని గురించి మూడే మూడు ముక్కల్లో చెప్పాలంటే ఓపెనింగ్‌లో విధ్వంసం, జట్టులో కీలకం, విజయాల్లో సంబరం! కానీ అతని బ్యాటింగ్ మెరుపులు ఇకపై అంతర్జాతీయ క్రికెట్‌లో కనిపించవు. ఆరు నెలల క్రితం టెస్టు, వన్డే ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పిన ఈ ఆస్ట్రేలియన్ తాజాగా టి20లకూ రిటైర్మెంట్ ప్రకటించడంతో అతని విధ్వంసరచన ఇకమీదట ఫ్రాంచైజీ ప్రైవేట్ టి20 లీగ్‌లకే పరిమితం కానుంది.

మెల్‌బోర్న్: ఓపెనింగ్‌లో బ్యాటింగ్‌కు దిగి ప్రత్యర్థి బౌలర్ల పాలిట సింహస్వప్నంగా మారి కంగారు పెట్టించిన ఈ కంగారూ క్రికెటర్ వార్నర్ అంతర్జాతీయ ఆటకు సంపూర్ణంగా టాటా చెప్పేశాడు. తాజాగా టి20లకు గుడ్‌బై చెప్పడం ద్వారా 15 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు 37 ఏళ్ల వార్నర్ వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ బ్యాటర్లలో ఒకడైన వార్నర్ ఇన్నింగ్స్‌కు అర్ష్‌దీప్ తెరదించాడు. అతని చివరి ఇన్నింగ్స్ స్కోరు 6. నిరాశగా వెనుదిరగడం మినహా 'గార్డ్ ఆఫ్ ఆనర్' గానీ స్టాండింగ్ ఒవేషన్ గానీ అందుకోలేకపోయాడు. అతని అంతిమ స్కోరు నిరాశపరిచిందేమో కానీ... అతనే ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో అత్యధిక పరుగుల (3277) వీరుడు. అన్ని ఫార్మాట్లలో కలిపి చూసుకున్న అతను చేసిందేమాత్రం తక్కువ కాదు. టెస్టు, వన్డే, టి20లు కలిపి దాదాపు 19 వేల పరుగులు (18,995) సాధించాడు. 49 సెంచరీలు బాదాడు. 98 అర్ధశతకాలు చేశాడు. సొంతగడ్డపై 2009 జనవరిలో సఫారీతో టి20 మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అదే నెల అదే ప్రత్యర్థిపై వన్డే కెరీర్ మొదలుపెట్టాడు. కానీ ఈ విధ్వంసకారుడు సంప్రదాయ టెస్టులు ఆడేందుకు దాదాపు మూడేళ్లు పట్టింది. 2011 డిసెంబర్‌లో కివీస్‌పై ఐదు రోజుల ఆటకు శ్రీకారం చుట్టాడు.

ముగింపు ఇలా...

ఓపెనర్‌గా విజయవంతమైన వార్నర్ ఆట భారత్‌తోనే ముగిసింది. గత నవంబర్లో భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్లో భారత్‌పై ఆడాకా ఆసీస్ విజేతగా నిలువడంతోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పుడు మళ్లీ ప్రస్తుత టి20 ప్రపంచకప్‌లో సూపర్-8 దశలో భారత్‌తోనే (మొత్తం అంతర్జాతీయ) కెరీర్‌కు మంగళం పాడాడు.

మరక పడిందిలా...


ఆటలో మేటి, ఓపెనింగ్‌లో ఘనాపాటి. మైదానంలో చిన్నచిన్న స్లెడ్జింగ్ ఉండేదేమో కానీ బాల్ టాంపరింగ్ కంటే ముందు వార్నర్ పక్కా జెంటిల్‌మేనే! 2018లో సఫారీ పర్యటనలో మూడో టెస్టు (కేప్‌టౌన్‌లో) సందర్భంగా వైస్ కెప్టెన్‌గా ఉన్న వార్నర్, కెప్టెన్ స్మిత్, బౌలర్ బ్యాంక్రాఫ్ట్‌తో కలిసి బాల్ టాంపరింగ్ (బంతి ఆకారం మార్చడం)కు పాల్పడంతో ఏడాది పాటు నిషేధానికి, కెరీర్ అసాంతం కెప్టెన్సీకి దూరమయ్యాడు.



ఆడిన టెస్టులు: 112	ఆడిన వన్డేలు: 161	ఆడిన టి20లు: 110
చేసిన పరుగులు: 8786	చేసిన పరుగులు: 6932	చేసిన పరుగులు: 3277
సెంచరీలు: 26	సెంచరీలు: 22	సెంచరీలు: 1
అర్ధ సెంచరీలు: 37	అర్ధ సెంచరీలు: 33	అర్ధ సెంచరీలు: 28
అత్యధిక స్కోరు: 335 నాటౌట్	అత్యధిక స్కోరు: 179	అత్యధిక స్కోరు: 100 నాటౌట్

'డక్‌వర్త్' కన్నుమూత

న్యూఢిల్లీ: క్రికెట్‌లో వానొచ్చినపుడల్లా వినిపించే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి రూపకర్తల్లో ఒకరైన ఫ్రాంక్ డక్‌వర్త్ కన్నుమూశారు. అయితే ఆయన మరణవార్త కాస్త ఆలస్యంగా వెలువడింది. 84 ఏళ్ల డక్‌వర్త్ ఈ నెల 21నే వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచారు. కానీ ఓ వెబ్‌సైట్ ద్వారా మంగళవారం ఆ వార్త వెలుగులోకి వచ్చింది. ఇక డీఎల్ విషయానికొస్తే డక్‌వర్త్, లూయిస్ ఇద్దరు కలిసి ఆవిష్కరించిన ఈ పద్ధతిని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తొలిసారి 1997లో అమలు చేసింది. తదనంతరం ఆస్ట్రేలియాకు చెందిన గణాంక నిపుణుడు స్టీవెన్ స్టెర్న్... డీఎల్‌కు కొన్ని మార్పుచేర్పులు చేశారు. అప్పటి నుంచి డీఎల్ కాస్త డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ (డీఎల్ఎస్)గా స్థిరపడింది. క్రికెట్‌లో వాన ముంచెత్తితే మ్యాచ్ రద్దవుతుంది. వాన పడి ఆగిపోయాక నిర్వహిస్తే, లేదంటే అప్పటివరకు జరిగిన మ్యాచ్‌లో ఫలితాన్ని తేల్చాలంటే, లక్ష్యాన్ని సవరించాలంటే డీఎల్ఎస్‌నే ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారు.



పాక్‌తో భారత్ తొలిపోరు

మహిళల టి20 ఆసియా కప్ టోర్నీ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల జట్టు ఆసియా కప్ టి20 టైటిల్ వేటను ఆరంభించనుంది. జూలై 19 నుంచి 28 వరకు శ్రీలంకలోని దంబుల్లా నగరంలో ఈ టోర్నీ జరగనుంది. మొత్తం 8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, యూఏఈ, నేపాల్... గ్రూప్ 'బి'లో శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేసియా జట్లున్నాయి. జూలై 19న పాకిస్తాన్‌తో మ్యాచ్ అనంతరం భారత జట్టు 21న యూఏఈతో, 23న నేపాల్‌తో ఆడతాయి. రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరతాయి.

టాప్-10లో స్మృతి, హర్మన్‌ప్రీత్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ టాప్-10లో ఉన్నారు. గతవారం మూడో స్థానంలో ఉన్న స్మృతి ఒక స్థానం పడిపోయి నాలుగో ర్యాంక్‌లో నిలువగా... హర్మన్‌ప్రీత్ రెండు స్థానాలు ఎగబాకి తొమ్మిదో ర్యాంక్‌కు చేరుకుంది.



సాక్షి బిజినెస్

బుధవారం
26-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	712	183
	78,054	23,721

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,666	▲	170
డోజోన్స్	39,108	▽	303
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,248	▽	34
డాక్స్	18,178	▽	148
షాంఘై	2,950	▽	13
నికాయ్	39,173	▲	369

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	70,510
బంగారం (22 క్యారట్)	67,150
వెండి (కిలో)	95,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎటీఐ	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎటీఐ	104.84	107.40
€	యూరో	ఎటీఐ	88.58	90.54
¥	జపాన్ ఎన్ (100)	ఎటీఐ	51.88	53.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎటీఐ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44

సినాప్సిస్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ జోడీ



న్యూఢిల్లీ: ఐటీ రంగంలో ఉన్న యూఎస్ కంపెనీ సినాప్సిస్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు టాటా ఎలక్ట్రానిక్స్ తెలిపింది. ఇందులో భాగంగా ధోలేరాలో టాటా ఏర్పాటు చేస్తున్న సెమీకండక్టర్ ప్లాంట్‌కు ప్రాసెస్ టెక్నాలజీ, ఫౌండ్రీ డిజైన్ ప్లాట్‌ఫామ్ కోసం సినాప్సిస్ సహకారం తీసుకోనుంది. రూ.91,000 కోట్ల వ్యయంతో టాటా ఎలక్ట్రానిక్స్ గుజరాత్‌లోని ధోలేరాలో సెమీకండక్టర్ వేఫర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్‌ను నిర్మిస్తోంది.

రూ. 2,000 కోట్లతో ఎంఐపీపీఎల్ విస్తరణ




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంఎస్ అగర్వాల్ గ్రూప్‌లో భాగమైన ఉక్కు ఉత్పత్తుల తయారీ సంస్థ మారుతీ ఇస్పాత్ అండ్ పైప్స్ (ఎంఐపీపీఎల్) వచ్చే అయిదేళ్లలో కార్యకలాపాల విస్తరణపై రూ. 2,000 కోట్లు వెచ్చించనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం ప్లాంట్ విస్తరణతో పాటు ఉత్తరాది మార్కెట్లోనూ తయారీపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో అభిషేక్ అగర్వాల్ వెల్లడించారు. ఈఆర్‌డబ్ల్యూ రకం స్టీల్ పైపుల కోసం ఎంఎస్ వాయు పేరిట కొత్త బ్రాండింగ్‌ను ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో టర్నోవరు రూ. 1,500 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 2026లో ఐపీవో ద్వారా రూ. 400 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం 2,000 మంది సిబ్బంది ఉండగా కొత్తగా 10,000 మందిని తీసుకోనున్నట్లు అగర్వాల్ పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-6-2024	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

సెన్సెక్స్ @ 78,000



- నిఫ్టీ 23,750 స్థాయిపైకి
- ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు
- ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రయ్

ముంబై: ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం ఇంట్రాడే, ముగింపులోనూ జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. సెన్సెక్స్ తొలిసారి 78 వేల మైలురాయిని అధిగమించింది. నిఫ్టీ ఈ ఏడాదిలో 34వ సారి సరికొత్త రికార్డును నెలకొల్పింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. మిడ్‌సెషన్ నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో ఊహించని రీతిలో పుంజుకున్నాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 823 పాయింట్లు ఎగసి 78,165 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 712 పాయింట్ల లాభంతో 78,054 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 216 పాయింట్లు బలపడి 23,754 వద్ద తాజా గరిష్టాన్ని నెలకొల్పింది. ఆఖరికి 183 పాయింట్లు బలపడి 23,721 వద్ద నిలిచింది. రికార్డుల ర్యాలీలోనూ రియల్టీ, విద్యుత్, వినిమయ, మెటల్, టెలికం షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

రికార్డుల ర్యాలీకి కారణాలు

- కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, సంస్కరణల కొనసాగింపుపై ఆశలు, అధికారం చేపట్టిన తొలి 100 రోజుల ప్రణాళికల అమలుపై మంత్రిత్వ శాఖలు దృష్టి సారించడంతో ట్రేడర్లు ఎఫ్అండ్ఓలపై బుల్లిష్ వైఖరి ప్రదర్శించారు. నిఫ్టీ జూలై సిరీస్ ఫ్యూచర్ కాంట్రాక్టుల్లోకి పొజిషన్లను రోలోవర్ చేసుకునేందుకు ట్రేడర్లు ఆసక్తి చూపుతున్నట్లు ఎఫ్అండ్ఓ గణాంకాలు సూచిస్తున్నాయి.
- ఇటీవల ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో ర్యాలీ మందగించడంతో మంగళవారం సూచీల్లో అధిక వెయిటేజీ కలిగిన ప్రైవేటు రంగ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. యాక్సిస్ బ్యాంక్ 3.50%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.50%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.32% కోటక్ బ్యాంక్ అరశాతం మేర రాణించాయి. అలాగే పీఎస్‌యూ ఎస్‌బీఐ బ్యాంకు షేరూ ఒకశాతానికి పైగా లాభపడింది.
- మూడోసారి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో విదేశీ ఇన్వెస్టర్లు ఇండెక్స్ ఫ్యూచర్లలో షార్ట్ పొజిషన్లను కవరింగ్ చేయడంతో పాటు క్రమంగా లాంగ్ పొజిషన్లను బిల్డ్ చేసుకున్నారు. గడచిన ఏడు ట్రేడింగ్ సెషన్లలో ఇండెక్స్ ఫ్యూచర్లలో నికర కొనుగోలుదారులుగా నిలిచారు. ఇండెక్సు ఫ్యూచర్లలో 59.08 శాతం లాంగ్ పొజిషన్లను కలిగి ఉన్నారు. ఇది గత రెండు నెలల్లో అత్యధికం.
- గత ఆర్థిక సంవత్సరంలో జనవరి-మార్చి త్రైమాసికంలో మనదేశ కరెంట్ ఖాతా మిగులు 5.7 మిలియన్ డాలర్లుగా ఉందని, ఇది జీడీపీలో 0.6 శాతానికి సమానమని ఆర్‌బీఐ ప్రకటించింది. ఇది సానుకూల సంకేతం కావడంతో ఇన్వెస్టర్లు భారీ కొనుగోళ్లకు మొగ్గుచూపారు. అలాగే అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై స్పష్టత ఇచ్చిన తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు మన మార్కెట్లలో పెట్టుబడులు పెంచవచ్చని, రూపాయి మారకంపై ఒత్తిడి తగ్గే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు సూచీలకు కలిసొచ్చాయి.

■ అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ షేరు 19% పెరిగి రూ.1,647 వద్ద ముగిసింది. లిథియం అయాన్ సెల్స్ ఉత్పత్తి చేసేందుకు స్లొవేకియా సంస్థ జీఐబీ ఎనర్జీఎక్స్‌తో ఈ సంస్థ లైసెన్సింగ్ డీల్ కుదుర్చుకోవడం ఇందుకు కారణం.

■ ప్రైవేటు రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంకు షేరు 2.5% పెరిగి రూ.1199 వద్ద స్థిరపడింది. దీంతో బ్యాంకు మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల (రూ.8.43 లక్షల కోట్లు) వద్ద ముగిసింది.

స్టాన్లీ లైఫ్‌స్టైల్ ఐపీవో సక్సెస్ | 96 రెట్లు అధిక స్పందన

లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్(కంపెనీ) స్టాన్లీ లైఫ్‌స్టైల్ పబ్లిక్ ఇష్యూకు భారీ స్పందన లభించింది. ఇష్యూ చివరి రోజు మంగళవారానికల్లా 96 రెట్లు సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. కంపెనీ 1.02 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. దాదాపు 98.57 కోట్ల షేర్లకు స్పందన లభించింది. రిటైల్ ఇన్వెస్టర్లు 18 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. షేరుకి రూ. 351-369 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 537 కోట్లు సమీకరించింది.

5జీ స్పెక్ట్రమ్ వేలం.. రూ.11వేల కోట్ల బిడ్లు

మొదటిరోజు మంచి స్పందన



న్యూఢిల్లీ: 5జీ స్పెక్ట్రమ్ వేలం మొదటి రోజున మంచి డిమాండ్ కనిపించింది. మంగళవారం మొత్తం ఐదు రౌండ్లలో టెలికం ఆపరేటర్లు రూ.11వేల కోట్ల మేర బిడ్లు దాఖలు చేశారు. రూ.96,238 కోట్ల విలువ చేసే 10,500 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను కేంద్ర ప్రభుత్వం వేలానికి ఉంచింది. 900, 1800, 2100, 2500 మెగాహెర్జ్ బ్యాండ్లలో స్పెక్ట్రమ్ కోసం ఆపరేటర్లు ఆసక్తి చూపించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వేలంలో పాల్గొన్నాయి. అత్యధికంగా రిలయన్స్ జియో రూ.3,000 కోట్లను ముందస్తుగా డిపాజిట్ చేసింది. దీంతో ఎక్కువ స్పెక్ట్రమ్ కోసం రిలయన్స్ పోటీ పడనున్నట్టు తెలుస్తోంది. భారతీ ఎయిర్‌టెల్ రూ.1,050 కోట్లను, వొడాఫోన్ రూ.300 కోట్ల చొప్పున డిపాజిట్ చేశాయి. 2010లో ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ మొదలైన తర్వాత ఇది పదో విడత స్పెక్ట్రమ్ వేలం కావడం గమనార్హం. కేంద్ర సర్కారు చివరిగా 2022 ఆగస్ట్‌లో వేలం నిర్వహించింది. వేలం బుధవారం తిరిగి ప్రారంభమవుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

బజాజ్ ఫైనాన్స్‌తో టాటా మోటార్స్ జట్టు



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ తాజాగా బ్యాంకింగేతర రుణ సంస్థ బజాజ్ ఫైనాన్స్‌తో చేతులు కలిపింది. ఇందులో భాగంగా టాటా వాణిజ్య వాహనాల కొనుగోలుకు కస్టమర్లకు సులభ వాయిదాల్లో రుణాలను బజాజ్ ఫైనాన్స్ సమకూరుస్తుంది. దేశంలో మారుమూల పల్లెలకూ బజాజ్ ఫైనాన్స్ చొచ్చుకుపోయిందని, వినియోగదార్లకు సులభంగా రుణం లభించేందుకు ఈ భాగస్వామ్యం ద్వారా వీలవుతుందని టాటా మోటార్స్ మంగళవారం తెలిపింది. తాజా డీల్ ద్వారా బజాజ్ ఫైనాన్స్ వాణిజ్య వాహనాల రుణ విభాగంలోకి ప్రవేశించినట్టు అయింది. బజాజ్ ఫైనాన్స్‌కు దేశవ్యాప్తంగా 8.36 కోట్ల మందికిపైగా కస్టమర్లు ఉన్నారు.

భారీ పెట్టుబడులకు అదానీ రెడీ

- రెన్యువబుల్స్‌పై రూ. 2 లక్షల కోట్లు
- 2030కల్లా 50 గిగావాట్ల సామర్థ్యం



అహ్మదాబాద్: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ పునరుత్పాదక (రెన్యువబుల్స్) విద్యుదుత్పత్తిపై భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. 2030కల్లా 40 గిగావాట్ల (జీడబ్ల్యూ) పునరుత్పాదక సామర్థ్యాన్ని నిర్మించే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడులకు సిద్ధపడుతోంది. తద్వారా 2050కల్లా వివిధ బిజినెస్‌లలో నికరంగా కర్బనరహితం(నెట్ జీరో)గా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం గ్రూప్ పునరుత్పాదక(సౌర, పవన) విద్యుత్‌లో 10 గిగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇకపై ప్రతీ ఏడాది 6-7 జీడబ్ల్యూను జత చేసుకోవాలని చూస్తోంది. వెరసి 2030కల్లా 50 గిగావాట్లకు చేరుకునే లక్ష్యంతో పనిచేస్తోంది. ఒక్కో మెగావాట్‌కు రూ. 5 కోట్ల పెట్టుబడుల అంచనాతో మదింపు చేస్తే 2030కల్లా రూ. 2 లక్షల కోట్లను వెచ్చించవలసి ఉంటుందని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ వెల్లడించారు. వీటితోపాటు 5 జీడబ్ల్యూ పంప్ స్టోరేజీ సామర్థ్యాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ సీఈవో అమిత్ సింగ్ తెలిపారు. విద్యుత్‌కు అధిక డిమాండ్ నెలకొనే రాత్రి వేళల్లో విద్యుదుత్పత్తికి వీలుగా స్టోరేజీ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వివరించారు.

కార్బన్ క్రెడిట్స్..

రెన్యువబుల్ సామర్థ్యాల వినియోగం ద్వారా లభించే కార్బన్ క్రెడిట్స్‌కుతోడు మరికొన్ని ఇతర చర్యల ద్వారా 2050కల్లా అదానీ గ్రూప్ నెట్ జీరోకు చేరనున్నట్లు అమిత్ పేర్కొన్నారు. గతేడాది(2023-24) అదానీ గ్రీన్ ఎనర్జీ 2.8 జీడబ్ల్యూ సామర్థ్యాలను జత చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం(2024-25)లో 6 జీడబ్ల్యూ సామర్థ్యాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కాగా, అదానీ గ్రూప్ ఈ ఏడాది (2024-25) వివిధ విభాగాలపై భారీ పెట్టుబడుల ప్రణాళికలు ప్రకటించింది. వివిధ కంపెనీలలో రూ. 1.3 లక్షల కోట్లు వెచ్చించనుంది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ టెర్మ్ ప్లాన్‌పై డిస్కౌంట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ సరికొత్త ఆఫర్‌కు తెరతీసింది. టర్మ్ ప్లాన్ అయిన ఐప్రొటెక్ట్ స్మార్ట్ కొనుగోలుపై మహిళలకు 15 శాతం లైఫ్‌టైమ్ డిస్కౌంట్ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఉద్యోగం చేస్తున్న మహిళలకు తొలి ఏడాది ప్రీమియంపై అదనంగా 15 శాతం తగ్గింపు ఇస్తారు. బ్రెస్ట్, ఒవేరియన్, యుటిరిన్, సెర్వికల్ క్యాన్సర్స్ వంటి 34 క్లిష్ట అనారోగ్య సమస్యలకు కవరేజ్ ఎంచుకోవచ్చు. మరణం, ప్రాణాంతక అనారోగ్యం, వైకల్యంతో సహా జీవితంలోని అనిశ్చితి నుండి ఆర్థిక రక్షణను ఐప్రొటెక్ట్ స్మార్ట్ అందిస్తుంది. 99 సంవత్సరాల వయస్సు వరకు లైఫ్ కవర్‌ను ఆఫర్ చేస్తోంది.



సినిమా

చిన్న కథ కాదు!



● నివేదా థామస్

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35 - చిన్న కథ కాదు'. ఈ చిత్రానికి నంద కిశోర్ ఈమాని దర్శకత్వం వహించారు. సురేష్ ప్రొడక్షన్స్ ఎస్. ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ పై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి '35- చిన్న కథ కాదు' అనే టైటిల్‌ని ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఆగస్టు 15న సినిమాని తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు కూడా అధికారికంగా ప్రకటించారు. ''క్లీన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా '35-చిన్న కథ కాదు'. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా చక్కని వినోదంతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా సిద్ధమైంది. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, కెమెరా నికేత్ బొమ్మి.

నిశి తొలిచాడు దీపమై...



● దీపికా పదుకోన్

'అధర్మాన్ని అణచెయ్యగ యుగయుగాన జగములోన పరిపరి విధాల్లోన విభవించే విక్రమ విరాట్ రూపమితడే... స్వధర్మాన్ని పరిరక్షించగ సమస్తాన్ని ప్రక్షాళించగ సముద్భవించే అవతారమిదే...' అంటూ మొదలవుతుంది 'కల్కి' థీమ్ సాంగ్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కల్కి 2898ఏడీ'. ఈ చిత్రంలో దీపికా పదుకోన్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా 'థీమ్ ఆఫ్ కల్కి' పాటను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణచేయగా..' అంటూ మొదలై... 'నిశి తొలిచాడు దీపమై... నిధనం తన ధ్యేయమై... వాయువే వేగమై...కలియుగ స్థితి లయలే కలబోసే కల్కి ఇతడే...' అనే లిరిక్స్‌తో 'థీమ్ ఆఫ్ కల్కి' సాగుతుంది. కాలభైరవ, సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా కాలభైరవ పాడారు.

పారిపోలేరు... దాక్కోనూలేరు



● కమల్‌హాసన్

'ఊరారా ఇది... చదువుకు తగ్గ జాబ్ లేదు... జాబ్‌కి తగ్గ జీతం లేదు... కట్టిన ట్యాక్స్‌కి తగినట్టు ఫెసిలిటీస్ దొరకడం లేదు', 'దొంగలించేవాడు దొంగలిస్తూనే ఉంటాడు, తప్పు చేసేవాడు తప్పు చేస్తూనే ఉంటాడు' అంటూ ఓ మహిళ ఆవేదనతో చెప్పే డైలాగులతో 'భారతీయుడు 2' ట్రైలర్ ఆరంభమైంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'భారతీయుడు 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'భారతీయుడు' (1996)కి సీక్వెల్‌గా 'భారతీయుడు 2, భారతీయుడు 3' చిత్రాలు రూపొందాయి. సిద్ధార్థ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, గుల్షన్ గ్రోవర్ ఇతర పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్థానీ 2' పేరుతో జూలై 12న విడుదల కానుంది. కాగా మంగళవారం ముంబైలో 'భారతీయుడు 2' ట్రైలర్ లాంచ్ వేడుకని నిర్వహించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ట్రైలర్స్‌ని విడుదల చేశారు మేకర్స్. 'ఇది రెండో స్వాతంత్ర్య పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు... నేతాజీ మార్గంలో నేను', 'సో పారిపోలేరు... దాక్కోనూలేరు', 'టామ్ అండ్ జెర్రీ ఆట ఆరంభమైంది' అంటూ కమల్‌హాసన్ చెప్పే డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ఇదిలా ఉంటే... 'భారతీయుడు 2' మూవీ తెలుగు హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పీ, సీడెడ్ హక్కులను శ్రీ లక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి.

థ్రిల్లింగ్ షణ్ముఖ



● షణ్ముగం, ఆది సాయికుమార్, అవికా గోర్

ఆది సాయికుమార్, అవికా గోర్ హీరో హీరోయిన్లుగా నటించిన డివోషనల్ థ్రిల్లర్ మూవీ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహించారు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు షణ్ముగం మాట్లాడుతూ- ''ఆది కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన డివోషనల్ పాయింట్‌తో విజువల్ వండర్‌లా ఈ చిత్రం ఉంటుంది. గ్రాఫిక్స్ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. 'కేజీఎఫ్, సలార్' సినిమాలకు సంగీతం అందించిన రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతం అందించారు. హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో జరిగిన చివరి షెడ్యూల్ చిత్రీకరణతో ఈ సినిమా షూటింగ్ పూర్తయింది త్వరలో నిర్మాణానంతర కార్యక్రమాలు ఆరంభిస్తాం'' అని పేర్కొన్నారు.

సెప్టెంబరులో ఎమర్జెన్సీ



● కంగనా రనౌత్

భారతదేశంలో ఏర్పడ్డ ఎమర్జెన్సీ (25 జూన్ 1975 - 21 మార్చి 1977) పరిస్థితుల ఆధారంగా హిందీలో తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ'. కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన సినిమా ఇది. ఈ చిత్రంలో భారతదేశ దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పాత్రలో కంగనా రనౌత్ నటించారు. అనుపమ్ ఖేర్, శ్రేయాస్ తల్పాడే, అశోక్ చక్రా, మహిమా చౌదరి ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాను కంగనా రనౌత్, పి. రేణు నిర్మించారు. ఈ సినిమాను తొలుత గత నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ కుదర్లేదు. ఆ తర్వాత ఈ ఏడాది జూన్ 14న రిలీజ్‌కు ప్లాన్ చేశారు. ఆ తేదీకి కూడా రాలేదు. తాజాగా 'ఎమర్జెన్సీ'ని సెప్టెంబరు 6న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ''భారతదేశంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ఏర్పడి జూన్ 25 నాటికి 49 సంవత్సరాలు పూర్తయి, 50వ ఏడాదిలోకి అడుగుపెట్టాం. నాటి పరిస్థితుల నేపథ్యంలో తీసిన 'ఎమర్జెన్సీ'ని సెప్టెంబరు 6న విడుదల చేస్తున్నాం. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలోని ఈ వివాదాస్పదమైన ఎపిసోడ్‌ను మా సినిమాలో చూపించబోతున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

హీరోయిజమ్ చూపించాలని బడ్డీ చేయలేదు - అల్లు శిరీష్



● గాయత్రి, అల్లు శిరీష్, ప్రిషా

''బడ్డీ'లో హీరో నేను కాదు.. టెడ్డీ బేర్. ఆ పాత్ర నచ్చడంతోనే ఈ సినిమా చేశాను... అంతేకానీ నా హీరోయిజమ్ చూపించాలని కాదు. జ్ఞానవేల్ రాజా గారికి థ్యాంక్స్. మా నాన్న (నిర్మాత అల్లు అరవింద్) కూడా నాపై ఇంత ఖర్చు పెట్టి సినిమా నిర్మించలేదు. భారీ బడ్జెట్‌తో నాతో బిగ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ తీశారు జ్ఞానవేల్ గారు'' అని అల్లు శిరీష్ అన్నారు. శ్యామ్ ఆంటోన్ దర్శకత్వంలో అల్లు శిరీష్ హీరోగా గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బడ్డీ'. కేఈ జ్ఞానవేల్ రాజా, అధనా జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీ జూలై 26న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'బడ్డీ' ట్రైలర్ రిలీజ్ కార్యక్రమంలో అల్లు శిరీష్ మాట్లాడుతూ- ''టెడ్డీ బేర్‌తో అడ్వెంచర్ యాక్షన్ మూవీ చేశాం.. ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనుకున్నా. కానీ, 'బడ్డీ' ట్రైలర్ చూశాక నాకు చాలా నమ్మకం వచ్చింది'' అన్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ- ''గీతా ఆర్ట్స్, స్టూడియో గ్రీన్ కలిసి శ్యామ్ ఆంటోన్ దర్శకత్వంలో 'ప్రేమకథా చిత్రమ్' సినిమాను తమిళంలో రీమేక్ చేయగా మంచి హిట్ అయ్యింది. ఆ మూవీ తర్వాత 'బడ్డీ' కోసం శ్యామ్ మరోసారి మా సంస్థలో పని చేశాడు. మా సినిమాను తెలుగు ప్రేక్షకులు బ్లాక్ బస్టర్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''రాజమౌళిగారి 'ఈగ' సినిమానే మా 'బడ్డీ'కి స్ఫూర్తి'' అన్నారు శ్యామ్ ఆంటోన్. నిర్మాత 'మధుర' శ్రీధర్ రెడ్డి, నటులు అలీ, అజ్మల్ తదితరులు మాట్లాడారు.

ఎస్ బాస్ షూటింగ్ పూర్తి



● హవీష్

అనుష్క లీడ్ రోల్‌లో 'భాగమతి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన అశోక్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'ఎస్ బాస్'. 'నువ్విలా, జీనియస్' చిత్రాల ఫేమ్ హవీష్ హీరోగా నటిస్తున్నారు. కె. స్టూడియోస్‌పై 'రాక్షసుడు, ఖిలాడి' వంటి హిట్ చిత్రాలను నిర్మించిన కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్న 'ఎస్ బాస్' మూవీ చిత్రీకరణ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. అలాగే హవీష్ బర్త్‌డేని (జూన్ 25) పురస్కరించుకుని కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. ''వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'ఎస్ బాస్'. ఈ చిత్రంలోని వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని యూనిట్ పేర్కొంది. బ్రహ్మానందం కీలక పాత్ర పోషించిన ఈ చిత్రానికి సమర్పణ: కాంచన కోనేరు, కెమెరా: కబీర్ లాల్, సంగీతం: అనూప్ రూబెన్స్.

ఈసారి బీభత్సమే...



● శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావ్

బాలీవుడ్ కామెడీ హారర్ హిట్ ఫిల్మ్ 'స్త్రీ' (2018)కి సీక్వెల్‌గా 'స్త్రీ 2' రూపొందిన సంగతి తెలిసిందే. తొలి భాగంలో నటించిన శ్రద్ధా కపూర్, రాజకుమార్ రావ్ 'స్త్రీ 2' సినిమాలోనూ లీడ్ రోల్స్‌లో నటించారు. చందేరి బ్యాక్‌డ్రాప్‌తో 'స్త్రీ' సినిమాకు దర్శకత్వం వహించిన అమర్ కౌశిక్‌యే సీక్వెల్‌కూ దర్శకత్వం వహించారు. దినేష్ విజయ్, జ్యోతి దేశ్‌పాండే నిర్మించిన ఈ 'స్త్రీ 2' చిత్రం ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ''ఈసారి ఆజాదీ రోజున (స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15) చందేరీలో బీభత్సం జరగబోతోంది. ఆమె తిరిగొచ్చింది'' అంటూ 'స్త్రీ 2' సినిమా హిందీ టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'స్త్రీ' బాక్సాఫీస్ వద్ద రూ. 150 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు రాబట్టిన నేపథ్యంలో 'స్త్రీ 2'పై బాలీవుడ్‌లో అంచనాలు ఉన్నాయి.

మేం ఫ్రెండ్సండి!



● నార్నే నితిన్

ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆయ్'. 'మేం ఫ్రెండ్సండి' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. నయన్ సారిక హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాతో అంజి. కె మణిపుత్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ ఫన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీని అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు యూనిట్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకు సంగీతం: రామ్ మిర్యాల, కెమెరా: సమీర్ కల్యాణి.

క్లుప్తంగా...

అక్రమ బంగారం పట్టివేత



శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తీసు కొచ్చిన బంగారాన్ని శంషాబాద్ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం ఉదయం కస్టమ్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో అబుదాబి నుంచి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 806 గ్రాముల బరువు కలిగిన బంగారం పేస్టు ను ఉండలుగా మార్చుకుని మలద్వారంలో పెట్టుకుని తీసుకొచ్చినట్లు గుర్తించి దాన్ని బయటికి తీయించారు. బంగారం విలువ రూ.58.8 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంటోన్మెంట్ బోర్డుల రద్దుకు కేంద్రం సుముఖం

సాక్షి, హైదరాబాద్: బ్రిటిష్ పాలన నాటి నుంచి ఇప్పటివరకు దేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఎ.గిరిధర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ ఏరియాలోని సివిల్ ప్రాంతాలను మున్సిపాలిటీలలో విలీనం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరారు. దేశంలో కంటోన్మెంట్ల పరిధిలో ఉన్న సివిల్ ప్రాంతాలను మునిసిపాలిటీలలో విలీనం చేసే విధి విధానాలపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి మంగళవారం వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డులను మునిసిపాలిటీలలో విలీనం చేసే అంశంపై చర్చించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలన్న కేంద్ర ప్రతిపాదనకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సమ్మతి తెలిపిందని శాంతికుమారి తెలిపారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందని ఆమె తెలియజేశారు. సివిల్ ఏరియాల తొల గింపు విధి విధానాలను ఖరారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ రూపొందించిన నివేదిక తమకు అందలేదని ఆమె పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ ముఖ్యకార్య దర్శి దానకిషోర్, మున్సిపల్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి చార్జిషీట్ దాఖలు

నేడు విచారణకు వచ్చే అవకాశం

సిటీ కోర్టులు(హైదరాబాద్): ఫోన్ ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టులో మరోసారి చార్జిషీట్‌ను దాఖలు చేశారు. దీంతోపాటు సీడీలు, హార్డ్ డెస్కులు, రెండు సీల్డ్ బాక్స్‌లను కోర్టుకు అందించారు. మార్చి 10న పంజాగుట్ట పోలీసులు ఆరుగురు ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావుపై కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే మూడుసార్లు చార్జిషీట్‌ను దాఖలు చేశారు. అయితే కోర్టుకు సమర్పించిన సీడీలు సరిగ్గా లేవని, ఫామ్ నం.16లో నాలుగు పేపర్లు ఉంటే ఐదు ఉన్నట్లు రాశారని, ఇలా పలు అభ్యంతరాలతో ఆ చార్జిషీట్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. దీంతో మార్పులు చేర్పులు చేసి తాజాగా చార్జిషీట్‌ను దాఖలు చేశారు. రాధాకిషన్‌రావు మినహా మిగిలిన ముగ్గురు భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు తరఫు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

బొకే ఇచ్చి.. బైబై



ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఇంకా అందని బెనిఫిట్స్

సాక్షి, హైదరాబాద్: పదవీవిరమణ పొందిన ఉద్యోగుల వీడ్కోలు కార్యక్రమాలు భావోద్వేగ వాతావరణం మధ్య జరుగుతాయి. ఉద్యోగి దంపతులకు పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను ఘనంగా పొగుడుతారు. వారికి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్లలో కొన్నింటిని అదేరోజు చెల్లించి దర్జాగా సాగనంపుతారు. ఆర్టీసీలోనూ ఈ తంతు సాధారణమే. కానీ కొన్ని నెలలుగా తీరు మారింది. పూలమాలలు, బొకేలు ఇచ్చి వీడ్కోలు చెప్పేస్తున్నారు. పదవీ విరమణ ఆర్థిక ప్రయోజనాల మాటేమిటి అంటే ఆ ఒక్కటి అడగొద్దంటోంది సంస్థ. నష్టాల వల్ల నిధులు లేవన్న కారణంతో రిటైర్డ్ ఉద్యోగులను టెన్షన్ పెడుతోంది. ఇప్పుడు వందలమంది రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

నిలిచిపోయిన గ్రాట్యుటీ..

పదవీవిరమణ పొందిన కొద్ది రోజుల్లోనే గ్రాట్యుటీ మొత్తం చెల్లించే పద్ధతి ఉండేది. కానీ, ఇప్పుడు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

- ఈ సంవత్సరం జనవరి వరకు వెంటవెంటనే గ్రాట్యుటీ చెల్లించారు.
- ఫిబ్రవరి నుంచి బ్రేక్ పడింది. ఆ నెలలో రిటైర్ అయిన వారికి నెల ఆలస్యంగా చెల్లించారు.
- మార్చిలో రిటైర్ అయిన వారికి మూడు రోజుల క్రితం చెల్లించారు.
- ఏప్రిల్ నుంచి పదవీ విరమణ పొందుతున్న వారు ఎదురుచూపుల జాబితాలో ఉన్నారు. వీరికి ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత లేదు.



ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్‌గా వచ్చే వాటిల్లో ఇదే పెద్ద మొత్తం. దీని ఆధారంగా భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఉంటారు. కానీ, ఆ మొత్తం చేతికందటంలో జరుగుతున్న జాప్యం ఆర్టీసీ కార్మికుల్లో గందరగోళానికి కారణమవుతోంది. డ్రైవర్, కండక్టర్ లాంటి వారికి దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఈ మొత్తం అందాల్సి ఉంటుంది. ఈడీ లాంటి పెద్ద పోస్టులోని అధికారులకు రూ.60 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. చిరుద్యోగులుగా ఉండి రిటైర్ అయినవారు ఇప్పుడు ప్రత్యామ్నాయ నిధి లేక ఈ మొత్తంపైనే ఆశలు పెట్టుకున్నారు. దాదాపు ఐదొందల కుటుంబాలు ఇప్పుడు ఆ మొత్తం కోసం ఎదురుచూస్తున్నాయి.

బాండ్ డబ్బులూ అంతే.. ఆర్టీసీలో 2013 వేతన సవరణను 2015లో అమలు చేశారు. రెండేళ్ల బకాయిల్లో 50 శాతం మొత్తాన్ని బాండ్ల రూపంలో చెల్లించాల్సి ఉంది. సర్వీసు ఉద్యోగులకు పెండింగ్‌లో పెట్టినా, రిటైర్ అయిన వారికి వెంటనే చెల్లిస్తూ వస్తున్నారు. కానీ జనవరి నుంచి రిటైర్ అయిన వారికి కూడా చెల్లించటం నిలిపేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో అందరు ఉద్యోగులకు బాండ్ బకాయిలు చెల్లించనున్నట్టు మూడునెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కానీ, కొన్ని నిధులే విడుదల కావటంతో ఇటీవల కేవలం డ్రైవర్లకు చెల్లించి వదిలేశారు. జనవరి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లింపులు మాత్రం పునరుద్ధరించలేదు. ఒక్కో ఉద్యోగికి దాదాపు రూ.లక్షన్నర వరకు అందాల్సి ఉంది. దాదాపు 1500 రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఈ నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి.

'చివరి నెల వేతనం' హుళక్కే.. ఉద్యోగి పదవీవిరమణ పొందేప్పుడు చివరి నెల వేతనాన్ని తాత్కాలికంగా నిలిపేస్తారు. ఆ ఉద్యోగి సంస్థకు ఏవైనా బకాయిలు చెల్లించాల్సి ఉంటే, లెక్కలు చూసి చివరి నెల వేతనం నుంచి మినహాయించి మిగతా మొత్తాన్ని అందిస్తారు. రిటైర్ అయిన నెల రోజుల్లో ఆ మొత్తం విడుదల అవుతుంది. కానీ, జనవరి నుంచి 'చివరి నెల వేతనం' ఆపేశారు.

ఆర్జిత సెలవు మొత్తం ఏమైంది? ఉద్యోగ కాలంలో పోగైన 300 ఆర్జిత సెలవు (ఈఎల్స్)ల ఎన్‌క్యాష్‌మెంట్ ఉంటుంది. ఆ సెలవులకు సంబంధించి నగదు చెల్లిస్తారు. ఆర్టీసీలో పదవీవిరమణ వయసు 60 ఏళ్లకు పెంచిన తర్వాత, తిరిగి రిటైర్మెంట్లు మొదలైన 2022 డిసెంబరు నుంచి ఆర్జిత సెలవుల మొత్తం చెల్లించటం ఆగిపోయింది. ఈ మొత్తం కనిష్టంగా రూ.5 లక్షల వరకు ఉంటుంది.

కరువు భత్యం బకాయిలకూ దిక్కులేదు ఆర్టీసీ ఉద్యోగులకు గతంలో నాలుగున్నరేళ్ల పాటు కరువు భత్యం సవరించలేదు. అవన్నీ పేరుకుపోయాయి. విడతవారీగా ఆ తర్వాత 9 డీఏలను సవరించి వేతనంలో చేర్చారు. కానీ, ఆ డీఏలను వర్తింప చేయాల్సినకాలం నుంచి వర్తింపచేసినకాలం మధ్య రిటైర్ అయినవారికి కూడా ఆ లబ్ధి అందాల్సి ఉంది. కానీ రిటైర్డ్ ఉద్యోగులకు వాటిని చెల్లించలేదు. ఈ మధ్యకాలంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు కూడా వాటిని చెల్లించాల్సి ఉన్నా చెల్లించలేదు.

వేతన సవరణ బకాయిలేమయ్యాయి? 2017లో జరగాల్సిన వేతన సవరణను గత మే నెల నుంచి అమలులోకి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 21% ఫిట్‌మెంట్‌తో దాన్ని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. కానీ వాటి బకాయిలను రిటైర్మెంట్ సమయంలోనే చెల్లించనున్నట్టు అప్పట్లో ఆర్టీసీ వెల్లడించింది. మరి, ఈ ఫిట్‌మెంట్ అమలులోకి తెచ్చేలోపు రిటైర్ అయినవారి విషయంలో మాత్రం చెల్లింపు ఊసే లేకుండాపోయింది. దానిపై కనీసం స్పష్టత కూడా ఇవ్వటం లేదు.

'ఓఎం' గ్రూప్ చారిటీ సంస్థలో

ఈడీ సోదాలు..

- దళిత, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య పేరిట విదేశాల నుంచి అక్రమంగా రూ.300 కోట్లు వసూలు చేసిన సంస్థ
- నెలకు ఒక్కో విద్యార్థి పేరిట రూ.వెయ్యి నుంచి రూ.1,500 వసూలు
- తెలంగాణ సీఐడీ కేసు ఆధారంగా రంగంలోకి ఈడీ
- హైదరాబాద్ పరిసరాల్లో మొత్తం 11 ప్రాంతాల్లో కొనసాగిన ఈడీ సోదాలు
- పలు కీలక పత్రాలు, డిజిటల్ డివైజ్‌లు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: దళిత, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య, భోజన వసతి కల్పన పేరిట విదేశాల నుంచి కోట్ల రూపాయల విరాళాలు సేకరించి వాటి ద్వారా ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఆపరేషన్ మొబిలైజేషన్ (ఓఎం) సంస్థలో సోదాలు నిర్వహించారు. ఈనెల 21, 22 తేదీల్లో హైదరాబాద్, ఇతర 11 ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో పలు కీలక పత్రాలు, డిజిటల్ డివైజ్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ మొబిలైజేషన్ గ్రూప్ ఆఫ్ చారిటీస్ సంస్థ.. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, డెన్మార్క్, జర్మనీ, ఫిన్‌లాండ్, ఐర్లండ్, మలేసియా, నార్వే, బ్రెజిల్, చెక్ రిపబ్లిక్, ఫ్రాన్స్, రుమేనియా, సింగపూర్, స్వీడన్, స్విట్జర్లాండ్ దేశాల్లోని దాతల నుంచి దళిత్ ఫ్రీడమ్ నెట్వర్క్ ద్వారా రూ.300 కోట్ల మేర నిధులు వసూలు చేయడంపై తెలంగాణ సీఐడీ విభాగం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీని ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఓఎం సంస్థ వంద పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్య, భోజన వసతి కల్పిస్తున్నామంటూ విరాళాల రూపంలో వసూలు చేసిన డబ్బులను ఆస్తులను కూడబెట్టేందుకు, ఇతర అనధికార పనులకు వాడినట్టు అధికారులు గుర్తించారు. ఉచిత విద్య, ట్యూషన్ ఫీజుల పేరిట నెలకు ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు ఓఎం సంస్థ వసూలు చేసినట్టు సీఐడీ దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఈ సొమ్మును సదరు సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇతర ఆస్తుల కొనుగోలుకు వినియోగించినట్టు వెల్లడైంది. అదేవిధంగా ప్రభుత్వం నుంచి రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ కింద వసూలు చేసిన నిధులకు సంబంధించి సైతం సరైన రికార్డులు లేవని తేలింది. ఈ అక్రమాలన్నింటిపైనా ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పలు రాష్ట్రాల్లో ఆస్తుల కొనుగోలు..

ఈడీ అధికారుల ప్రాథమిక దర్యాప్తులో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఓఎం గ్రూప్ ఆఫ్ చారిటీస్ పేరిట విదేశాల నుంచి సేకరించిన సొమ్ముతో సంస్థల్లోని కీలక ఆఫీస్ బేరర్స్ పేరిట తెలంగాణ, గోవా, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రల్లో స్థిరాస్తులు కొనుగోలు చేసినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఓఎం గ్రూపు సంస్థలకు సంబంధించిన ఎఫ్ఆర్‌సీఏ (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) రిజిస్ట్రేషన్లు సైతం రెన్యువల్ చేయలేదని, ఓఎం బుక్స్ ఫౌండేషన్ సంస్థ పేరిట సేకరించిన విదేశీ విరాళాలు ఇతర సంస్థలకు రుణాలు ఇచ్చినట్టుగా చూపి దారి మళ్లించినట్టు ఈడీ దర్యాప్తులో తేలింది. ఓఎం సంస్థలకు చెందిన ఆఫీస్ బేరర్స్ గోవాలో పలు డొల్ల కంపెనీలను సృష్టించి వాటిలో వారంతా ఉద్యోగులుగా చూపి, వేతనాల రూపంలోనూ డబ్బులు దండుకున్నట్టు తేలింది. కేసు దర్యాప్తులో భాగంగా ఓఎం గ్రూప్ సంస్థ కీలక సిబ్బంది ఇళ్లు, కార్యాలయాల్లో జరిపిన సోదాల్లో బినామీ కంపెనీలకు సంబంధించిన పలు పత్రాలు, అనుమానాస్పద లావాదేవీల వివరాలు, డిజిటల్ డివైజ్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు వారు వెల్లడించారు.

మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్..

కన్నీటి పర్యంతమైన విద్యార్థులు



కుల్కచర్ల: విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు పాఠశాల అభ్యున్నతికి కృషి చేసిన తమ హెచ్ఎం బదిలీపై వెళ్లడాన్ని విద్యార్థులు తట్టుకోలేకపోయారు. 'మమ్మల్ని వదిలి.. మీరు వెళ్లొద్దు సార్' అంటూ కంటతడి పెట్టుకున్నారు. గురువుగా పాఠాలు చెప్పడంతో పాటు తండ్రిలా బంధాన్ని పెనవేసుకున్న తమ సార్ మరో స్కూల్‌కు వెళ్తున్నారని తెలిసి ఆవేదనకు గురయ్యారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని చౌడాపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న తిమ్యా, ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భాస్కర్ స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో భాగంగా మరో చోటకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయి వెళ్తుండగా.. విద్యార్థులు వెక్కివెక్కి ఏడ్చారు. వారిని ఊరడించిన మాస్టారు.. 'బాగా చదువుకోండి. మిమ్మల్ని చూసేందుకు అప్పుడప్పుడు వచ్చి వెళ్తాం' అని చెప్పి బరువెక్కిన హృదయంతో బైబై చెప్పుకుంటూ వెళ్లిపోయారు.

డ్రగ్స్‌పై సమాజాన్ని మేల్కొలుపుదాం

మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్ (హైదరాబాద్): యువ తను, విద్యార్థులను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టేందుకు ప్రజా నాట్యమండలి కళారూపాల ప్రదర్శనకు శ్రీకారం చుట్టింది. 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం–సమాజాన్ని మేల్కొల్పుదాం' పేరిట చేపట్టే కళాయాత్ర లోగోను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డ్రగ్స్ బారి నుంచి యువతను మేల్కొల్పి వారిని చక్కటి బాట పట్టించేందుకు చేపట్టిన కళాయాత్ర విజయవంతంగా కొనసాగా లని ఆకాంక్షించారు. ప్రభుత్వం డ్రగ్స్‌ను ఎంత కట్టడి చేసినా డ్రగ్స్ మాఫియా వివిధ రూపాల్లో వ్యాపారం సాగిస్తూ చివరకు చిన్న పిల్లలు తినే చాక్లెట్స్‌లో డ్రగ్స్ కలిపి వ్యాపారం చేస్తూ వారి జీవి తాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేద న్నారు. ప్రజా నాట్య మండలి కళారూపాల ద్వారా పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. ఈ నెల 31 వరకు ఎగ్జిబిషన్స్, ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు కళా యాత్రతో వివిధ కార్యక్రమా లను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో ఆహ్వాన సంఘాన్ని ప్రకటించారు. సంఘం చైర్మన్‌గా మంత్రి పొన్నం ప్రభాకర్, చీఫ్ ప్యాట్రన్స్‌గా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సినీ గేయ రచయిత అశోక్‌తేజ, మాదాల రవి, గాంధీ హాస్పటల్ సూపరింటెండెట్ రాజారావు, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్, డాక్టర్ నీలిమ, డాక్టర్ జీఎస్‌రావులతో పాటు భారత్ ఇన్‌స్టిట్యూట్స్ సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి, డీజీ నరసింహారావు, నాగటి మారన్న, మహరాజ్‌లను ప్రకటించారు.



కళాయాత్ర లోగోను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- రాష్ట్రంలో డ్రగ్స్ కనిపించొద్దన్నదే సీఎం, మంత్రుల సంకల్పం
- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క
- అంతర్జాతీయ డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం
- నెక్లెస్ రోడ్డులో అవగాహనా ర్యాలీ ప్రారంభించిన డిప్యూటీ సీఎం
- డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత: డీజీపీ రవిగుప్తా



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో డీజీపీ రవి గుప్తా

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ రహిత తెలంగాణ తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని చెప్పారు. డ్రగ్స్ కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తోందని, ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సంఘ విద్రోహ శక్తుల చేతుల్లో యువత జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు డ్రగ్స్‌ను అస్త్రంగా ప్రయోగిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బడ్జెట్ ఎంతైనా కేటాయిస్తాం..

రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తామని భట్టి తెలిపారు. ఇప్పటికే అడిగినన్ని నిధులు ఇచ్చామని, రాష్ట్రంలో డ్రగ్స్ మాట వినిపించకుండా చేయాల్సిన బాధ్యత నార్కోటిక్ విభాగానిదేనని పేర్కొన్నారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రజలు అన్ని గ్రామాల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను రూపొందించుకోవాలని ఆయన సూచించారు.

కలసికట్టుగా తరిమేద్దాం: డీజీపీ

కలసికట్టుగా ఉండి రాష్ట్రం నుంచి డ్రగ్స్‌ను తరిమేయాలని డీజీపీ రవిగుప్తా పిలుపునిచ్చారు. పిల్లలు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాలేజీలు, స్కూళ్లను డ్రగ్ ఫ్రీ ప్రదేశాలుగా మలిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ తీసుకుంటే విద్యార్థుల జీవితాలతో పాటు వారి కలలు, కుటుంబాలు కూడా విచ్ఛిన్నం అవుతాయని హెచ్చరించారు.

చేయూతనివ్వాలి: హైదరాబాద్ సీపీ

డ్రగ్స్‌కు బానిసలైన వారిని చైతన్యపరచి, వారికి చేయూతనివ్వాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువతను లక్ష్యంగా చేసుకుని దేశద్రోహులు డ్రగ్స్ కుట్ర పన్నుతున్నారని చెప్పారు. వారి ఉచ్చులో పడి యువత మత్తుకు బానిసలై జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు రూపొందించిన పాటను సీఎస్ శాంతికుమారితో కలిసి డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కోసం షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. నెక్లెస్ రోడ్డుపై విద్యార్థుల ర్యాలీని భట్టి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.